కర్నూలు జిల్లా జనజీవన చిత్రాలు

# కందనవోలు కథలు



డా॥ ఎం. హరికిషన్

9441032212

# కందనవోలు కథలు




డా॥ ఎం. హరి కిషన్

94410 32212

కందనవోలు కథలు

కర్నూలు బుక్ ట్రస్ట్

రచయిత : డా॥ ఎం. హరికిషన్ , 9441032212

మొదటి ముద్రణ: 2015

ముఖచిత్రం: మాస్టర్ క్రాంతి ,9963555547

**డా॥ ఎం. హరికిషన్**
45/205-1, లేబర్ కాలనీ,
చర్చ్ ఎదురుగా,
టీచర్స్ కాలనీ,
కర్నూలు.

వెల : **100/-** రూపాయలు.



వెల : 100/- రూపాయలు.

# అంకితం



కథా సమయం
ప్రియమిత్రుడు
రచయిత
నా సాహసాలకు నిరంతరం అండగా నిలిచే
**జి. ఉమామహేశ్వర్** కు...

# విషయసూచిక


కథ చెప్పటం తెలిసిన కథకుడు – సింగమనేని నారాయణ – 5

నిర్దిష్టత నుంచి నిర్దిష్టత లోకి – ఎ.కె. ప్రభాకర్ – 9

1 . పడగనీడ – 15

2 . రాజమ్మ – 24

3 . మాయమైన గానం – 31

4 . ముసుగు – 37

5 . ఒక చల్లని మేఘం – 42

6 . బతుకు యుద్ధం – 53

7 . జై తెలంగాణ – 59

8 . పొద్దుపోని పంచాయితీ? – 65

9 . నాలుగో స్తంభం – 70

10 . జవా – 75

11 . ఒక్క కథ – 81

12 . సత్వర న్యాయం – 88

13 . పచ్చి కరువు – 93

14 . సదవకురా చెడేవు – 100

15 . హిందూ ముస్లిం – భాయ్ భాయ్ – 106

16 . చిచ్చు – 115

17 . చూపు – 123

18 . జాస్మిన్ – 131

19 . వరద – 138

20 . కొత్త కల – 147

21 . ఒక మైనార్టీ కాలేజీ కథ – 155

22 . గాయపడ్డ నమ్మకం – 160

# కథ చెప్పటం తెలిసిన కథకుడు

"కథానికా తత్వం పట్టుబడటం యెవరికైనా అంత సులభం కాదు" అంటారు రా.రా. ఒక వ్యాసంలో. నిజమే! వందలాది కథలు రాసి కూడా కథా నిర్మాణం పట్టుబడని కథకులెందరో మనకున్నారు.. ఏక సూత్రత, ఏక లక్ష్యం లేకుండా అనేక అంశాలు చెప్పాలనే లౌల్యంతో, బోలెడు సన్నివేశాలతో పేజీలకు పేజీలు నింపే కథకులు చాలా మందే వున్నారు మనకు! కథంటే మన విజ్ఞానం, మన పాండిత్యం ప్రదర్శించుకోవటం కాదని ఇప్పటికీ చాలామందికి తెలియదంటే ఆశ్చర్యం కాదు. కథ జీవితం నుండే పుట్టుకు రావాలని, మెదళ్ళ నుండి కాదని గుర్తించని వాళ్ళెందరో. చెప్పేదేదో ఇంత సూటిగా చెప్పి, రాసేదేదో క్లుప్తంగా రాయటం అలవడని వాళ్ళు తొంభైశాతం మంది! కథ ఎత్తుగడ, నడక ఎప్పుడూ ముగింపుకు అభిముఖంగా సాగాలని, నిర్మాణం సౌష్ఠవంగా ఉండాలని తెలిసిన కథకులు చాలా తక్కువ. కథ ద్వారా చెప్పాల్సిన 'పాయింట్' ఒకటి ఉండాలని మన కథకులు తరచూ మరచిపోతుంటారు. తెలిసిన జీవితాన్ని రాయటం కాదు, ఆ జీవితం ద్వారా చెప్పదగ్గ సత్యం ఏదైనా ఉన్నదా అన్న విషయం పట్ల చాలా మందికి గమనిక ఉండదు. కథ ప్రారంభం నుండీ చివరి వరకూ కథకుడి కంఠస్వరం వినిపిస్తూనే వుండాలి. కథంతా చదివిన తర్వాత ఈ కథను కథకుడు ఎందుకు రాశాడా అనే అనుమానం పాఠకుడికి రాకూడదు. కథకుడు స్పష్టత సాధించినపుడే ఇది సాధ్యం... ఇవన్నీ నిజానికి చాలా చాలా చిన్న విషయాలు... పెద్ద విషయం జీవితమే!

ఈ సంపుటిలోని కథలన్నీ చదివింతర్వాత, కథకుడు హరికిషన్‌కు కథా సూత్రాల పట్ల అవగాహన ఉందనీ, కథానికా తత్వం అతనికి బోధపడిందనీ, కథా నిర్మాణంలో మెలకువలు

పాటించినాడనీ, కథ గురించి తెలిసిన వాడెవడైనా గ్రహిస్తాడని నా నమ్మకం. ఈ సంపుటిలోని ఏ కథా మరోకథకు పొడిగింపు కాదు. ఏ కథా మరో కథను అనుసరించింది కాదు. ఏ కథా రూపం ఆ కథదే. ఒక్కొక్క జీవితశకలం ఒక్కొక్క కథా రూపాన్ని నిర్ణయించిందని మనం గుర్తిస్తాము. మొత్తానికి హరికిషన్ 'కథ' తెలిసిన కథకుడని పాఠకులు గ్రహిస్తారు.

ఇందులోని కథలన్నీ కూడా సహజంగానే క్లుప్తతను సంతరించుకున్నవి. ఏ కథలో కూడా ఒకటి రెండుకు మించి సన్నివేశాలుండవు. కథలోని కాలం ఎంతైనా ఉండవచ్చు గానీ కథ నడిచే కాలం మాత్రం సుదీర్ఘం కాకూడదన్న రహస్యం హరికిషన్‌కి తెలుసు. ఒక 'పాయింట్' చెప్పటం కోసమే కథ రాయాలనే స్పృహ కూడా హరికిషన్‌కుంది... 'పడగనీడ' కథలో ఒక యువకుడు ఒక ఫ్యాక్షన్ గ్రామంలోని పాఠశాలకు ఉపాధ్యాయుడిగా నియమింపబడతాడు. ఆ గ్రామానికి వెళ్ళి ఆ వూరి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరటమే కథంతా కూడా... కథంతా ఫ్యాక్షన్ నేపథ్యంలో నడుస్తుంది. కథలోని వాతావరణం, పాత్రలు, ప్రయాణం, సంభాషణలు, సన్నివేశాలు అంతా కూడా ఒకే సూత్రంపై నడుస్తాయి. కథ ఎక్కడ ఆగాలో అక్కడే ఆగుతుంది. కథకుడు చెప్పాలనుకున్న అంశం పాఠకుడికి చేరిపోతుంది.

'నిశ్శబ్ద ఆర్తనాదం' కథంతా కూడా ఒకే ఒక పాత్రే! ఆ పాత్ర ఆలోచనలే, తలపోతలే కథంతా కూడా! ఒక విస్తృతమైన జీవితంలోని విషాదమంతా ఆ కథ నిండా పరచుకొని ఉంటుంది. కొన్ని వేల కుటుంబాలలోని ఇల్లాళ్ళ ఆర్తనాదం ఆ చిన్న కథలో ప్రతిధ్వనిస్తుంది. కథంతా చిక్కగా, బాగా అల్లిన నవారు మంచం నిర్మాణంలా వుంటుంది. ఒకే సన్నివేశంలో బంధింపబడిన ఆ కథ పాఠకుడి గుండెను బలంగా తాకుతుంది.

'ముసుగు' అనే కథ ఆనందరావు అనే ఒక రచయిత ఆలోచనల్లోని ఒక గంట సమయం మాత్రమే. ఎందరో కపట రచయితల 'ముసుగు'ను ఆ కథ తొలగిస్తుంది. "ఒక చల్లని మేఘం" కథ కార్పొరేట్ హైస్కూల్లో చదివే మురళి, హరి అనే రెండు పాత్రల మానసిక ప్రపంచం, ఒక మిథ్యా విద్యావ్యవస్థ దుర్మార్గాన్ని ఎండగడుతుంది. కథకుడు కార్పోరేట్ విద్యావ్యవస్థను చీల్చి చెండాడటమే గాకుండా, కార్పోరేట్ విద్య పిల్లల బాల్యం మీద ఎంత దారుణమైన ప్రభావాన్ని చూపుతుందో కూడా ఆగ్రహంతో వెల్లడి చేస్తాడు. కథంతా రెండు మూడు సన్నివేశాల మధ్య ఆద్యంతం ఉత్కంఠతతో నడుస్తుంది. కథ పూర్తి కాగానే పాఠకుడి గుండె నిండా తడి తగులుతుంది. పాత కథావస్తువే అయినా కథనంలోని నవ్యత పాఠకుడిని గాఢంగా ఆలోచింపచేస్తుంది.

'నాలుగోస్తంభం' కథ నడిచే కాలమంతా కూడా ఒకే ఒక్కరోజే! ప్రింట్ మీడియా వ్యాపార కుతంత్రాలను ఒక పాత్ర ప్రయాణం ద్వారా తూర్పారబడతాడు కథకుడు. ఈ కథలో కన్పించే కార్పొరేట్ విద్యాసంస్థల అంతర్నాటకం, ఒక ప్రహసనంలా పాఠకుడి ముందు ప్రదర్శితమౌతుంది. "బతుకు యుద్ధం" కథ నడిచే కాలం అంతా కూడా ఒకరోజే! వర్షాధారంతో నడిచే వ్యవసాయం,

పెట్టుబడి కూడా గిట్టని పంటలు, కరువు పరిస్థితులు, పల్లెలన్నీ ప్లాట్లుగా, సెజ్జులుగా మారటం, ప్రజల వలసలు, పనుల్లేక దొంగలుగా మారటం... ఈ బతుకు యుద్ధాన్నంతా రఘురాం అనే పాత్ర ప్రయాణ నేపథ్యంలో వివరిస్తుంది ఈ కథ. అనంతమైన సీమ బతుకు చిత్రాన్ని గుప్పెట్లో బంధించటం ఈ కథలోని శిల్పనైపుణ్యం. ప్రధాన పాత్ర రఘురాం వెంట పాఠకుడిని కూడా ప్రయాణం చేయిస్తుంది ఈ కథ.

సన్నకారు రైతు చంద్రయ్య సేద్యం కథ 'పచ్చికరువు' రెండు సన్నివేశాల కూర్పుతో నడుస్తుంది. వాన రాక పంట పెట్టలేని పరిస్థితి ఒక సన్నివేశం – వాన వచ్చి పంటంతా పాడయ్యే పరిస్థితి మరో సన్నివేశం. ఈ రెండు సన్నివేశాల చిత్రణతో రాయలసీమ రైతు వ్యవసాయాన్ని చిత్రిక పడుతుంది ఈ కథ. ఒక చిన్న నవలికగా రాయదగ్గ వస్తువును ఒక చిన్న కథలో క్లుప్తీకరించడాన్ని ఈ కథలో చూడవచ్చు.

'జాస్మిన్' కథ అయితే ఒకే సంఘటన – హాస్పిటల్‌లో ఒక యువకుడు మరణశయ్య మీద వున్న ఒక యువతిని చూస్తాడు. కథ వెనుకకూ ముందుకూ నడుస్తుంది. ఆ యువకుడు ఒకప్పుడు బాగా యిష్టపడ్డ యువతి కథ ఇది.

"హిందూ – ముస్లిం – భాయ్ భాయ్' ఒక నాటకంగా రాయదగ్గ వస్తువును కథగా మల్చడంలో కథకుడి నైపుణ్యం పాఠకుడిని ముగ్ధుణ్ని చేస్తుంది. కథకుడి ప్రతిభకూ, సామాజిక దృక్పథానికె. నిలువెత్తు నిదర్శనంగా భాసిల్లిన కథ ఇది. మతమూ, కులమూ, మతమార్పిడీ సంఘర్షిస్తే ఎలా వుంటుంది? కథ ఊహించని మలుపులు తిరుగుతుంది. ఒక సాంఘిక బీభత్సాన్ని గగుర్పొడిచేలా ప్రదర్శిస్తుంది ఈ కథ. కథంతా కూడా ఒక్క 'సీనే'. ఈ కథ మీదే ప్రత్యేకంగా ఒక వ్యాసం రాయవచ్చు.

'జై తెలంగాణా' కథలో తెలంగాణా అన్న పదమే ఎక్కడా కన్పించదు. అభివృద్ధి చెందిన ప్రాంతాల వాళ్ళు, వెనకబడిన ప్రాంతాలను దోపిడీ చేసే నేర్పరితనం మాత్రమే ఈ కథలో కన్పిస్తుంది. వెనకబడిన తెలంగాణా ప్రాంతం దోపిడీకి గురి కావటాన్ని ఈ కథ ధ్వనింపజేస్తుంది. ప్రత్యేక తెలంగాణా వాదాన్ని గడుసుగా సమర్థిస్తుంది ఈ కథ. అలాగే సమైక్యాంధ్ర ఉద్యమాన్ని స్వార్థపరశక్తులు నడిపిస్తున్నాయన్న సత్యాన్ని 'కొత్తకల' అన్న కథ ద్వారా కథకుడు నిరూపిస్తాడు. ఈ రెండు కథల్లోనూ కథకుడు మనకెక్కడా కన్పించడు. కథకుడి కంఠస్వరం మాత్రమే వినిపిస్తూంటుంది. వర్తమాన రాజకీయాల్ని కథగా ఎంత నేర్పుగా మలచుకోవచ్చో ఈ రెండు కథల్ని అధ్యయనం చేస్తే అర్థమవుతుంది.

ఈ అన్ని కథల్లోనూ కథకుడు ఎవరి పక్షాన ఉన్నట్టు? దళితుల పక్షాన, పేద ముస్లిం మైనార్టీల పక్షాన, శ్రమజీవుల పక్షాన, రైతుల పక్షాన, స్త్రీల పక్షాన, అణచివేతకు గురైన వారి పక్షాన ఉన్నట్టు అతని కథలు స్పష్టం చేస్తాయి. అయితే వారి పక్షాన కథ రాస్తున్నట్టు ఎక్కడా వాచ్యంగా ఉండదు. అతడికున్న ప్రజాస్వామిక దృక్పథంలో అది కలసిపోయి వుంటుంది. కథాశిల్పంలో దాగి

వుంటుంది. ఇదే సందర్భంలో కథకుడి అనుభవ ప్రపంచం నుండే ఈ కథలన్నీ పుట్టుకొచ్చినట్టు పాఠకుడు గ్రహిస్తాడు.

కథనంలో క్లుప్తత పాటించడం, ఒక కథలో ఒకే పాయింట్ చెప్పడం, కథ ఎత్తుగడకూ, నడకకూ, ముగింపుకూ లంకె వుండటం, కథలోకి నేరుగా ప్రవేశించడం, అనవసర విషయాలేవీ కథలో లేకపోవడం, వర్ణనలూ, అలంకారాల పట్ల వ్యామోహం లేకపోవడం... ఇలాంటి సూత్రాల వల్ల ఈ సంపుటిలోని కథలన్నీ కూడా కథకుడికి కథానిర్మాణం పట్ల గల శ్రద్ధను, నేర్పును, తెలియజేస్తున్నాయి.

దాదాపుగా ఇందులోని కథలన్నీ, ప్రాంతీయ స్పృహతో గుబాళిస్తూ ఉంటాయి. దేశంలో ఎక్కడైనా ఈ కథల్లోని జీవితం కన్పిస్తూండవచ్చు గానీ, ఇది నిర్దిష్ట ప్రాంతపు ప్రాదేశిక జీవితం వాతావరణం, భాష, మాటతీరు మనుషుల ప్రవర్తన, ఆర్థిక పరిస్థితులు, మత కుల వర్గ స్పృహ, మహిళల కుటుంబగత హింస ఇలాంటివెన్నో, ఈ కథల్లో కొట్టొచ్చినట్టు కన్పిస్తూ, ప్రాంతీయమైన రంగూ, రుచీ, వాసనలను వెదజల్లుతాయి.

రాయలసీమలోని కర్నూలు ప్రాంతపు ఆధిపత్యపు కులాల ఫ్యూడల్ అహంకారం, ఫ్యాక్షన్, కరువు పరిస్థితులు, వ్యవసాయం, పేదరికం ఇలాంటివన్నీ కూడా స్థానిక రచయిత రాయటం వల్ల ఈ కథల్లో ప్రాణం పోసుకున్నాయి. ఇందులో కనిపించే 'స్థానికత' ఒక విలక్షణత్వాన్ని ఈ కథలకు ఆపాదించింది.

ఈ సంపుటిలోని కథల గురించి చెప్పాల్సింది ఇంకా చాలానే ఉంది. పాఠకుల తెలివితేటల మీద నమ్మకంతో ఇంతటితో చాలిస్తున్నాను.

మిత్రులు హరికిషన్‌కు నా అభినందనలు.

**– సింగమనేని నారాయణ**

అనంతపురం
24.02.2014

# నిర్దిష్టత నుంచి నిర్దిష్టత లోకి....

"సీమ సాహిత్యమే సీమ జీవితం – సీమ వెతలే సీమ కతలు" ఇదొక నానుడిగా చెలామణి అవుతున్న రోజుల్లో కర్నూలు కథని ప్రత్యేకంగా యెత్తి చూపిన రచయిత డా॥ ఎం. హరికిషన్. నిర్దిష్టంగా కర్నూలు జీవితాన్నీ, కథల్నీ అర్థం చేసుకోడానికి 2005లో హరికిషన్ సంకలనం చేసిన 'కర్నూలు కథ' యెంతగానో తోడ్పడింది. ఆ సంకలనం ద్వారానే గొప్ప తవ్వకపు పనిమంతుడుగా హరికిషన్‌తో నాకు తొలి పరిచయం. రాయలసీమలో మరీ ముఖ్యంగా కర్నూలు ప్రాంతంలో కొత్తగా 'పరుగులు తీస్తున్న పెట్టుబడుల పద ఘట్టనల కింద పడి నలుగుతున్న సామాన్యుడి జీవితాన్ని' గురించి ఆ సంకలనం ముందుమాటలో ప్రస్తావించిన అంశాలు నన్నెంతగానో ఆలోచింపజేయడమే గాక హరికిషన్ సాహిత్య వ్యక్తిత్వాన్నీ, ప్రాపంచిక దృక్పథాన్నీ యెరుకపరిచాయి.

నిజానికి హరికిషన్ కథా రచనా ప్రస్థానం తొలి అడుగు ద్వారానే (పడగ నీడ – 1997) అతను పయనించబోయే తోవా, నడక తీరూ అవగతమయ్యాయి. సీమ నేలని పట్టి పీడించే ఫ్యాక్షనిజం బహుముఖ పార్శ్వాల్ని అతను ఆ కథలో ఆవిష్కరించగలిగాడు. పార్టీ రాజకీయాలూ, కులాధిపత్య పోరాటాలూ, సారా వ్యాపారాలూ, రియల్ ఎస్టేట్ దందాలూ, చోటా బడా కాంట్రాక్టులూ, భూగర్భ వనరుల దోపిడీ, అటవీ సంపద అక్రమ తరలింపు... ఇవన్నీ ఫ్యాక్షనిజం పెంచుకొన్న కోరలేనని తెలియజేశాడు. అంతేకాదు వీటికి ప్రత్యామ్నాయంగా మొగ్గ తొడుగుతోన్న భూపోరాటాల్ని ప్రస్తావించాడు. పల్లెల్లో విస్తరిస్తోన్న బి.సి.ల, దళితుల చైతన్యాన్ని (ఎబిసిడి ల వర్గీకరణతో సహా) గుర్తిస్తూనే పాలక వర్గాలు దాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకొంటున్న వైనాన్ని సైతం వ్యాఖ్యానించాడు. వీటన్నిటినీ – నీళ్ళు లేక, పంటల్లేక, పనుల్లేక, రోడ్లు లేక... ఎడారులై పోతున్న బీళ్ళతో.... బీళ్ళవుతున్న పచ్చిక బయళ్ళతో... హత్యలు, ఆత్మహత్యలు, వలసలతో కునారిల్లుతున్న రాయలసీమ నిర్దిష్టతలోంచే అతను విశ్లేషించాడు. స్వీయ జీవితానుభవానికే అక్షర రూపంలా కనిపించినప్పటికీ... తన నేల మీద బలంగా కాళ్ళూని హరికిషన్ నిలబడ్డాడని 'పడగనీడ'

నిరూపించింది. ఈ నిర్దిష్టత రాను రానూ అతనిలో మరింత పదును దేరిందని యీ కొత్త కథల సంపుటి 'కందనవోలు కథలు' స్పష్టం చేస్తుంది. హరికిషన్ యిటీవల (2012 – 13ల్లో) రాసిన 'జై తెలంగాణా', 'కొత్తకల' కథలు అందుకు నిలువెత్తు సాక్ష్యాలు.

సీమ సాహిత్యకారుల్లో యింతకుముందు కన్పించిన ప్రాంతీయ స్పృహ, తెలంగాణ రాష్ట్రోద్యమం నేపథ్యంలో రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రాంతీయ అస్తిత్వ చైతన్యంగా పరిణమించాల్సిన అవసరాన్ని యీ కథలు నిర్దేశిస్తున్నాయి. ఈ చైతన్యం సీమలోని తక్కిన జిల్లాల్లో కంటే ముందుగా కర్నూలు ప్రాంతంలోనే మొదలు కావడం యాదృచ్ఛికం కాదు. అదొక సామాజిక యధార్థత. ఆ యధార్థాన్ని 'కర్నూలు సాహితీ మిత్రులు' లో ఒకడిగా డా॥ ఎం. హరికిషన్ గుండె గొంతుకలోకి తెచ్చుకొని బలంగా వినిపిస్తున్నాడు. కృష్ణా నికర జలాల పంపిణీలో న్యాయబద్ధమైన వాటా గురించి డిమాండ్ చేయడం దగ్గరో, హైదరాబాద్‌ని స్విస్‌బ్యాంక్‌గా మార్చుకొన్న సీమ ఫ్యాక్షనిస్టుల వరకో యీ రచయిత ఆగిపోవడం లేదు. 'శ్రీబాగ్ ఒడంబడికను చిత్తుకాగితంగా మార్చిన పెద్ద మనుషులతో కలసి నడవడం' గురించి, 'నాలుగు కాసుల కోసం భాషను, సంస్కృతిని రాక్షసంగా మార్చి వెక్కిరించిన వారితో, పదవులు విసిరి ప్రాజెక్టులు కొల్లగొట్టిన పెద్దన్నలతో సహజీవనం చేయడం' గురించి 'మీసాల మీద నిమ్మకాయలు నిలబెట్టడం మాని, గంజి మెతుకుల కోసం గలం విప్పి ప్రశ్నిద్దాం' (ఒక ఆలింగనం కోసం) అని హెచ్చరిస్తున్నాడు. కోస్తా వలస ఆధిపత్యాలకి తలుపులు తెరచి వాళ్ళు విసిరిన అదనపు పెట్టుబడులకు అమ్ముడుపోయిన అన్ని రాజకీయ నాయకత్వాల ద్రోహాల్నీ (అప్పటి నీలం సంజీవరెడ్డి దగ్గర్నుంచి నిన్నటి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి వరకూ – మధ్యలో సందుకో వైన్ షాపు తెరిపించి, ఇటీవలే బెల్ట్ షాపుల రద్దుకి 'మూడో సంతకం' చేసిన చంద్రబాబు నాయుణ్ణి కలుపుకొని) హరికిషన్ ప్రశ్నిస్తున్నాడు. అయితే అతనీ ప్రశ్నల్ని కేవలం రాయలసీమ చైతన్యం నుంచే అడగడం లేదు. మరింత నిర్దిష్టంగా కర్నూలు గడ్డని కేంద్రంగా చేసుకొని తుంగభద్ర దిగువ కాలువ కింద నీరందక యెండిపోయి నెర్రెలిచ్చిన పొలాల జాడల్లోంచీ, కొండారెడ్డి బురుజు సాక్షిగా నడచిన బూటకపు 'సమైక్య ఉద్యమాల' నీడల్లోంచీ సంధిస్తున్నాడు. ద్రోహాల చరిత్రని తవ్వి తీసి – మరోసారి మోసపోవద్దనీ, తెలంగాణ వుద్యమం నుంచీ స్ఫూర్తి పొందమనీ యెండు డొక్కల సీమప్రజలకు ఉద్బోధిస్తున్నాడు. ఛిద్రమైన రాయలసీమ ముఖచిత్రాన్నీ, శిథిలమైన బతుకుల్నీ, సామాజిక, ఆర్థిక, రాజకీయ కోణాల నుంచి అధ్యయనం చేయడం వల్ల మాత్రమే అతనీ కథలు రాయగలిగాడని నేను నమ్ముతున్నాను. నా నమ్మకానికి బలమైన ఆధారాలు యీ సంపుటిలోనే 'బతుకు యుద్ధం' కథలో కనిపిస్తాయి.

'బతుకు యుద్ధం' రాసింది కూడా 2013లోనే. సీమ కరువు వెతలు కథలుగావడం కొత్తకాదు గానీ, దాన్ని సమస్త విలువల్నీ నాశనం చేసే కఠోర వాస్తవికతగా అభివర్ణిస్తూ యింతకుముందు పి. రామకృష్ణారెడ్డి 'కరువు పీల్చిన మనుషుల్ని' హృదయ విదారకంగా సాక్షాత్కరింప జేశారు. కరువులో

బతుకులు బుగ్గైన వ్యక్తుల నైతిక పతనాన్నే మరో రూపంలో చూపిన కథ 'బతుకు యుద్ధం'. వరస కరువుల్తో 'అప్పు కట్టలేక, అవమానం తట్టుకోలేక ఆఖరికి పొలంలోనే చింతచెట్టుకి వురేసుకొన్న బోయగేరి శంకరప్ప, 'యవసాయం చేసేదానికన్నా కూలిపనికి పోవడమే మేలు' అనుకొనే రైతు సుంకన్న, ఆ పని కూడా లేక 'సూస్తూ సూస్తూ పస్తులతో సావలేక – నాలుగు వేళ్ళు నోట్లోకి పోవాలంటే ఏదో ఒగటి సెయ్యాల' గాబట్టి ఫ్యాక్షనిష్టు రాజారెడ్డి కింద పని చేస్తూ వ్యసనాల పాలైన సుంకన్న పెద్దకొడుకు వీరేష్, వూరి బైట కొత్తగా వచ్చిన ఫ్యాక్టరీ కింద భూమిని కోల్పోయి, వచ్చిన దుడ్లు కరిగిపోయి 'పుట్టినూళ్ళో గంజినీళ్ళు గూడా పుట్టక' వూరుగాని వూరు పోయి దారిదొంగగా మారిన బలిజగేరి గోవిందయ్య... యీ కథలో వీళ్ళంతా బతకడమే యుద్ధమైన చోట మంచీ చెడుల గురించి, నీతీ న్యాయాల గురించి, ధర్మాధర్మాల గురించి లేవనెత్తే ప్రశ్నలకు జవాబులిమ్మంటారు.

'పల్లెలన్నీ ప్లాట్లుగా, సెజ్జులుగా మారిపోయాక గ్రామాల్లోని సాలు సక్కగ వచ్చేటట్లు గొర్రు పట్టి విత్తనమేసే మొనగాళ్ళు, వంచిన నడుం ఎత్తకుండా చక చక నాట్లు వేసే పనిగత్తెలు, కొడవలి పడితే చాలు ఒక్కరోజే ఎకరాలకు ఎకరాలు పంట కోసే పాలెగాళ్ళు, గడ్డివాముల్ని ఎంతటి గాలివానకైనా చెక్కు చెదరకుండా, నిర్మించే నేర్పరిగాళ్ళు' మాయమైపోతున్నారని కూడా యీ కథలోనే రచయిత వాపోతాడు. అయితే యీ పరిస్థితి కేవలం రాయలసీమకే పరిమితం కాదు, కానీ వర్ణించిన భౌతిక, భౌగోళిక వాస్తవికత మాత్రం ఆ ప్రాంతానిదే. ఆళ్ళగడ్డ, గూళ్యం, బైరాపురం, తర్తూరు, గాజులదిన్నె, కొండారెడ్డి బురుజు, కాల్వబుగ్గ, యస్‌టిబిసి కాలేజి, కండేరి, బండిమిట్ట, సి.క్యాంప్... యీ ప్రాంతాలన్నీ కథల్లో అత్యంత సహజంగా వొదిగిపోయి ఆ వాస్తవికత సాధిస్తాయి. రాయలసీమ అనగానే గుర్తొచ్చే అనావృష్టి పరిస్థితులకు భిన్నంగా తుంగభద్ర వరదల్లో కర్నూలు ప్రాంతం ముంపుకు గురికావడానికి కారణమైన నిర్లక్ష్యవైఖరిని పచ్చి కరువు (2004), వరద (2009) కథల్లో నిశితంగా విమర్శించినప్పుడు గానీ, పల్లెల్లో కులం బలంతో ఫ్యూడల్ న్యాయాన్నే అమలుపరుస్తోన్న రెడ్డి దొరతనానికి యెదురొడ్డి నిలవాలని మానసిక ప్రతిన తీసుకొన్న బోయ వెంకటేశ్వర్లు (చిచ్చు – 2006) తెంపరితనాన్ని వర్ణించినప్పుడు గానీ కర్నూలు స్థానీయతని వొక పరిమళంలా అద్దాడు హరికిషన్.

రచయిత సమకూర్చిన స్థానీయతా నేపథ్యమే యీ కథలని 'కందనవోలు కథలు'గా తీర్చిదిద్దడానికి ముఖ్యమైన వనరుగా తోడ్పడింది. కథల్లో సందర్భోచితంగా వాడిన కర్నూలు ప్రాంత మాండలికం కూడా అందుకు అదనపు హంగుని జోడించింది. సూక్ష్మంగా పరిశీలించినపుడు రాయలసీమ నాలుగు జిల్లాల్లోనూ వొకే విధమైన జీవితం లేదనీ, సమస్యల స్వభావం వేరనీ, వాటిని పరిష్కరించుకోడానికి దారులు తీసే చైతన్య భూమిక ప్రత్యేకమైనదనీ, వొకే కాలంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో చలనం భిన్నంగా ఉందనీ, గతి తార్కికంగా నిరూపించడానికి యీ కథల సంపుటి వొక ఆకర గ్రంథంగా వుపయోగపడుతుంది. రాయలసీమ జీవితాన్ని యథాతథంగా

చిత్రించడం దగ్గర ఆగిపోకుండా, ఆ జీవితం అలా వుండడానికి కారణమైన ఆర్థిక, భౌతిక, సామాజిక, రాజకీయ శక్తుల్ని దృశ్యమానం చేయడానికి ప్రయత్నించడం వల్ల మాత్రమే అది సాధ్యమైంది.

ఉన్నతవిద్యనభ్యసించిన ఉపాధ్యాయుడిగా స్వీయ అనుభవాల్నీ, సామాజిక అవగాహననీ కథలుగా మలిచే సందర్భాల్లో సైతం హరికిషన్ తన నేల వాసనని వదులుకోలేదు. మన విద్యా వ్యవస్థలో రోజురోజుకీ పెరిగిపోతున్న అసమానతల్నీ, జడలు విచ్చుకున్న అమానవీయతనీ, పాతుకుపోయిన అవినీతినీ, అసంబద్ధమైన పోటీనీ దగ్గరగా చూస్తూ అందులో యిమడలేని వూపిరాడనితనంలోంచి... తీవ్రమైన ఆవేదనకి లోనై అతను రాసిన కథలు వొక డజను వరకూ వున్నాయి. 'బాల్యంలోనే యుద్ధ ఖైదీలై చదువుల బోనుకు బందీలై' శిక్షలు అనుభవించే 'పిల్లల్ని ప్రేమించేవాళ్ళ కోసమే' ప్రచురించిన 'ఒక చల్లని మేఘం' కథల సంపుటి (2008) ద్వారా లోపలి వ్యక్తిగా హరికిషన్ నేటి విద్యా వ్యవస్థలో సమస్త అస్తవ్యస్త పరిస్థితుల్నీ నిశితంగా చర్చకు పెట్టాడు. చాలామంది ఉపాధ్యాయ రచయితలు చేయని పనిని వొక సామాజిక ఆచరణలో భాగంగా నిర్వర్తిస్తున్నందుకు డా॥ ఎం. హరికిషన్ని నా వరకు నేను బహుధా అభినందిస్తున్నాను. ఈ సంపుటిలోకి యెక్కిన 'సదవకురా చెడేవు' (2001), 'ఒక చల్లని మేఘం' (2002), 'ఒక మైనార్టీ కాలేజి కథ' (2005) విద్యారంగానికి చెందిన భిన్న పార్శ్వాలను విమర్శకు పెట్టిన కథలు.

'సదవకురా చెడేవు' బహుముఖీన కథ. పరీక్ష హాల్లో యిన్విజిలేటర్గా పని చేసే ఉపాధ్యాయుడి అంతరంగంలో చెలరేగే సంఘర్షణకి అక్షర రూపమైన యీ కథలో ప్రభుత్వ విద్యా విధానాలు, కార్పొరేట్ చదువులు, పట్టణ, గ్రామీణ విద్యార్థుల విద్యా ప్రమాణాల్లో అనివార్యంగా చోటు చేసుకొనే వ్యత్యాసాలు – వాటికి కారణాలు, ప్రైవేటీకరణలో పేద, దళిత విద్యార్థులు యెదుర్కొనే నిరుద్యోగ సమస్యలు, రిజర్వేషన్ పాలసీలు, మాతృభాషోద్ధరణ వాదాలు, సినిమాల్లో సీమ ఫ్యాక్షనిజం... వంటి సవాలక్ష విషయాలు వొడ్డును కోసే వరద ప్రవాహ వేగంతో కదులుతూ వుంటాయి. పది వ్యాసాల పెట్టు యీ కథ. చైతన్య స్రవంతికి దగ్గరగా వుండే టెక్నిక్ని ఆశ్రయించడం వల్ల యెన్నో విరుద్ధ అంశాలు కథలోకి యెక్కాయి. తాను బోధించే చదువుల పరమార్థం తన చేతి నుంచి జారిపోయిన కారణంగా కల్గిన వొక విధమైన కసి యీ కథలోని ఉపాధ్యాయుడి ప్రవర్తనలో చూస్తాం. కానీ నిజానికి అశక్తతలోంచి పుట్టిన దుర్భరమైన ఆవేదన అది. పోటీ చదువుల్తో బాల్యానికీ, ప్రకృతికీ దూరమౌతోన్న పిల్లల పట్ల అపారమైన ప్రేమతో రాసిన కథ 'ఒక చల్లని మేఘం'. అనివార్యంగా కంటతడి పెట్టించే కథ యిది. పేదలకి విద్యనందకుండా చేసే మైనార్టీ గుట్టుని 'ఒక మైనార్టీ కాలేజీ కథ' రట్టు చేస్తే, 'నాలుగో స్తంభం' కథ విద్యని లాభసాటి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చిన కార్పొరేట్ కాలేజీల మధ్య నెలకొన్న అనారోగ్యకరమైన పోటీనీ, పెట్టుబడులకు పెంపుడు జంతువైన మీడియా క్రూర దౌష్ట్యాన్నీ యేకకాలంలో యెండగట్టింది. ఇదంతా మన చదువుల కుట్ర. దాన్ని ఛేదించడానికి పూనికతో కథనొక సాధనంగా యెన్నుకొన్న రచయిత హరికిషన్. ఇప్పుడు కావల్సింది

సంస్కరణలు కాదు – సమూలమైన మార్పు అని ఈ కథలు చదివాక అనుకోకుండా వుండలేం.

ఈ సంపుటిలో స్త్రీల ముఖతః వినిపించిన రెండు అద్భుతమైన మౌఖిక కథనాలు (నిశ్శబ్ద ఆర్తనాదం – 2000, పొద్దుపోని పంచాయితీ – 2010) నన్ను కట్టిపడేశాయి. వాటిలో గుక్క తిప్పుకోకుండా పలికిన సాంద్ర దుఃఖ – క్రోధ భాష గుండెను బలంగా తాకుతుంది. కుటుంబ హింస, జెండర్ రాజకీయాల వస్తువా – వర్గ, ప్రాంతీయ భాషా – మోనోలాగ్ శిల్పమా యేది ఆకట్టుకుంటుందో నేను చెప్పే కన్నా మీరే స్వయంగా చూసి తెలుసుకోండి. వస్తు, శైలీ, శిల్పాల మేలు కలయికకి అవి అమోఘమైన సాక్ష్యాలు అని తప్పక అంగీకరిస్తారు.

ప్రపంచీకరణ ద్వారా మనం కోల్పోతున్నదాన్ని కాపాడుకోవాల్సిన వాటిని కూడా హరికిషన్ స్పష్టంగా గుర్తించాడు. గ్లోబల్ సందర్భంలో సాంస్కృతిక పరాయీకరణ అతణ్ణి ఎక్కువగా బాధించింది. రోజుల తరబడి మహా కథనాల్ని గానం చేసి, సాంస్కృతిక వారసత్వ సంపదని కాపాడుకొస్తున్న వుపకులాలకు చెందిన కళాకారులు తమ కళకి దూరమై పూట గడవక బిచ్చగాళ్ళుగా మారిపోగా, టీవీ పెట్టెలకి అతుక్కుపోయి, వొక మత్తులో కూరుకుపోయి చివరికి వూకుడు కథలు చెప్పేవాళ్ళూ కరువై మన పాటా, కథా నశించిపోతున్న సందర్భాన్ని 'మాయమైన గానం' (2006), 'ఒక్కకథ' (2010)ల్లో హరికిషన్ రికార్డు చేశాడు. అందుకే అతను రాయలసీమ పల్లెపట్టుల్లో లభించే జానపద గేయాల్నీ, కథల్నీ పిల్లల కోసం సేకరించి ప్రచురిస్తున్నాడు. మనదైన, అచ్చమైన దేశీయ సాహిత్య సంపదని కాపాడే లక్ష్యంతో చేస్తున్న ఆ పని చొచ్చుకొస్తున్న సాంస్కృతిక, సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని ఎదుర్కొనే సాధనంగానే భావించాలి. మౌఖిక కథనాల్ని లిఖిత రూపంలోకి తర్జుమా చేసి అందించడం వల్ల ఆ సాహిత్యంలో వినిపించే కర్నూలు మాండలిక భాషా విశేషాలు అట్టడుగు కులాల సామాజిక చరిత్రని తెలుసుకోడానికి సైతం దోహదపడతాయి.

'హిందూ ముస్లిం – భాయ్ భాయ్' (2005) కథ నిచ్చెన మెట్ల సమాజంలో అట్టడుగున వున్న దళితులు ఉన్నతీకరణని కోరుకున్నప్పుడు వారిని అణగదొక్కడానికి మతవిద్వేషంతో వొకరిపై మరొకరు కత్తులు నూరే హిందూ ముస్లింలు వొకటౌతారన్న చేదు వాస్తవాన్ని విప్పి చెబుతుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వున్నా చేజారిపోయే సంక్లిష్టమైన వస్తువుని హరికిషన్ యెంతో సంయమనంతో నిర్వహించాడు. ఇదే జాగ్రత్త 'జవా' నిర్వహణలో కూడా చూస్తాం. ఇది ఇన్‌సైడర్స్ మాత్రమే రాయగల కథ. యీ కథ ముస్లిం మతం లోపల ముల్లాల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తుంది.

కులం – మతం – ప్రాంతం – జెండర్ నిర్దిష్టతల్లోంచి వస్తువైవిధ్యంతో తీర్చిదిద్దిన యీ కథలకి ప్రాణభూతమైన అంతస్సూత్రం (యాంకరింగ్ పాయింట్) మాత్రం వొక్కటే – వ్యవస్థీకృతమైన అసమానతలపై తీవ్రమైన క్రోధం, సమస్త ఆధిపత్యాలపై నిరసన. అదే రచయితగా హరికిషన్ ప్రాపంచిక దృక్పథం. ఆ దృక్పథం వల్లే అతను ఐక్యత – సంఘర్షణ సూత్రాన్ని అన్వయించుకొంటూ అనేక నిర్దిష్టతల్లోంచి సాధారణీకరణం వైపు పయనిస్తూ గడ్డిపరకల్తో తాడు పేనుతున్నాడు.

సంపుటిలోని కథలన్నీ తడమలేని అశక్తుణ్ణి. చివరిగా వొక్క ముచ్చట చెప్పి మాత్రం ముగిస్తా –

మంచి కథలో పాత్రలు పాఠకుల్ని వెంటాడుతాయి – లోపలా, బయటా సంఘర్షణ ప్రధానంగా నడిచే కథల్లోని పాత్రలే పదికాలాలు గుర్తుంటాయి. బహుముఖీన (మల్టీ లేయర్డ్) కథల్లో పాత్రలు పాఠకుడిని వూపిరి తీసుకోనివ్వవు – సుఖంగా నిద్రపోనివ్వవు. అటువంటి బలమైన పాత్రల్ని కథల్లోకి తీసుకురావడానికి అనువైన సమాజమే మన చుట్టూ వుంది. హరికిషన్ కథల్లో యెక్కువ భాగం సింగిల్ పాయింట్ కథలు కావడం వల్ల పాత్రల వ్యక్తిత్వంలోని అనేక పొరలు ఆవిష్కారమవడానికి ఆస్కారం తక్కువ. అయినప్పటికీ 'బతుకు యుద్ధం'లో గోవిందయ్య, 'చూపు'లో 'నేను', 'ఒక చల్లని మేఘం'లో హరి, 'రాజమ్మ'లో రాజమ్మ వంటి గుర్తుండే పాత్రల్ని మన ముందు సాక్షాత్కరింపజేయగలిగాడు. బాధ్యతనెరిగిన రచయితగా సమాజంలోని సంక్లిష్టతల్నీ, సంక్షోభాల్నీ సాహిత్యీకరించే ఆచరణలో ముందువరసలో నడుస్తున్నాడు కాబట్టి హరికిషన్ నుంచి ముందు ముందు మల్టీ లేయర్డ్ కథలూ, పాత్రలూ తయారవుతాయని యీ సంపుటి భరోసానిస్తుంది. కథా నిర్మాణంపై అతను తీసుకొనే శ్రద్ధ ముచ్చట గొలుపుతుంది.

నిరాడంబర శైలీ, ముక్కుసూటి కథనం, వస్తు వైవిధ్యం, శిల్పం పేరున ప్రయోగాలు చేయకపోవడం, పాత్రోచితమైన  భాషా ప్రయోగం చేస్తూనే కథనంలో సైతం తనదైన ప్రాంతీయ ముద్రని చూపే నైపుణ్యం, తన చుట్టూ వున్న సమాజంలోని గతిశీలతని భిన్న పార్శ్వాల నుంచి విశ్లేషించగల యెరుక, స్వీయ జీవితానుభవాలను ప్రగతిశీల ప్రాపంచిక దృక్పథం నుంచి వ్యాఖ్యానించే నేర్పు, స్థానీయతకి పెద్దపీట వేసి వొక వాతావరణాన్ని నిర్మించే జాగరూకత, మానవీయ స్పందనల్ని – వుద్వేగాల్ని నిర్దిష్ట సామాజిక సందర్భం నుంచి చూడగల సంయమనం, 'కథా సమయం' వంటి సంస్థల ద్వారా పెంచుకొన్న సదసద్వివేచనా రచయితగా హరికిషన్ కూడగట్టుకొన్న బలాలు. ఇవి భవిష్యత్తులో మరింత పదునెక్కుతాయని ఆశంస.

కర్నూలు జిల్లా చరిత్రకారుడిగా, బాలసాహిత్యకర్తగా, జానపద సాహిత్య సేకర్తగా – పునః స్రష్టగా, కథా రచయితగా తనకంటూ వొక గుర్తింపు తెచ్చుకొన్న డా॥ హరికిషన్ నుంచి కర్నూలు ప్రాంత సమగ్ర సామాజిక చరిత్రకి అద్దం పట్టే మంచి నవలని ఆశించడం తప్పు కాదేమో! సీమ నవల అనకుండా కర్నూలు నవల అనటానికి కారణం – కర్నూలు నుంచి హరికిషన్‌ని విడదీయలేకపోవడమేనని నివేదిస్తూ... కందనవోలు కథలకు సాదర స్వాగతం పలుకుతూ... సెలవ్.

**– ఎ.కె. ప్రభాకర్.**

హైదరాబాద్,
జూన్ 24, 2014.

# పడగనీడ

కంత్రీకట్టకేసి బయల్దేరాను. సాయంత్రం కాగానే సరదాగా స్నేహితులతో అక్కడ చేరి, పిచ్చాపాటి కబుర్లాడి, రాత్రి పదికో పదిన్నరకో యింటికి చేరుతుంటాము. పనీపాటా లేని కంత్రీ నాయాళ్ళంతా అక్కడ చేరుతారని కొందరా పేరు పెట్టారు. ఓ పెద్ద అరుగు. పక్కనే సిగరెట్ షాపూ, దాన్నానుకొని బజ్జీలంగడీ, టీ షాపూ వున్నాయి.

అరుగు మీద రమేషు, చౌడప్పనాయుడు కూర్చొని ఉన్నారు. నేను రావడం చూసి, విష్ చేసి "ఏరా! జాబొచ్చిందట కదా. కంగ్రాచ్యులేషన్స్, పార్టీ ఎప్పుడ్రా" అంటూ రమేష్ నేను కూర్చోడానికి కాస్త పక్కకు జరిగాడు. "ఇస్తాలేరా మొదటి జీతమన్నా రానీ" అన్నాను కూర్చుంటూ.

నాయుడు నవ్వుతూ "మళ్ళీ యాడ దొరుకుతావ్‌రా నువ్వు. ఇంతకుముందు దుబ్బోడు కూడా ఇలాగే చెప్పి చెయ్యిచ్చాడు. చంద్రన్న పుణ్యమాని సందుకో షాపొచ్చింది. హాట్ హాట్‌గా ఓ క్వార్టర్ కొట్టిస్తే... ఆహా..." పెదాలు తడుపుకుంటూ ఏమన్నట్లుగా చూశాడు.

కమిటయితే కష్టం. ఎలాగోలా తప్పించుకోవాలని "సారీరా.. చాలామందిని కలవాల. ఈ రోజుకొదిలేయ్. ఈసారి కల్సినప్పుడు తప్పకుండా యిస్తా... ప్రామిస్." అన్నాను నమ్మకంగా.

రమేష్‌కి నా ప్లాను అర్థమైపోయి "సరే ఏం చేద్దాం. కనీసం బజ్జీలైనా తినిపిద్దురా" అన్నాడు వదలకుండా.

బజ్జీలు, చాయ్, సిగరెట్ వరుసగా వచ్చాయి.

"ఇంతకీ ఎక్కడేశారు" చాయ్ తాగుతూ ప్రశ్నించాడు రమేష్.

"ఆళ్ళగడ్డ దగ్గర దున్నపాడు" సమాధానమిచ్చాను.

"దున్నపాడా...!" ఒక్క క్షణం ఆగి "ఫ్యాక్షనేరియా కదరా. మొన్ననే సర్పంచ్‌ను నడీధిలో చంపారట. పేపర్లో చదవలా. మన నాయుడిది కూడా అదే ఊరు. ఏరా నాయుడు ఊరు మంచిదేనా" అన్నాడు రమేష్ సిగరెట్ అంటిస్తూ.

చౌడప్పనాయుడి వంక చూశాను. ఇద్దరిదీ ఒకటే కులం. మంచి స్నేహితుడు. కర్నూలు పి.జి. సెంటర్లో కలిసి చదివినాం.

నాయుడు బలంగా ఒక దమ్ము లాగి, నా భుజం తట్టి "భయమెందుకురా... ఊరంతా మనోల్లే... కాపోల్లొక పది కుటుంబాలుంటారు. ఆళ్ళకీ మనకీ గొడవ. కురువోళ్ళు, ఈడిగోళ్ళు, బలిజోళ్ళు మనైపే... మాలా మాదిగలూ, పింజరోళ్ళు కాపోళ్ళకు సపోర్టు. ఈ మధ్యనే ఎ.బి.సి.డి.గొడవొచ్చింది గదా! మాదిగోళ్ళను గూడా మనైపు లాగేసినారు. మొన్న ఎవరూ లేనిది సూసి మనోన్నేసి, ఊరిడ్సిపోయినారు. యాడికి బోతారులే. భూములున్నాయి కదా ఆడనే... వస్తే వుంటాది నా కొడుకులకి" కుడిచేత్తో మీసం కొసను సవరించుకుంటూ ఆవేశంగా అన్నాడు. మసక వెలుగులో కూడా నాయుడి మొహంలో కసి ప్రస్ఫుటంగా కనబడి నా వొళ్ళు జలదరించింది.

"ఏ పార్టీ వుందక్కడ" వివరాల కోసం ప్రశ్నించాను.

రమేష్ ఫక్కున నవ్వుతూ "పార్టీలదేముందిరా. ఈళ్ళు కాంగ్రెస్ చేరితే ఆళ్ళు తెలుగుదేశం. ఆళ్ళు కాంగ్రెస్ అంటే ఈళ్ళు తెలుగుదేశం. అంతే గదా సీమ చరిత్ర... ఏరా" అన్నాడు నాయుని వంక చూసి. నాయుడు తలూపుతూ "ఆ నా కొడుకుల దగ్గర డబ్బుంది... మన దగ్గర లేదు. అదీ తేడా" అన్నాడు.

"ఇంతకీ సర్పంచ్‌నెందుకు చంపారు" కుతూహలం ఆపుకోలేక అడిగాను.

నాయుడి దవడ కండరం బిగుసుకుంది. గొంతులో కరుకుదనం ప్రవేశించింది. "ఈ మధ్య మన బోయోళ్ళు పైకొస్తున్నారు గదా... అది పడ్డంలా నా కొడుకులకి. మనూరు బీ.సీ. రిజర్వేషన్. సర్పంచ్ మనోడే. డబ్బు కోసం సారా పాటల కాడ పోటీకి దిగినాం. సేపల సెరువు యేలంపాట కూడా మనమే సంపాదించినాం. మనల్ని దెబ్బ తీయడానికి దొంగసారా కాయించి అమ్మినారు. గొడవలు మొదలైనాయి. నిరుడు మన యెంకటేషు నాయున్ని ఆళ్ళగడ్డలో ఆళ్ళేసినారు. దాంతో రామిరెడ్డిని, ఆళ్ళ మనుషులు నలుగుర్ని నంద్యాల కోర్టు దగ్గర మనోళ్ళేసినారు. మొన్న డబ్బిచ్చి కిరాయి మనుషులతో మన సర్పంచ్‌నేసినారు. ఊర్లో బీ.సీ.లెక్కువుండి ఆ నా కొడుకులెవరు ఆధిపత్యం సెలాయించడానికి. అందరూ వొగటి కావడంలా. కొందరు డబ్బు కక్కుర్తి నాయాళ్ళు ఆళ్ళెంటే తిరుగుతున్నారు" అన్నాడు అక్కసుగా.

ఊరి పరిస్థితి నాకర్థమై నెమ్మదిగా వణుకు ప్రారంభమైంది. నాకెంతో యిష్టమైన ఉద్యోగమది "చేస్తే టీచర్‌గా చేస్తా... లేదంటే లేదు" అనేవాన్ని.

ఉద్యోగం వస్తూనే ఎంతో ఆనందపడ్డాను. స్నేహితుల మాటలు వింటున్న కొద్దీ నాగరిక ప్రపంచం నుంచి అనాగరిక ప్రపంచంలోకి పోతున్నట్లుగా అన్పించింది. టైం చూసుకున్నాను. ఎనిమిదైంది. వస్తానని పైకి లేచాను.

రమేష్ టాటా చెబుతూ "ఫోటో వొగటుంటే యిచ్చిపో, మరలా చూస్తామో... చూడమో... యెందుకైనా మంచిది ఎల్లైసీ గూడా చేసేయ్" అన్నాడు అల్లరిగా నవ్వుతూ.

నాకు నవ్వూ, భయం రెండూ కలిగాయి. వెంటనే నాయుడు "ఏం భయపడొద్దురా... బస్సు

దిగ్గానే ఎదురుగా వో హోటలుంటాది. అది మా సిన్నాయనదే. నా స్నేహితున్నని సెప్పు. కావాల్సిన సాయం సేస్తాడు" అన్నాడు. తలూపి బయల్దేరాను.

మా పెద్దమామ రిటైర్డ్ హెడ్మాష్టరు. జిల్లా పరిషత్తులో అందరూ బాగా తెలుసు. ఏదైనా మంచి ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటే బాగుంటుందని అనుకున్నాను. ఆలోచనల్లోనే పెద్దమామ ఇంట్లొచ్చింది..

అత్తకు స్వీట్ ప్యాకెట్ యిచ్చి మామయ్యకు వివరాలన్నీ చెప్పాను. మామయ్య నవ్వుతూ "అపాయింట్‌మెంట్స్ అన్నీ పూర్తయ్యాయి. ఇప్పుడు కష్టం. ముందే చెప్పొచ్చు గదా. ఓ రెండు సంవత్సరాలు చెయ్. పర్మినెంట్ కాగానే ట్రాన్స్‌ఫర్ చేయించుకుందాం. మేమంతా చెయ్యలా. తప్పదు. కాకపోతే కాస్త జాగ్రత్తగా వుండాల" అన్నాడు. అంతలో అత్త టీ తెచ్చింది.

మామయ్య టీ తాగుతూ "పల్లెటూరోళ్ళకి మన మీద జెలసీ. వూకెనే నెల నెలా డబ్బు తీస్కుంటామనీ, యెదారి లేని బతుకనీ ఆళ్ళభిప్రాయం. అమాయకుల్లాగానే కన్పిస్తూ ఆరాలన్నీ తీస్తుంటారు. ఆడ జరిగే గొడవల్లో తల దూర్చొద్దు. రాజీలకు పోవొద్దు. ఎవరేం చెప్పినా విను. తలూపు. రామసెంద్రయ్య చెడ్డోడంటాడొకడు. చెడ్డోడని నీకూ తెలిసినా చెడ్డోడనకు. యెవన్ది తప్పని తెల్సినా నోరిప్పకు. యేది మంచో ఏది చెడో నేను చెప్పాలా. మీకున్న అనుభవం నాకాడ అనాల జారుకోవాల. ఊరోళ్ళు ఊరోళ్ళు ఎప్పుడూ వొగటే. మనమే బైటోళ్ళం" అంటూ తన అనుభవం ఆధారంగా సలహా ఇచ్చాడు.

బాగా చీకటి పడింది. కలవాల్సిన వాళ్ళు చాలా వున్నారు. పోయొస్తానని పైకి లేస్తుంటే మామ "ఒక్కమాట" అన్నాడు. ఏమన్నట్లుగా చూశాను. "యేం లేదు. మీసాలు కాస్త తగ్గించు. అట్లా తిప్పుకొని తిరగడం ఆడ మంచిది కాదు" అన్నాడు. తలూపుతూ బయల్దేరాను.

అందర్నీ కలిసి ఇంటికొచ్చేసరికి అలసిపోయా. రాత్రి నిద్ర సరిగా రాలేదు. ఏవేవో ఆలోచనలు.

వేకువనే తలస్నానం చేసి, దేవునికి మొక్కుకొని, రాజ్‌విహార్ చేరుకున్నా. ఓ అరగంటకు బస్సొచ్చింది.

తార్రోడ్డుపై బస్సు రివ్వున పోసాగింది. ఈదురుగాలి. కిటికీలు మూసేసాను.

అలవాటుగా మీసంపై చేయి వేశా. కొసలు లేవు. ఆరు సంవత్సరాలుగా ముచ్చటగా తిప్పుకునే మీసం.

స్నేహితుల మాటలు, పేపర్లో చదివిన విషయాలు, జుగుప్స కలిగించే ఫోటోలు పదే పదే గుర్తుకొస్తున్నాయి.

శరీరం సన్నగా వణికింది.

ఆదివారం, సంతనాడు, నడీధిలో, రాములోరి గుడి ముందు, వేటకత్తులతో కిరాతకంగా

తల నరికి, వీధులలో తిప్పి, ఊరి బయట పొలాల్లో పాడేశారట.కళ్ళ ముందు దృశ్యం ఊహించుకుంటే ఒళ్ళు గగుర్పొడిచింది. ఒక సంవత్సరంలోనే ఏడు హత్యలు.

మనుషులా... రాక్షసులా...

నిన్న గూళ్యం... నేడు దున్నపాడు... రేపు...

నరహంతక సంస్కృతి...

పట్టుదలలు... పౌరుషాలు... ప్రతీకారాలు...

కొడవళ్ళతో కొంగు బిగించే ఆడోళ్ళు....

బాంబులతో మిద్దెలెక్కే మొగోళ్ళు....

భర్తను చంపినోన్ని సమాధి చేసేంత వరకు తాళి తెంపని స్త్రీలు. శవాన్ని నట్టింట్లో సమాధి చేసి నరనరాన ప్రతీకారాన్ని పెంచుకునే కుటుంబాలు.

ఎందుకిదంతా... అసలు ఎందుకు చంపుకుంటున్నారు.

గ్రామ పెత్తనం... ఆలయ భూముల గొడవ... విస్తరిస్తున్న దళిత చైతన్యం... అక్రమ సంబంధాలు... సారా కాంట్రాక్టులు... రాజకీయాలు... భూపోరాటాలు... తరతరాల కక్షలు...

కారణం యేదైతేనేం

తెలుసుకొని యేం లాభం...

ఫ్యాక్షన్ కతలు – కతలు కతలుగా బైటకొస్తున్నాయ్.

కారణాలు చెబుతున్నాయ్.

రకరకాల కోణాల్లో విశ్లేషిస్తున్నాయ్.

జీవితాలను ఆవిష్కరిస్తున్నాయ్.

యేం లాభం...

ప్రజలు సస్పెన్స్ సీరియల్లా చదువుతున్నారు.

క్రైం స్టోరీల్లా ఆనందిస్తున్నారు.

నీళ్ళు లేవు... పంటల్లేవు... పనుల్లేవు... రోడ్లులేవు.

యెడారులై పోతున్న బీళ్ళు... బీళ్ళవుతున్న పచ్చిక బయళ్ళు...

హత్యలు... ఆత్మహత్యలు... వలసలు.

ఆలోచనలు భయాన్ని కల్గించాయి.

పల్లెల కన్నా పట్టణాలే నయం. యెవని బతుకు వానిది. అనుబంధాలు, ఆప్యాయతలు ఇప్పుడు పల్లెల్లో యాడున్నాయి.

భయం భయం బతుకులు.

ఆ పల్లెల్లో పోయి సావడం కన్నా... వుద్యోగమొదిలేస్తే...

ఒక్క క్షణం తర్వాత మళ్ళా భయమేసింది.
ప్రయివేట్లో కడుపు నిండని జీతాలు.
పొద్దస్తమానం చాకిరీ చేస్తే పన్నెండొందలు.
వంగి వంగి సలాములు కొట్టాల.
చెప్పిన పని చెప్పినట్టు చెయ్యాల.
చదువుకున్న గాసగాళ్ళం.
గవర్నమెంటు ఉద్యోగం వదులుకుంటే మళ్ళా వస్తాదా.
శనిదేవత పదిసార్లైనా తలుపు కొడ్తాది గానీ...
కాలాలసలే బాగాలేవు.
బతకడానికి డబ్బు కావాల.
జీవితానికి భద్రత కావాల.
మన పని మనం చూసుకుంటే పోలా...
యెవడెట్లా చస్తే మనకేమి.
స్వేచ్ఛ... అవసరం... సర్దుకోవాలి.
యాడైనా బానిస బతుకే...
ఎవడు స్వేచ్ఛగున్నాడీ ప్రపంచంలో...
ఏదో అసంతృప్తి... వెంటాడుతున్న నిజాలు...
ఫ్యాక్షన్ అంతానికి ముఖ్యమంత్రి పిలుపు...
ప్రధాని నవ్వుతున్నాడు...
రాష్ట్రపతి సెక్యూరిటీతో ఖైదీలా...
జీపులు... బాంబులు... ప్రశాంతత...
జైలు నుంచి గర్వంగా బైటికొస్తున్న రవీంద్రారెడ్డి...
సమాధిలో కూర్చున్న జడ్జి...
వంగి వంగి సలాములు కొడ్తున్న జనాలు...
వెక్కిరిస్తున్న మీసం కొసలు...
బస్సు రోడ్డొదిలి చేలోకి పోసాగింది.
అదిరిపడి చుట్టూ చూశాను. ఎవరూ లేరు.
నేనొక్కన్నే...
"డ్రైవర్" గట్టిగా కేకేశాను.
డ్రైవర్ నాకేసి చూశాడు. ఎవరో కాదు. పెద్దమామే. గుర్తే పట్టలా.

"మామా" అన్నాను. నవ్వుతూ ఎగిరిపోయాడు.

బస్సు దిగాను. చుట్టూ పంటచేలు... ఏవేవో... ఎన్నెన్నో... పచ్చగా కళకళలాడుతూ... నాల్గువైపులా...

ఆకాశంలో ఎయిర్‌కూలర్లు పెట్టినట్లు చల్లని గాలి.

మొక్కలు గుసగుసలాడుకుంటున్నాయ్... నవ్వుతున్నాయ్... సరసాలాడుకుంటున్నాయ్... మైమరచిపోతున్నాయ్...

కందిచేను పరవశంగా పాడుతోంది.

జొన్నకంకులు లయబద్ధంగా తప్పెట కొడుతున్నాయ్. కరివేపాకు చిందులు తొక్కుతోంది.

అరుపులు... కేకలు... ఈలలు... చప్పట్లు... ఒకటే సందడి.

హఠాత్తుగా, ఒక్కసారిగా పాట ఆగిపోయింది. మొక్కలు చిత్తరువుల్లా నిలిచిపోయాయి.

కనుచూపుమేరలో ఎవడో వస్తూ కనబడ్డాడు.

మొక్కలన్నీ వాన్నే చూస్తున్నాయ్... వణికిపోతున్నాయ్.

యెవడు వాడు... యెక్కడో చూసినట్లే వుంది. బాగా పరిచయమైన ముఖమే.

పొలాల్లోకొస్తున్నాడు... భూమి బీటలు వారుతోంది...

యెవడు... యెక్కడ చూశాను... గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించా.

అంకిరెడ్డా... సుంకన్నా... యెంకటేశ్వర్లా... రసూలా... రవీంద్రనాయుడా... చౌదరా... మస్తాన్ రెడ్డా.... రెడ్డప్ప దొరా... యెవడు వాడు?

ప్రతి పల్లెలో, అసెంబ్లీలో, పేపర్లలో యెప్పుడూ కనబడే ముఖమే.

పెద్ద పెద్ద అంగలు వేస్తూ పొలంలోకొచ్చాడు. కళ్ళు దేన్నో వెదుకుతున్నాయి.

మౌనంగా, సద్దు చేయక, తలలు వంచి, భయంభయంగా తప్పు చేసినట్లు మొక్కలు యెక్కడివక్కడే.

పచ్చని జొన్న కంకి వణికిపోతా వుంది... ధారాపాతంగా కన్నీళ్ళు... ఒక్కొక్క అడుగే వెనక్కి వేస్తా వుంది.

యెందుకు... యేం జరుగబోతుంది... అర్థం కాలా...

జొన్న కంకినే తీవ్రంగా చూస్తున్నాడు. కొడవలిపై పిడికిలి బిగుసుకుంది. ఒక్కుదుటున రెండడుగులేసి వేగంగా గాల్లోకి లేపాడు. దిక్కులు పిక్కటిల్లేటట్లు... చావు కేక...

రెప్పపాటులో దంటు నుంచి వేరు పడి... గాల్లో గింగరాలు తిరుగుతూ...

పచ్చని జొన్న కంకి.

యేందది... కంకేనా... తలా... తలలాగే వుందే! కంకా? తలా?? యేందది???

కళ్ళు నులుముకొని చూశాను.

రక్తం... దంటు నుంచి... ఫౌంటెన్‌లా... ఆకాశానికి...

నేలంతా కాలువలు గడుతూ... యెటు చూసినా, యెక్కడ చూసినా... ప్రవాహంలా... నా వైపుకే...

పరుగెత్తాలనుకున్నా... కాళ్ళురాలా... భూమిలోకి దిగబడిపోతున్నాయి...

రక్తం... దగ్గరగా... మరింత దగ్గరగా... ఉప్పెనలా... ముంచెత్తడానికి...

తప్పించుకోవాలి... వేగంగా పారిపోవాలి... కాళ్ళు సహకరించడం లేదు. పీక్కోడానికి ప్రయత్నించాను.

యెవరూ... యెవరూ పట్టించుకోడం లేదు

."హెల్ప్... హెల్ప్"

నిర్లిప్తంగా చూస్తున్నారు... యేడుస్తున్నారు... తల దించుకుంటున్నారు... వెళ్ళిపోతున్నారు... ఆవేశాన్ని అణచుకుంటున్నారు... తిట్టుకొంటున్నారు... కేకలు పెడుతున్నారు... పరుగులు దీస్తున్నారు...

"హెల్ప్... హెల్ప్" దగ్గరికెవరూ రావడం లేదు.

రక్తం... కాళ్ళకిందంతా... చిక్కగా... జిగటగా...

ఒళ్ళంతా చెమటలు... నాలుక తడారిపోతా వుంది.

నడుం వరకూ... వెచ్చగా... బుసలు కొడుతూ...

తప్పించుకోవాలి... గింజుకోసాగాను.

భుజం మీద యెవరిదో చేయి.... గుండె క్షణం ఆగి కొట్టుకోసాగింది. వొక్కుదుటున విదిల్చాను. యెవరూ కనబడలేదు.

మళ్ళా అదే చేయి భుజంపై...

నో... ఆగకూడదు... తప్పించుకోవాలి... చచ్చిపోతాను...

భుజాన్ని మరింత గట్టిగా పట్టుకున్నాడు. విడిపించుకోడానికి గింజుకున్నాను. వదలడం లేదు.

ప్రాణాల మీద ఆశ పోతా వుంది. చెమటలు కారిపోతున్నాయ్... కొడవలితో మీదికొచ్చేస్తున్నాడు...

"సార్... సార్..." గట్టిగా భుజం తడుతూ అరిచిన అరుపుతో ఉలిక్కిపడ్డాను. యెదురుగా కండక్టర్. అందరూ నన్నే చూస్తున్నారు. కొందరు నవ్వుతున్నారు. కలా... నిజమా... నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటూ యేమన్నట్లు కండక్టర్‌కేసి చూశాను. మీరు చెప్పిన వూరొచ్చింది. దిగండి సార్" అన్నాడు.

"థాంక్స్" చెప్పి బయటపడ్డా. యెదురుగా "దున్నపాడు - 6 కి॥మీ॥" అనే బోర్డు, ఎర్రమట్టి రస్తా... స్వాగతం పలుకుతున్నాయి.

బస్సు దిగిన నలుగురు ముసిలోళ్ళు వూళ్ళోకి బెరబెరా పోతున్నారు. వూరోళ్ళ వేగం అందుకోవడం కష్టంగా వుంది. అప్పుడప్పుడూ తలతిప్పి అనుమానంగా చూస్తున్నారు.

కలలో దృశ్యమే వెంటాడుతూ వుంది.

అలవాటులేని పనాయె. గసెక్కువైంది. కాసేపటికి దూరంగా ఇళ్ళు కనబడ్డాయి. ప్రాణం లేచివచ్చినట్లైంది.

కళ్ళాల్లో గడ్డివాములు, కందికట్టె, నల్లగా... బొగ్గులా... కాలీకాలక...

పశువుల ఆస్పత్రి ముందు నలుగురు పోలీసులు తుపాకులు ముందు బెట్టుకొని పులి జూదం ఆడుతూ నన్ను నిశితంగా గమనించారు. వారిని దాటి సందు తిరిగాను.

చిన్నపిల్లలు... ముసిలోళ్ళు... ఆడోళ్ళు తప్ప నడివయసు మొగోడే కనబడ్డంలేదు.

ప్రశాంతత... భరించలేనంత ప్రశాంతత... వద్దనుకున్నా వారి జీవితాల్లోకి చొచ్చుకొని వచ్చిన ప్రశాంతత. తప్పనిసరైన ప్రశాంతత.

అప్పుడప్పుడు వినబడుతున్న లారీల చప్పుళ్ళు... కుక్కల మొరుగుళ్ళు...

అమాయక సంస్కృతి... పచ్చని పరిసరాలు... ప్రశాంత వాతావరణం... పుస్తకాల్లోనే...

ఊరి మధ్యకు వచ్చాను. మూడు రోడ్ల కూడలి. కుడిపక్క పురాతనమైన రాములోరి దేవాలయం. చరిత్రకు  సాక్ష్యంగా.

ఊళ్ళో దిగ్గానే యెవరు? యేమిటి? అంటూ ఆరాలు తీసేవాళ్ళు, మాటలు కలిపేటోళ్ళు, ఆప్యాయంగా పలకరించేవాళ్ళు యెవ్వరూ కనబడ్డంలేదు.

ఆప్యాయత, అభిమానం స్థానంలో భయం, అనుమానం.

"ఎస్సై రమ్మంటున్నాడు" అనే పిలుపుతో తలతిప్పి చూశాను.

ఎదురుగా పోలీసు, కాస్త దూరంగా టీ తాగుతూ ఓ మంచం మీద కూర్చున్న ఎస్సయ్యి కనిపించారు.

"ఎందుకొచ్చావిక్కడికి? ఎవరి తాలూకు?" ఎస్సై మాటలు కరుగ్గా వున్నాయి.

"ఏం రాకూడదా... నీకు చెప్పాలా" మనసులో అనుకుంటూ జాయినింగ్ ఆర్డర్ చూపించా.

నన్నూ, దాన్నీ పరిశీలనగా చూసి "కొత్తగా చేరావా... అదీ ఈ ఊళ్ళో" అంటూ నవ్వాడు. ఆ నవ్వులో అనేక భావాలు. మౌనంగా వుండిపోయాను. "ఊళ్ళోకి కొత్తవాళ్ళెవరూ రాకూడదు. అందుకే ఆపా. నువ్వెళ్ళొచ్చు" అన్నాడు.

హైస్కూలు దారడిగాను. కుడివేపు చూపించి "ఈ దారెంబడే పోండి. ఆ కడాకున బిల్డింగ్ కనబడ్తాది. బెస్టాఫ్ లక్" అన్నాడు.

లక్ లేకనే కదా ఈడ పడింది. అందరూ రెకమెండేషన్లు పెట్టి కావాల్సిన వూళ్ళేపించుకున్నారు. చాతగాక ఆళ్ళేసిన వూరికొచ్చాననుకుంటూ "థాంక్స్" చెప్పి బయల్దేరాను.

అరకిలోమీటరు నడిచాక స్కూల్ బిల్డింగ్ కనబడింది. విశాలమైన గ్రౌండ్‌లో బిక్కుబిక్కుమంటున్న ఆరు గదులు. బీటలు వారిన గోడలు, ఆ బీడులో, రాళ్ళలో ఎదగలేకా... చావలేకా... ఆ వూరి జనాల్లా... అక్కడక్కడ కానుగచెట్లు...

సూట్‌కేస్ దించి చూస్తుండగానే ఎదురుగా ఒకతనొచ్చి “హలో! వెల్‌కమ్. రామ్మోహనేనా. మీరు జాయిన్ అవుతున్నట్లు నిన్ననే ఆర్డరొచ్చింది. అయామ్ మధు. సోషల్ టీచర్ని” అంటూ ఆప్యాయంగా షేక్‌హ్యాండిచ్చి హెడ్మాష్టర్ రూంకి తీసుకెళ్ళాడు.

హెడ్మాష్టర్ జాయినింగ్ రిపోర్ట్ తీసుకొని, వివరాలు తెలుసుకొని, “ఊళ్ళో పరిస్థితి చూసే వుంటారు. చిల్లర్నాయాళ్ళు. చిల్లర్రాజకీయాలు. ఒకనితో మాట్లాడితే ఒకనితో కష్టం. మేమెవరూ యిక్కడ ఉండడంలా. అప్పండౌనే. ఖర్చయినా, శ్రమయినా అదే మంచిది. మీరే ఆలోచించుకోండి” అంటూ తన బాధ్యతగా సలహా ఇచ్చి రిజిష్టరు ముందుకు తోశాడు.

సంతకం పెడుతూ వుంటే చేయి వణికింది.

**ఆదివారం ఆంధ్రజ్యోతి - డిసెంబర్ 1997**
**సీమ కక్షల కథలు - సెప్టెంబర్, 2004**

# రాజమ్మ

చుక్కలు చీకట్లో దాక్కున్నాయి. చందమామను మింగడానికి మబ్బులు చుట్టుముట్టుకున్నాయి. పున్నమి అమాస లాగే వుంది. రావిచెట్టు కింద పెట్రోమాక్సు దీపం మినుకుమినుకుమంటా చీకటితో పోరాడతా వుంది. చెట్టు చుట్టూ పెదింత మంది జెనాలు గుమిగూడి చూస్తా వున్నారు. రచ్చబండ మీద కులపెద్ద కూచోనున్నాడు. కుడివైపు పుల్లయ్య, యెడమవైపు నాగన్న చేతులు కట్టుకోని నిల్చోనున్నారు. నాగన్న పక్కనే రాజమ్మ కాళ్ళు ముడ్చుకోని, తలొంచుకోని, బాధ పళ్ళ బిగువున వుగ్గబట్టుకోని నేల మీద కూచోనుంది. రాజమ్మకు పుల్లయ్యను చూస్తా వుంటే అగ్గిలోన యేసి కాల్చినట్టనిపించసాగింది. లోలోన కుతకుతా వుడికిపోతా వుంది..

"పోనంటే యెట్టానే... యేలుకుంటానంటున్నాడుగా..." కులపెద్ద రాజమ్మను గద్దించడిగాడు.

"ఆరోజు మద్దస్తం సేసి నలుగుర్లో పుస్తె తెంపుకొని పాయ గదా... మళ్ళా యేంది పొయ్యేది. నేసస్తేపోను. ఈన్నే వుంటా. నా బదుకు నే బదుకుతా" తలొంచుకొనే రాజమ్మ సమాధానమిచ్చింది.

కులపెద్ద యిద్దరొంక చూసి "వాసేవ్! నువు గాదంటే... పాపం ఆని బదుకెట్టా... వయసయిపాయ. మూడో సంబంధం యెవరిస్తారు సెప్పు... ఆన్ని సూసుకునేదెవురు... ఆనింట్లో దీపమెట్టేటోళ్ళెవరు... యెళ్ళి తీరాల్సిందే" అన్నాడు.

రాజమ్మ నాయన నాగన్న మధ్యలో జోక్యం చేసుకొని "దాన్దేముందిలే సామీ! నే పంపుతా. కానీ... ఆ రోజు దీని తప్పు సూపిచ్చి వదిలేశగదా... అప్పుడు పెళ్ళి కర్చులు నాతోన కట్టించుకొనె. బాకీ సేసి డబ్బులు కడ్తి. మొత్తం నాలుగేలయ్యింది. వడ్డీతో సహా తిరిగిచ్చి తీసుకెళ్ళమను. నాకేమభ్యంతరంల్యా" అన్నాడు నింపాదిగా.

కులపెద్ద కాసేపు మౌనంగా ఆలోచన చేసి పుల్లయ్యతో "మొత్తం ఐదేలు కట్టి దాన్ని తోల్కోని పో" అని తీర్పిచ్చాడు.

నాలుగు రోజుల తర్వాత పుల్లయ్య డబ్బుతో వచ్చాడు. రాజమ్మ పోనేపోనంటూ అందరి కాళ్ళా పట్టుకొని ఏడ్చింది. మొత్తుకునింది. బంగపోయింది. యెవరూ ఆమె మాటినలేదు. ఆఖరికి దిక్కులేని పక్షిలా మొగునెంట బైలుదేరింది.

బస్సు ఒకొక్క వూరే దాటతా వుంది. రాజమ్మ పుల్లయ్య పక్కనే కుచున్నా... మొగునొంక తలెత్తి గూడా చూళ్ళేదు. ఒక్కమాటా మాట్లాల్లేదు. వళ్ళు అగ్గిలెక్కుంది. పక్కనే తాకుతా వుంటే నిప్పుల

కొలిమిలో యేసి కాల్సినట్టుంది. రెడ్డి గుర్తొచ్చాడు. రెడ్డితో సంబంధం గుర్తొచ్చింది. ఐదేండ్ల కిందటి సంగతులు వొక్కొక్కటి గుర్తొచ్చి దుక్కం వుప్పొంగింది.

✳ ✳ ✳

నాగన్నది కూలి చేసుకునే కుటుంబం. యే రోజు సంపాదన ఆరోజు గంజికి సరిపోయేది. నలుగురు పిల్లలు. ముగ్గురు ఆడ. ఒక మగ. రాజమ్మే పెద్దది. పద్నాలుగేండ్లకే పుల్లయ్యకిచ్చి సేశాడు. ఇద్దరికి యిరవై యేళ్ళ వారుంటాది. పుల్లయ్యకది రెండో సంబంధం. మొదటి పెళ్ళాం ఓ పిల్లని కని పురిట్లోనే సచ్చిపోయింది. వొంటరిగుండలేక, పిల్లను సాకలేక, పెద్దమనుసులతో పక్కూరి నాగన్నతో కర్చులు తానే పెట్టుకుంటానని సంబంధం మాట్లాడించాడు. దానికి నాగన్న ఒప్పుకున్నాడు.

రాజమ్మ వొద్దువొద్దని యేడ్సి గీ పెట్టినా వినలేదు. బలవంతాన తాళి కట్టించి బరువు దించుకొన్నాడు. మనువైన రెండేండ్లకే పుల్లయ్య చతికిలబడిపోయాడు. పనులు చాతగాక, రోగంతో మంచానికి అంటుకుపోయాడు. రాజమ్మే కూలీకి పోతూ, ఇల్లు నడపసాగింది.

అంతలో... మాయదారి కరువొచ్చింది. బావుల్లో గంగింకిపోయింది. పంటలు వాడిపోయి నేలకు కర్సుకున్నాయి.

ఆకాశంలో మబ్బుతునక కనబళ్ళేదు. కష్టాలు... మనుషులకే గాక మానులకూ వచ్చాయి. పశువులకూ వచ్చాయి. జనాలు అల్లాడిపోయారు. పంటల్లేవు... పనుల్లేవు... కూలీల్లేవు... యాలకి తిండి లేదు. అప్పులు పుట్టక వలసలు మొదలయ్యాయి.

అప్పుడే... ఎల్లమ్మ రెడ్డి గురించి చెప్పింది. ఎల్లమ్మ రెడ్డింట్లో కసులు గొట్టే ముసిల్ది. రాజమ్మింటి పక్కనే వుంటాది.

"పెళ్ళాం పోయింది. గాలికి దిరుగుతున్నాడు. డబ్బున్నోడు. ఆయనంచుకుబోతావా. నే గలుపుతా, కరువు దీరతాది" అంది.

రాజమ్మ వారం రోజులు కిందా మీదా పడింది. మంచమ్మీది మొగున్ని చూసింది. నేలకు కర్సుకున్న పిల్లని చూసింది. మనసు వొద్దన్నా కడుపు పొమ్మంది. ఆఖరికి సరేనంది. ఎల్లమ్మ రెడ్డితో యేం జెప్పిందో గానీ రాజమ్మను ఆయనంచుకు తోల్కోనిపోయింది. ఆనాటి నుండి తిండికి లోటు లేదు. రెండుపూట్లా కంచంలోకి అన్నం చేరసాగింది.

ప్రతిరోజూ పొద్దున్నే రాజమ్మ రెడ్డింటికి బోవడం మొదలుపెట్టింది. అన్నం చేయడం, కసులూడ్చడం, బట్టలుతకడం... అన్నీ చేయబట్టింది. ఇంటి అవసరాలు, వంటి అవసరాలు దీర్చబట్టింది. ఆనోటా యీనోటా వూరందరికీ విషయం తెల్సిపోయింది. వెనుకమాటున అనుకోసాగారు. రాజమ్మేమీ పట్టించుకోలేదు.

మొగునికి విషయం తెల్సీ... తెలీనట్లే గమ్మునుండిపోయాడు.

మధ్యాన్నం యింటికొచ్చి పనులన్నీ చేసుకొనేది. మొగునికీ, పిల్లదానికీ యేలకి తిండి బెట్టేది.

రెడ్డంచున తెచ్చిన డబ్బుల్తో మొగున్ని డాక్టరుకు చూపిచ్చింది. మందులిప్పిచ్చింది. పుల్లయ్య నెమ్మదిగా కోలుకున్నాడు. రెండు సమ్మచ్చరాల కరువు సుఖంగానే గడిచిపోయింది.

ఆ యేడు వానలు కురిసి, బరకలు పదునెక్కాయి. రైతులు గడాలు బయటకు దీశారు. ఎక్కడ చూసినా హడావుడి. వూరిడ్చిన జనాలు మళ్ళా వూళ్ళోకి రావడం మొదలయింది. కూలీలకు రేట్లు పెరిగాయి. పుల్లయ్య కూలీకి పోవడం మొదలెట్టాడు. చేతిలో దుడ్లాడడం మొదలయ్యింది. అప్పుడు రాజమ్మతో కొట్లాటెట్టుకున్నాడు.

"మొగుడు మంచానుంటే మోసం సేస్తావే దొంగలంజా! నీకూ నాకూ సంబందంలా. యే యేట్లోకైనా పోయి సావు. నీ దారి నీది. నా దారి నాది" అన్నాడు. నాగన్నను పిలంపి పంచాయితీ పెట్టించాడు. రాజమ్మ గమ్మున కళ్ళనీళ్ళతో తప్పొప్పుకొంది. పుల్లయ్య అందరి ముందు తాళి తెంపేసుకున్నాడు. పెళ్ళి ఖర్చులకయ్యింది తిరిగి కట్టమన్నాడు. పెద్ద మనుషులు గూడా యియ్యాల్సిందే అంటూ వారం గడువిచ్చారు.

నాగన్న రాజమ్మను నోటికొచ్చినట్టల్లా తిడుతూ కిందా మీదా యేసి సావగొట్టాడు. వొక్కుదుటున అంత డబ్బు యెట్ల తేవాల్నో అర్థంగాలేదు. రెడ్డంచుకెళ్ళాడు. సంగతంతా వివరించి, నువ్వే నా కూతురిని ఆదుకోవాలన్నాడు. రెడ్డి రాజమ్మనేమీ అనొద్దంటూ నాలుగేలిస్తూ దారి కర్చులకుంచుకోమని మరో వెయ్యిచ్చాడు. నాగన్న పంచాయితీలో డబ్బు కట్టి కూతుర్ని తీసుకొని వాళ్ళూరెళ్ళిపోయినాడు. రాజమ్మ ఆన్నే కూలీనాలీ సేసుకొని బదుకసాగింది.

రెండు సమ్మచ్చరాలు గిర్రున తిరిగిపోయాయి. పుల్లయ్యకు వయసు పైబడి శక్తి తగ్గిపోయింది.. కూలీకి పోలేక పోయాడు. దాచిన సొమ్మంతా కర్చయిపోయింది. తిండికి లేకపోయింది. పిల్లదాన్ని పట్టిచ్చుకునేటోళ్ళు కనబడలేదు. యాడంటే ఆడ తినీ, తిరిగీ, తాగి ఒళ్ళు పాడయింది. ఒక్కపూట తిండి దొరకడమే బమ్మాండమై పోయింది. యేదేమైనా తిరిగి రాజమ్మను తోలుకొచ్చుకోవాలనుకున్నాడు. రాయబారాలు నడిపి పెద్ద మనుషులను బతిమలాడి వాళ్ళకు చెయ్యాల్సిన మర్యాదలన్నీ చేశాడు.

⁂ ⁂ ⁂

బస్సాగడంతో రాజమ్మ వులిక్కిపడి, ఈ లోకంలోకొచ్చింది. కళ్ళు తుడుచుకుంటూ బస్సు దిగింది. మొగునెంట నడిచింది. కొంపంతా బూజుబట్టింది. పుల్లయ్య కాసేపు అటూ యిటూ తిరిగి సరుకులు తెస్తానని బయటికెళ్ళిపోయాడు. పక్కింట్లో ఆడుకుంటున్న పాప కాసేపటికొచ్చి "అమ్మా" అంటూ చుట్టుకుపోయింది. నెమ్మదిగా లేసి దానికి స్నానం చేపిచ్చి, కసులూడ్చి, చాప మీద దాన్ని పడుకోబెట్టింది. ఇంఢ్లంతా శుభ్రం చేసింది. పుల్లయ్య కాసేపటికి వంటసామాను తీసుకొచ్చాడు. వొండి పిల్లకూ, మొగునికి బెట్టి తానూ తిని పండుకొనింది.

ఓ వారం తర్వాత యింటి ముందు కసులూడుస్తుంటే వొగడొచ్చి "రెడ్డి పిలుస్తున్నాడు. పోవాలంట" అన్నాడు. రాజమ్మ యిననట్టే గమ్మునుండిపోయింది. రెడ్డంచు నుండి పిలుపుల మీద

పిలుపులు రాసాగాయి. రాజమ్మకు పోవాలనున్నా పోలేదు. రెన్నెల్లు అలాగే జరిగిపోయాయి.

ఓరోజు అనుకోకుండా పుల్లయ్య లేని సమయంలో రెడ్డే యింటికొచ్చాడు. రాజమ్మ నోటమాట రాక అలాగే చూస్తుండిపోయింది. రెడ్డి చిన్నగా నవ్వుతా "ఎందుకే బయం. నీ మొగుడొస్తాడనా. రాడులే. టౌనుకు బోయిండు. ఇగో ఓ విషయం సెబ్తా విను. మొన్న నిన్ను తోల్కోనొచ్చేటప్పుడు ఐదేలు మీ నాయనకు గట్టెగదా. అంతోటి డబ్బు ఆనికెక్కడిదనుకున్నావ్... అంత డబ్బే వుంటే ఆడు నిన్నెందుకు తోల్కోనొచ్చుకుంటాడు. నా కాళ్ళావేళ్ళా బడ్తే నీ కోసరమని నేనే యిచ్చంపినా. రెన్నెల్ల నుంచీ రోజూ వస్తూనే వున్నాడు. దినబత్యానికి డబ్బుల కోసం" అంటూ జరిగిందంతా వివరిస్తూ దగ్గరకు తీసుకున్నాడు.

పాత సంబందం మళ్ళా మొదలయింది. మునుపటిలాగే రోజూ రెడ్డి తావుకు పోసాగింది. పుల్లయ్య చిన్న తమ్ముని పెళ్ళికీ... గుడిసె పీకేసి మట్టిమిద్దె కట్టుకోడానికీ రెడ్డే సాయం చేశాడు. రోజులు హాయిగా గడువసాగాయి. ఆ అవసరమైనప్పుడల్లా పుల్లయ్య రెడ్డంచుకెళ్ళి డబ్బులు తెచ్చుకోసాగాడు.

✧ ✧ ✧

గాలి మత్తుగా వుంది. సారా వాసన, కడ్డీల వాసన ఓ దానితో వోటి పోటీ పడుతున్నాయి. జనాలు తాగుతూ తూగుతూ వున్నారు. పుల్లయ్య ఓ రెండు గ్లాసుల సారా పూటుగా పట్టిచ్చాడు. పుల్లయ్య స్నేహితుడొకడు పక్కనే కూచోని తనకూ ఓ గ్లాసు తెప్పియ్యమన్నాడు. పుల్లయ్య నవ్వుతా "పోరా! డబ్బులేమైనా యెట్టిగా వస్తున్నాయా. లేవుపో" అన్నాడు.

వాడు కోపంగా "వాయబ్బో... తెగ కష్టపడి సంపాదిత్తున్నావులే... పెళ్ళాన్ని యెవనంచునో పన్నబెట్టి తెస్తున్న దానిక్కూడా బలె సంబడంగ మాట్లాడుతున్నావ్" అన్నాడు ఎకసెక్కంగా.

అంతే... ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగిపోయింది. అంగీలు పట్టుకొని, కిందా మీదా తన్నుకోసాగారు. జెనాలు విడదీసి పుల్లయ్యను మొగం మీదే తిడ్తూ నానాక మాటలు అన్నారు.

పుల్లయ్య కోపంగా యింటికి బయలుదేరాడు. కల్లు గుడిసె కాడ అందరూ మొగం మీదనే తన పెండ్లాం గురించి మాట్లాడ్డం గుర్తుకు రాసాగింది. సిన్న పొట్టెగాళ్ళు గూడా యెగతాలి సేయడం గుర్తుకొచ్చింది. మైకంతో బాటు కోపం పెరిగిపోసాగింది. తూలుతా ఇంటికొచ్చి తలుపు తెరిశాడు. పెండ్లాం కనబళ్ళేదు. పిల్లది సాప మీద పండుకోని కన్పించింది. ఈడ్చి దాని డొక్కలో కాలితో వొక్కటిచ్చాడు. అదిరిపడి లేచి అమ్మెక్కడుందో తెలీదనింది. యేడ్చసాగింది. ఇంటి ముందు మంచమ్మీద కూచోని ఈదిలో అందరికీ ఇనబడేటట్లు బూతులు తిట్టసాగాడు. ఓ పావు గంటకు రాజమ్మొస్తూ కనబడింది.

వొచ్చీరాగానే వొక్కుదుటున లేచి "దొంగలంజా... బరితెగించినావే... నీయమ్మ... మొగుడంటే లెక్కా జమా లాకపోయెనే నీకు. యాడికి బోయింటివే యింతసేపు" అంటూ జుట్టు పట్టుకోని వీపు

మీద దభీదభీమని నాలుగు గుద్దులు గుద్ది ఒక్క తోపు తోశాడు. విసురుగా పోయి గోడకు కొట్టుకొని కిందపడింది.

చుట్టుపక్కల జెనాలంతా చుట్టూ జేరి వినోదం చూడసాగారు. రాజమ్మకు అర్థంగాక యేడుస్తా "నేనేం సేస్తిని... ఇట్లా మీద బడ్తున్నావ్" అంది.

"మళ్ళా యేం సేసినానంటావ్ నీయమ్మ... నన్నుమాయకున్ని సేసి, కళ్ళు గప్పి... మళ్ళా రెడ్డంచుకుబోతావా నువ్" అంటూ కాలితో కడుపులో ఈడ్చి కొట్టాడు.

రాజమ్మకు విషయం అర్థమై కోపంగా పైకి లేసి "అవ్ బోతా... నేను బోకుంటే... ఈ యిల్లు నువ్ నడుపుతున్నావా. మొగుడివేనా నువ్. నా మీద బడి బతుకుతున్నావ్. మళ్ళా నన్నే అంటావ్. థూ... సాతగాకపోతే వదిలేయ్‌రా... నిన్నేమన్నా యేలుకోమని యెంటబడ్తినా... డబ్బుల్గావాలా, సారాగావాల, సిన్మాల్గావాల... యాడకుబోయి దెచ్చేది. లచ్చిముందా యింట్లో...లేక... మీ నాయన దాసిన ముల్లెందా" అనింది ఆవేశంగా వూగిపోతూ.

పుల్లయ్య అదిరిపడి చుట్టూ చూస్తున్నోళ్ళందరొంకా చూశాడు. కొందరు కొంగడ్డం బెట్టుకొని నవ్వడం కన్పించింది. కోపం పెరిగిపోయి పళ్ళు పటపటలాడాయి. మూలనున్న కర్రందుకోని "మాటకు మాట సెబ్తావ్... యెంత బరితెగించినావే.." అంటూ గొడ్డును బాదినట్టు బాదుతూ "యిన్ని రోజులూ నువ్ పోయిన కాడికీ, వాడిచ్చిన కాడికీ సరిపాయ. సాలియ్యి. ఇంగోపారి పోనావంటే ఈన్నే తవ్వి పాతరేస్తా" అంటూ మొగమ్మీద తుపుక్కున వుమ్మేసి సరసరా ఆన్నించి వెళ్ళిపోయాడు.

రాజమ్మ వళ్ళంతా పచ్చి పుండయి, వాతలుదేలాయి. నెమ్మదిగా లేచి ఇంట్లోకి పోయింది. కుళ్ళి కుళ్ళి యేడ్చింది. యేదేమైనా ఇంగోపారి రెడ్డంచుకు పోగూడదని తీర్మానం చేసుకొంది. శరీరం సోదీనంలోకి రాడానికి వారం బట్టింది. మొగుడింట్లో వున్నా గమ్మునుండసాగింది. పుల్లయ్యే పల్కరించడానికి ప్రయత్నించినా యేమీ మాట్లాల్లేదు. రెడ్డంచు నుంచి మాటిమాటికీ పిలుపులు రాసాగాయి. గుడ్లనీరు కుక్కుకునిందే గానీ కన్నెత్తి సూడ్లా, పన్నెత్తి మాట్లాడ్లా. ఇండ్లొదల్లా. మొగుడు తెస్తే తినడం, లేకుంటే పస్తుండడం అలా నాలుగు నెలలు మౌనంగా గడిచిపోయాయి.

పుల్లయ్యకు డబ్బులు కష్టమయిపోయింది. వున్నవన్నీ ఐపోయాయి. యేం చెయ్యాలో అర్థం గాలా. ఓనాడు రాజమ్మ మంచమ్మీద పండుకోనింటే దగ్గరకొచ్చి అటూ యిటూ తచ్చాడుతూ మాటిమాటికీ రాజమ్మొంక చూడసాగాడు. రాజమ్మ అవతల్కి దిరిగి పండుకొనింది. దగ్గరకొచ్చి నసుగుతూ "రెడ్డి పిలుస్తున్నాడు. యేందో పనుందంట. పోవాలంట..." అన్నాడు.

రాజమ్మ తాచుపాములా తల తిప్పింది. ఆ కళ్ళలోకి చూడలాక తత్తరపడతా బయటికెళ్ళిపోయాడు. రాజమ్మ మనసు కుతకుతా వుడకసాగింది. కాసేపు కిందామీదా బడి ఓ నిర్ణయానికొచ్చి నెమ్మదిగా పైకి లేచింది. ముఖ్యమైన సామాను సర్దుకొని పెట్టె తీసుకోని రెడ్డంచుకు బైలుదేరింది.

మంచమ్మీద పండుకోని బీడీ తాగుతున్న రెడ్డి అలికిడికి తలదిప్పాడు. గుమ్మం దగ్గర రాజమ్మ

కన్పడింది. చేతిలో పెట్టె గమనించి లేచి దగ్గరకొస్తా యేమే పెట్టెతోనొచ్చినావ్" అన్నాడు. సెప్పడానికి నోరు తెరిచింది గానీ అంతలోనే చేయి పట్టి విసురుగా లాగాడు. ఒళ్ళోకొచ్చి పడింది. "యెన్నిమాట్లు కబురంపాల్నే నీకు. సొయ్యమెక్కినట్లుందీమధ్య" అంటూనే ఆబగా చుట్టుకుపోయాడు. రాజమ్మకు నోట్లో మాట నోట్లోనే వుండిపోయింది. గమ్మున శరీరాన్నప్పగించింది. రెడ్డి కాసేపటికి అలసిపోయి పక్కకు దొర్లాడు. రాజమ్మ చీర కుచ్చిళ్ళు సరిజేసుకుని ఓ మూలన గోడవారకు కాళ్ళు ముడ్చుకోని కూచుంది.

రెడ్డి మంచమ్మీద కూచోని బీడీ అంటించాడు. పొగ సుళ్ళు దిరగసాగింది. రాజమ్మొంక నింపాదిగా చూస్తా "అవును ఇందాక సెప్పడం మర్సిపోతివి. యేమి పెట్టెతోనొచ్చినావ్" అన్నాడు. రాజమ్మ తలొంచుకోని నెమ్మదిగా గొణుగుతున్నట్టుగా "అన్ని వదిలేస్తున్నా. ఇంగ నీకాడనే వుంటా..." అంది.

రెడ్డి పక్కలో పామున్నట్టు వొక్కసారిగా అదిరిపన్నాడు. కోపంగా చూస్తా "యేందే సోదిలో వుండే మాట్లాడుతున్నావా. నీ కులమేడ... నా కులమేడ... నీ మొగుడు మద్దస్తం బెట్నాడంటే... నలుగుర్లో అవలాయవుతా. వూరోళ్ళు తుపుక్కున వుమ్మేస్తారు మొగమ్మీద. ఇంగోపారి ఆ మాటెత్తక పెట్టె దీస్కోని పో" అన్నాడు.

రాజమ్మ మాటలు బుదుక్కుంటా "యెవనికి తెలియన్దేముంది రెడ్డీ యీ వూర్లో. ఆడు పేరుకు మొగుడే గానీ... వుంటుంది నీతోనే గదా. నీవు గాదంటే నా గతేం గాను" అనింది కాళ్ళకానుకోని కూచుంటూ.

రెడ్డి కాలు విదిలించి కొట్టి "యేందే... యెప్పుడూ లేని మాటలు మాట్లాడుతున్నావ్. నీలాంటి అలగా జెనంతో మాలాంటోళ్ళకు సంబందాలు మామూలే. అట్లాని సెప్పి నెత్తిన బెట్టుకోని వూరేగమంటావా. మా బంధువులకు యేమని సమాధానం సెప్పుకోవాల. ఇగో... ఈ కుత్తుక మీద అడ్డంగా కత్తిబెట్టి కోసినా నిన్నుంచుకోడం జరగదు.నోర్మూసుకోని గమ్మున పడుంటే పడుండు. లేకుంటేలా. ఐనా... ఇంగెంత మంది దగ్గర పండుకొంటున్నావో నాకేమెరుక. మీ కులపోళ్ళను నమ్మేదెవరు" అన్నాడు కరుకుగా.

ఆ మాటలకు రాజమ్మకు మండిపోయింది. రక్తం సలసలా కాగిపోయింది. విసురుగా లేచి "పండుకునేటప్పుడు లేని కులం... యిప్పుడడ్డమొచ్చెనా... కులమంట కులం... థూ..." అంది విసురుగా నొసలు చిట్లిస్తూ.

వూహించని విధంగా రెడ్డి, రాజమ్మ చెంపపై ఈడ్చికొట్టాడు. పెదవి చిట్లి రక్తం కారసాగింది. జుట్టట్టుకోని గోడకేసి దబాదబా బాదుతా "యేందే యెదురుమళ్ళ మాట్లాడుతున్నావ్. వూకెనే పండుకొంటున్నావా. కావాల్సినవన్నీ దొబ్బుకు పోలేదా. ఇన్ని వేలని గాదు. అడిగిందల్లా యిస్తి. దినబత్యం నడిపితి. నా మీదబడి బతుకుతా మళ్ళా నన్నే అంటావా... నీ యమ్మ... నువ్ గాకపోతే వంద మందొస్తారు" అంటూ బండబూతులు తిడ్తూ విసురుగా బయటకు దొబ్బాడు. ఈదిలోకొచ్చి

పడింది. సామాను బయటకు విసిరికొట్టి తలుపు దఢేలున మూశాడు.

రాజమ్మ నెమ్మదిగా వంటికంటిన మట్టి దులుపుకోని లేసి నిలబడింది. పెదవి నుండి రక్తం వుప్పగా నోట్లోకి జారసాగింది. చేత్తో రక్తాన్ని తుడ్చుకోని పెట్టె తీస్కోని అక్కడినుండి బయలుదేరింది. గుండె బరువెక్కి, కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలసాగాయి. యెక్కడికి పోవాల్నో అర్థం గాలేదు.

గడచిన జీవితం కళ్ళ ముందు కదలాడసాగింది. తండ్రి గుర్తొచ్చాడు. మొగుడు గుర్తొచ్చాడు. రెడ్డి గుర్తొచ్చాడు. అందరూ పరాయోళ్ళలాగే కన్పన్నారు. యెవలంచుకూ యెళ్ళబుద్ధి కాలేదు.

కట్టుకున్నోనికి డబ్బు గావాల... వుంచుకున్నోనికి వళ్ళు గావాల... కన్నోనికి పరువు గావాల... తానెవరికీ అక్కరలేదు...

తన బదుకు మీద తనకే అసహ్యావేసింది. కంపరవేసింది. ఒళ్ళమ్ముకోని సంపాదిస్తున్నట్టనిపించింది. అదీ.... తన కోసం గాక... సాకడం చాతగాని మొగుని కోసం తన్నులు తింటూ... తిట్లు తింటూ... నలుగుర్లో అవలాయవుతూ... మాట పడుతూ...

అంతలోనే ఈ సోకు తగ్గిపోతే... అనే వూహొచ్చి ఒళ్ళు వణికిపోయింది. గుండె దడదడా కొట్టుకొంది.

ఇంతకాలం తానెవరి కోసం బతుకుతున్నదో అర్థమైంది. తనకెవరూ యేమీ గారని తెలిసిపోయింది. ఈళ్ళెవరూ లేకుంటే తన బదుకు తనిష్టమొచ్చినట్టు తాను బదకగలనని అనుకొంది. మనసులో ముసురుకున్న మబ్బులు నెమ్మదిగా తొలగిపోసాగాయి.

నెమ్మదిగా... నిబ్బరంగా... పెట్టెతో బస్టాండ్ వైపు అడుగులేసింది. నాలుగడుగులేసిందో లేదో... నుదుటి మీద చల్లగా తడయింది. చేయి పెట్టి చూసింది. రక్తం... ఎర్రగా... జిగటగా... తల సలుపసాగింది. పెదవి తడుముకుంది. వాసి వుబ్బెత్తుగయ్యింది. గోడకేసి దబదబా బాదిన రెడ్డి గుర్తొచ్చాడు. అతని మాటలు గుర్తొచ్చాయి. కోపంతో, అసహ్యంతో వూగిపోయింది. పూనకమొచ్చిన దాన్లా పోతున్నది కాస్తా గిరుక్కున వెనుదిరిగి రెడ్డింటికి బయలుదేరింది.

మూసి వున్న తలుపుపై చప్పుడు చేసింది. రెడ్డి తీశాడు. ఎదురుగా వున్న రాజమ్మను చూసి హేళనగా, వెకిలిగా నవ్వతా "ఏమే... మళ్ళొచ్చినావ్. నీ మొగుడు డబ్బులకోసమంపినాడా" అన్నాడు.

ఎర్రబారిన కళ్ళతో రాజమ్మ తలెత్తి రెడ్డి కళ్ళలోకి సూటిగా చూసింది. రెడ్డి వెకిలిగా నవ్వాడు. వూహించని విధంగా రాజమ్మ ఒక్కడుగు ముందుకేసి రెడ్డి మొగమ్మీద కాండ్రించి తుపుక్కున వూసింది.

రెడ్డికి ఒక్క క్షణం కాలాడలా.... చెయ్యాడలా... బిక్కసచ్చిపోయాడు. అంతలోనే తేరుకొని ఆవేశంగా వూగిపోతూ "నీయమ్మ" అంటూ బూతులు తిడ్తా అడుగు ముందుకేశాడు. అప్పటికే రాజమ్మ గిరుక్కున వెనుదిరిగి బెరబెరా నడుచుకుంటూ చీకట్లో కలిసిపోయింది.

మాయమ్మ రాక్షసి కథాసంపుటి - డిసెంబర్ 2000

# మాయమైన గానం

"అమ్మా... తల్లీ... కాస్త ఏమన్నా వుంటే ఎయ్ తల్లీ... పుణ్యముంటాది" పదిహేడేళ్ళ జమ్మన్న, గొంతును సాధ్యమయినంత దీనంగా, అవతలి వాళ్ళ హృదయాలు కరిగిపోయేటట్లు మార్చి ఒక్కొక్క ఇంటి ముందే ఆగాగి అరుస్తూ వున్నాడు. ఏదో ఒకరిద్దరు తప్ప చానామంది "పోయిరాపో, చేయి ఖాళీ లేదు" అంటూ వున్నారు.

గిన్నె వైపు చూసుకున్నాడు. సగానికి కూడా నిండలేదు. అది గూడా వుత్త అన్నమే. "థూ... థూ... జనాలకీ మధ్య రోజురోజుకీ పిసినారితనం ఎక్కువయి పోతా వుంది" అని తిట్టుకుంటూ ఒకింటి ముందు నిలబడి అలవాటయిన పద్ధతిలో "మా... తల్లీ... కాస్త కూరుంటే ఏయమ్మా" అంటూ గట్టిగా అరిచాడు.

ఆ ఇంటి గాసగాడు పెరట్లో వుత్తపైన నిలబడి ఎండకు చెమటలు కారిపోతూ వుంటే గేదెలను కడుగుతూ వున్నాడు. జమ్మన్న మరలా కాస్త గొంతు పెంచి, మరింత గట్టిగా అరిచాడు. లోపలి నుండి ఎవరూ ఏమీ పలకలేదు. అంతలో గాసగాడు తల పైకెత్తి చూసి "ఏయ్... పోయిరాపో... వూరికే అరవకు" అంటూ విసుక్కోని మళ్ళా తన పనిలో తాను పన్నాడు.

జమ్మన్నకు అలాంటి మాటలు మామూలే.

కొన్ని క్షణాలు చూసి లోపలి నుండి ఏ మాత్రం అలికిడి వినిపించకపోయేసరికి ఈ సారి మరింత గొంతు పెంచి "మా... కాస్త కూరుంటే ఎయ్ తల్లీ... పుణ్యముంటాది" అంటూ గట్టిగా అరిచాడు.

ఒంటి మీద కారిపోతున్న చెమటతో చిరాకుగా వున్న గాసగాడు ఆ అరుపినేసరికి అసహనంగా తలతిప్పి "రేయ్... చెప్తే అర్థం గాదా... చెవుడా... వూకె పిచ్చికుక్కలెక్క అరుస్తా వున్నావే. ఐనా కాలొంకరా.. కన్నొంకరా... దున్నపోతులెక్కున్నావ్... సిగ్గులేదూ అడుక్కోటానికి" అన్నాడు విసుగ్గా.

ఆ మాటలకు జమ్మన్న "చూడు సామీ... వుంటే వుందను.. లేదంటే లేదను... అంతేగానీ పిడికెడు బిచ్చానికి మాటలెందుకు... అనవసరంగా" అన్నాడు.

మాటకు మాట చెప్పేసరికి గాసగాడు బరగొడ్డును కడగడం ఆపు చేసి కోపంగా వానికేసి

తిరిగి “వాయబ్బో... పిడికెడు బిచ్చమంట... ఏం వూకొస్తున్నాయనుకుంటున్నావా 'ఐనా కష్టపడి సంపాదించేటోళ్ళకి తెలుస్తాది గానీ అడుక్కుతినేటోళ్ళకేం తెలుస్తాది దాండ్ల విలువ” అన్నాడు.

ఆ హేళనకు జమ్మన్నకు సుర్రుమనింది. “చూడు సామీ... పెడ్తే పెట్టు... లేదంటే లేదు. అంతేగానీ మా కులవృత్తిని మాత్రం తక్కువ చేసి మాట్లాడొద్దు. బాగుండదు. నీకు నీ వృత్తేంతో నాకు నా వృత్తంత...” అన్నాడు.

గాసగాడు వ్యంగ్యంగా “వాయబ్బా కుల వృత్తంట... కులవృత్తి. పనీపాటా లేకుండా దేవరగొడ్డు మాదిరి వూరి మీద పడి మేయడం గూడా వృత్తేనా. పోరా నా కొడకా... ఇంగోసారి ఈ ఇంటి ముందు గనుక కనబన్నావనుకో... ఏం చేస్తానో చూడు” అంటూ హెచ్చరించాడు వేలు చూపిస్తూ.

దాంతో జమ్మన్న గూడా రోషంగా “ఏం జేస్తావ్. నా వృత్తి నే చేసుకుంటున్నా. అంతే గానీ... దొంగతనం చేస్తినా... లంజతనం చేస్తినా సిగ్గుపడ్డానికి... మాటలు మర్యాదగా రానీయ్” అన్నాడు గట్టిగా.

అడుక్కుతినే జమ్మన్న అట్లా అనేసరికి గాసగాడు తట్టుకోలేకపోయాడు. కోపం సర్రున నరనరాల్లోకి పాకింది. “నా కొడకా... వూరి మీద పడి బతికే నా కొడుకువి. నాకే మాటకు మాట చెబుతావా” అంటూ వూహించని విధంగా పక్కనే వున్న చనకాల తీసుకోని సర్రున దగ్గరికొచ్చి “అడుక్కుతినే నా కొడుకుని అడుక్కుతినే నా కొడుకనక... మహారాజంటారా... పెదరెడ్డంటారా... పని చేసేదిలాగానీ పెద్ద రోషమొకటి. ఇంగోపారి గనుక ఈ గేరివైపు కనబన్నావనుకో... ముక్కుమొగం తెలీకుండా తంతా చూడు... ఏమనుకుంటున్నావో” అంటూ రపరపరప పెరికాడు.

జమ్మన్న అది వూహించలేదు. ఒక్కసారిగా ఒళ్ళంతా సుర్రుమనింది. కళ్ళలోంచి నీళ్ళు సర్రున కారాయి. దెబ్బలకు తట్టుకోలేక గట్టిగా కేకలు పెట్టాడు. ఆ అరుపులకు చుట్టుపక్కలోళ్ళు వురుక్కుంటూ వచ్చి గాసగాని చేతిలో వున్న చనకాల లాగేసుకున్నారు. జరిగినదంతా తెలుసుకొని జమ్మన్ననే నానాక తిట్లు తిట్టి పంపించారు.

జమ్మన్న వంచిన తల ఎత్తకుండా... ఒళ్ళంతా సుర్రుమంటూ వుంటే... ఆగాగి వస్తున్న కన్నీళ్ళని తుడుచుకుంటూ... నెమ్మదిగా వూరి చివరి ఎస్సీకాలనీ దాటి దూరంగా వున్న తమ ఇళ్ళవైపు బైలుదేరాడు.

పుట్టి పదిహేడేళ్ళవుతూ వుంది. ఏ రోజూ జరగలేదిట్లా. వూహ తెలిసినప్పటి నుండి చేస్తున్న పని ఇదే.ఆకలైతూనే గిన్నె ఎత్తుకొని వురుక్కుంటూ వూళ్ళోకి పోవడం. అట్లా నాలుగైదు గేర్లు తిరిగి రావడం, నాలుగు రకాల కూరలతో తినడం లేదా సావాసగాళ్ళతో కలసి వలలు, బోనులు, వుచ్చులు, గాలాలు తీసుకొని వేటకు బోయి నక్కనో, పిల్లినో, ఉడతనో, చేపనో, ఎంద్రకాయనో ఏదో ఒగటి పట్టుకు రావడం... తినడం... పైసలుంటే కల్లు తాగి చిందులు తొక్కడం. తనకొక్కనికేగాదు... కులంలో సగానికి పైగా అదే పని.

వీధుల్లో తిట్లు... అరుపులు... విసుర్లు... హేళనలు... మామూలే.

కానీ... ఇట్లా మాత్రం ఎప్పుడూ జరగలేదు.

అంగీ తగిలినప్పుడల్లా ఒంటి మీద వాతలు సుర్రుమంటూ వుంటే ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేరు. లోపలికి పోయి అంగీ విప్పి కట్టెల పొయ్యి మీద వేడినీళ్ళు కాచి వాతలపై కాపడం పెట్టుకున్నాడు. నొప్పి కొంచెం తగ్గుముకం పట్టింది. ఇంటి బైటకొచ్చి వేపచెట్టు కింద కూర్చున్నాడు. అక్కడక్కడ మట్టి మిద్దెలతో బాటు, సులభంగా విప్పి తీసుకుపోవడానికి వీలుగా అర్ధచంద్రాకారంలో ప్లాస్టిక్‌షీట్లు పైన పరచిన గుడిసెలు చాలా వున్నాయి.

చుట్టూ చూస్తూ వుంటే మాటిమాటికీ ఆ గాసగాని మాటలే గుర్తుకు రాసాగాయి.

కండ్ల నుండి నీళ్ళు సర్రున కారిపోసాగాయి.

తన బాధను ఎవరితో పంచుకోవాల్నో అర్థం కాలేదు.

గేర్లో ఎవరూ లేరు.

వేటకో, వ్యాపారాలకో, అడుక్కోడానికో చానా మంది పోయినట్టున్నారు. నిశ్శబ్దంగా వుంది.

చిన్నపిల్లలు కొందరు చినిగిన, మాసిన బట్టలతో గుడిసెల ముందు బొంగరాలాట ఆడుకుంటూ కనబన్నారు. బాధను మరచిపోడానికి 'రేయ్... ఎంకటేశులూ... ఇట్ల రారా' అంటూ ఒకన్ని పిలిచాడు.

వాడు బొంగరానికి తాడు చుట్టుకుంటా దగ్గరకొచ్చి "ఏమనా" అన్నాడు.

"ఏరా... బడికి పోలేదా... పొయిన వారమేగదా మీయమ్మ నా కొడుకుని సదివించి పెద్దోన్ని చేస్తా అంటూ తీస్కపోయి నిన్ను బళ్ళో ఏసింది" అడిగాడు.

వాడు కాసేపుండి "అదికాదనా... ఆడందరూ మీరు అడుక్కుతినేటోళ్ళు గదా... అంటూ మాటిమాటికీ ఏడిపిస్తున్నారనా.... ఆటల్లో ఆడిపిచ్చుకోరు. పక్కన కూచోనియ్యరు. సారోళ్ళు గూడా అంతే... దూరం దూరం పెడ్తున్నారు. దగ్గరికి పోతే కసిరిచ్చుకుంటున్నారు. అందుకే పోబుద్దిగాక మానేసినా" అన్నాడు.

జమ్మన్నను ఆ మాటలు మరింతగా బాధపెట్టాయి.

మొదటిసారిగా తన మీద, తన వృత్తి మీద అసహ్యమేసింది. ఆలోచనలో పన్నాడు.

అంతలో... అటువేపు ఒక కాలికి సగం దాకా పైకి మడిచిన ఖాకీరంగు ప్యాంటూ, అదే రంగు పాత చొక్కా, నెత్తి మీద ఇంగ్లీషు దొరల టోపీ, భుజమ్మీద కర్రతుపాకీ, చినిగిన బూట్లు, జేబులో బీడీలు పెట్టిన సిగరెట్ ప్యాకెట్టుతో, మొహానికి వేసిన ఎర్రని రంగు సగానికి పైగా చెమటకు కారిపోతూ వుంటే పిట్టలదొర వేషంతో తాటికొండ సుంకన్న సైకిలు తొక్కుకుంటూ వచ్చాడు.

ఇంటిబైట కూర్చున్న జమ్మన్నని చూసి "ఏరా... ఎప్పుడూ... గలగలా మాట్లాడేటోనివి, ఇప్పుడు పలకరిస్తా వున్నా వూ... ఆ... అనకుండా మూగెద్దులెక్క మట్టసంగా అట్ల కూసున్నావ్. ఏమయింది. పైగానీ బాలేదా ఏమి" అన్నాడు గొంతు కింద చేయిపెట్టి చూస్తూ.

అంతవరకూ ఏడుపును తనలోనే అదిమి పెట్టుకున్న జమ్మన్న కళ్ళలోంచి నీళ్ళు ఒక్కసారిగా బైటకు దుంకాయి. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వూర్లో జరిగిందంతా చెప్పి “కాదు మామా... నువ్వే చెప్పు... నేనేమయినా కానిపని చేస్తినా... మన కులవృత్తేగా చేసింది. అదేమన్నా తప్పా” అన్నాడు.

సుంకన్న వాని భుజం చుట్టూ చేయేసి దగ్గరికి తీసుకుంటూ “రేయ్ అప్పట్నించీ మాటమాటకీ కులవృత్తి... కులవృత్తి అంటున్నావ్ గదా. ఇంతకీ యేందిరా మన కులవృత్తి” అన్నాడు.

ఆ మాటలకు ఆశ్చర్యంగా జమ్మన్న తల పైకెత్తి “ఏంది మామా... ఏమీ తెలీనట్లు కొత్తగా అడుగుతున్నావే. అడుక్కోడమేగా” అన్నాడు.

సుంకన్న చిరునవ్వు నవ్వుతూ “ఎవర్రా నీకు చెప్పింది అడుక్కోడమని. జనాలకు వినోదం కల్పించి డబ్బులడగడం మన వృత్తి. దాంట్లో ఇచ్చి పుచ్చుకోడముంది. గౌరవముంది. అది మర్చిపోయి అడుక్కుతినడమొక్కటే కులవృత్తనుకుంటే ఎట్లా” అన్నాడు.

దానికి జమ్మన్న “కానీ... ఇప్పుడెవరింటున్నారు మామా... మన కతలూ పాటలూ... మా నాయన కాలంలోనే బుడగలూ, తంబూరాలు ఎప్పుడో అటకెక్కేసినాయి గదా” అన్నాడు.

“నిజమేరా నువ్ చెప్పింది. టీవీలు పల్లెల్లో ఇంటింటికీ వచ్చినాక రోడ్ల మీదకొచ్చి మన నాటకాలు చూసేటోళ్ళే కరువయిపోయినారు.

మా తాతల కాలం నుండి మా యింట్లో పిట్టలదొర వేషమేస్తానే వున్నాము. నేను వయసులో వున్నప్పుడు జనాల మధ్య చేరి డైలాగులు కొడుతా వుంటే మాటమాటకీ జనాలు పగలబడి నవ్వేటోళ్ళు. చప్పట్లు కొట్టేటోళ్ళు.

కానీ ఇప్పుడు ఈ వేషమేస్తే చూసేటోడు లేడు. వినేటోడు లేడు. ఐనా పాడింది పాడరా పాచిపండ్ల దాసరీ అన్నట్లు అస్తమానం ఒగటే డైలాగులు కొడుతూ వుంటే ఎవడు మాత్రమింటాడులే. అందుకే రైతుల పొలాల్లో కోతలు పూర్తయి దుడ్లాడే ఇట్లాంటి సమయాల్లో మాత్రమే అప్పుడప్పుడు కొత్త కొత్త డైలాగులు నేర్చుకొని పోతావున్నాగానీ... ఇంతకుముందు లెక్క పూర్తిగా దీని మీదే ఆధారపడి బతకడంల్యా.

చూడు... కల్లూరు ఎస్టేట్ కాడ బిందెల ఫ్యాక్టరీ ఓనరు నాకు బాగా తెలిసినోడే. నీకిష్టమైతేరా. బిందెలిప్పిస్తా. కష్టపడి సంపాదిచ్చుకొని తిను. అపుడు ఎవరితోనూ మాట పడాల్సిన పనే వుండదు. ఎవరి దగ్గరా చేయి చాచాల్సిన అవసరమూ ఉండదు. లేదు, కులవృత్తి... కులవృత్తి అనుకుంటూ నిన్ను నువ్వు మోసం చేసుకుంటూ కూచుంటావో... కూచో... నీ యిష్టం” అంటూ అక్కన్నించి వెళ్ళిపోయాడు.

జమ్మన్న కాసేపలాగే కూర్చున్నాడు. సుంకన్న మాటలే పదేపదే గుర్తుకు రాసాగాయి. లేచి ఇంట్లోకి పోయాడు. మచ్చు మీద తీగలు తెగిన తంబూరా, దాన్నానుకొని రెండు బుడగలూ బూజు పట్టి కనబడ్డాయి. తంబూరా గుమ్మి అర్ధవృత్తాకారంలో కాస్త పెద్దదిగా వుండి, తీగలు సవరించే

మెట్ల వైపు నాగుబాము పడగలాగా తీర్చిదిద్దినట్లుంది. వాటినలాగే చూస్తూ వుంటే వాళ్ళ తాత మోతె ఎల్లప్ప గుర్తుకొచ్చాడు. ఆయన చివరి రోజుల్లో ఎప్పుడూ చెప్పే విషయాలు గుర్తుకొచ్చాయి.

"రేయ్... నేను వయసులో వున్నప్పుడు... నెత్తికి తలపాగా చుట్టి, చేతికి రంగు రుమాలు కట్టి, ఎడమచేతి బొటనవేలుకు వేసుకున్న అందెలు లయబద్ధంగా మోగిస్తూ, కుడిచేత్తో తంబుర మీటుతూ... ఏ అల్లిరాణి కతనో, ఆరె మరాటీల కతనో, ఎల్లమ్మ కతనో, దేశంగిరాజు కతనో... పాడుతూ.. మధ్య మధ్యలో పిట్టకథలు చెబుతా వుంటే జనాలంతా కతలో లీనమై నాతోపాటు ఏడుస్తూ, నవ్వుతూ, వుద్రేకపడుతూ, ఆచ్చర్యపోతూ నోరెళ్ళబెట్టుకుని కంటికి రెప్ప వేయకుండా రాత్రంతా వినేటోళ్ళు. మీ అవ్వ పోశమ్మ, అమ్మ నాగమ్మ రెండువైపులా వంత పాడుతూ, గుమ్మెట కొడుతూ వూపునిచ్చేటోళ్ళు. ఒక్కొక్క కతా వారం దినాలు, పదిదినాలు రాత్రుళ్ళపూట అట్లాగే సాగిపోయేవి. రోజురోజుకీ జనాలు పెరగడమే తప్ప తరగడముండేదిగాదు.

పొద్దున వూర్లోకి పోతే ఎంత గౌరవం. పెద్ద పెద్ద రెడ్ల నుండీ వూరోళ్ళ దాకా చాపలు పరచి కూచోమనేటోళ్ళు. పండితులతో సమానంగా చూసుకునేటోళ్ళు. గౌరవంగా కావాల్సినంత భత్యం గాసగాళ్ళతో పంపించేటోళ్ళు. కొందరు ఇనాములిచ్చేటోళ్ళు. కడియాలు తొడిగేటోళ్ళు. కత పూర్తయి వెళ్ళిపోతుంటే వూరువూరంతా తెగ బాధపడిపోయేటోళ్ళు. మళ్ళా తొందరగా రమ్మని మాట తీసుకునేటోళ్ళు" అంటూ గర్వంగా కళ్ళు మూసుకొని ఆనందంగా చెప్పేటోడు.

అంతలోనే ఇప్పటి పరిస్థితిని తలచుకొని "రేయ్... మనకు అప్పుడున్న మరియాదలు... గౌరవాలు ఇప్పుడెక్కడున్నాయిరా. నాటకాలు మొదటిదెబ్బ కొడితే, సినిమాలు రెండోదెబ్బ కొడితే, టీవీలు నున్నగా బూంచి పెట్టినాయి. ఎవరో ఒకరిద్దరు వెండితెర మీద వెలిగిపోతూ సొమ్ము చేసుకుంటూ వుంటే వేలాది మంది కళాకారులు వీధిన పన్నారు. గొంతు చించుకొని చెప్పినా వినేటోడు లేడు. విలువనిచ్చేటోడు లేడు.

ఇప్పుడా తంబూరాలు, గుమ్మెటలు తీసుకొని వూర్లలోకి పోతే అడుక్కుతినేటోళ్ళు వచ్చినారంటున్నారేగానీ కతలు చెప్పేటోళ్ళు వచ్చినారని అనడం లేదు. ఎట్లాంటి బదుకు ఎట్లా అయిపోయింది" అంటూ కండ్లనీళ్ళు బెట్టుకునేటోడు.

తాత గుర్తుకొచ్చి జమ్మన్న కళ్ళలో నీళ్ళు తిరిగినాయి. కుర్చీ మీదెక్కి తంబూరానీ, గుమ్మెటనీ ఆప్యాయంగా, ప్రేమగా తడిమాడు. మనసంతా ఏదోలా, బరువుగా అనిపించింది.

గాసగాడు, సుంకన్న, తాత కండ్ల ముందు మాటిమాటికీ మెదలసాగారు. వాళ్ళ మాటలు ఒకదాంట్లో మరొకటి కలిసిపోతూ మార్మోగసాగాయి. పొద్దున జరిగిన అవమానం, గాసగాడు కొట్టిన చనకాల దెబ్బలూ గుర్తుకు రాసాగాయి.

ఆలోచనలు పోటెత్తసాగాయి.

నిజమే... ఎందుకు మాటపడాల.

కళ రాకపోవచ్చు.

నేర్చుకున్నా ఇప్పుడు కూడు పెట్టకపోవచ్చు.

కానీ... వయసుంది. పని చేసే శక్తుంది.

తప్పదు.

మారాలి.

గౌరవంగా బతకడానికి.

భవిష్యత్తును మార్చుకోటానికి.

ఏదో ఒక పని.

తల వంచని పని. ఆలోచనల్లో ఒక నిశ్చయానికొచ్చిన జమ్మన్న నెమ్మదిగా సుంకన్న ఇంటివైపు అడుగులేయసాగాడు.

**అరుణతార - సెప్టెంబర్-2006**

# ముసుగు

ఆనందరావు తన గదిలోకి ప్రవేశించాడు. గదంతా శుభ్రంగా అద్దంలా తళతళా మెరిసిపోతూ వుంది. పుస్తకాలన్నీ ర్యాక్‌లో చక్కగా అమర్చి వున్నాయి. టేబుల్, దానిపై రైటింగ్ ప్యాడ్. పక్కనే తెల్లకాగితాలు సిద్ధంగా వున్నాయి. కుర్చీలో కూర్చున్నాడు. తెల్లకాగితాలు ముందేసుకోని ఆలోచిస్తూ పెన్ను కోసం చూశాడు. కనబడలేదు. కాగితాల కిందా, పుస్తకాల కిందా, టేబుల్ సొరుగులో... అంతా వెతికాడు. ఎక్కడా కనబడలేదు. కోపం ముంచుకు వచ్చింది.

"ఒసేవ్... ఎక్కడ సచ్చావే"

"ఆ... ఆ... వస్తున్నా" ఆనందరావు భార్య చెయ్యి కొంగుకు తుడుచుకుంటూ పరుగున అక్కడికి వచ్చింది.

"పెన్నెక్కడే"

"ఇక్కడే వుండాలే..." అంటూ వెదకడానికి టేబుల్ దగ్గరికి రాబోయింది.

"ఆహా... అంటే... పెన్నిక్కడే వున్నా పనీ పాటా లేక నిన్ను పిలిచాననుకుంటున్నావా... కొంపలో ఏదీ వున్నచోట వుండిసావదు గదా... ఛ... ఛ... దొంగముండా... వయసొస్తే సరిపోదు. బుద్ధి.... బుద్ధి పెరగాల. కాపురానికొచ్చి ఇన్నేళ్ళయినా మొగునికి ఎప్పుడు ఏం కావాలో తెలీదు. దరిద్రం మొహం పెట్టుకోని అలా వూరికే కొయ్యబొమ్మలా నిలబడే బదులు పోయి వెతికి సావొచ్చు గదా..." ఆపకుండా తిట్టసాగాడు. ఆమె గది బైటకు పోయింది. వెదుకుతూ వుంటే టీవీ పక్కన కనబడింది. పొద్దున ఏదో పత్రిక నుంచి ఎం.ఓ. వస్తే సంతకం చేసి తన భర్తే అక్కడ పెట్టినది గుర్తుకు వచ్చింది. ఐనా ఏమీ మాట్లాడకుండా మౌనంగా తెచ్చి ఇచ్చింది.

ఆనందరావు పెన్ను పట్టుకొని ఆలోచనల్లో పన్నాడు. మనసంతా గందరగోళంగా వుంది. క్యాలెండర్ ఫ్యాను గాలికి పైకి లేస్తూ వుంది. సమయం లేదు. చివరితేదీ దగ్గర పడుతోంది. ఇంక కేవలం నాలుగు రోజులే. మొదటి బహుమతి పదివేలు. రెండవ బహుమతి ఐదువేలు. మూడవ బహుమతి మూడువేలు. మరలా ఐదు కన్సలేషన్ బహుమతులు. రాస్తే ఏదో ఒకటి ఖచ్చితంగా తగులుతాది. ఎప్పుడూ గురి తప్పలేదు. డబ్బుకి డబ్బు. పేరుకి పేరు. ఒక్కదెబ్బకి రెండు పిట్టలు. ఈ

రోజు సాయంత్రానికంతా రాసి కొరియర్లో పంపించాలి.

ఏది రాయాలి... ఆలోచనలో పన్నాడు. ఎవర్‌గ్రీన్ కరువు కథ రాస్తే... ప్రభుత్వాలు మారినా, ఋణపథకాలు విస్తరిస్తున్నా, ప్రాజెక్టులు పరుగెడుతున్నా... భూమిని నమ్ముకున్న రైతు ఆశలు ఆవిరై వురికొయ్యకు వేలాడుతున్న దృశ్యాన్ని అతి దీనంగా, హృదయవిదారకంగా రాస్తూ... ప్రకృతి దాగుడుమూతలని, ప్రభుత్వాల అసమర్థతనూ, దళారీల దోపిడీని అందులో వేసి బాగా కలిపి, మాండలికాన్ని దట్టించి, కండ్లు చెమ్మగిల్లేటట్టు వదిలితే... కానీ రైతుల సమస్యలు పాతగయిపోయాయి. ఎంత కష్టపడి రాసినా పాత వాసనే... ఏదో ఒక కథకు పోలికే. అటూ యిటూ మార్చి మార్చి రాయలేక విసుగొచ్చేస్తా వుంది. న్యాయనిర్ణేతలు గూడా ఈ మధ్య ఇటువంటివి పట్టించుకోవడం లేదు. కొత్తవి... కొత్తవి రాయాలి.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల సమస్యలైతే... యస్... అమెరికాలో డాలర్ల వేటలో అనుబంధాలు మరిచిపోతున్నట్లు, ఇక్కడ తల్లిదండ్రులు ఒంటరిగా అనాథలుగా ఓల్డేజ్ హోమ్‌లలో బ్రతుకులీడుస్తున్నట్లు, అమెరికా సంబంధాలు చేసుకున్న ఆడపిల్లల ఆశలు ఆవిరై దేశంగాని దేశంలో పురుషాహంకారానికి బలౌతున్నట్లు... లేదు... లేదు... ఈ కథలు గూడా అయిపోయాయి. ఐనా ఇప్పుడు కొత్తవి వెదికి రాసేంత సమయం గూడా లేదు. ఏదో ఒకటి. జస్ట్ లైన్ దొరికితే చాలు.... చకచకచక... అల్లుకుపోవాలి.

అంతలో ఆనందరావుకి వాళ్ళ పెద్దబాబు గుర్తుకొచ్చాడు. పెదాల మీద చిరునవ్వు మెరిసింది. విశాలమైన సొంతిల్లు, బ్యాంకులో నిల్వలు, ఏసీ కారు, సమాజంలో గౌరవం, ఆర్థిక ఒడిదుడుకులు లేని ప్రశాంతమైన జీవితం గుర్తుకొచ్చాయి. అంతలో ఏదో గుర్తుకొచ్చి భార్యని కేకేశాడు.

"ఏమండీ" అంటూ ఆమె చెంగుకు చేయి తుడుచుకుంటూ వచ్చింది.

"బాబు ఫోన్చేశాడా"

"ఆ... పొద్దున్నే నీవు యోగాకి పోయినప్పుడు చేశాడు. ఎనిమిదిన్నరకి నెట్‌లోకి వస్తానన్నాడు. పనిలోబడి చెప్పడం మరిచిపోయా"

"సర్లే... అడిగాకైనా గుర్తుకొచ్చింది. సంతోషం. అవునూ ఇంతకీ ఆ నంద్యాల వెంకటరావు ఏమైనా ఫోన్చేశాడా"

"లేదు..."

"సరే... కొంచం కాఫీ తాపో" ఆమె వెళ్ళిపోయింది.

వెంకటరావుకి ఫోన్చేశాడు.

"ఆ... నేను ఆనందరావుని మాట్లాడ్తున్నా... ఆ ఆదోనివాళ్ళ సంబంధం ఏమైంది"

"అమ్మాయి గూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరే గదా... నెలకు యాభైపైనే సంపాదిస్తోంది. ఇంకా కట్నకానుకలేంది. పెళ్ళి పెద్ద ఎత్తున జరిపిస్తాం అంటున్నారు"

"అదేం లెక్క. పిల్లోనికి వూరికే రెక్కలొచ్చి ఎగిరిపోలేదు గదా ఫారిన్‌కి. లక్షలు లక్షలు ఖర్చయినాయి. ఆ గుంతకల్లు నారాయణరావైతే ఇరవైదాకా ఇస్తానంటున్నాడు. ఆ అమ్మాయి గూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరే. కాకపోతే కాస్త కళ తక్కువ. ఐనా అందాన్ని కొరుక్కుతింటామా... ఏమి... ఏ విషయమూ రాత్రి ఎనిమిదిలోగా మరొకసారి కనుక్కోని చెప్పు"

సెల్ ఆఫ్ చేశాడు. మరలా ఏవో ఆలోచనలు కథా వస్తువుల పట్ల తిరిగాయి. ఏవేవో ప్లాట్లు వస్తున్నాయి. పోతున్నాయి. ఏదీ నిలబడ్డం లేదు. అసహనంగా తల విదిలించాడు. రెండు రోజుల ముందన్నా రాయడం మొదలుపెట్టింటే బాగుండేది. చివరి రోజయితే ఇలాగే గందరగోళంగా వుంటాది. ఐనా ఎన్నిసార్లు ఇలా ఆఖర్రోజు రాసి పంపించలేదు... ఎన్నిసార్లు బహుమతులు పొందలేదు. కాస్త మనసు పెట్టి ఆలోచించాలి అంతే...

ఆలోచనల్లో వుండగానే భార్య కాఫీ తెచ్చిపెట్టింది.

పొగలు కక్కుతూ వుంది.

కుర్చీలో విశ్రాంతిగా జారగిలబడి కాఫీ తాగసాగాడు.

అంతలో బైట ఏవో అరుపులు వినబన్నాయి. భార్య ఎవరినో కేకలేస్తూ వుంది. ఎవరబ్బా అని బైటకు పోయాడు.

పనిమనిషి మంగమ్మ...

ఆమెని చూడగానే ఆనందరావుకి కూడా కోపం ముంచుకు వచ్చింది.

"ఏమే... మాదిగదానా... ఎక్కడికి పోయింటివే మూడు రోజులు... ఒక్కమాట కూడా చెప్పకుండా" అరిచాడు.

"మనవనికి మూడు రోజుల నుంచీ జ్వరం సామీ... ఒకటే వాంతులు, బేదులు... అందుకని"

"ఎవరికి చెబుతున్నావే ఈ దొంగ కతలన్నీ. సందు దొరుకుతే సాలు... ఎప్పుడెప్పుడు పనెగ్గొడ్దామా అని ఎదురు చూస్తుంటావు. ఈ నెలలో ఇది రెండోసారి. మీలాంటోళ్ళకి కొంచం చనువిస్తే చాలు చంకనెక్కుతారు"

"అమ్మతోడు సామీ... నిజంగానే"

"ముయ్ నోరు... నోరు తెరిస్తే చాలు ఒకటే అబద్దాలు" అంటూ భార్యకేసి తిరిగి "ఏమే... ఈ ముసల్ది ఇంతకుముందు గూడా ఈ నెలలోనే మూడు రోజులు ఎగ్గొట్టింది గదా... దీనికిచ్చేదాంట్లో ఆరు రోజులకు కట్ చేయి. ఇప్పటినుంచి ఎన్ని రోజులు ఎగ్గొడ్తే అన్ని రోజులకు కట్ చేసి ఇస్తుండు. అప్పటికి గానీ బుద్ధిరాదు దీనికి"

మంగమ్మ తల వంచుకోని మౌనంగా అన్నంగిన్నెలు కడగడానికి జాలాట్లోకి వెళ్ళిపోయింది.

ఆనందరావు తిరిగి గదిలోకి ప్రవేశించాడు.

కాఫీ చల్లారిపోయింది. భార్యని కేకేసి మరోకప్పు తెమ్మని ఆర్డర్ చేశాడు.

అల్మారా వంక చూశాడు. తాను ముద్రించిన పుస్తకాలు తళతళా మెరిసిపోతూ కనబన్నాయి. మల్టీకలర్లో, స్పాట్ ల్యామినేషన్తో, ప్రముఖ చిత్రకారుల ముఖచిత్రాలతో... చూస్తూనే కొనాలనిపించేలా వున్నాయి. గది నిండా అనేక రకాల షీల్డులు, ప్రశంసా పత్రాలు, బహుమతుల, సన్మానాల ఫోటోలు. వాటిని చూస్తూ మరోపక్క కథ గురించి ఆలోచించసాగాడు.

అంతలో... కళ్ళ ముందు పనిమనిషి మంగమ్మ తళుక్కున మెరిసింది.

అవును... ఈ పనిమనిషి కథనే రాస్తే...

కొడుకు మంచమ్మీద జ్వరంతో అల్లాడుతుండడం, అప్పడిగితే జీతాలిచ్చి వారం గూడా కాలేదు మరలా అప్పుడేనా అంటూ ఎవరూ ఇవ్వకపోవడం, ఇంకా రెండు మూడు ఇళ్ళలో పని వుండడం, ఒకవైపు ఇంటికి పోవాలనే ఆరాటం, మరొకవైపు ఆ రెండిళ్ళలో ఎవరైనా డబ్బులిస్తారేమోననే ఆశ... దానికితోడు భర్తను తాగుబోతుగా, ఏమీ పట్టించుకోనివానిగా, జీతం డబ్బులు మొదటిరోజే తన్ని గుంజుకుపోయినట్లుగా చిత్రించాలి. అలాగే ఒకింట్లో ఒకడు ఎప్పుడూ ఆమె కోసమే ఆకలిగా చూస్తూ, ఒకరోజు భార్య లేనప్పుడు చేయి పట్టుకున్నట్లుగా, ఆమె తిట్టి అక్కడ పని మానేసినట్లుగా చిత్రించి... కథ చివరలో ఎక్కడా డబ్బు దొరకక బిడ్డ కోసం వాని దగ్గరికే వెళ్ళడం, కొంగు జార్చడం... డబ్బులతో పరుగు పరుగున ఇంటికి రావడం... ఐనా అప్పటికే బిడ్డ చనిపోయి వుండడం. వావ్ అద్భుతంగా వుంటుంది. వస్తువు కొంచం పాతదే ఐనా పాఠకుడు చివరికొచ్చేసరికి కళ్ళు చెమ్మగిల్లేలా రాయొచ్చు. ఏదో ఒక బహుమతి ఖాయం.

ఆనందరావు మనసు ఆనందంతో, వుత్సాహంతో వురకలు వేయసాగింది. ప్రారంభం, సన్నివేశాలు, సంభాషణలు, ముగింపు... అన్నీ ఒకదాని తర్వాత ఒకటి క్రమపద్ధతిలో మనసులో తయారయిపోయాయి. ఆనందంగా పెన్ను తీశాడు.

సరసరసర రాయడం మొదలుపెట్టాడు.

అంతలో... అల్మారా అద్దం ఫెటిల్లున పగిలిన శబ్దం వినబడింది.

గదంతా గాజువడకలు పరుచుకున్నాయి.

ఆనందరావు అదిరిపడి అటువైపు చూశాడు.

ఎవరూ లేరు!

"ఎలా పగిలిందిది" చుట్టూ చూశాడు.

ఆశ్చర్యంగా పైకి లేచి అల్మారా వైపు అడుగులు వేయబోయి ఒక్కసారిగా కొయ్యబారిపోయాడు.

కనుపాపలు పెద్దగయ్యాయి.

గుండె దడదడలాడింది.

కాలూ చేయీ బిగుసుకుపోయాయి.

ఎదురుగా...

అల్మారాలో తాను రాసిన పుస్తకాల్లోంచి...

కరువు కాటకాల్లో నమ్ముకున్న నేల నట్టేట్లో ముంచేస్తే, అప్పుల వూబిలో కూరుకుపోయి

చివరకు పురుగులమందు తాగి పొలంలోనే కుప్పకూలిపోయిన రైతు ఎల్లయ్య...

అగ్రవర్ణ పెత్తందార్ల దోపిడీని ఎదిరించి, తన కులాన్ని చైతన్యపరచి, తిరుగుబాటు బావుటా ఎగరేసి, వాళ్ల తలలు వంచిన మాదిగ సుంకన్న...

కట్టుకున్నవాడు కట్నం కోసం కాటికి పంపడానికి సిద్ధపడగా, ఎదురు తిరిగి, కోర్టుకీడ్చి, స్వతంత్రంగా తన కాళ్ళ మీద తాను నిలబడి, సాటి స్త్రీల హక్కుల కోసం విరామమెరుగని పోరాటం జరుపుతున్న చైతన్య...

ప్రపంచీకరణలో చేతి వృత్తులు నాశనమై పూలమ్మినచోట కట్టెలమ్మలేక నగరానికి పోయి భవన నిర్మాణ కార్మికునిగా బతుకీడుస్తున్న కుమ్మరి రంగయ్య...

ఒకొక్కరే... ఒకొక్కరే...

ఎర్రని కళ్ళతో... బిగుసుకున్న దవడలతో చేతుల్లో కట్టెలు, కత్తులతో ఆకలిగొన్న సింహాల్లా... పుస్తకాల పుటలను చీల్చుకొని దిగుతూ వున్నారు.

ఏమిటిది!!!

నేను సృష్టించిన పాత్రలు...

ఇలా నా మీదికే...

నో... నో... అడుగు వెనుకకు వేయబోయాడు.

వెనుక అలికిడైంది.

తలతిప్పి చూస్తే....

చాకలి మల్లన్న... చేతిలో వురితాడు పట్టుకొని...

ఎలా వీరి నుంచి తప్పించుకోవడం...

వచ్చేస్తున్నారు... దగ్గరికి....

మరింత దగ్గరికి...

పదునెక్కిన చూపులతో...

భగభగభగ మండుతున్న గుండెలతో..

అసహ్యం... కసి... వుక్రోషం... నిండిన ముఖాలతో...

వచ్చేస్తున్నారు...

చుట్టూ....

ఎటూ పారిపోవడానికి లేకుండా...

పదులు వందలై... వందలు వేలై...

దగ్గరికి... మరింత దగ్గరికి.

**ఆదివారం వార్త - 2005**

# ఒక చల్లని మేఘం

మురళి బ్యాట్ పట్టుకోని రెడీగా నిలబడ్డాడు. లత తడబడుకుంటూ నాలుగడుగులు ముందుకేసి బలంగా బంతి విసిరింది. అది నేల మీద నాలుగు పిల్లిమొగ్గలేసి బ్యాట్తో కొట్టక ముందే ఆగిపోయింది. మురళి చెల్లెలు వంక కోపంగా చూస్తూ "ఏయ్... పిచ్చిపిల్లా... సరిగ్గా వెయ్యలేవా" అన్నాడు.

లత పెదాలు సున్నాలా చుట్టి "నేనేం పిచ్చిపిల్లను కాను. మన్చిపిల్లను" ముద్దుముద్దుగా అంది. మురళి నవ్వుతూ చెల్లిని మరింత ఉడికించడానికి "నువ్వేం మన్చిపిల్లవుకాదు. పిచ్చి కుక్కవి" అన్నాడు. లత ఉక్రోషంగా తలెత్తి "నేనేం పిచ్చికుక్కను కాను. నువ్వే పిచ్చికుక్కవి. నేను మన్చికుక్కను" అంది. మురళి పగలబడి కిలకిల నవ్వసాగాడు. అన్నయ్యెందుకు నవ్వుతున్నాడో అర్థంగాక "నీతో అన్ను ఫో... కచ్చి" అంటూ లత అన్నించి వెళ్ళిపోయింది.

మురళి నవ్వుకుంటూ బ్యాట్ భుజంపై పెట్టుకోని బైటికి పోడానికి కదిలాడు. అంతలో వాళ్ళ నాన్న సంచితో లోపలికడుగు పెట్టాడు. కొడుకు చేతిలో బ్యాట్ చూసి,

"రేయ్... ఏందిరా... ఎప్పుడూ వెధవాటలూ నువ్వూనూ. వచ్చినప్పన్నించి చూస్తున్నా... ఎప్పుడన్నా పుస్తకం పట్టుకొని పట్టుమని పది నిముషాలన్నా కూర్చున్నావా. సందు దొరికితే చాలు బైటకురుక్తావ్. ఐపాయలే ఇదే ఆఖర్రోజు. ఇంతకీ అన్నీ సర్దుకున్నావా... లేదా... ఇదిగో స్కూల్డ్రస్. సూట్కేస్లో పెట్కో. రేప్పొద్దున్నే బైల్దేరాల" అంటూ సంచి అందించాడు.

మురళికొక్కసారిగా నీరసమావహించింది. బట్టల్తీస్కోని కాల్లీడుస్తూ రూంలోకి చేరుకున్నాడు. స్కూలు గుర్తుకు రాగానే కళ్ళ నిండా నీళ్ళు కమ్ముకొన్నాయి. మంచమ్మీద వాలిపోయాడు. అంతలో లతొచ్చి చేయి పట్టుకొని లాగుతూ "అనా... దానా... ఆడుకుందాం. నువ్వు బాలెయ్యి నేను కొడ్తా" అంది. మురళి విసుగ్గా "యేయ్... పోతావా లేదా ఈన్నించి" కసురుకుంటూ విసురుగా దొబ్బాడు. లత గోడకు కొట్టుకోని కిందపడి ఏడుస్తూ బైటికి పోయింది.

మురళి ఒంటరిగా పండుకున్నాడు. పదే పదే స్కూలు, వార్డెను, టీచర్లు, బెత్తాలు గుర్తుకు రాసాగాయి. రాత్రి అన్నం సయించలేదు. నిద్ర రాలేదు. పొద్దున్నే తండ్రి వెంట సూట్కేస్తో మౌనంగా బైలుదేరాడు. లత చిరునవ్వుతో టాటా చెప్పసాగింది. మురళికి పోవాలన్పించడంలేదు. దుఃఖం తన్నుకొస్తా వుంది. మొదట్లో పోడానికి నానా గందరగోళం చేసేవాడు. ఏడ్చేవాడు. కిందామీదా పడి

పొర్లేవాడు. దొరక్కుండా పారిపోయేవాడు. ఎలాగోలా పట్టుకొనేవారు. కొట్టి, తిట్టి, బలవంతంగా ఈడ్చుకు పోయేవారు. ఏమ్చేసినా లాభం లేదని తర్వాత్తర్వాత గ్రహించాడు. అప్పన్నించీ మౌనంగా వెళ్ళడం నేర్చుకున్నాడు.

బస్సు బైల్దేరింది. ఊరు దూరం కాసాగింది. దిగులుగా కిటికీలోంచి అలాగే చూడసాగాడు. కాసేపటికి కళ్ళు మూతలు పడ్డాయి. నాన్న లేపుతుంటే మెలకువొచ్చింది. బస్సు కర్నూల్ బస్టాండులో ఆగి వుంది. ఆటో మాట్లాడుకొని వూరి బైటున్న స్కూలుకి చేరారు. తండ్రి ఆఫీస్ రూమ్లో ఫీజులు కట్టాడు. వాళ్ళ సంరక్షణలో మురళిని వదిలి వెళ్ళిపోతూ...

"బాగా బుద్ధిగా చదువుకో... ఇప్పున్నువ్ సెవెన్త్ క్లాస్. పబ్లిక్. మార్కులు అదిరిపోవాలి. అందరి ముందు నేను తలెత్తుకొని గర్వంగా తిర్గాలి. నీ కోసం యెంత ఖర్చు పెడ్తున్నానో చూస్తున్నావు గదా. జాగ్రత్త. అల్లరి చిల్లరిగా తిరగొద్దు. ఏదైనా కంప్లెయింటొచ్చిందనుకో... నా గురించి తెల్సుగదా... కాళ్ళూ చేతులిరగ్గొట్టి రైలు కింద పన్నబెడ్తా. ఈసారి క్లాస్‌ఫస్ట్ రావాలి. గుర్తుంచుకో" అంటూ వెళ్ళిపోయాడు. మురళికి టాటా గూడా చెప్పాలనిపించలేదు. సూట్‌కేస్ తీసుకుని కాళ్ళీడ్చుకుంటూ హాస్టల్ వైపు అడుగులేయసాగాడు.

"హలో! వెనుక నుండి భుజమ్మీద చెయ్యి పడింది. తల తిప్పాడు. తన రూమ్మేట్. "ఏయ్! హరీ! బాగున్నావా... ఎప్పుడొచ్చావ్" ఆనందంగా చెయ్యి కలుపుతూ ప్రశ్నించాడు.

"నెలైందిలే... మనం లెక్కల్లో డల్ గదా. ఈనాకొడుకులు డబ్బుల్కోసం సమ్మర్లో ఇంప్రూవ్‌మెంట్ కోచింగ్ పెట్నారు. మా ఇంట్లో నన్ను భరించలేక ఈన్నే పడేసిపోయినారు. దొంగనాకొడుకులు" గట్టిగా నవ్వేశాడు.

"అరెరే... ఐతే సెలవులంతా ఈన్నే వున్నావా" మురళి సానుభూతిగా అన్నాడు. హరి తలూపూ "ఐనా ఇంకెన్ని రోజుల్లే... చూస్తుండు. ఈ సారి ప్లాన్ కరెక్టుగా వేస్తున్నా. చచ్చినా దొరకను" అన్నాడు.

మురళికి అంతకుముందు సంవత్సరం జరిగింది గుర్తుకొచ్చింది. ఒళ్ళు భయంతో వణికింది. ఓరోజు పొద్దన్నే హరి కడుపునొప్పంటూ పడిపోయాడు. గిలగిలా కొట్టుకోసాగాడు. ఏవేవో మందులు తెప్పించారు. తగ్గలేదు. కర్నూలుకి వార్డెన్ని తోడిచ్చి పంపారు. వార్డెన్ డాక్టర్తో మాట్లాడ్తున్నప్పుడు హరి నెమ్మదిగా జారుకున్నాడు. గంటలో విషయం స్కూలు సిబ్బందికి తెలిసిపోయింది. వెంటనే అలర్టయ్యారు. వేట మొదలెట్టారు. సాయంత్రం రైలెక్కబోతూ స్టేషన్లో దొరికిపోయాడు.

తర్వాత రోజు ప్రేయర్లో అందరి ముందూ విపరీతంగా కొట్టారు. రెండు చేతులూ విరిచి కట్టి గ్రౌండ్లో అందరికీ కనబడేటట్లు సాయంత్రం వరకు ఉంచారు. వారం రోజులు గదిలో ఒక్కన్నే బందీ చేశారు. యెంత చేసినా హరి చెక్కుచెదరలేదు. ఏడ్చలేదు. కొడ్తుంటే వాళ్ళ వంకే సూటిగా చూస్తుండేవాడు. ఆ కళ్ళలో కోపం, అసహ్యం, కసి, నిర్లక్ష్యం ఉట్టిపడేవి.

క్లాసులో విపరీతంగా అల్లరి చేసేవాడు. గోడల మీద ఏవేవో రాసేవాడు. టీచర్లను లెక్కజేసేవాడు కాదు. తోటి పిల్లలతో ఎప్పుడూ గొడవలు పెట్టుకొనేవాడు. అందరూ వాన్ని తిట్టేవారు. మొద్దబ్బాయని ఎగతాళి చేసేవారు. కానీ మురళికి వాడు ఓ హీరోలా కన్పించేవాడు. ఇద్దరూ ప్రాణస్నేహితులయ్యారు. కలిసి తిరిగేవారు. ఆడుకునేవారు. మనసు విప్పి మాట్లాడుకొనేవారు.

"యేందిరా ఆలోచిస్తున్నావ్" హరి ప్రశ్నతో మురళి ఈ లోకంలోకొచ్చాడు. ఇద్దరూ మాట్లాడుకొంటూ గదికి చేరుకున్నారు. తరువాత రోజు నుండి యాంత్రిక జీవితం ప్రారంభమైంది.

⊹ ⊹ ⊹

ఓ రోజు మధ్యాహ్నం భోజనం ముగించి ఇద్దరూ గదికి చేరుకున్నారు. మురళి అలసటగా మంచమ్మీద వాలిపోయాడు. హరి వాని పక్కన కూర్చోని "రేయ్! నిన్న రాత్రి మంచి బొమ్మేశాను తెల్సా" అన్నాడు. మురళి లేచి కూర్చుంటూ "యేదీ... చూపియ్... చూపియ్" ఆసక్తిగా అడిగాడు.

హరి తలుపులు మూసి గడేశాడు. బుక్కుల కింద జాగ్రత్తగా దాచిన బొమ్మనీస్కొచ్చి మంచమ్మీద పరిచాడు. మురళి ఆత్రంగా దానొంక చూశాడు. అందులో ఒకడు నేల మీద వెల్లకిలా పడుకున్నాడు. దాదాపు నలభైయేళ్ళుంటాయి. వాని గుండెల మీద చిన్న పిల్లవాడు కూర్చోని గొంతు పిసుకుతున్నాడు.

బొమ్మను పరిశీలనగా చూస్తున్న మురళితో "ఆ కిందున్నోడెవడో కనుక్కో చూద్దాం" అన్నాడు హరి."మన హెడ్మాస్టర్" మురళి ఠక్కున సమాధానమిచ్చాడు. కాదన్నట్టు హరి తలడ్డంగా ఊపాడు. మురళి ఒక్క క్షణమాలోచించి "మన వార్డెన్. కరెక్టేనా" అన్నాడు. హరి పెదవి విరిచాడు. మురళి దీర్ఘంగా ఆలోచించసాగాడు. ఎవరో అర్థంకాక "నువ్వే చెప్పురా" అన్నాడు. హరి అదిగూడా తెలీదా అన్నట్లుగా చూసి "మా నాన్న" అన్నాడు ఫక్కున నవ్వుతూ. మురళి నవ్వుతున్న హరి వంక అలాగే చూశాడు. కళ్ళూ కళ్ళూ కలిశాయి. కాసేపటికి మురళి పెదాల మీద కూడా చిరునవ్వు చేరింది. హరి భుజమ్మీద చేయేసి "మీ నాన్నేగాదు. మానాన్న గూడా" అన్నాడు. నవ్వులతో గది మార్మోగింది.

⊹ ⊹ ⊹

హరి ప్రతిరోజూ ఏవేవో పక్షుల ఈకలు తెచ్చి గదిలో దాచిపెట్టసాగాడు. గూళ్ళలో, పుస్తకాలలో, మంచం కింద... ఎక్కడ చూసినా ఈకలు నిండిపోసాగాయి. మురళికేమీ అర్థం కాలేదు. "ఎందుకురా ఇవన్నీ" చాలాసార్లడిగాడు. "చెబ్తాలేరా... ఇప్పుడుగాదు" హరి ప్రతిసారీ దాటవేయసాగాడు.

ఓరోజు అర్ధరాత్రి తడుతుంటే మురళికి మెలకువొచ్చింది.

ఎదురుగా హరి.... "ష్"... అంటూ చేయి పట్టుకొని "నాతోరా" అన్నాడు. నిశ్శబ్దంగా తలుపు తెరిచాడు. కారిడార్లో ఎవరూ లేరు. మురళి చేయి పట్టుకొని అడుగులో అడుగు వేసుకుంటూ మెట్ల వద్దకు చేరుకున్నాడు. ఒకొక్క అంతస్తూ ఎక్కుతూ డాబా మీదకు చేరుకున్నారు. అమావాస్య. చీకటిగా ఉంది. దూరం నుండి బార్లైట్ వెలుగు మసకమసకగా ప్రసరిస్తోంది. మురళికి అంతా అయోమయంగా వుంది.

"ఒక్క నిముషం" అంటూ ఓ పెద్ద బండచాటు నుంచి ఏవో తీసుకువచ్చాడు. ధగ ధగా మెరిసిపోతున్నాయి. పరిశీలనగా చూశాడు. ఆశ్చర్యంతో కళ్ళు పెద్దగయ్యాయి. రెక్కలు... అందమైన రంగురంగుల ఈకలతో... మనోహరమైన రెక్కలు. "ఎందుకివి" మురళి ఆత్రంగా ప్రశ్నించాడు.

హరి మిలమిలలాడే కళ్ళతో, వాటిని ఆప్యాయంగా నిమురుతూ "ఎగిరిపోడానికి" అన్నాడు.

"ఎగిరిపోవచ్చా" మురళి కళ్ళలో ఆశ్చర్యం. హరి ఔనన్నట్లుగా తలూపూ

"ఈ రెక్కల గురించి నీకింతవరకు చెప్పలేదు గదూ... నాక్కూడా మొన్న వేసవి సెలవుల్లోనే తెలిసింది. మా ముందింట్లో ఇమ్మానియేలని ఒకడున్నాడ్లే. వాడు నేర్పాడు వీటినెలా చేయాలో. ఇక్కడ మంచి ఈకలు దొరకలేదుగానీ... ఇంటి దగ్గర యెంత అద్భుతంగా తయార్చేశానో తెల్సా. రంగురంగుల చిన్నిచిన్ని పక్షుల ఈకలతో... మధ్యన కాంతులీనే మనోహరమైన నెమలిపింఛాలతో... అబ్బ... చెప్పలేను. చూచి తీరాల్సిందే. రెండు భుజాలకూ కట్టుకొన్నాను. ఒక్క మాటున గాలిపటంలా రివ్వున పైకెగిరా... అలా అలా గాలిలో తేలిపోతూ... పైకి పైపైకి... నల్లని మబ్బుల్లోకి... చెట్లు, బిల్డింగులు, రైళ్ళు... చిన్నగా... మరింత చిన్నగా... ఆటబొమ్మల్లా...

దూరంగా... తెల్లని మంచుపర్వతం. చల్లని గాలి. సువాసనలు వెదజల్లుతున్న రంగు రంగుల పూలు. విశాలమైన పచ్చనిచెట్లు. మనోహరమైన పక్షులు. కొండ మీంచి జలజలా దూకుతున్న సెలయేళ్ళు... వాటి మధ్య... ఎక్కడ చూసినా... యెటు చూసినా.. పిల్లలు... చిన్నచిన్న పిల్లలు. మనీదు పిల్లలు. చిన్న చిన్న రెక్కలతో... నవ్వుతూ, తుళ్ళుతూ, ఎగురుతూ... నన్ను చూసి చిరునవ్వులు చిందించారు. కేరింతలు కొట్టారు. తమలోకి ఆహ్వానం పలికారు.

అక్కడ నాన్నల్లేరు. అమ్మల్లేరు. టీచర్లు లేరు. భోజనం గంటల్లేవు. ప్రార్థన పిలుపుల్లేవు. బలవంతపు చదువుల్లేవు... బూట్లు లేవు. టక్కుల్లేవు. టైలు లేవు... అరుపులు, తిట్లు, తన్నులు అస్సల్లేవు. మన కోసం. మనలాంటి బాలల కోసం దేవుడెంతో శ్రమించీ, శ్రమించీ సృష్టించిన అద్భుతలోకమది.

మేము నీళ్ళలో చేపలమయ్యాం. చెట్లలో కోతులమయ్యాం. ఆకాశంలో పక్షులమయ్యాం. కోయిలలమయ్యాం. లేగదూడలమయ్యాం. కుక్కపిల్లలమయ్యాం... మా కోసం చెట్లు పండ్లిచ్చాయి. పూలు తేనిచ్చాయి. చెరువులు నీళ్ళిచ్చాయి... ఎండ వెన్నెలైంది. ముళ్ళు పూలయ్యాయి. రాళ్ళు రబ్బరు ముక్కలయినాయి... చినిగిన అంగీలతో, రేగిన జుట్టుతో, మట్టి కొట్టుకున్న ఒంటితో... ఎగిరాం. ఎగిరి దుంకాం. కిందపడ్డాం. లేచాం. కొట్టుకున్నాం. దొబ్బుకున్నాం. మమ్మల్ని చూసి చెట్లు నవ్వాయి. పువ్వులు నవ్వాయి. కొండలు నవ్వాయి.

చీకటి ఎప్పుడౌతుందో తెలీదు. చందమామ ఎప్పుడొస్తాడో తెలీదు. గంటలు క్షణాలయ్యేవి. కళ్ళు మూసి తెరచినట్టుగా ఉండేది. కలలాగా ఉండేది. టాటాలు చెప్పుకుంటూ, రేపటి గురించి కలలు కంటూ, వీడ్కోలు తీసుకునేవాళ్ళం. సూర్యోదయం కోసం ఆతృతగా ఎదురుచూసేవాన్ని. మళ్ళా పొద్దున్నే... రెట్టించిన ఉత్సాహంతో... అమ్మా నాన్నా బైటికిపోగానే... ఎగురుతా, వురుకుతా

వాళ్ళలో కలసిపోయేవాన్ని. కానీ...” హరి చెప్పడం ఆపేశాడు. కళ్ళు వర్షించే మేఘాలయ్యాయి. గొంతు వణికింది.

“ఏమైంది... తర్వాతేమైంది” మురళి కుదుపుతూ ప్రశ్నించాడు. కన్నీళ్ళు తుడుచుకుంటూ హరి కొనసాగించాడు.

“ఎలా తెలిసిందో అమ్మానాన్నలకు. తిట్టలేదు. కొట్టలేదు. ప్రశ్నించలేదు. ఎప్పట్లాగే ఓరోజు ఇద్దరూ ఉద్యోగానికెళ్ళగానే పరుగు పరుగున గదిలోకి చేరుకున్నా. మంచం కింద రెక్కలు కనబల్లేదు. వెతికాను. ఇల్లంతా... అణువణువునా... ఏడుస్తూ... కిందా మీదా బదుతూ... ఎక్కడా... ఎక్కడా కనబల్లేదు. ఆఖరికి వంటగదిలో... పొయ్యిలో... కాలి బూడిదైపోయి...

పిచ్చివానిలా కేకలు పెట్టాను. పొర్లి పొర్లి ఏడ్చాను. తాళం వేసి వున్న తలుపుకు తల బాదుకున్నాను. శాపనార్థాలు పెట్టాను. బూతులు తిట్టాను. ఆ తరువాతరోజే తీస్కొచ్చి నన్నిక్కడ పడేశారు.

అప్పన్నించి కన్నుమూస్తే అదే కల. చేతులు చాచి ఆహ్వానిస్తున్న స్నేహితులు. ఎలాగైనా వాళ్ళను చేరుకోవాలనుకున్నా. కాంపౌండంతా గాలించా. ఒక్కొక్క ఈకనే ఏరి దాచిపెట్టసాగా. ఇన్నాళ్ళకు రెక్కలకు సరిపడా ఈకలు దొరికాయి. నాలుగురోజులుగా రాత్రుళ్ళు మిద్దెపైన కూర్చోని దీన్ని తయారు చేశా. బాగున్నాయి కదూ” రెక్కలను గాల్లో ఆడించాడు.

హరి మొహం చందమామలా వెలిగిపోతా వుంది. చిరునవ్వు పెదాల మీద నుండి జలపాతంలా దూకుతా ఉంది.

మురళి వంక చూస్తూ “వస్తావా” అన్నాడు. మురళికి వెళ్ళాలనిపించింది. ఆ కొత్తలోకాన్ని చూడాలని మనస్సు వువ్విళ్ళూరింది. కానీ ఏదో భయం... తటపటాయింపు.. విషాదవదనంతో “ఈసారి వస్తాలే” అన్నాడు.

హరి చిరునవ్వు నవ్వుతూ అంచు మీదికెక్కాడు. అమావాస్య. నల్లని చీకటి. స్కూలు చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడ మసకమసకగా కనబడుతోంది. మురళి వంక చూశాడు. ఆప్యాయంగా చేతిని నొక్కి వదుల్తూ “వస్తాను” అంటూ చేయూపాడు. మురళి కన్నీళ్ళతో, నిరాశతో వీడ్కోలు చెబ్తూ చేయెత్తాడు.

హరి శక్తినంతా కూడగట్టుకోని, డాబా అంచు మీది నుండి ఒక్కుదుటున గాల్లోకెగిరాడు. అంతే... సర్రున నేల మీదకు జారిపోసాగాడు. రెక్కలు గాల్లో వేగంగా టపటపా కొట్టుకుంటున్నాయి. మురళి అదిరిపడి ‘హరీ’ అంటూ బిగ్గరగా అరుస్తూ, డాబా చివరకొచ్చి కిందికి తొంగి చూశాడు. చీకటిలో ఏమీ కనబల్లేదు. ఆకాశం ఎర్రగా భీతిగొల్పుతూ వుంది.

**అరుణతార – అక్టోబర్, నవంబర్ – 2002, కథ – 2002**

# నిశ్శబ్ద ఆర్తనాదం

వూకుండ్రా. గమ్మున పండుకో. వున్నా గదా ఈడ్నే. జో... లాలీ... బుర్ర్ర్ర్... ఏడ్సాకురా నాయనా... పండుకో... పని సేస్కోవద్దా. యెత్తు మరిగినావ్. యీడెవడుండాడ్రా నిన్నెత్తుకోడానికి. అదే మీ అమ్మమ్మోళ్ళింటికాడయితే మామోళ్ళు, అన్నోళ్ళు, బావోళ్ళు, తాతోళ్ళు, అత్తోళ్ళు... యెంతమందో. లేదులేమ్మా. పండుకో... వుయ్యాలూపుతూనే వున్నాగదా. జోజోజో... ఓ... కాకీ... రాయ్యెరాయ్యెరాయ్యే... మా పిల్లోన్ని సూడే. పండుకోరా కన్నా. నీకాడనే వుంటే ఎట్లా. మీ జేజొచ్చే సమయమైంది. అంతలోపు అన్నం గాని సెయ్యకుంటే ఇంతెత్తెగురుతాది. మాట పడాల. సెయ్యడానికి యెనకే గానీ అనడానికి ముందే. యెప్పుడెప్పుడు సందు దొరుకుద్దా... గోడాడిద్దామాని కాస్కోని కూకోనింటాది.

వురా! నువ్వే సూస్తున్నావు గదా. యే రోజన్నా కాసేపన్నా కూకుంటినా. మందితో యవ్వారాలు సేస్తినా. పొద్దస్తమానం యింటిని సూపెట్టుకోని అన్ని పనులూ సేస్తూనే వున్నాగదా. తెల్లార్లూ సేసినా సెయ్యలేదంటూ కుత్తుక మీద కూకోనింటాది. నిన్న... బోరింగ్ కాడికి నీళ్ళకెళ్తినా. యెనకింటి వరలచ్మి కనబడెనా. ఐదంటే ఐదు నిముషాలు గూడా మాట్లాడ్లా. యేమ్మా అంటే యేమ్మా అంతే. దానికే యెంత రాద్దాంతం. యెన్ని మాటలు.

దినాం పొద్దుగాలనే లేస్తానా. పెండకళ్ళు తీస్తానా. మేతేస్తానా, గాట్లో నీళ్ళోసి, బరగొడ్ల పై కడుగుతానా. పాలు పితికి వొటల్లో ఇచ్చొస్తానా. పెండనీళ్ళు సల్లి, ముగ్గేసి, వంటింట్లోకి బోతానా. రాత్రి తిన్న అన్నం బోకులు కడుగుతానా. బండలు తుడ్సి, టిఫెన్లు వేసి, స్నానం సేసి, పూజ సేసేసరికి.. యెంత బెరీత సేసినా పదవుతాది. పైటాలన్నా పండుకుంటానా, సొంగలు కాల్సాలా. పాకెట్లలో పోయాలా, సీలెయ్యాలా, అయ్యో పాపమని మీ జేజేమైనా సేస్తదా. యిక్కడ పుల్ల అక్కడ బెట్టదు. అంబల్ల పొద్దుదాకా మంచం మీదే. పైగా పుల్లపోటు మాటలు. అన్ని సేస్తున్నా ఐదంటే ఐదు నిముషాలు మాట్లాడ్తినో లేదో "యేందే యవ్వారం. కూకుంటే పనులు జరుగుతాయా. సందు దొరుకుతే సాలు తప్పించుకొని తిరుగుతా"వంటూ గదిరిస్తాది. దాని కళ్ళేమైనా బూడుకుపోనాయా. సేసేది కనబడ్డా. యెదురుమళ్ళి మాటకు మాట సెప్తినా, ఆళ్ళకీ ఈళ్ళకీ యేవేవో గిల్లలు సెప్తాది.

మీ నాయనకు పెదిన్నెక్కించి తన్నిస్తాది.

మాటిమాటికీ మాటమాటకూ బంగారు బంగారంటారు. నిజమే. వూకియ్యలా. కట్టం కిందే యిచ్చారు. గానీ అమ్మమనిరా. తాకట్టెట్టమనిరా. గాజులు బాంకులో తాకట్టెట్టి అగో యిగో అంటూ రెండేళ్ళు దాటెనా. కమ్మలమ్మేసినారా. నా వొంటి మీదికేమి వొద్దా. బయటికెళితే పదిమందిలో బోసిమెడతో యెట్టా తలెత్తుకునేది. కొత్తవి కొనమన్లా. వున్నవుంచుతే సాలు. మొన్నటికి మొన్న పెదమామ కూతురి పెళ్ళిలో అందరూ దిగేసుకొచ్చినారు. సేతులకు మట్టిగాజుల్తో... నలుగుర్లో యెంత సిన్నతనం. యెంత నగుబాటు. నువ్వే సెప్పురా... ఆడదన్నాక సీమంత బంగారమన్నా పైమీద లాకుంటే యెట్టా. యిదే మీ జేజైతే యాడికైనా పెండ్లికెళ్తే పక్కింటోళ్ళని, ఎదురింటోళ్ళని అడుక్కొని మరీ యేసుకెళ్తాది. సిగ్గులేకుండా. నాకట్లాంటి బుద్దుల్లేవ్. దేముడు మనకిచ్చినంత సాలు.

వురా! నువ్ పుట్నప్పట్నించీ యింటున్నావు గదా. ఒగటే సొద. నా మనవనికి గజ్జలు సేపియ్యమను. గొలుసు సేపియ్యమను... వున్నమాట సెప్పుకోవాల. ఆడేమన్నా కారిపోతుందా. పెళ్ళికెదిగినోళ్ళు నా యెనకిద్దరున్నారు. యెన్నని తెస్తారు. గుడ్డు పెట్టే పెట్టకు తెలుస్తాది గుడ్డనొప్పెంతో ఐనా మనం సేపిచ్చుకున్న సొమ్ములు మనకుండాల గానీ యెదుటోళ్ళ దానికి యెగబడ్తే యెట్టా. యాడ్నించి తెస్తారు. ఆడికీ యాపారమని పదివేలు తెచ్చుకునెనా మీనాయన. మళ్ళా యిచ్చనా. పోరంబోకోని మాదిరి తిరిగి అంతా ఆగం సేశ. డబ్బు మాటెత్తితే సాలు గదిరిచ్చుకుంటాడు. జన్మలో మీ గడప తొక్కనని బెదిరిస్తాడు.

అసలు... ఆలుమగలంటే యెట్టుండాల్రా... బంగారం లెక్కుండాల. పెళ్ళిగాక ముందెట్టుంటి. అడుగు తీసి అడుగెయ్యనియ్యకుండిరి మాయమ్మోళ్ళు. మా సినమామోళ్ళ వూరికెళ్ళినపుడు నన్ను సూసందరూ "వాయబ్బో! యెంత బాగుందే! అచ్చం కాపామె మాదిరి!!" అనేటోళ్ళు. మీ నాన్నేమో అస్సలు పట్టిచ్చుకోడు. యెవడు సేస్కోమనే. పొయ్యి ఆ తూడిసెర్లదాన్నే సేస్కోవాల్సింది. "అదంటే నాకిట్టం. మా అమ్మోళ్ళు వద్దన్నా యినకుండా డబ్బుల కోసం నిన్ను సేసినా" రంటాడు. నేనేం సేసేది. యెంటబడ్తినా. సేస్కోమంటినా... ఆళ్ళేగదా సేస్కుంది. యామైనా తిరుపం సేస్కున్నారా. ఆళ్ళడిగిన డబ్బిచ్చిరి. బంగారిచ్చిరి. పెళ్ళి సేసిచ్చిరి. ఇంగేమంట. ఈళ్ళన్నా సెప్పొద్దా. ఇంగా దానెంబడే తిరుగుతుంటుంటే. ఐనా మన బాయి నీళ్ళు మనం తాగాల గానీ మంది బాయిల దగ్గరికి పోతే వూకుంటారా. ఆ మొన్న మెత్తగ దన్నిరి దానన్నోళ్ళు. ఐనా బుద్ధి రాలా. సిగ్గులేని జన్మ. సిగ్గులేని జన్మైనా...

మీ జేజెమ్మా జేజినాయనలను సూడు. మంది పండుకోక ముందే వొగరి మీదొకరు కాలేసి పండుకుంటారు. సోకయిపోయింది. తగ్గిపోయినోళ్ళు. ఇంగేల మనకనుకోరు. ఒగటే యికయికలు, పకపకలు. మెత్తబడినోళ్ళకే అంత యావుంటే నాకెట్టుండాల. యింగితమనేదుందా. తప్పూ వొప్పూ ఆళ్ళు ఆళ్ళ పిల్లోనికి సెప్పుకోవద్దా. మీ నాయనెప్పుడొస్తాడో... యెప్పుడు పోతాడో... ఆ దేవునికే

యెరుక. యే అర్ధరాత్రో దబుక్కున మీద బడ్తాడు. అదిరిపడి లేసి తెలివి తెచ్చుకునేసరికి లేసిపోతాడు. వచ్చ... పాయ... అంతే. బాధలెవనికి సెప్పుకోవాలి. యేదైనా సెబ్తే నన్నేమడగాకంటాడు. కసిరిచ్చుకుంటాడు. కొంపలో పెళ్ళామనేదొకటుంది. దాని మంచీ సెడ్డా సూడాలనే యింగితమే ల్యా. మొగుడున్నా మొగుడులేని ముండమోపి బతుకే అయ్యింది. ఇంగేటికీ సంసారం. యాసిరికొచ్చింది. యే యెనక జన్మలో సేసుకున్న కర్మనో యిదంతా. మా అమ్మోళ్ళింటికి బోతా. కూసోబెట్టి సాకకున్నా యింత అన్నం పాడేస్తే సాలు.

వురా! మొన్నటికి మొన్న నీ అన్నపాసనకు మీ మామొచ్చినాడా. నన్ను మీ నాయన పుట్టింటికంపిస్తానని మాటిచ్చినాడంట. తీస్కబోతానంటే సస్తే అంపియ్యననే గదా మీ జేజి. సాతగానోడు ముందుగనే యెందుకనాల. యెన్నాళ్ళాయ మా యింటి గడప తొక్కక. పోయిన వుగాదికే గదా. అదే మీ జేజైతే మూన్నెళ్ళకోపారి ముడ్డి తిప్పుకుంటూ ఆళ్ళమ్మోళ్ళింటికి బోయొస్తదే. నేబోతే తప్పా. మా అన్నెంత సిన్నబుచ్చుకున్నాడు. మరీ యింతన్నాయమా. ఆవు మంచిది... పాలిస్తుందిస్తుంది గదాని గుద్దలో కట్టె సెక్తే ఏమవుద్ది. యెగిరి ముఖం మీద తంతాది. సూస్తా సూస్తా యెన్నాళ్ళో.

నీ కోసరమేరా నాయనా తెంపు సెయ్యంది. యేమైనా అంటే మా పిల్లోనొదిలేసి పో అంటారు. అందుకే గదా పెదిన్ని మాటలంటున్నా గమ్మున పడుండా. నువ్ పుట్నాకన్నా మీ నాయన మార్నాడా. ఆ వొట్టి సరుకుల యాపారంలో యెంతొస్తాది. ఆ సినిమాలు, పాన్‌పరాగ్లూ, సిగరెట్లూ... వచ్చేదానికన్నా కర్సే యెక్కువ. మట్టసంగా యాపారం సేసుకోని నాల్గు డబ్బులు యెనకేసుకోవాల్నా. ల్యా. వున్నది సాలక ఆడా యీడా అప్పులు. మంచమున్నంత వరకే కాళ్ళు సాపుకోవాలగానీ ఈ అతికం పనులెందుకు. అందరూ అందరే. యా యింట్లోనూ సూళ్ళా యిట్లాంటోళ్ళని. థూ... యెదవ జన్మలూ, యెదవ బతుకులూ.

అగో... వస్తుంది సూడు సేతుల్తిప్పుకుంటూ... దొంగ సచ్చినేది. వూరంతా యవ్వారాలు సేసి. నువ్ పండుకోరా నాయనా. ఇంగా వంట సేయలేదేమని వస్తూనే పాణం తీస్తాది. జో... లాలీ... పండుకోమ్మా. సతాయించకు... మీ జేజి మాదిరి...

**మాయమ్మ రాక్షసి కథాసంపుటి - డిసెంబర్ 2000**

# మిస్సింగ్

వెదుకులాట. సత్యం కోసం. నిప్పుల గుండాల్లో కాలి బూడిదైపోయిన నిజం కోసం...

కన్నీటి కాలువలను దాటి, రక్త ప్రవాహాలను దాటి, వర్షించని మేఘాలను దాటి ప్రయాణం...

బీడుల మధ్య... కాలిన కొట్టాల బూడిదల మధ్య... కుళ్ళిన శవాల కంపుల మధ్య... ప్రతి మలుపులోనూ జిగురు జిగురుగా కాళ్ళకంటుతున్న రక్తపు చారికల మధ్య... నడుస్తున్న శవాల మధ్య... మౌనరోదనతో సత్యం కోసం వెదుకులాట.

ఆరని కుంపటిలా హృదయంలో కుతకుతా వుడుకుతున్న లావాను క్రక్కలేక... అగ్ని పర్వతంలా బ్రద్ధలవలేక... లోలోన దహించుకుపోతూ, కాలిపోతూ, కరిగిపోతూ, ఆవేదనతో మిత్రుని కోసం వెదుకులాట...

"ఎంతకాలం. ఇంకా ఎంతకాలమీ భయం భయం బతుకులు. దా... చస్తే ఒక్కసారే. ఎగిసిపడే కెరటంలా విజృంభిద్దాం. కాలువలన్నీ కలుపుకుందాం. సముద్రమవుదాం. తుఫానులా ఎగిసిపడదాం. దా... కమాన్. ఇంకా ఎంత కాలం.

క్షణం క్షణం చస్తూ, సమాధుల్లో కూర్చొని జపం చేస్తూ, ఎవడి దయాదాక్షిణ్యాల కోసమో మోకరిల్లుతూ, తలలు తీసి చంకన బెట్టుకొని, నాలుకల్లో అబద్దాల్ని నింపుకొని, లావాను అమృతంగా మార్చి, జయజయధ్వానాలు చేస్తూ, పల్లకీలు మోస్తూ, భిక్షగానిలా వాడిదిల్చే నయాపైసాలేరుకుంటూ... తిట్టినా, కొట్టినా, వుమ్మేసినా, అసహ్యించుకున్నా... ఆ కాళ్ళ చుట్టే బానిసలా తిరుగుతూ, నాకుతూ, తోకాడించుకుంటూ ఇంకా ఎంతకాలం. దా... కమాన్... లే.. నీ శక్తి నీకర్థం కాలేదా. చీలికలు పేలికలైన సమూహాన్ని సాగరంలా మార్చుదాం. ఆ వుప్పెనలో మన అవమానాల్ని తుడిచిపెడదాం". సత్యం పిలుపులు అడుగడుగునా వెంటాడుతూనే వున్నాయ్. వేడిని రగిలిస్తున్నాయ్.

శరీరాన్ని అగ్నిగుండంగా మార్చేస్తున్న ఎండ. ఊరు మండుతున్న కొలిమిలా వుంది. చెరువుల్లో, బావుల్లో, బోర్లలో పాతాళానికంటిన గంగ. ఎంత పూడిక తీసినా, ఎంత లోతుకు తవ్వినా, ఎన్ని పైపులు వేసినా రాను పొమ్మంటున్న నీళ్ళు. శరీరాలు పీక్కుపోయి, ముఖాలు కళ తప్పి, ఎముకల గూడుల్లా మారిన జనాలు. నోళ్ళు తెరచి వర్షపు చినుకుల కోసం ఆవురావురుమని ఎదురుచూస్తున్న బీళ్ళు.

"దా... వచ్చి చూడు... కరువు కోరల్లో విలవిలలాడుతున్న నా జన్మభూమిని చూడు. ప్రకృతి శాపం కాదిది. ఫ్యాక్షన్ శాపం. యాభై సంవత్సరాలుగా ఇద్దరు రెడ్లు ఢీ కొంటూ, వూరిని రెండు ముక్కలుగా చేసి, తమ తమ సామ్రాజ్య విస్తరణ కోసం, అధికారం కోసం ప్రయత్నించారే తప్ప, వూరి బాగు కోసం ఎవడూ ఏమీ చేసిందిలేదు.

ఘర్షణలో విజయం సాధించిన రాజారెడ్డి, అవతలి వాళ్ళను గ్రామాన్నించి తరిమేసి, భూములను ఆక్రమించి, అడ్డొచ్చిన వాళ్ళను మాయం చేసి అధికారాన్ని వాడవాడలా సుస్థిరం చేసుకొని, ఏకఛత్రాధిపత్యం వహిస్తున్నాడు.

నిజం చెప్పాలంటే ఫ్యాక్షన్ కాదిది మాఫియా... దొంగ సారా అమ్మకాల కోసం, కాంట్రాక్టు కోసం, అక్రమ కలప తరలింపుల కోసం జరుగుతున్న పోరాటం. డబ్బు వచ్చే ప్రతిచోటా ఘర్షణే. తెగే తలలు. ప్రవహించే రక్తం.

బీళ్ళుగా మారిపోతున్న పొలాల మధ్య, వాళ్ళ భవంతుల్ని చూడు. పచ్చగా కాసుల గలగలలతో, దిగేసిన నగలతో, అపారమైన చెరువు కింది భూములతో, అనుచరులతో, విలాసవంతమైన కార్లతో... ఎలా పైపైకి విస్తరిస్తున్నాయో చూడు.

అందుకే మిత్రమా! తప్పయినా సరే కుల రాజకీయాలను రెచ్చగొట్టి బీసీలను చైతన్యపరచి, ఏకం చేసి, అధికారాన్ని చేజిక్కించుకొని, నా కలల గ్రామాన్ని ఆవిష్కరించుకోడానికి, నేనింత వరకు సంపాదించిన డబ్బుతో, అనుచరులతో నా జన్మభూమి బాగు కోసం పోతున్నాను"

మిత్రమా నీ గ్రామంలో ప్రతి యింటి తలుపూ కొట్టి, ప్రతి ఒక్కని హృదయాన్నీ జయించి, సైలెంట్ వేవ్‌తో రాజారెడ్డినోడించి ఎన్నికల్లో విజయం సాధించావ్. రాజారెడ్డి కళ్ళల్లో నిప్పులు పోసుకొని చూస్తుండగా జయజయ ధ్వానాల మధ్య, విజయహారాలతో మందహాసం చేశావ్. పంచాయితీ చైర్మన్ అయ్యావ్. విజయాన్ని సుస్థిరం చేసుకుంటూ, ఒకొక్క ఊడనే తెగ నరుకుతూ, స్తంభాలను కదిలిస్తూ, ముందుకు దూసుకుపోతూ, హఠాత్తుగా...

అదృశ్యమయ్యావ్.

నాలుకల్లేని పంచభూతాల సాక్షిగా, పలుకలేని పవిత్ర గ్రంథాల సాక్షిగా, నిద్రలో కూరుకుపోయిన రక్షక భటుల సాక్షిగా, సాక్ష్యాలుంటే తప్ప నమ్మని న్యాయస్థానాల సాక్షిగా, సాక్ష్యాలను తారుమారు చేసే న్యాయరక్షకుల సాక్షిగా, సాక్షులను మాయం చేయగల రాజకీయ నాయకుల సాక్షిగా... నీ అదృశ్యం ఓ మిస్సింగ్ కేస్‌గా మిగిలిపోయింది.

సత్యం... నువ్వెక్కడ...

కాలిన గుడిసెల్లో మాడిమసై గుర్తుపట్టని మృతదేహాల్లో ఒకనిగా మిగిలావా... గ్రానైట్ గనుల సమాధుల కింద నీపై కుప్పలు కుప్పలుగా పోసిన రాళ్ళగుట్టలను ఛేదించుకొని బయటకు రాలేకపోతున్నావా... ముక్కలు ముక్కలుగా నరికి నల్లమల అడవుల్లో కాల్చి పారేసిన ఎముకల్లో

మరలా నీ రూపాన్ని తయారు చేసుకోడానికి ప్రయత్నిస్తున్నావా… తుంగభద్రా నదిలో చేపలు పీక్కుతినగా గుర్తుపట్టని అనాథశవాల్లో ఒకనిగా మిగిలిపోయావా… మిత్రమా! నువ్వెక్కడ?

"రేయ్ లంజాకొడుకుల్లారా!! తెలుసు. మీకందరికీ తెలుసు. మీ కళ్ళ ముందే, మీరందరూ చూస్తుండగానే, దొంగచాటుగా నడిబజార్లో ఒక్కసారిగా చుట్టుముట్టి, ముక్కలు ముక్కలుగా నరికేసి, రక్తపు చారలను తుడిచేసి, మృతదేహాన్ని మాయం చేసేసిన సంగతి.

మీ వుక్కు సంకెళ్ళని బద్దలుగొట్టి, నరనరాల్లో శక్తిని ప్రవహింపజేసి, మీ కోసం, మీ వూరి బాగు కోసం, ప్రాణాలను త్యాగం చేసిన సత్యం కోసం… నోరిప్పండి… ఒక్క సాక్ష్యం చాలు…"

వేట కొడవళ్ళతో ఛిద్రమవుతున్న శరీరాల మధ్య…. బాంబుల మోతతో దద్దరిల్లుతున్న నిత్యాగ్నిహోత్రాల మధ్య… అనుక్షణం మెడ మీద వేలాడుతున్న కత్తుల మధ్య… నిరంతర భయంతో వణికించే పడగనీడల మధ్య, ఇంటింటా వూడలను విస్తరించిన విశాల మర్రివృక్షం కింద… ఎవని గొంతూ పెగలడం లేదు. మౌనంగా, నిరాసక్తంగా, విషాదంగా, లోతుకు పోయిన గాజుకళ్ళతో కొయ్యబొమ్మల్లా తిరుగుతున్నారు.

"ప్లీజ్ నోరిప్పండి. ఒక్కరైనా… ఒక్కసారైనా… "

ఎవడి నోరు బలవంతంగా తెరిచి చూసినా… పై దవడకూ కింది దవడకూ మధ్య ఖాళీ…! పిల్లలు, యువకులు, పెద్దలు, ముసలివాళ్లు, స్త్రీలు… ఎవరి నోట్లోనూ నాలుకల్లేవు!

ఎక్కడికి పోయాయి? ఎవరు మాయం చేశారు వీటిని?? గ్రామం గ్రామమంతా నాలుకల్లేని జనాలను తయారు చేసిందెవరు???

బఁుజం పట్టి లాగిన అప్పుడే పుట్టిన పిల్లవాడు రమ్మని సైగ చేస్తూ, గునపం భుజాన పెట్టుకొని దారి చూపించాడు.

రక్తప్రవాహాలను దాటి… కుళ్ళిన మాంసాన్ని దాటి… కాళ్ళ కింద పగులుతున్న కపాలాల చప్పుడును దాటి… వేటకొడవళ్ళ మధ్య… బాంబుల కార్ఖానాల మధ్య… నిరంతర పహారాల మధ్య… పచ్చగా తళతళా మెరిసిపోతున్న రాజారెడ్డి భవంతి దగ్గరికి తీసుకుపోయి గునపంతో పునాదుల కింద తవ్వసాగాడు.

పుట్టల్లోంచి చీమలు బిలబిలమని బయటపడినట్టు ఒకదానిమీదొకటి, పెనవేసుకుంటూ, మెలికలు తిరుగుతూ, హాహాకారాలు చేస్తూ, గజగజా వణుకుతూ, కుప్పలు తెప్పలుగా బయట పడుతున్న వేలవేల నాలుకల మధ్య, బయటకు రావడానికి పెనుగులాడుతున్న…

సత్యం!

**మాయమ్మ రాక్షసి కథాసంపుటి – డిసెంబర్ 2000**

# బతుకు యుద్ధం

**బ**స్సు వేగంగా దూసుకుపోతోంది. రఘురాం కిటికీలోంచి బైటకు చూస్తున్నాడు. చల్లని గాలి ప్రశాంతంగా తాకుతూ వుంది. చీకటిలో రోడ్డుకి ఇరువైపులా ఏమీ కనబడ్డం లేదు. కండక్టర్ టికెట్లు కొట్టడం పూర్తయ్యింది. లైట్లు ఆర్పివేశారు. కాసేపటికే ఎవరో సిగరెట్ అంటించారు. ఒక్కసారిగా భాస్వరం వాసన గుప్పుమంది. రఘురాంకి తలతిప్పినట్లుగా అన్పించింది. ఠక్కున లేచి సిగరెట్టు తాగుతున్న వ్యక్తి దగ్గరకు పోయి "పాడెయ్యి దాన్ని. బస్సులో తాగగూడదని తెలీదా" అన్నాడు కటువుగా. అతను తలెత్తి రఘురాం వంక చూశాడు. ఆరడుగుల ఎత్తుతో, బలిష్టమైన ఒంటితో చీకటిలో మసకమసకగా కనబడుతున్నాడు. మారు మాట్లాడకుండా సిగరెట్ బైట పడేశాడు. రఘురాం తిరిగి తన స్థలానికి చేరుకున్నాడు.

అమావాస్య దగ్గర పడుతుండడంతో చుట్టూరా చిక్కని చీకటి ఆవరించింది. సమయం పదకొండవుతూ వుంది. హెడ్‌లైట్ల వెలుతురులో మెలికలు తిరుగుతున్న నల్లని రోడ్డు మధ్యలో తెల్లని చారలు వింతగా మెరుస్తూ వున్నాయి. చాలామంది నిద్రలో జోగుతూ వున్నారు. ఎటువంటి అలికిడి లేదు.

అంతలో సడన్ బ్రేక్ వేయడంతో బస్సు ఒక్క కుదుపుతో ఆగిపోయింది. అందరూ ముందుకి తూలారు. అర్థంగాక అయోమయంగా చూడసాగారు. వెంటనే ఏవో అరుపులు, కేకలు... అద్దాలు భళ్ళున పగలసాగాయి. డ్రైవర్ రహదారిపై రాళ్ళు అడ్డంగా వుండడంతో ఏం చేయాలో పాలుపోక వెనక్కి తిప్పడానికి ప్రయత్నించాడు. అంతలోపే కొందరు పగిలిన అద్దాల గుండా కిటికీలలోంచి లోపలికి వచ్చేసి తలుపు తెరిచారు. తెల్లని మాసిపోయిన బనియన్లు, పైకెత్తి కట్టిన పంచలు, ముఖాలకడ్డంగా కట్టిన వల్లెలు వున్న కొందరు కట్టెలు, కత్తులతో లోపలికి దూసుకువచ్చారు. జరుగుతున్నదేమో జనాలకు నెమ్మదిగా అర్థమవుతూ వుంది. అంతలో కొందరు యువకులు "ఎవర్రా మీరు" అంటూ పైకి లేచారు. వెంటనే వాళ్ళు కట్టెలతో దొరికిన వాళ్ళని దొరికినట్టు దబదబదబ బాదసాగారు. ఒకరిద్దరి తలలు పగిలి ఎర్రని రక్తం బైటపడింది. అది చూడగానే మిగతావాళ్ళందరి గుండెలు దడదడలాడాయి. భయంతో కొయ్యబారిపోయి వణుకుతూ కుర్చీల్లో అతుక్కుపోయారు.

దొంగలు ఆడవాళ్ళ వంటి మీది నగలు, మగవాళ్ళ వాచీలు, వుంగరాలు, గొలుసులు బలవంతంగా గుంజుకోసాగారు. కొందరు సూటుకేసులు పగలగొట్టి విలువైన వస్తువులు బైటికి తీస్తున్నారు. పావుగంటలో పని ముగించుకొని సైగలు చేసుకుంటూ వేగంగా బైటకు పోవడం మొదలుపెట్టారు.

రఘురాం పిడికిలి బిగుసుకుంది. ఒకప్పుడు సైనికునిగా పనిచేసిన ధైర్యం వెన్ను తట్టసాగింది. దొంగలు అంత ప్రొఫెషనల్‌గా కూడా లేరు. ఒక్కన్ని పట్టుకున్నా చాలు. తీగ లాగితే డొంకంతా కదులుతుంది. ఒక్కుదుటున పైకిలేచి బస్సు దిగుతున్న వాళ్ళ వెంబడి తానూ దుంకి అందరికన్నా చివర పోతున్న ఒకన్ని గట్టిగా వెనుకనుండి వాటేసుకున్నాడు. వాడు విడిపించుకోవడానికి గట్టిగా కేకలు పెడుతుండడంతో ముందు పోతున్న ఇద్దరు వెనక్కి తిరిగి కట్టెల్తో దాడి చేశారు. ఆ దెబ్బలను లెక్క చేయకుండా పట్టినపట్టు విడవకుండా మరింతగా బిగించాడు. బస్సులో తేరుకున్న జనాలు ఒక్కసారిగా బైటకు దుంకారు. వాళ్ళను చూడగానే దొంగలు వులిక్కిపడ్డారు. తాము ముగ్గురం తప్ప మిగిలినవారు అప్పటికే చీకటిలో కలసిపోయారు. ఒకడు ఆఖరి ప్రయత్నంగా కత్తి తీసి బలంగా రఘురాంను పొడవబోయాడు. రఘురాం నేర్పుగా పక్కకి తిరగడంతో కత్తి దొంగ భుజంలోకి దిగి రక్తం ఎగజిమ్మింది. వాళ్ళు అదిరిపడ్డారు. జనాలు దగ్గర కావడంతో తాము గూడా పట్టుబడతామేమోనన్న భయంతో ఒక్కన్ని అలాగే వదిలేసి పారిపోయారు. వాడు రఘురాం పట్టు నుంచి తప్పించుకోడానికి గింజుకోసాగాడు. ఆ పెనుగులాటలో మొహానికడ్డంగా కట్టుకున్న వల్లె పక్కకి తొలగింది. మసక వెలుతురులో ఆ దొంగ మొహం చూసిన రఘురాం కళ్ళు పెద్దగయ్యాయి. "నువ్వా" అన్నాడు ఆశ్చర్యంతో. దొంగ తలెత్తి రఘురాం వంక చూశాడు. క్షణకాలం ఇద్దరి కళ్ళూ కలిశాయి. చేతిపట్టు సడలింది. వెంటనే ఆ దొంగ ఒక్కుదుటున విదిలించుకొని వేగంగా పారిపోయాడు. రఘురాం షాక్ తిన్నవానిలా అట్లాగే నిలబడిపోయాడు.

రఘురాం వుండేది సికింద్రాబాద్‌లోని డిఫెన్స్ కాలనీలో. మిలట్రీ నుంచి వచ్చేశాక బ్యాంకులో ఉద్యోగం సంపాదించాడు. నందికొట్కూరులో ఒక పెండ్లి వుంటే బైలుదేరాడు. అంతలో ఈ సంఘటన. పెళ్ళిలో వున్నా రఘురాం చుట్టూ అవే ఆలోచనలు. ఆ రూపం మళ్ళా మళ్ళా గుర్తుకు రాసాగింది. చిన్నప్పుడు ఒకరినొదిలి ఒకరు అస్సలు వుండేటోళ్ళు కాదు. వాని ఆలోచనలతో తల పగిలిపోతోంది. లాభం లేదు... వూరికి పోతే తప్ప విషయం అర్థం కాదు. మళ్ళా ఇప్పట్లో ఇటువైపు వచ్చే పనేం లేదు అనుకున్నాడు. పెళ్ళి పూర్తి కాగానే కర్నూలుకి చేరుకొని డోన్‌వైపుకు బైలుదేరాడు. డోన్ పక్కనే చిన్నపల్లె. రోడ్డు మీంచి మూడు కిలోమీటర్ల దూరం. బస్సు దిగి నడక మొదలుపెట్టాడు.

అడుగులు వేస్తూ వుంటే దుమ్ము పైకెగస్తా వుంది. మనుషులు అక్కడక్కడా మాసిన గడ్డాలతో, నల్లబారిన ముఖాల్తో, కరిగిన ఒంటితో కనబడుతున్నారు. పశువుల డొక్కలు లోపలికి పీక్కుపోయాయి. కొంతమంది ఆడవాళ్ళు గుంపుగా ఎక్కడో వూరికి దూరంగా వున్న సుంకులమ్మ చెరువు నుండి నెత్తిన ఒక బిందె, సంకలో ఒక బిందె పెట్టుకొని వేగంగా అడుగులు వేస్తున్నారు. పొలాలు

నిర్మానుష్యంగా వున్నాయి. ఎండకు ఒళ్ళు చెమటలు కక్కుతూ వుంది. గసబెడతా వూళ్ళోకి ప్రవేశించాడు. రోడ్ల మీద ఆడాడ పిల్లలు చెట్ల నీడన ఆడుకుంటున్నారు. పనుల కోసం వలసలు పోవడంతో చాలా ఇండ్లకు తాళాలేసి వున్నాయి. ముసిలోళ్ళు, పిల్లలు తప్ప యువకుల జాడ చాలా తక్కువగా కనబడుతూ వుంది.

చిన్నప్పుడు ఆడుకున్న వీధులు, చదివిన బడి, తిరిగిన ప్రదేశాలు అన్నీ నిశ్శబ్దంగా పలకరిస్తున్నాయి. చెల్లెళ్ళ పెండ్లిళ్ళు, నాన్న చనిపోవడం, గుత్తలు పెద్దగా రాకపోవడంతో వచ్చిన కాడికి భూములమ్మేసి అమ్మను తనతో తీసుకుపోవడం, వూరితో పదిసంవత్సరాలుగా సంబంధాలు పూర్తిగా తెగిపోవడం... ఒకొక్కటే గుర్తుకు రాసాగాయి. నెమ్మదిగా అడుగులు వేస్తూ రామాలయం పక్క సందులోకి తిరిగాడు. చిన్ననాటి మిత్రుడు సుంకన్న ఇల్లు కనబడింది. తలుపు తెరిచే వుంది. "హమ్మయ్య... ఇంట్లో ఎవరో ఒకరు వున్నట్టున్నార్లే" అనుకుంటూ దగ్గరికి పోయాడు.

ఇంటి పక్కనే వున్న వేపచెట్టు కింద నులకమంచమేసుకోని వుత్తపైన పండుకోనున్న సుంకన్న అలికిడికి లేచి కూర్చున్నాడు. రఘురాంని గుర్తుబట్టి ఆశ్చర్యంతో, ఆనందంతో "రేయ్... బాగున్నావా... ఏమిట్లా దారి తప్పొచ్చినావు. ఐనా ఇంత ఎండనబడి రాకపోతేనేం చల్లగైనాక రాగూడదా" అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ లేచి దగ్గరకొచ్చాడు.

"ఏం లేదురా... స్నేహితుని కూతురి పెండ్లుంటే నందికొట్కూరుకి వచ్చింటి. ఎట్లాగూ ఇంత దూరం వచ్చాగదా... ఒకసారి అందరినీ పలకరిచ్చి పోదామని" అన్నాడు.

"దా... దా..." అంటూ లోపలికి పిలుస్తూ "ఏమే... ఎవరొచ్చినారో చూడు" అంటూ గట్టిగా కేకేసినాడు. సుంకన్న పెండ్లాం బైటకొచ్చి "ఏంనా... బాగుండావా... పూర్తిగా నల్లపూసైనావ్. వదినా, పిల్లలు ఎట్లుండారు. చూసి ఎన్నేళ్ళయిందో... అంతా పెద్దోళ్ళయి పోయింటారే" అంటూ పలకరిస్తూ కాళ్ళు కడుక్కోమని చెప్పింది. రఘురాం జలాట్లోకి పోయి గచ్చులో అడుగునున్న నీటిని చెంబుతో ముంచుకోని కాళ్ళూ చేతులు కడుక్కున్నాడు. "దా... బైట్నే కూచుందాం. ఇంట్లో ఒకటే ఉక్క" అని సుంకన్న పిలిస్తే తలూపుతూ చెట్టు కింది నులకమంచం మీదకు చేరుకున్నారు.

"ఏరా... పంటలెట్లా వున్నాయి. ఏమేసినావీసారి" ప్రశ్నించాడు రఘురాం.

సుంకన్న ఆకాశమొంక చూసి నిట్టూరుస్తా "అవ్వ వడికిన నూలు తాత మొలతాటికి సరన్నట్లు పెట్టింది రావడమే గగనమైపోతోంది. ఈ యవసాయం చేసేదాని కన్నా కూలిపనికి పోవడమే మేలురా... ఎండలు సూసినావు గదా... ఈ సమ్మచ్చరం మరీ ఎక్కువైపోయినాయి. దుడ్లు మన్నులో పోసినట్లే. ఏమీ సేయలేక కిందాపైనా మూసుకోని గమ్మున ఆకాశమొంక సూస్తా కూచున్నాం" అన్నాడు.

అంతలో అటువైపు పోతున్న క్రిష్ణారెడ్డి రఘురాంని చూసి "ఏమనా... ఎప్పుడొచ్చినావు" అంటూ పలకరిస్తూ మంచమ్మీదకు చేరుకుని రఘురాంని ఎగాదిగా చూస్తూ "అనా... నేను గూడా

ఇంటర్లైపోగానే నీ యెంబడే మిలట్రీలో చేరింటే బాగుండేదనా" అన్నాడు.

"నీకేంలే కృష్ణారెడ్డి! రోజుకో కాంట్రాక్టు. పూటకో అగ్రిమెంటు. దుడ్లు దులిపిన కొద్దీ రాల్తున్నాయ్. ఇంగెందుకో ఆ వుత్తుత్త ఏడుపు" అన్నాడు సుంకన్న.

"సాల్లేరోయ్... దొరికినాడు గదాని బలే సంబడంగ ఎగిరెగిరి చెబ్తున్నావ్. దా... ఓ కాంట్రాక్టిప్పిస్తా. కూలోల్తో పనుల్చేపిచ్చి, పెద్దరెడ్డికి పర్సెంటేజిచ్చి, ఇంజనీర్లను మేపి, బిల్లులు సాంక్షను చేపిచ్చుకునేసరికి తలలో జేజెమ్మ దిగొస్తాది. కూచోని మాటలు చెప్పడం గాదు కాంట్రాక్టులంటే".

కృష్ణారెడ్డి కాసేపు మాట్లాడి వెళ్ళిపోయినాడు. వాడట్లా పోగానే "మాటలు నేర్చినాడు కొడుకు. కుల రాజకీయాలు వుపయోగించి వూళ్ళో కాంట్రాక్టులన్నీ కొట్టేస్తా వున్నాడు. దానికి తోడు పనికి ఆహార పథకం లడ్డులెక్క దొరికింది. ఈ కరువుల్లో గూడా పచ్చగుండేది ఇట్లాంటినాకొడుకులే. స్నేహితులైనా, బంధువులైనా ఎంతవసరమొచ్చినా ప్రామిసరీ నోటు మీద సంతకం లేకుండా ముడ్డి కింద నుంచి మూట తీయడు. వడ్డీల మీద వడ్డీలేస్తా వుంటే తట్టుకోలేక ఆఖరికి భూములు అమ్ముకోవాల్సిందే... పాపం... శంకరప్ప లేదూ... బోయగేరిలో వుంటాడు. అప్పు కట్టలేక, అవమానం తట్టుకోలేక ఆఖరికి పొలంలోనే చింతచెట్టుకి వురేసుకునె. ఇంకా ఎంతమంది వుసురు పోసుకోవాల్నో వీడు" అన్నాడు.

రఘురాం మనసంతా అదోలా అయిపోయింది. కాసేపు మౌనంగా వుండిపోయాడు. మళ్ళా పదేపదే బస్సు సంఘటన గుర్తుకు రాసాగింది. విషయం చెప్పకుండా కాసేపు అవీ ఇవీ మాట్లాడి "అవునూ బలిజగేరిలో గోవిందయ్యని చిన్నప్పుడు మనతోబాటు చదువుకున్నాడే... వాడెట్లా వున్నాడు. చూడక చానా రోజులైంది అన్నాడు" ఆరా తీస్తూ....

సుంకన్న ఓ నిమిషం పాటు ఆగి "ఇంగెక్కడి గోవిందయ్య. మూడు సమ్మచ్చరాలైపాయ వూరిడిచి. ఇంతవరకూ ఇటువైపు గూడా తొక్కి చూళ్ళా" అన్నాడు.

"ఏం... ఏమైంది" ఆతృతగా అడిగాడు.

"నువ్వు వూరిడ్చిన మూడు సమ్మచ్చరాలకనుకుంటా... కరువొచ్చి వరుసగా రెండు సమ్మచ్చరాలు దెబ్బ మీద దెబ్బ కొట్టె. పదెకరాలంటే మన సీమలో ఏమీ లేనోడనే గదా అర్థం. అప్పట్లో కూతురి పెండ్లుందని మరో పదెకరాలు ముందస్తు గుత్త ఇచ్చి తీసుకునె. అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు తెచ్చ. వాన మొదట్లో బాగానే కురిసినా అవసరమైనప్పుడు మొగం చాటేశ. కండ్ల ముందు పంట వాడిపోతుంటే చూళ్ళేక అప్పుపెట్టి బోరేపించ. సన్నపిల్లోడు వుచ్చ పోసినట్టు నీళ్ళు పడె. అదీ మూన్నాళ్ళ ముచ్చటే. అప్పులు తీర్చలేక నల్లవంక కాడున్న ఐదెకరాలు అమ్మేశ. మిగిలిందాంతో పిల్ల పెండ్లి చేశ. అంతలో వూరి బైట ఒక ఫ్యాక్టరీ వచ్చ. వీనికి రోడ్డు మీద ఐదెకరాలుందిగా... అదింత దాండ్లోకి పాయ. అమ్మమని వీన్తోబాటు చానామంది అడ్డం తిరిగినారు గానీ ఎమ్మెల్యే మధ్యలో దూరినాడు. ఎదిరిచ్చి ఎట్లా బతగ్గలం. దాంతో ఇచ్చిన కాడికి పుచ్చుకొని చెప్పినచోట వేలిముద్రేసి

కిమ్మనకుండా బైటకొచ్చ. దుడ్లు బాగానే వచ్చినాయి గానీ అవెంతకాలం నిలబడ్తాయి. వూరి బైట భూములన్నీ ఫ్యాక్టరీలోకి పోగానే వూర్లో భూములన్నీ కొండెక్కి కూచున్నాయి.

వానికున్నది ఒక్కడే కొడుకు. ఒక్కసారిగా డబ్బొచ్చిపడేసరికి యాపారం చేద్దామని పట్టుబట్టె. మొదట్లో బాగానే జరిగింది. దుడ్లు దుడ్లు గాదు. కానీ చుట్టూరా స్నేహితులు, జల్సాలు. కొడుకు ఎవరి మాటా వినేటోడు గాదు. ఖర్చు ఖర్చుగాదు. ఒకసారి మందు తాగి రోడ్డు మీద బైకులో రయ్యిమని రాత్రిపూట వస్తా వుంటే... పెద్దబావి కాడ మలుపుంది చూడు... ఆడ చూసుకోక ఎదురుగొస్తున్న ఎడ్లబండికి కొట్టేశ్నాడు. నెలరోజులు ఆస్పత్రిలో డబ్బు మంచినీళ్ళ లెక్క ఖర్చాయ. ఆఖరికి ఒంటికాలితో కొడుకింటికి చేరుకునె. పరిస్థితి మళ్ళా మొదటికొచ్చ. భూమిలేనోనికి ఎవడప్పిస్తాడు. పుట్టినూళ్ళో గంజినీళ్ళు గూడా పుట్టలా... పూలమ్మిన చోట కట్టెలమ్మలేక ఆఖరికి తట్టాబుట్టా తీసుకొని పెండ్లాం పిల్లల్తో టౌనుకి ఎల్లిపాయ. అంతే... ఆరోజు నుంచీ వాని మొగం మళ్ళా ఎవరమూ ఎప్పుడూ చూళ్ళా" అన్నాడు.

రఘురాంకి నెమ్మదిగా విషయమంతా అర్థం కాసాగింది. మాటల్లోనే సుంకన్న పెండ్లాం ఇద్దరికీ కాఫీ తెచ్చిచ్చింది. కాఫీ తాగుతూ వుంటే ఓ జీపొచ్చి ఇంటి ముందాగింది. సుంకన్న పెద్దకొడుకు వీరేష్ అందులోంచి దిగ్గానే దుమ్ము లేపుకుంటూ పోయింది. ఫుల్లుగా తాగినట్టున్నాడు. ముఖం వుబ్బి కండ్లు ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి. తలొంచుకొని తడబడుతూ చక్కగా ఇంట్లోకి పోయినాడు.

రఘురాం వాన్ని చూస్తూ "పెద్దోడు గదా... ఏం చేస్తున్నాడిప్పుడు" అన్నాడు ఆశ్చర్యంతో. సుంకన్న కాసేపు మౌనంగా వుండి "రాజారెడ్డి దగ్గర పన్జేస్తున్నాడు" అన్నాడు గొణుగుతున్నట్లుగా.

రాజారెడ్డి గురించి రఘురాంకి బాగా తెలుసు. వూళ్ళో ఒక వర్గానికి ఆయన మాటే వేదం. తిరుగు లేదు. ఎప్పుడూ ఓ పదిమంది కత్తుల్తో, నాటుకట్టెల్తో ఎంబడుండాల. పెద్దరెడ్డికి, రాజారెడ్డికి అస్సలు పడదు. ఎవరి మీద ఎవరు దాడి చేస్తారో తెలీదు. నిరంతరం గొడవలూ, కేసులే. మధ్యలో ఎంతమంది ప్రాణాలు పోయాయో తెలీదు.

"తెలిసి... తెలిసీ... ఆయన దగ్గరెందుకు పెట్టావ్" అన్నాడు రఘురాం.

సుంకన్న విరక్తిగా నవ్వి 'ఏం చేద్దాం... నాలుగువేళ్ళు నోట్లోకి పోవాలంటే ఏదో ఒగటి సెయ్యాల... తప్పని తెలిసినా తప్పదు. సూస్తూ సూస్తూ పస్తులతో సావలేం గదా... వీడు తెచ్చి పెడ్తుండబట్టే ఇంట్లో జరుగుతా వుంది" అన్నాడు.

మాటల్లోనే సాయంకాలమైంది. రఘురాం పోయొస్తానని చెప్పి బైలుదేరాడు. అంతలో సుంకన్న "మన గోవిందయ్య వుండేది టౌనులోనే గదా... కర్నూల్లో ఎవరైనా తెలిసినోళ్ళుంటే కాస్త వెదికి చూడు. దొరుకుతాడు" అన్నాడు.

రఘురాంకి జరిగింది చెబుదామని నోటిదాకా వచ్చింది. కానీ తమాయించుకున్నాడు. పోయొస్తానని అందరికీ చెప్పి బైలుదేరాడు.

కర్నూలు నుండి లోకల్ రైలు వచ్చినట్లుంది. ఉదయం పనుల కోసం నగరానికి పోయిన జనాలంతా తిరిగి వస్తూ వున్నారు. చీకట్లో ఎవరూ గమనించడం లేదు. ఎవరి తొందరలో వాళ్ళు... అలసిన ముఖాల్తో, చెమట పట్టి మట్టికొట్టుకున్న బట్టల్తో, పలుగు పారల్తో, ఖాళీయైన సద్ది మూటల్తో పెద్దపెద్ద అడుగులు వేస్తూ వేగంగా ఇండ్ల వైపు వెళుతున్నారు.

పల్లెలన్నీ ప్లాట్లుగా, సెజ్జులుగా మారిపోతుంటే గ్రామాల్లోని సాలు సక్కగ వచ్చేటట్లు గొర్రు పట్టి విత్తనమేసే మొనగాళ్ళు, వంచిన నడుం ఎత్తకుండా చకచకచక నాట్లు వేసే పనిగత్తెలు, కొడవలి పడితే చాలు ఒక్కరోజే ఎకరాలకు ఎకరాలు పంట కోసే పాలెగాళ్ళు, గడ్డివాముల్ని ఎంతటి గాలికైనా, వానకైనా చెక్కు చెదరకుండా నిర్మించే నేర్పరిగాళ్ళు... ఈ వ్యవసాయ నిపుణులంతా... నగరాల్లో భవన నిర్మాణాల్లో అన్‌స్కిల్డ్ లేబర్‌గా మారిపోయారు. ఒకప్పటి ఆంధ్రరాష్ట్ర రాజధానిని తలచుకుంటే మనసు కళుక్కుమంది. నగరంలో ఫ్యాక్టరీల సైరన్‌మోత వినక ఎన్నాళ్ళయిందో. పేపరుమిల్లూ, కార్బైడ్ ఫ్యాక్టరీ, బిర్లా, ఎంజీ బ్రదర్స్ ఒక్కటనేమిటి అన్నీ ప్లాట్లుగా, అపార్ట్‌మెంట్లుగా మారిపోతున్నాయి. కార్మికులూ లేరు. కర్షకులూ లేరు.

మనసంతా వూరి గురించిన ఆలోచనలే. గుండె బరువెక్కి పోతోంది.

"మంచీ చెడూ, నీతీ అవినీతి, ధర్మం అధర్మం.... ఇట్లాంటివన్నీ కడుపు నిండినోళ్ళ ఆలోచనలే... కానీ బతకడమే యుద్ధమైన చోట..."

రఘురాంకి గోవిందయ్య, సుంకన్న, శంకరప్ప... అందరూ చుట్టూ మూగి ప్రశ్నిస్తున్నట్లుగా వుంది.

# జై తెలంగాణ

బడంతా నిశ్శబ్దంగా వుంది. గదులు తక్కువ కావడంతో చాలా తరగతులు బైటే వున్నాయి. గోడలకు బ్లాక్ బోర్డులు చేయించాల. రెండు వారాలుగా ఎంత ప్రయత్నించినా గౌండాలు దొరకడం లేదు. "ప్రభుత్వం తెలుగు మీడియంతో బాటు ఇంగ్లీషు మీడియం గూడా ప్రవేశపెట్టడంతో సమస్య ఎక్కువైంది. వరండాలు, చెట్లే గతవుతున్నాయి" అనుకున్నాడు హెడ్మాష్టర్ వీరేశం. అతను అక్కడకు కొత్తగా రెన్నెళ్ళ కిందటనే నంద్యాల నుంచి బదిలీ అయి వచ్చాడు. ఊర్లో అద్దెలు ఎక్కువగా వుండడం, ఇళ్ళు చిన్నగా వుండడంతో కర్నూల్లోనే ఫ్యామిలీ పెట్టి తిరుగుతూ వున్నాడు.

"సార్" అంటూ లోపలికి వచ్చాడు అటెండర్.

"ఏం రా"

"అదే సార్... గౌండాను మాట్లాడమన్నావు గదా. తీసుకొచ్చా"

"అంతా చూపించావా"

"చూపించా సార్... డబ్బులు మాట్లాడాల"

"సరే రమ్మను"

అటెండర్ గౌండాను పిలుచుకొని లోపలికి వచ్చాడు.

"ఎక్కడెక్కడ బోర్డులు చేయాల... ఎన్ని చేయాల... వాటి సైజులు అన్నీ చూస్నావు గదా" ప్రశ్నించాడు.

"చూస్నా సార్" అంటూ గౌండా తలాడించాడు.

"ఇది గవర్నమెంటు బడి. అంతా మీ వూరి పిల్లలే. కాస్త చూస్కోని చెప్పు. ఎంతియ్యమంటావ్"

"మొత్తం ఆరు బోర్డులు. ఒక గదిలో బండలు సరిచేయాల. ఓ ఐదువేలు ఇయ్యండ్సార్. వచ్చే సోమవారం నుంచి మొదలు పెడతా".

"ఏందీ... ఇదింత పనికి ఐదువేలా. అడిగేటప్పుడు కాస్త ముందూ వెనుకా చూసుకోవాల... అంతేగానీ నోటికెంతొస్తే అంత ఠపీమని చెబ్తే ఎట్లా... పైనుంచేమీ పైసా గూడా రాదు. అంతా

జేబులోంచే పెట్టాల. ఊరి బడికి ఆ మాత్రం సాయం చేయకుంటే ఎట్లా... బోర్డుకు నాలుగువందల చొప్పున ఆరింటికి రెండువేలా నాలుగొందలు. బండలు సరి చేసినందుకు ఆరొందలు. మొత్తం మూడువేలిస్తా సరేనా...”

“అబ్బే... కుదర్దు సార్... ఎంతగాదన్నా మూడ్రోజుల పని. చేతికిందకు ఇద్దరు కావాల. వాళ్ళకు రోజుకు మూడువందలేసుకున్నా మూడురోజులకు పద్దెనిమిదొందలు. నాకో పన్నెండొందలు. ఆడికి మూడువేలు పోతాది. ఇంకా సిమెంటు, ఇసుక అన్నీ తెప్పిస్తే నాకేం మిగులుతాది. అన్నీ ఆలోచించే చెప్తున్నా సార్. ఐదువేలకు పైసా తగ్గదు”.

“ఏందీ చేతి కింది కూలీలగ్గూడా మూడొందలా... మా వూర్లో నూటాయాభై ఇస్తామంటే ఉరికురికొస్తారు” ఆశ్చర్యంగా అన్నాడు వీరేశం.

“ఐతే... వాళ్ళనే పిల్చుకొచ్చుకోండి సార్. ఈడ అంత తక్కువకి పిల్లోడు గూడా దొరకడు” ఠకీమని సమాధానమిచ్చాడు గౌండా.

“వాయబ్బా... మరీ అంత డిమాండా... ఇదేమైనా బొంబాయా”.

“అవున్సార్... చుట్టుపక్కల పోల్చుకుంటే ఇది బొంబాయే. ఎంత వెదుకులాన్నా ఒక్క పనోడు దొరకడు. మీకిష్టమైతే చెప్పి పంపండి. అవతల రెండిండ్లు చేపిస్తున్నా. ఆ పని ఆపుకోని చేయాల. ఏదో బడని వచ్చినానంతే... ఇట్లాంటి సిన్నసిన్న పనులు నాకవసరం వుండదు” అంటూ వాడు వెళ్ళిపోయాడు.

వీరేశం అటెండర్ని పిలిచి నాలుగువేలకు ఎలాగోలా మాట్లాడి పని మొదలు పెట్టించమన్నాడు.

“సార్... ఈ ఊర్లో మనుషులు దొరకడమే కష్టం. మళ్ళా మూడిస్తా నాలుగిస్తా అంటే ఎట్లా సార్” అంటూ నసిగినాడు అటెండర్.

“అంటే... ఎంతడిగితే అంతియ్యాల్నా”.

“ఏం చేద్దాం సార్.. డిమాండట్లుంది. పక్కూర్లకు పోయి పదికి ఇరవై ఇస్తామంటూ బంగపోయి పిలుచుకొస్తున్నారు”.

వీరేశానికి విరిగిపోయిన తలుపులు, పగిలిపోయి తీగలు వేలాడుతున్న బోర్డులు, చెట్ల కింద కూర్చోని దిక్కులు చూసే పిల్లలు గుర్తుకొచ్చారు.

“సరేపో... ఎంతకో ఒకంతకు తగలబడమను. పనైనా సరిగ్గా చేస్తారా... లేక అది గూడా అడగ్గూడదంటారా” విసుగ్గా అన్నాడు.

“నేను దగ్గరుండి చేయిస్తాలే సార్” అంటూ అటెండర్ గౌండా కోసం వెళ్ళిపోయాడు.

వీరేశం టైం చూసుకున్నాడు. పదకొండవుతావుంది. ఉరుకుందప్ప ఇంకా రాలేదు. తొందరగా బైరాపురం పోవాల. సెలవుచీటి రాసి ఛార్జీ అప్పజెప్పి స్నేహితుని కోసం ఎదురు చూడసాగాడు.

✧ ✧ ✧

రాబందు ఒకటి ఆకాశంలో గుండ్రంగా తిరుగుతూ వుంది. ఎక్కడో భూమ్మీద ఆహారం జాడ పసిగట్టినట్టుంది. బండి వెనక కూర్చున్న వీరేశం దాన్నే గమనిస్తున్నాడు.

అది సింగల్ రోడ్డు. పత్తితో నిండిన ఆటోలు వచ్చినప్పుడల్లా రోడ్డు పక్కనున్న మట్టిలోకి దించవలసి వస్తూ వుంది. రెండువైపులా పెరిగిన తుమ్మకంపకంతా ఆటోలలోని దూది తగులుకోని చెట్లు తెల్లగా మెరిసిపోతున్నాయి. అక్కడక్కడ గుంతలు పడ్డ తార్రోడ్డు మీద ఉరుకుందప్ప నెమ్మదిగా బండి నడుపుతున్నాడు.

“పత్తి బాగా పండినట్లుందే… ఎప్పటిది” అన్నాడు వీరేశం వరుసగా వస్తున్న పత్తి లోడ్లను చూస్తూ.

“పోయిన సారిది. ఇప్పుడు మంచి రేటొచ్చింది. దాంతో మార్కెట్టుకు తోలుతున్నారు. గత ఐదారు సంవత్సరాలుగా వూర్లో తిరుగే లేదనుకో. ఒకపక్క వానలు. మరోపక్క కెనాలు. దానికి తోడు బి.టి. పత్తి, బాడిగె మిరప. ఇంకేముంది దుడ్లు దుడ్లు కాదులే. మొన్న దసరా పండగనాడయితే ఒక్కరోజే ముప్పయి కొత్తబండ్లు దిగినాయ్ వూర్లోకి. చీకటి పడితే చాలు కంచంలో ముద్దకు వెతుక్కునేటోడు గూడా టీ తాగడానికి కర్నూలుకి పోతున్నాడు” అన్నాడు నవ్వుతా ఉరుకుందప్ప.

ఉరుకుందప్పది అదే వూరు. పదెకరాల బైలు పొలముంది. ఈ మధ్యనే దశ తిరిగి చేతి నిండా డబ్బులొస్తున్నాయ్. ఒకప్పుడు కర్నూల్లో వీరేశంతో కలసి చదివాడు. వీరేశం వాళ్ళ అన్నకి పెళ్ళీడు కొచ్చిన కూతురుంది. బైరాపురంలో మంచి సంబంధం ఒకటుందని తెలిసి చూసొద్దామని బైలుదేరారు. బస్సులో పోతే నాలుగ్గంటలు పడతాది. అదే బండి మీద పోతే కొంచం దూరం పోయినాక కెనాల్ పక్కనున్న అడ్డరోడ్డు మీద పోతే సగానికి సగం తగ్గుతాది. దాంతో ఇద్దరూ బండి మీద బైలుదేరారు.

వీరేశం రోడ్డుకు ఇరువైపులా గమనిస్తా వున్నాడు. కనుచూపుమేరలో ఎక్కడ చూసినా పచ్చగా వుంది. మిరప, పత్తి తప్ప ఏవీ కనబడ్డంలేదు. వాటిని పరిశీలిస్తూ “ఎవరివి” అడిగాడు వీరేశం.

“మా వూరోళ్ళవే… గుంటూరోళ్ళు గుత్తకు చేస్తున్నారు”.

“అవునూ మీ వూర్లో ఎక్కడ చూసినా వాళ్ళే వుంటారే… మరి మీరేం చేయరా” సందేహం వెలిబుచ్చాడు వీరేశం.

“మా వూరోళ్ళు ఉత్త సోమరిపోతుల్రా. తినడం, తాగడం తప్ప పని చేయడం, దాచిపెట్టుకోవడం తెలీదు. ఈ గుంటూరోళ్ళే గనుక రాకపోతే ఎక్కడ వేసిన గొంగడి అక్కన్నే అన్నట్టు మన్ను నాకుతుండేటోళ్ళం. ఏదో కాలువ పక్కనున్న ఆయకట్టు రైతులు మాత్రమే దుడ్లు చూసేటోళ్ళు గానీ మిగతా భూమంతా గాలిలో దీపం పెట్టినట్లే. వాన పడితే పండుతాది. లేకుంటే ఎండుతాది. ఊర్లో ముక్కాలుకు పైగా బీడు భూములే. పెద్దరైతులు గూడా చేసుకోలేక పొలాలను వదిలేశారు. చిన్న రైతులు గిట్టుబాటు కాక కూలీలకు పోయేటోళ్ళు. ఎట్లా పడిందోగానీ గుంటూరోళ్ళ కన్ను ఈడ

పడింది. ముందు ఒగాయనొచ్చినాడు. ఆయనెనుకే ఇంగొకాయన. చూస్తుండగానే ఒకరివెనుక ఒకరు మిడతల దండు లెక్క వచ్చి పన్నారు. అంతే... అప్పట్నించీ అదృష్టం శని పట్టుకున్నట్టు పట్టుకుందీ వూరికి" ఉరుకుందప్ప చెప్పుకుంటూ పోతుంటే మధ్యలో అడ్డు తగిలాడు వీరేశం.

"ఐతే అంతా గుంటూరు నుంచి వచ్చినోళ్ళేనా మీ వూర్లో"

"అట్లా కాదులే... కోస్తా నుంచి వేరు వేరు వూర్లు. కాకపోతే ఇక్కడ అందర్నీ గుంటూరోళ్ళే అని పిలుస్తారు"

"మరి అంత మందికి పొలాలెక్కడివి" అనుమానమొచ్చి అడిగాడు వీరేశం.

"అదా... చాలామంది పెద్ద రైతులు బీడు పెట్టేసినారు గదా... అట్లాంటివన్నీ తీసేసుకున్నారు. చిన్న చిన్న రైతులు గూడా వాళ్ళిచ్చే గుత్తలు చూసి కూలీకి పోవడం మేలనుకోని పొలాలు వాళ్ళ చేతుల్లో పెట్టేసినారు. ఏమైనా వాళ్ళు రాత్రింబగళ్ళు భలే కష్టపడతార్రా. ముళ్ళకంపలు కొట్టించి, భూములన్నీ సదును చేసి, రాయిరప్పా ఏరిపారేసి, నాగళ్ళతో దున్నించి తొండలు గుడ్లు పెట్టే భూముల్లో బంగారం పండించి సూపిచ్చినారు.

"అంతకు ముందు అంత పంటలు లేవా మీ వూర్లో".

"ఎక్కడున్నాయిరా... కెనాల్ కింద వరి. మిగతా చోటంతా మున్వారు పత్తి, జొన్న, పొద్దుతిరుగుడు, ఆముదాలు లాంటివే... కానీ వీళ్ళు బీటీ పత్తి, గుంటూరు మిరప, బాడిగ మిరప తెచ్చినారు. విత్తనాలకు, మందులకు దుడ్లు నీళ్ళలెక్క ఖర్చుపెట్టినారు. మా జన్మలో అట్లా మందులు కొట్టడం ఎప్పుడూ సూళ్ళా. అట్లా పంటలు పండడం ఎప్పుడూ సూళ్ళా. వంద బెద్దే రెండొందలు చేతికొచ్చేది. రెండుమూడు సమ్మచ్చరాలు వాళ్ళ చేలల్లో కూలీకి పని చేసేసరికి మాలాంటోళ్ళకి వాళ్ళ పద్ధతి తెల్సిపోయింది. విత్తనాలు ఏవెయ్యాల, మందులు ఎప్పుడెప్పుడు ఏవేవి కొట్టాల, పంటను ఎక్కడకు తీసుకపోయి అమ్మాల అన్నీ అర్థమైపోయినాయి. అంతే చానామంది దుడ్లు వడ్డీలకు తెచ్చుకోని వాళ్ళ పొలాలు వాళ్ళే చేసుకోవడం మొదలుపెట్నారు. జొన్నలు, పొద్దుతిరుగుడు అన్నీ గాలికొదిలేసి అంతా పత్తి, మిరపల్లోకి దిగినాం. అంతే వూరు వూరంతా మారిపోయింది. పెళ్ళిళ్ళు, కొత్తిళ్ళు, విందులు, జల్సాలు పెరిగిపోయినాయి. అందరికీ చేతి నిండా పని. చేతి నిండా డబ్బులు" అంటూ ఉరుకుందప్ప సంబరంగా చెప్పుకొంటూ పోతున్నాడు. వీరేశం తాను కూర్చున్న కొత్త బండిని చూస్తూ "మరి మీ భూములన్నీ మీరు చేసుకుంటుంటే... వాళ్ళు అంతమంది ఎట్లా వున్నారు మీ వూర్లో" అడిగాడు.

ఉరుకుందప్ప పెద్దగా నవ్వేస్తూ "వాళ్ళకేంరా... ఐతే ఆత్మకూరు. కాదంటే నందికొట్కూరు. ఇక్కడ ఆస్తులా పాస్తులా. పిల్లల్ని ఆన్నే కార్పోరేట్ స్కూళ్ళలో చేర్పించి మొగుడుపెండ్లాలు మాత్రం వస్తారు. ఈ వూర్లోనే కాదు సుట్టుపక్కల వూర్లన్నీ నిండిపోయినారు. మా వూర్లో వ్యవసాయం వదిలేసి టౌనుకు పోయి వ్యాపారాలలో దిగిన పెద్దరైతులు మస్తుమందున్నారు. అదీగాక చిన్న చిన్న రైతులు

గూడా పెరిగిన కూలీ రేట్లు తట్టుకోలేకుంటున్నారు. అట్లాంటి భూములన్నీ వీళ్ళే చేస్తున్నారు" అన్నాడు.

ఎదురుగా నిండుగా క్రిక్కిరిసి వస్తున్న ఆటోలు కనబడుతున్నాయి. పెద్దోళ్ళ కన్నా చిన్నపిల్లలే ఎక్కువమంది వున్నారు. ఈ మధ్యనే ఒక ఆటో బోల్తాపడి ఇద్దరు బడీడు పిల్లల కాళ్ళూచేతులు నుజ్జునుజ్జయ్యాయి. పత్తి, మిరప చేలల్లో పిల్లోల్లకే డిమాండు. అందుకే బళ్ళకుగూడా రాకుండా కిందాపైనా ఒకరిమీదొకరు ఎక్కి కూలీలకు వెళుతూ వుంటారు.

మాటల్లోనే గంట సమయం గడిచిపోయింది.

కాసేపటికి బైరాపురం రోడ్డు వచ్చింది.

తార్రోడ్డు మీద నుంచి ఎర్రమట్టిరోడ్డు తిరిగి కెనాల్ వెంట బైలుదేరారు.

కెనాల్లో మడమలోతు వరకు గూడా నీళ్ళు లేవు. రోడ్డుకి రెండు వైపులా మొక్కలు వాలిపోయి వున్నాయి. కొన్ని పొలాల్లో ఎదిగీ ఎదగని బిడ్డల్లాగుంటే, మరికొన్ని పొలాల్లో కొనవూపిరితో కొట్టుకుంటున్న రోగుల్లా వున్నాయి.

"పాపం... ఈ వూర్లో వానలు లేనట్లున్నాయి" అన్నాడు వీరేశం.

"అవును. ఈసారి అంతా కరువే. ముందేసిన చోట్ల ఇప్పటికే మళ్ళా దున్నేస్తా వుంటే, కాస్త వెనుక నాటినోళ్ళు మాత్రం ఆశ చావక కనబన్న దేవున్నళ్ళా వేడుకొంటున్నారు" అన్నాడు ఉరుకుందప్ప.

బండి పొలిమేర దాటి ఊర్లోకి వచ్చింది. రోడ్ల మీద జనాలు గుంపులు గుంపులుగా మాట్లాడుకొంటున్నారు. కొందరు ఏదో చర్చించుకుంటూ, వేగంగా నడుస్తూ ఎక్కడికో పోతున్నారు. వాళ్ళ ముఖాలు గూడా ప్రశాంతంగా లేవు. ఏదో అలజడి.

బండి నెమ్మదిగా వెంకటస్వామి ఇంటి ముందుకు వచ్చింది.

"రండి... రండి... తొందరగా రండి. సమయం గాని సమయంలో వస్తిరి. వూర్లో అంతా రచ్చరచ్చగా వుంది" అన్నాడు వెంకటస్వామి వారిని ఆహ్వానిస్తూనే.

"ఏం... ఏమైంది" కాళ్ళు కడుక్కుంటూ అడిగాడు ఉరుకుందప్ప.

"కెనాల్లో కిందికి వచ్చేసరికి సుక్కనీళ్ళు గూడా మిగలడం లేదు. అంతా పైనపైన్నే అధికారుల నోళ్ళల్లో డబ్బులు కొట్టి రాత్రుళ్ళు పైపులు పెట్టి లాగేస్తా వున్నారు. అసలే వానల్లేవు. డ్యాం పైన బాగానే పన్నాయి. కనీసం కాలువ కింద రైతులన్నా బాగుపడతారు అనుకుంటే వాళ్ళదీ అదే పరిస్థితి. అందుకే ఆయకట్టు రైతులంతా ఎలాగయినా సరే నీళ్ళ దొంగతనాన్ని ఆపి పంటలు కాపాడుకోడానికి సిద్ధమవుతా వున్నారు. నాకు గూడా నాలుగెకరాల ఆయకట్టుంది. మీటింగుకెళ్ళాల. విషయం ముందే తెలిసుంటే రావద్దని చెబుతావుంటి గానీ ముసలం పుట్టినట్లు ఇప్పుడిప్పుడే ఇది మొదలై చిచ్చు అంటుకుంటూ వుంది..."

వీరేశానికి విషయం అర్థమైపోయింది. ఎట్లాగూ వచ్చినాం కదాని వాళ్ళిచ్చిన కాఫీ తాగి

అమ్మాయి గురించి నాలుగు ముక్కల్లో చెప్పి, అబ్బాయినీ, ఇంటినీ, ఆస్తిపాస్తులనీ కళ్ళతోనే లెక్కలేసుకొని మరలా కలుస్తామని బైలురేదినాడు.

తిరిగి వస్తా వుంటే రచ్చబండ దగ్గరంతా జనాలు పెద్ద గుంపుగా వున్నారు. అందరి ముఖాల్లోనూ ఏదో బాధ, కోపం. రోడ్డంతా నిండిపోయి వుంది. బండి దిగి తోసుకుంటూ బైలుదేరారు. రచ్చబండ మీద ఎవరో నిలబడి ఆవేశంగా, గట్టిగా మాట్లాడుతున్నాడు. అవన్నీ స్పష్టంగా వినబడుతున్నాయి.

"లాభం లేదు. ఇలాగే మన్నుతిన్న పాములెక్క చూస్తా వుంటే మన నోటి నిండా మన్నే. రోజురోజుకీ కాలువెంబడి కాలనీల మీద కాలనీలు పెరిగిపోతున్నాయి. ఏదో వూరు గాని వూరు. తిండి లేక వచ్చినారనుకున్నాం గానీ మన నోటికాడి గింజలు గూడా లాగేస్తారనుకోలేదు. మనమంతా కలసికట్టుగా తిరగబడకపోతే..."

మాటలు వింటూ వింటూనే గుంపు దాటి బైటకొచ్చారు. బండి బైలుదేరింది. ఉరుకుందప్ప మౌనంగా తోలుతున్నాడు. వీరేశం మనసంతా ఏవేవో ఆలోచనలు.

ఇక్కడంతా వానలు లేక ఊరంతా ఎండిపోతుంటే తను మపిచేసే చోట మాత్రం అంతా పచ్చగా మెరిసిపోవడం గుర్తుకొచ్చింది. ఊర్లో ఎక్కడ చూసినా ఇండ్ల ముందు పెద్దపెద్ద మోటార్లు, వెనకాల లావులావు పైపులూ కళ్ళ ముందు మెదిలాయి.

ఉరుకుందప్ప "మా వూర్లో సోమరిపోతుల్రా" అన్న మాటలు గుర్తుకొచ్చాయి. వాళ్ళు సోమరిపోతులు కాదు. నిజాయితీపరులు. వీళ్ళొచ్చినాక నీళ్ళ దొంగతనానికి అలవాటు పడి దొంగలుగా మారిపోయారు. కలసి సొంత ప్రాంతం వాళ్ళనే దోచేస్తా వున్నారు. బహుశా క్రింది ప్రాంతంలోని జనాలు తిరగబడితే అభివృద్ధిలోకి వచ్చిన వీళ్ళు మద్దతు గూడా ఇవ్వరేమో..."

అనుకోకుండా వీరేశానికి రాష్ట్రంలో జరుగుతున్న ఉద్యమాలు గుర్తుకొచ్చాయి.

నెమ్మదిగా మబ్బులు విడిపోసాగాయి.

"నిజమే ఆ ఉద్యమాల నుంచి నేర్చుకోవాల్సింది చాలా వుంది" అనుకున్నాడు.

**పాలపిట్ట - జనవరి, 2012**

# పొద్దుపోని పంచాయితీ?

అనా... బాగున్నావా... నాకు తెలుసు పొద్దున లేసినప్పటినుంచి రాత్రి పండుకొనేదాకా నీకు ఇంటా బైటా మస్తుగ పంచాయితీలుంటాయని. ఐనా... ఒక ఐదు నిమిషాలు అటూ యిటూ పరుగులు పెట్టకుండా మట్టసంగా ఒకతాన నిలుచుంటే నేను చెప్పేదేదో చెప్పేస్తా... ఆపైన నీ ఇష్టం. ఇంతకూ నేనెవరో చెప్పలేదు గదా... నేను మాజీ సర్పంచ్ రాజమ్మనన్నా... పార్టీ అంటావా... ఈ లోకంలో ఆడదానికి ఏ పార్టీ ఐతే ఏంలే గానీ... అదిగో ఆడ దూరంగా బడి దగ్గర జనాలంతా వరుసగా నిలబడి ఓట్లేస్తావున్నారు సూడు... అది కొత్త సర్పంచును ఎన్నుకోడానికి.

ఇంతకుముందీడ కాంగ్రెస్సు, తెలుగుదేశమె వుండె. ఇప్పుడు వైఎస్సార్‌పార్టీ గూడా తగలబడింది. పొద్దుగూకే సమాయానికంతా ఎవరు గెలుస్తారో, ఎవరు ఓడిపోతారో తెల్సిపోతాది. ఈ సారి గూడా నేను ఎన్నికల్లో నిలబన్నా... ఏమాటకామాట సెప్పుకోవాల గానీ నిలబన్నానని చెప్పాలంటే చానా సిగ్గుగా వుంది. అది వుత్తిత్తి మాటే. నా మొగుడు నిలబెట్నాడు.

ఆ రోజునుంచీ నాకు ఒకటే భయం. కొంపదీసి మళ్ళా గెలుస్తానేమోనని. ఈ సారి నేను నిలబడనని నెత్తీనోరూ కొట్టుకున్నా వినకుండా ఈ సచ్చినోడు చెంపమీద రపరపరపమని నాలుగుపీకి మరీ నిలబెట్నాడు. వీని చేతులిరిగిపోనూ... ఏమిట్లా మొగున్ని పట్టుకోని తిడతావుంది అనుకుంటున్నావా... ఇంతకుముందు వెలగబెట్నా గదా ఐదు సమ్మచ్చరాల సర్పంచ్‌గిరీ... అది గుర్తుకొచ్చిందిలే...

నా మొగునికి మొదట్నించీ రాజకీయాలంటే ఒగటే జిల. రాసుకోని, పూసుకోని, కాలరెగరేసుకోని, ఖద్దరేసుకోని తిరుగుతావుంటాడు. రోడ్డు దగ్గరున్న భూములకి రెక్కలు రావడంతో ముడ్డికింద మూటలు మూలగడం ఎక్కువైంది. ఎవడెక్కిచ్చినాడోఏమోగానీ ఈసారి సర్పంచ్ ఎలచ్చన్లలో నిలబడాలని నిర్ణయించేసుకొన్నాడు. కానీ అదేమో ఆడోళ్ళకు రిజర్వయింది. ఐనా వదుల్తేనా! నన్ను ముందుకు తోస్నాడు. ఎమ్మెల్యే గూడా మద్దతుగా తలూపినాడు. దాంతో సంచులు తీసుకోని, జనాలనేసుకోని వూరి మీద పన్నాడు. అవతలోళ్ళు గూడా తక్కువ తినలేదనుకో. ఎవనికి చేతనైనంత వాళ్ళు... సారా ప్యాకెట్లు, బిర్యానీ ప్యాకెట్లు, గుట్కాలు, సిగరెట్లు, చీరలు, రవికలు, ఇంటింటికీ డబ్బులు పంచడాలు... వూరంతా పండగ చేసుకుంది.

ఎలచ్చన్లయిపోయి ఓట్లు లెక్కపెట్టడం మొదలయ్యింది. అందరి మొఖాల్లోనూ ఒగటే టెన్షన్. నాకైతే కాలూసేయీ ఆడక ఒక మూల గమ్మున కూచుండిపోయా. ఒకొక్క రౌండ్ పూర్తవుతున్న కొద్దీ టెన్షన్ మరింత పెరుగు తావుంది. రౌండు రౌండుకూ విజయం మారుతా వుంది. చివరికి రెండు రౌండ్లు మిగిలినాయి. అవతలోళ్ళకు మెజార్టీ యాభైపైన్నే వుండింది. ఆ రెండింటి మీదే మా ఆశ.

అంతకు ముందురోజు రాత్రే వూర్లోని రెండు పెద్ద గేర్లతో ఒప్పందం జరిగింది. "సూడు... మాది మాటంటే మాటే... ఏదో ఒకటో రెండో జారొచ్చు గానీ మిగతావన్నీ గంపగుత్తగా పడిపోతాయి. ఎంతిస్తారో చెప్పండి. మేమేం మా కోసం అడగడం లేదు. గుడికీ, చరికీ అడుగుతున్నాం. ఎవరెక్కువిస్తే వాళ్ళకే మా ఓట్లు" అన్నారు. అర్ధరాత్రిదాకా పాట సాగింది. ఆఖరికి నా మొగుడు అందరి కంటే ఎక్కువకు ఒప్పుకోవడమే గాకుండా అప్పటికప్పుడు డబ్బులు సేతిలో పెట్టేసినాడు. సరిగ్గా ఆ రెండు వార్డులవి అప్పుడొచ్చినాయి. ఐనా ఏదో మూల చిన్న అనుమానం. ఈ మధ్య జనాలు ఎడమచేత్తో ఒకని దగ్గర తీసుకోని, కుడిచేత్తో ఇంకొకనికి గుద్దేస్తున్నారు. కానీ కులపెద్దల పట్టు ఇంకా జారినట్టు లేదు. అంతవరకూ ఆధిక్యంలో వున్న అవతలి పక్షం కాస్తా నిమిషనిమిషానికీ తగ్గిపోయింది. చివరి రౌండు ఎంచేసరికి విజయం ఇంటి ముంగిటకు వచ్చేసింది. ఆ మరుక్షణమే బైట ఒకటే అరుపులు, కేకలు, సంబరాలు.

నన్ను లోపలికి పిలుచుకోని పోయినారు. సంతకాలు చేపిచ్చుకోని గెలిచినట్లు కాగితం చేతిలో పెట్టినారు. బైట తప్పెట్ల మోత మోగిపోతోంది. నా మొగున్ని భుజాల మీదకు ఎత్తుకోని ఎగురుతా వున్నారు. ఆడోళ్ళని వూరేగిస్తే ఏం బాగుంటుంది. అందుకే నా మొగున్ని ఎత్తుకోని మురిసిపోతున్నారని సంబరపన్నా. అదీగాక నేను గెలిచినానంటే అదంతా నా మొగుని పనితనమే గదా అందుకే సంతోషపన్నా... అప్పటికే ట్రాక్టర్ తయారైపోయింది. "చంద్రన్నకు జై... సర్పంచ్ చంద్రన్న... జిందాబాద్" అని అరుస్తా వున్నారు. పూలదండల్తో ముంచెత్తినారు. మా మరిది వచ్చి నన్ను తీసకపోయి ఇంటిలో దిగబెట్నాడు. తప్పెట్ల శబ్దం అర్ధరాత్రి దాకా వినబడుతూనే వుంది. సారా వాసన వూరంతా మత్తుగా కమ్ముకుంది. ఇంట్లో నేనూ, నా కూతురూ ఒకరికొకరు తోడుగా వుండిపోయినాం.

ఆ రోజు రాత్రి అసలు నిద్రే రాలేదు. మనసంతా ఏదో కల్లోలం. ఆనందం. ఈ రోజుతో ఆ వూరికి సర్పంచ్ అయిపోయానని, రోడ్డు మీద పోతా వుంటే అందరూ "రాజక్కొచ్చిందిరా... సర్పంచొచ్చిందిరా" అంటూ దండాలు పెడుతున్నట్లు, వాళ్ళ మంచి సెడ్డలు సెబుతున్నట్లు, ఆగష్టు 15కి బళ్ళో పిల్లలందరి ముందూ జండా ఎగురేసినట్లూ, వూరికి కావాల్సిన పనులు చేయించినట్లు, మంచి పేరు సంపాదించుకోని అందరితో పొగిడించుకొన్నట్లు... ఏవేవో కలలు. ఆలోచనలు. కలత నిద్ర. అట్లా వూహల్తో కొన్ని రోజులు బాగానే గడిచిపోయినాయి. అప్పుడప్పుడు ఎవరెవరో నా మొగునితోపాటు వస్తుంటారు. ఏదేదో సెబుతుంటారు. సంతకాలు సేపిచ్చుకుంటూ వుంటారు. అర్థం చేసుకోడానికి ప్రయత్నించసాగా... మా నాయన డబ్బులకు ఎనకాడకుండా మా తమ్మున్ని బస్సెక్కించి

కర్నూలులోని కాన్వెంటుకి పంపిచ్చినాడు గానీ నన్ను మాత్రం మా వూరి చిన్నబడికే తోలినాడు. అందుకే అంత తొందరగా అర్థమయ్యేవి కావు.

కానీ ఆ సంబడం ఎక్కువ రోజులు సాగలా. నాలుగోనెల జరిగిందా సంఘటన. తలచుకొంటే ఇప్పటికీ ఒళ్ళు కంపరంతో కంపించిపోతాది. “థూ... దీనమ్మ... ఈ ఆడబతుకు” అని నా మీద నేనే వుమ్మేసుకోవాలనిపిస్తాది.

ఆరోజు పొద్దున్నే పంచాయితీ కార్యదర్శి వచ్చి ఇంటి తలుపు తట్నాడు. నా మొగుడు ఏదో పనుందని అప్పటికే కర్నూలుకి పోయినాడు. ఇంట్లో నేనొక్కదాన్నే వున్నా. “అమ్మా... చానా అర్జంటు. మరుగుదొడ్లు కొత్తగా కొందరికి ఇస్తారంట. కొంచెం సంతకం పెట్టు. కలెక్టరికివ్వాల. ఈరోజే ఆఖరు” అంటూ ఓ నాలుగు కాగితాలు ముందుంచినాడు. సరే అత్యవసరమంటున్నాడు గదాని సంతకాలు పెట్టినా. ఆరోజు సాయంత్రం జరిగిందా గొడవ.

నా మొగుడు రావడం రావడం “ఏమే... లంజా... నాకు తెలీకుండానే సంతకాలు పెట్టేటంత పెద్దదానివై పోయినావా... మొగుడనేటోడు ఒకడున్నాడు. వానికోసారి ఫోన్ చేసి కనుక్కుందామనిల్యా” అంటూ వంగబెట్టి దభీ దభీమని నాలుగు గుద్దులు గుద్దినాడు. ఫుల్లుగా తాగినట్టున్నాడు. నోట్లో వాసన గుప్పుమని కొడతా వుంది.

“అదిగాదు... పాపం... ఆడోళ్ళు పొద్దున్నే బైటకు పోలేక కిందామీదా అవుతుంటారు గదా... మరుగుదొడ్లు మంజూరయితే మంచిదే గదా... అందుకని” అంటూ నీళ్ళు నమిలినాది.

“అవ్... మంచిదే... గానీ... మరుగుదొడ్లు మనోళ్ళకొస్తున్నాయో... పక్కనోళ్ళకొస్తున్నాయో సూసుకోవద్దా” గట్టిగా అరిచినాడు గసబెడతా...

“గెలవక ముందు పరాయోళ్ళయినా గెలిచినాక అంతా మనోళ్ళేగదా... అందరితోనూ మంచిగుంటేనే గదా మంచి పేరొచ్చేది” అన్నా.

అంతే గయ్యిమని పైకి లేస్తా “అబ్బో... సర్పంచయినాక మాటకు మాట లేస్తుందే... పొగరు తలకెక్కిందే ఈ మధ్య నీకు. నీలాంటి తలబిరుసుదాంతో కాపురం కష్టమే. పో... పోవే... నా ఇంట్లోంచి” అంటూ మెడ పట్టుకోని బైటకు దొబ్బినాడు.

ఆ అరుపులకు, కేకలకు వీధిలో అందరూ గుమిగూడ్నారు. ఎవరూ ముందుకు రావడం లేదు.

“ఈ రోజు సంతకం చేయమంటే సేసినావు. రేపు పండుకోమంటే పండుకుంటావు. నేనంటే లెక్కా జమా లేకపోయినాక ఇంకెందుకు ఇక్కడుండడం. మళ్ళా ఈ ఇంటి గడప తొక్కినావంటే కాళ్ళిరగ్గొడతా సూడు” అంటూ మత్తు దిగేదాకా రంకెలేస్తూ, నానాక బూతులు తిడ్తూ ధడేలున తలుపులు మూసేసినాడు.

వీధిలో అందరి ముందూ తల కొట్టేసినట్టనిపించింది. ఒకొక్కమాటా కత్తితో చీరేసినట్లనిపించింది. సుట్టుపక్కలున్నోళ్ళు అటువంటివన్నీ శానా మామూలే అన్నట్లు ఎవరిండ్లలోకి వాళ్ళు వెళ్ళిపోతున్నారు.

ఆ రోజంతా  పక్కింట్లోనే పడుకోవాల్సొచ్చింది.విషయం తెలిసి అందరూ నన్నే తప్పు పట్టినారు. “ఆడదానివి. నోరు మూసుకోని ఇంటి పనులు సూసుకోక వూరి పెత్తనాలు నీకెందుకు సెప్పు. వాడు సూసుకుంటాడు గదా అన్నీ” అంటూ

అంతే... ఆ రోజు నుంచీ బెల్లం కొట్టిన రాయిలా గమ్మునుంటూ మళ్ళా ఎప్పుడూ ఎక్కడా తలదూర్చలా. ఎవడన్నా తెలీక నా దగ్గరకొచ్చినా ముందు నా మొగుని దగ్గరికే పొమ్మని చెప్పసాగినా. నా మొగుడు గూడా నన్ను పూర్తిగా ఇంటికే బందీ చేసినాడు. నెమ్మదిగా అందరూ నన్ను మర్చిపోసాగినారు. వూరోళ్ళయితే నన్నసలు పట్టిచ్చుకొనేటోళ్ళుగాదు. సర్పంచ్ లెక్క పలకరించేటోళ్ళు గాదు. ఆళ్ళ దృష్టిలో నా మొగుడే సర్పంచు. చిన్న పనైనా, పెద్ద పనైనా అంతా ఆని దగ్గరికే. అధికార్లు మొదట్లో అప్పుడప్పుడు నా దగ్గరికి వచ్చేవాళ్ళు. వాళ్ళు గూడా దారి మార్చినారు. ఏ పనున్నా సక్కగా నా మొగునికే ఫోన్ చేసేటోళ్ళు. ఎవరొచ్చినా, ఎక్కడికెళ్ళినా అంతా నా మొగుడే. రాత్రిపూట సంతకాలు చేయడం మాత్రమే నా పని.

సరే... ఎప్పుడూ బాధేనా... సంతోషపన్న రోజు ఒక్కటీ లేదా... అని ప్రశ్నించుకుంటే నాకోసారి మాత్రం భలే సంతోషమేసింది. నా ఐదు సమ్మచ్చరాల పదవీకాలంలో అంత సంబరపన్న కాలం ఎప్పుడూ లేదు. ఇప్పటికీ అది తల్చుకుంటే చాలు ఫక్కున నవ్వొచ్చేస్తాది.

నా మొగుడు అట్లాంటిట్లాంటోడు గాదు. పెద్ద దకాటీ. వూర్లో అపోజిషన్ పార్టీవాడు ఎవడన్నా పని కోసం దగ్గరకొస్తే “ఏంరా... నీవేమన్నా నాకు ఓటేస్తివా... అడగ్గానే వురుక్కుంటా పని చేసి పెట్టడానికి” అనేటోడు. అదే ఓటేసినోడు వచ్చినాడనుకో “వాయబ్బో... భలే సంబడంగ వచ్చినావులే వూపుకుంటా... నీవేమన్నా వూకేస్తివా ఓటు. దొరికిన కాడికి గుంజలా” అని కసిరిచ్చుకునేటోడు. అట్లాంటోడు ఒకదాంట్లో భలే ఇరుక్కున్నాడు.

ఆ మధ్య ఒక సినిమా హీరో కొత్త పార్టీ పెట్టుకొని వుత్తమాటలు చెప్పుకుంటా... గాల్లో మేడలు కట్టి సుక్కలు సూపిస్తూ ఆఖరికి కలబన్నోళ్ళనే కర్చుకోని కలసిపోయినాడు సూడు... ఆయనంటే మా వూర్లో పొట్టిగాళ్ళందరికీ అప్పట్లో భలే మోజు. దాంతో అందరూ నా మొగుని సుట్టూ చేరి “అనా... అనా.. ఆ ఎన్టీవోని తర్వాత మళ్ళా అట్లాంటోడు ఇప్పుడొచ్చినాడు. సుడిగాలిలెక్క సుట్టుకోని అన్ని పార్టీలోళ్ళని ఎత్తుకొనిపోయి బంగాళాఖాతంలో పాడేస్తాడు. ఈసారి అసెంబ్లీ ఎన్నికలకు మన హీరోకెళ్ళి తిరుగు. మేమంతా నీ యెనుకే వుంటాం. ఏ పనైనా కాల్తో సెప్తే సేత్తో చేసి పడేస్తాం. మనోడు ముఖ్యమంత్రయితే మన దర్జానే మారిపోతాది” అని గాల్లోకెత్తినారు. నా మొగుడు గూడా ఆని అభిమానే. మొదటిరోజు మొదటాటకు పంచపైకెగ్గట్టి పరుగులెత్తే రకం. దాంతో నక్కకు నాగలోకానికి తేడా కనుక్కోలేక ఎప్పుడూ జై కొట్టే ఎమ్మెల్యేని గాదని, కొత్త పార్టీ నిలబెట్టిన ఒక పాతరెడ్డికి మద్దతిచ్చి ఇంటిపైన జండా పాతినాడు.

అది సూసి ఎమ్మెల్యేకి కోపం అరికాలి నుంచి నసాళానికి అంటింది. నాకు గూడా నచ్చక

వద్దని చెప్పినా... దాంతో నా మీదకు ఇంతెత్తున లేచి "ఆడదానివి.. గుద్దా మూతీ తెలీదు. నేను నిలబెడ్తే కూచున్నదానివి. నాకే చెప్పొచ్చేంత దానివయినావా... మూసుకోని కూసో గమ్మున" అన్నాడు. సరే... ఆ ఎన్నికల్లో ఏమయిందో మీకు తెలియంది కాదు. దెబ్బకి నా మొగునికి సలిజ్వరం వచ్చినట్టయింది. మళ్ళా ఆ ఎమ్మెల్యేనే గెలిచినాడు. వాడు మామూలోడు గాదు. కాలికేస్తే మెడకు, మెడకేస్తే కాలికి వేసే రకం.

ఒకసారి సర్పంచ్‌లకంతా సమావేశం. ఎప్పట్లాగే నా మొగుడు వూపుకుంటా పోయినాడు. దానికి జిల్లా అధికారుల్తో బాటు ఎమ్మెల్యే గూడా వచ్చినాడు. సమావేశం మధ్యలో అందరి ముందూ మైకులో "రేయ్... ఏం పనిరా నీకిక్కడ. సర్పంచ్ నువ్వా నీ పెండ్లామా. పో... పోయి నీ పెండ్లాన్ని అంపియ్యి. నువ్వుండాల్సింది గేటుకవతల్నే. ఇంగోసారి లోపల గనుక కనబన్నావనుకో... మెడపట్టి దొబ్బిస్తా... ఏమనుకున్నావో" అని నోటికొచ్చిన తిట్లన్నీ తిట్టినాడు. ఆ దెబ్బకు నా మొగుడు తలాడ బెట్టుకోవాల్నో అర్థం గాక మొగమంతా నల్లగా చేసుకోని ఇంటికొచ్చినాడు. విషయం తెలిసి నేను లోపల్లోపల భలే నవ్వుకున్నా. ఆ నెలరోజులూ నేనే పోతా వుంటి మీటింగులకి నా మొగున్ని బైట నిలబెట్టి. కానీ... ఈ సిగ్గులేనోడు అందరు రాజకీయ నాయకుల లెక్కనే మళ్ళా పార్టీ ఫిరాయించినాడు. తెలిసినోళ్ళని పట్టుకోని కుక్కలెక్క తోకాడించుకుంటా ఎమ్మెల్యే కాళ్ళ దగ్గరికి పోయినాడు నాకడానికి. దాంతో ఆయన వార్నింగిచ్చి వదిలేసినాడు. అట్లా నా సంబడం ఆ నెల రోజులు మాత్రం వుండింది.

కలెక్టర్లు, మండలాధికారులు, ఇంజనీర్లు... కింది నుంచి పై వరకూ వున్నారు గదా పెదింతమంది. ఒక్కరంటే ఒక్కరన్నా పట్టించుకుంటారా ఈ అన్యాయాన్ని. వూహూ... ఈళ్ళూ మొగోళ్ళే గదా... ఓ పెద్ద వుద్ధరించామని వీధుల్లో వీరంగాలు పోతూ తల్లుల్ని, పెండ్లాల్ని, బిడ్డల్ని ఇంట్లో పెట్టి తాళాలేసే జాతి. ఈ ఐదు సమ్మచ్చరాల్లో ఒక్క నిఖార్సయిన అధికారన్నా వస్తాడేమోనని కళ్ళు కాయలు కాసేటట్లు ఎదురు సూసినా... వూహూ... లాభం లేదు... ఆడంగినాయాళ్ళు. ఉత్సవ విగ్రహాలన్నా సమ్మచ్చరానికి ఒకసారి వూరేగుతాయి గానీ మా బతుక్కి అదీ లేదు. అందుకే బొమ్మలెక్క వుండలేక ఓడిపోతే బాగుంటుందని ఎదురు సూస్తా వున్నా...

ఏ మాటకామాట సెప్పుకోవాలగానీ... ఈ దేశంలో ఆడోళ్ళకు అధికారం రావాలంటే మొగుళ్ళు జైలుకన్నా పోవాల, పైకన్నా పోవాల. దేముడు నాకంత అదృష్టం రాయలా... ఓన్నోవ్... ఏదో మాటవరసకు తమాషాగా అట్లా అన్నా... మళ్ళా నువ్వు పోయి నా మొగునికి ఎక్కించేవు. వాడసలే మంచోడు గాదు. బతికుండగానే బూంచి పెట్టే రకం... అయినా నువ్వూ మొగోనివే గదా... నీకు సెప్పినా ఆ గోడకు సెప్పినా ఒగటే... ఐనా తెలిసి తెలిసీ వుండబట్టలేక మళ్ళామళ్ళా సెబుతానే వుంటాం... పొరపాట్న ఒక్కనికన్నా మా బాధ ఎక్కుతాదేమోనని.

# నాలుగో స్తంభం

ఆనంద్ టీ తాగుతూ న్యూస్ ఛానెల్ ఆన్ చేశాడు. క్రైమ్ న్యూస్ వస్తూ వుంది. నాలుగు రోజుల కిందట కొత్తపేటలో ఓ భర్త భార్యపై అనుమానంతో గొంతు కోసి చంపిన సంఘటనను దృశ్యరూపం చేసి ప్రసారం చేస్తున్నారు. భర్త క్రూరంగా వెనుకనుంచి వచ్చి, అమాయకంగా వంట చేసుకుంటున్న భార్యపై ఒక్కమాటున దాడి చేసి, కత్తి పీటతో గొంతు కోసే దృశ్యాన్ని నాలుగైదు సార్లు రిపీట్ చేసి చూపిస్తున్నారు. చూస్తుంటే కడుపులో దేవినట్లనిపించింది. టక్కున ఛానెల్ మార్చాడు.

డాన్సులపోటీ ఎలిమినేషన్ జరుగుతూ వుంది. ఓడిపోయి బాధలో వున్నవాన్ని ఓదార్చవలసింది పోయి మైకును ముఖమ్మీద పెడుతూ, మీ ఫీలింగేమిటంటూ గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తూ, వాని కళ్ళలోంచి నీళ్ళు కారిపోతూ వుంటే క్లోజప్‌లో చూపిస్తూ వున్నారు. అంతలో బైట ఏవో టపాకాయలు ధనధనమని పేలిన శబ్దం, వాటితోపాటు అరుపులు, నినాదాలు వినబడ్డాయి. ఆనంద్ లేచి బైటకొచ్చాడు. దూరంగా పక్కసందులో బాణాల వెలుగులు కనబన్నాయి.

కొత్తగా విలేఖరిగా చేరిన ఆనంద్‌కు అదేదో తెలుసుకోవాలన్న కోరిక పెరిగింది. వేగంగా లోపలికి వచ్చి గబగబా ప్యాంటూ, షర్టూ వేసుకొని, డిజిటల్ కెమెరా జేబులో పెట్టుకొని బైలుదేరాడు. పక్కసందులో పెద్ద ర్యాలీ పోతూ వుంది. కొంచం దగ్గరికి పోయేసరికి అదేదో అర్థమైంది. నిన్ననే విద్యాశాఖ ఇంటర్‌మీడియట్ ఫలితాలు ప్రకటించింది. ప్రతిభా కాలేజీ వారికి కర్నూలు జిల్లాలో అందరికన్నా అధికంగా మార్కులు వచ్చాయి. దాంతో విద్యార్థులతో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తూ వున్నారు. ముందు పెద్ద బ్యాండ్ మేళం పోతూ వుంది. దాని వెనుక మొదటి సంవత్సరం విద్యార్థులు రకరకాల ప్లేకార్డులు, బ్యానర్లు పట్టుకొని నినాదాలు చేస్తున్నారు. వాళ్ళకిరువైపులా లెక్చరర్లు, అందరికన్నా వెనుక రథాకారంలో అలంకరించబడిన వాహనంలో ఫైనలియర్‌లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు.

ఐదు నిమిషాలకొకసారి టపాకాయలు పెద్దపెద్ద శబ్దాలతో చుట్టుపక్కలంతా దద్దరిల్లిపోయేలా పేలుతూ వున్నాయి. ఆ చప్పుళ్ళకు రోడ్డు మీద పోతున్న జనాలంతా ఆగి చూస్తూ వుంటే, షాపుల్లో, ఇండ్లల్లో వున్నవాళ్ళు బైటకొచ్చి చూస్తున్నారు. పెద్ద పెళ్ళి ఊరేగింపులా అట్టహాసంగా ఆ ప్రదర్శన సాగిపోతూ వుంది. ఆనంద్ కెమెరాతో రెండు మూడు స్నాప్స్ తీశాడు.

అంతలో ఆ ర్యాలీ అక్కడే కాస్త దూరంలో వున్న ఆదర్శా కాలేజీ ముందుకు దారి తీసింది. కర్నూల్లో గత ఐదు సంవత్సరాలుగా ప్రతిభా కాలేజీకి, ఆదర్శా కాలేజీకి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమటూ

వుంది. ప్రతి సంవత్సరం ర్యాంకులు ఆ రెండు కాలేజీల్లో ఏదో ఒకదానివైపు తిరుగుతూ వుంటాయి. దాని కోసం విద్యార్థులను ప్రత్యేకంగా రుబ్బడం మొదలుకొని,సెంటర్లలో మాస్ కాపీయింగ్ వరకూ రకరకాల పద్ధతుల్లో ఎంత ఖర్చయినా పెడుతుంటారు.

ర్యాలీ ఆదర్శాకాలేజీ ముందుకు రాగానే విద్యార్థుల నినాదాలు, అరుపులు, కేకలు ఎక్కువయ్యాయి. టపాకాయలు కాలుస్తున్న వాళ్ళలో కొందరు కావాలనే రాకెట్లను కాలేజీ వైపుకు తిప్పారు. అంతే అవి సర్రున దూసుకుపోయి ఆదర్శా కాలేజీ ఆవరణలో పడి ధనధనమని పెద్దగా శబ్దాలు చేస్తూ పేలాయి.

గేట్ బైట కాపలాగా వున్న వాచ్‌మెన్ అది చూసి వురుక్కుంటూ వాళ్ళ దగ్గరికి పోయి "బాబూ... అలా పక్కకి కాల్చండి. తరగతి గదుల్లో పడుతున్నాయ్" అన్నాడు అభ్యర్థనగా."అలాగా... ఐతే తలుపులేసుకోమను పడవు" ఒక లెక్చరర్ వ్యంగ్యంగా నవ్వుతూ అన్నాడు. వెంటనే ఆ లెక్చరర్ వెనుక వున్న విద్యార్థులు నోటిపై చేతుల్తో కొట్టుకొంటూ 'ఓ' అని గట్టిగా అరవసాగారు.

ఆ అరుపులకి పై అంతస్తులో వున్న లెక్చరర్లు కొందరు బైటకు వచ్చి కిందకి చూడసాగారు.

"అదికాద్సార్... లోపల క్లాసులు జరుగుతున్నాయ్" వాచ్‌మెన్ మరలా అభ్యర్థించాడు.

"ఐతే ఏందిరా... నీ కోసమని మేం టపాకాయలు కాల్చకుండా, నోరు మూసుకొని పోవాలా... పోతావా లేదా ఈన్నించి" అంటూ ఒకడు అంగీ పట్టుకొని దొబ్బాడు.

అది చూసిన ఒక ఆదర్శా కాలేజి లెక్చరర్ వురుక్కుంటూ అక్కడికి వచ్చి "ఏందిది ఏ మాత్రం మర్యాద లేకుండా.... వెళ్ళిపోండిక్కన్నించి ముందు" అన్నాడు.

అంతలో ఒకడు "ఏందిరా... మర్యాద లేదు గిర్యాద లేదు అంటూ ఎక్కువెక్కువ మాట్లాడుతున్నావ్... ఏం చేస్తావ్‌రా... పోకుంటే" అంటూ లెక్చరర్ అంగీ పట్టుకొన్నాడు.

అదంతా చూస్తున్న ప్రతిభా కాలేజీ విద్యార్థులు కొందరు ఒక్కసారిగా పెద్దగా కేకలు పెడుతూ, పిల్లికూతలు కూస్తూ ఆదర్శా కాలేజిలోకి దూసుకుపోయారు. తలుపులు తెరచుకొని ప్రిన్సిపల్ గదిలోకి పోయి సామానంతా చిందరవందర చేయసాగారు. ఆనంద్ వేగంగా ఎవరూ గమనించకుండా కెమెరాను చేత్తో పట్టుకొని వాళ్ళ మధ్యకి దూసుకుపోయి ఫ్లాష్ ఆన్ చేసి వరుసగా క్లిక్ చేయసాగాడు. అదంతా మౌనంగా చూస్తూ వున్న ప్రతిభా కాలేజీ లెక్చరర్లు గొడవ పెద్దగవుతుండడంతో వేగంగా ముందుకు దూసుకువచ్చారు. విద్యార్థుల్ని వారిస్తూ వెనుకకు తీసుకు వచ్చారు. ర్యాలీని అక్కడి నుంచి ముందుకు కదిలించారు.

ఆనంద్ గబగబా అడుగులు వేస్తూ ఇంటికి చేరుకున్నాడు. కెమెరా నుంచి కంప్యూటర్లోకి ఫోటోలు ఎక్కించాడు. విద్యార్థుల ఊరేగింపు, టపాకాయలు కాలుస్తున్న దృశ్యం, రాకెట్లు ఆదర్శా కాలేజిలో పడి పేలుతున్న దృశ్యం, వాచ్‌మెన్ మీద, లెక్చరర్ మీద దాడి చేస్తున్న దృశ్యాలు, విద్యార్థులు ప్రిన్సిపల్ గదిని ధ్వంసం చేస్తున్న దృశ్యం చాలా బాగా స్పష్టంగా వచ్చాయి. ఫోటోలను జతపరుస్తూ

వార్త రాయడం మొదలుపెట్టాడు. మొత్తం పూర్తి కాగానే ఈ దాడి పట్ల ఆదర్శ కాలేజీ ప్రిన్సిపల్ ప్రతిస్పందన తెలుసుకోవాలి అనిపించింది. వెంటనే కాలేజీకి బైలుదేరాడు.

ఆదర్శా కాలేజీ లోకల్ కాలేజీ. ఇరవై సంవత్సరాలుగా ఎంతో కష్టపడి ఎదుగుతూ కర్నూల్లో నంబర్‌వన్ స్థాయికి వచ్చింది. అనుభవజ్ఞులైన లెక్చరర్లు వుండడంతో ర్యాంకులు బాగా వస్తాయి. చాలామంది తల్లిదండ్రులు మొదట తమ పిల్లల్ని అక్కడ చేర్పించడానికి పోటీ పడుతుంటారు.

ఆనంద్ ప్రిన్సిపల్ గదికి చేరుకున్నాడు. ఆశ్చర్యమేసింది. అక్కడ దాడి జరిగినట్లు ఏ ఆధారమూ లేదు. అంతా ఎక్కడివక్కడ సర్దిపెట్టేసి వున్నాయి. ప్రిన్సిపల్‌ను కలిసి తనను తాను పరిచయం చేసుకొని "ఈ సంఘటనపై మీ అభిప్రాయం చెప్పండి. పత్రికలో ప్రచురిస్తాం" అన్నాడు.

దానికి అతను చిరునవ్వు నవ్వుతూ "వదిలేయండి సార్... దీనిని పెద్దగ చేయకండి. బురదలో రాయేస్తే చిట్లేది మనమీదే గదా... వాళ్ళది రాష్ట్రమంతా ఎన్నో బ్రాంచులతో విస్తరించిన కాలేజీ. ఇక్కడ వాళ్ళ విస్తరణకి మా కాలేజీ ప్రధాన అడ్డంకిగా వుంది. టేకోవర్ చేసుకోవడానికి చాలా పెద్ద మొత్తంలో ఆఫర్ చేశారు గానీ మా యాజమాన్యం పట్టించుకోలేదు. దాంతో మా కాన్‌సన్‌ట్రేషన్ దెబ్బతీయడానికి ప్లాన్డ్‌గా చేసిన కుట్ర ఇది. వాళ్ళ వలలో చిక్కుకోవడం మాకు ఇష్టం లేదు. దయచేసి ఏమీ రాయకండి" అన్నాడు.

ఇక అతనితో మాట్లాడి లాభం లేదనుకొన్న ఆనంద్ బైటికొచ్చాడు. ఎడిషన్ ఇంఛార్జికి ఫోన్ చేసి జరిగిందంతా వివరించాడు. అతను అదంతా విని "శభాష్. చాలా బాగుంది. ఫోటోలు గూడా స్పష్టంగా వున్నాయంటున్నావ్ గదా... న్యూస్ మొత్తం రాసి పంపించు. చూసి చెబ్తాను" అన్నాడు.

ఆనంద్ ఉత్సాహంగా ఆఫీసుకి బైలుదేరాడు. మధ్యాహ్నం రెండు కావస్తూ వుంది. ఆఫీసులో ఎవరూ లేరు. కంప్యూటర్ గదిలో డీటీపి ఆపరేటర్ కూర్చుని వచ్చిన వార్తల్ని డీటీపి చేసి మెయిన్ ఆఫీస్‌కి పంపిస్తూ వున్నాడు. ఆనంద్ తాను రాసినదాంట్లో మార్పులు, చేర్పుల కోసం గది చివరన ప్రశాంతంగా కూర్చుని చూసుకోసాగాడు.

కాసేపటికి ఎవరివో అడుగుల చప్పుళ్ళు వినబడ్డాయి. తొంగి చూశాడు.క్రైం న్యూస్ విలేఖరి కంప్యూటర్ గదిలో చేరాడు. చుట్టూ ఎవరూ లేకపోవడంతో వాళ్ళు మాటల్లో పన్నారు. ఆనంద్‌కు ఆ మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి.

"ఏం బాస్... ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న అవినీతి మీద వరుసగా రాస్తూ వున్నావ్. ఇంకా గిట్టుబాటు కాలేదా ఏం" ఆపరేటర్ నవ్వుతూ పలకరించాడు.

"ఆ ఎండీగాడు పెద్ద ఖతర్‌నాక్‌లే. రాజకీయ నాయకులతో ఫోన్ చేయిస్తున్నాడు గానీ డైరెక్ట్‌గా కాంటాక్ట్‌లోకి రాకుంటున్నాడు. ఐనా వదులుతానా... రేపు ఇంగో న్యూస్ వుంది. అది పడ్తే వాడే దిగొస్తాడు" అంటూ విలేఖరి కుర్చీని కంప్యూటర్ దగ్గరికి జరుపుకొన్నాడు.

"మొన్న మస్తాన్‌గాడు ఓర్వకల్లులో హాస్టల్ వార్డన్ వంట సరుకులు షాపుకి తరలిస్తుంటే

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని మస్తు వసూలు చేసినాడంటనే నిజమేనా?"

"అదెంతలే గురూ చిన్నది. ఆదోని దగ్గర టీవీ ఎక్స్ విలేఖరి వెంకట్రావ్ లేడూ... వాడు శ్రీరామ్ పెట్రోల్‌బంకు దగ్గర, రేషన్‌షాపు డీలర్ల నుంచి సేకరించిన కిరోసిన్‌ను పెట్రోల్, డీజిల్ ట్యాంకుల్లో కలిపి కల్తీ చేస్తుంటే వీడియో తీసి లక్షకి బేరం పెట్టినాడంట. ఛానల్లో గనుక ప్రసారమయిందంటే విజిలెన్స్ దాడి, లైసెన్స్ బంద్... మస్తు పంచాయితీ వుంటాది గదా... దాంతో సాయంత్రానికంతా డెబ్బైవేలకి సెటిల్ చేసుకొని క్యాసెట్ తీసుకున్నారంట"

"ఏది ఏమయినా ఈ పేపర్ కన్నా న్యూస్ ఛానల్‌కు పోవడమే మేలు గురూ... మస్తు సంపాదించొచ్చు. మన రాజేష్‌గానికి పోయిన సంవత్సరం వరకూ సైకిల్‌కు గూడా గతిలేకుండే. ఛానెల్‌కి మారి రెండు సంవత్సరాలు తిరిగేసరికి వెంకటరమణ కాలనీలో ఐదు సెంట్ల స్థలం కొని పునాదులు లేపినాడు. స్థలమంటే గుర్తుకొచ్చింది. ప్రభుత్వం మనకు నామినల్ రేటుకి తాండ్రపాడు దగ్గర ఐదు సెంట్ల స్థలం ఇవ్వబోతుందట... అప్లై చెయ్యి"

ఆనంద్‌కి ఆ మాటలు వింటుంటే ఏదో కంపరంగా, ఒళ్ళంతా తేళ్ళు, జర్రులూ పాకినట్లుగా అనిపించింది. పత్రికలో తాను చేరకముందు ఊహించిన దానికీ, ఇక్కడ జరుగుతున్న దానికీ చాలా తేడా వుంది. దీని కంటే ముందు ఈ మధ్యనే ఎన్నికల ముందు కొత్తగా పెట్టిన ఒక పత్రికలో పని చేశాడు. చాలా మంచి జీతం, కానీ అందులో ఎంతసేపూ ప్రభుత్వానికి సపోర్టుగా, ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా రాయడమే పని. పేరు మోసిన విలేఖరులూ, రచయితలూ, ఏమాత్రం సిగ్గూశరం లేకుండా... కళ్ళ ముందు కనబడ్తున్న నిజాల్ని తొక్కిపెడుతూ, యాజమాన్యం కనుసన్నల్లో డబ్బు కోసం బానిసల్లా వాళ్ళు చెప్పిన పని చేస్తూ వున్నారు. అక్కడ ఇమడలేక బైటపడ్డాడు. ఏ పత్రిక చూసినా ఏదో ఒక పార్టీకో, కులానికో కొమ్ముకాస్తున్నవే. కాకపోతే కొన్ని నిర్లజ్జగా బరితెగించి ప్రచురిస్తుంటే, మరికొన్ని ముసుగులో దొంగాట ఆడుతున్నాయి. విసుగ్గా లేచి కంప్యూటర్ గదిలోకి అడుగులు వేశాడు.

ఆనంద్‌ను చూసి వాళ్ళిద్దరూ మాటలాపేశారు. డీటీపి ఆపరేటర్‌కి రాసిన సమాచారాన్ని, ఫోటోలను అందించాడు. ఇంటికొచ్చి ఫోంచేసి సాయంత్రం ఎడిషన్ ఇంఛార్జికి ఫోన్ చేశాడు. అప్పటికే అదంతా చదువుకొన్న ఇంఛార్జి "ఓకే ఆనంద్ వెరీగుడ్... ఫోటోస్ గూడా చాలా బాగా వచ్చాయ్. ఈ న్యూస్ వేరే విలేఖరులకి ఎవరికీ ఇవ్వలేదు గదా" ప్రశ్నించాడు.

"లేద్సార్... అసలు ఎవరికీ తెలీదు. నేను గూడా స్పాట్‌లో కెమెరాతో వుండబట్టి తీయగలిగాను. వాళ్ళు కేసుగూడా పెట్టలేదు కాబట్టి విషయం బైటకి పొక్కే వీలుగూడా వుండదు.

"ఓకేమ్మా... కార్పొరేట్ వార్ అనే టైటిల్ పెట్టి రేపు టాబ్లాయిడ్ మొదటి పేజీలో వేద్దాం. అదిరిపోతుంది. సరేనా" అంటూ ఫోన్ పెట్టేశాడు. సబ్ ఎడిటర్‌ని పిలిచి ఆ న్యూస్ మొదటి పేజీలో పెద్ద అక్షరాలతో సెట్ చేయమన్నాడు.

అదే సమయంలో అడ్వర్టయిజింగ్ సెక్షన్‌లో పని చేస్తున్న కోటేష్ సబ్ ఎడిటర్‌తో పనిబడి

ఆఫీసుకి వచ్చాడు. అక్కడ మెయిన్ పేజీకి తయారవుతున్న వార్త చూశాడు. కోటేష్‌కి ప్రతిభా కాలేజీ ప్రిన్సిపల్‌తో మంచి సంబంధాలు వున్నాయి. ఏ అకేషన్ అయినా అడిగినప్పుడల్లా కాదనకుండా ప్రకటనలు ఇస్తుంటాడు.

కోటేష్ ఆఫీసులో పనయిపోగానే బైటకు వచ్చి ప్రతిభా కాలేజీ ప్రిన్సిపల్‌కి ఫోన్ చేసి జరిగిందంతా చెప్పి "వెంటనే ఫోన్ చేయకండి సార్. నా మీద అనుమానం వస్తాది" అంటూ ఫోన్ పెట్టేశాడు. ప్రిన్సిపల్ ఓ అరగంటాగి ఎడిషన్ ఇంఛార్జికి ఫోన్ చేశాడు.

"హలో.. ఎడిషన్ ఇంఛార్జి గారేనా... నేను ప్రతిభా కాలేజి ప్రిన్సిపల్‌ని మాట్లాడుతున్నా"

"నమస్తే సార్... చెప్పండి"

"మీ పత్రికలో మా కాలేజీకి సంబంధించిన వార్త ఒకటి ప్రచురిస్తున్నట్లు తెలిసింది..."

"అటువంటిదేమీ లేదే... ఎవరు చెప్పారు మీకు"

"ఇప్పుడది అంత ప్రధానం కాదు కదా... దయచేసి ఆ వార్త రాకుండా ఆపగలరా"

"సారీ సార్... ఇప్పటికే అంతా సెట్ అయిపోయింది. కుదరదు"

"ప్లీజ్ సర్ మీ ఋణం వుంచుకోము లెండి. రేప్పొద్దున ఇంటికి మా ఆఫీస్ బాయ్ వచ్చి కలుస్తాడు"

"సారీ.. నా గురించి మీకు తెలియదనుకుంటా... ఇంగోసారి ఫోన్ చేయకండి మర్యాదగుండదు" ఖచ్చితంగా చెబ్తూ ఫోన్ పెట్టేశాడు. దాంతో ప్రిన్సిపల్ ఇక లాభం లేదనుకొని హైదరాబాద్ మెయిన్ బ్రాంచ్‌కి విషయాన్నంతా తెలియచేశాడు.

* * * * * *

ఆనంద్ తరువాత రోజు పొద్దున్నే ఉత్సాహంగా ఇంటి ముందు పన్న పేపర్ తీశాడు. గబగబా జిల్లా పేపర్ తీసుకొని చూశాడు. మొదటి పేజీలో ఏ వార్తా లేదు. ప్రతిపక్ష ఎమ్మెల్యే ఒకరికి ప్రభుత్వపక్షం గాలం వేసుకొని తమవైపు తిప్పుకోబోతున్నట్లు పెద్ద హెడ్డింగుతో వుంది. లోపల పేజీల్లో వుంటుందిలే అనుకుంటూ ఆతృతగా పేజీలు తిప్పాడు. ఎక్కడా లేదు. నమ్మశక్యం గాక నిదానంగా మరోసారి అంతా వెదికాడు. లాభం లేదు. ఆశ్చర్యపోయి సెల్ తీసి ఎడిషన్ ఇంఛార్జికి ఫోన్ చేశాడు. ఎన్నిసార్లు చేసినా సెల్ మోగుతుందే కానీ ఎవరూ ఎత్తడం లేదు.

ఏం జరిగిందో అర్థంగాక చాలా నిస్సత్తువగా అన్పించింది.

అంతలో న్యూస్ ఏమయినా మెయిన్ పేజీలోకి వెళ్ళిందా అనే ఆలోచన వచ్చింది. వెంటనే గబగబా పేపర్ చేతిలోకి తీసుకున్నాడు.

అంతే... షాక్ తగిలినట్లనిపించింది.

పత్రిక మొదటిపేజీలో సగానికి ప్రతిభా కాలేజీ ప్రకటన....కలర్‌ఫుల్‌గా.... వెక్కిరిస్తూ....

**(అరుణతార – జులై సెప్టెంబర్ – 2009)**

# జవా

"పొరపాటైంది భాయీ... యిసేక్బార్ ఛోడ్దో... పిల్లోడు తెలీక సేశాడు. మాఫ్‌కర్నా" రఫిక్ తండ్రి ప్రాధేయపడసాగాడు.

పెద్ద మొల్లాసాబ్ ఆ మాటల్నిననట్టు మౌనంగా కూర్చున్నాడు. మసీదుకొచ్చిన జెనాలంతా ఏం జరగబోతుందాని కుతూహలంగా చూస్తున్నారు. తమలో తాము గుసగుసలాడుకుంటున్నారు. పంచాయితీ పెద్దలింకా రాలేదు. వాళ్ళ కోసం యెదురు చూస్తున్నారు.

రఫిక్ ఓ మూల మౌనంగా నిల్చోనున్నాడు. మొహం కందగడ్డలాగుంది. ఆవేశంతో ఒళ్ళొణుకుతా వుంది. జెనాలంతా అతన్ని దోషిని చూసినట్టు చూస్తున్నారు.

రఫిక్ వయసు ఇరవైయేండ్లుంటాది. సన్నగా పొడుగ్గా వుంటాడు. తెల్లని ఛాయ. పని చేసీ చేసీ శరీరం రాటుదేలింది. వాళ్ళ నాన్నకు రెండెకరాల పొలముంది. అల్లా దయదలిస్తే పంట. లేకుంటే ల్యా. రఫిక్ ఊళ్ళోని జిల్లా పరిషత్ హైస్కూల్లో పదోతరగతి వరకూ చదూకోని, ఆపైన కాలేజీకి పక్కూరికెళ్ళలేక మానేశాడు. గౌండా పని నేర్చుకున్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో యేదైనా పనుంటే పోతుంటాడు. లేకుంటే వూళ్ళోనే పొలాల్లో కూలీకి పోతుంటాడు.

రఫిక్తోబాటు వాని స్నేహితుడు బీవర్ కూడా గౌండానే. బీవర్‌కి వారం కిందట్నే కొడుకు పుట్టాడు. పార్టీ యివ్వమని రఫిక్ వెంటబడ్తే సరేనని కిందట్రోజు సంతలో ఓ మంచి నాటుకోడి కొనుక్కొచ్చాడు. దాన్ని జవా చేపిద్దామంటే వూళ్ళో మొల్లోల్లెవరూ కన్పడలేదు. వాళ్ళ బంధువుల పెళ్ళికని పక్కూరికెళ్ళారు. దాంతో "వాళ్ళు లేకుంటేనేమి... నేను కోస్తలేరా" అంటూ రఫిక్కే కోడి కోశాడు. తరువాత రోజా విషయం ఆనోటా యీనోటా పాకి మొల్లోల్లందరికీ తెల్సిపోయింది.

ఊళ్ళో యెక్కడ కోడి కోయాలన్నా మొల్లోల్లే కోయాలి. కోసినందుకు డబ్బులో, గుండెకాయా, ఐదు కండలో యిస్తారు. ముస్లింలేగాక హిందువుల్లో కూడా చాలా మంది కూడా జవా చేయించుకోకుండా తినరు.

రఫిక్ కోడి కోశాడనే వార్త పెద్ద మొల్లాసాబ్‌కు తెల్సి అగ్గైపోయాడు. మసీద్లో పంచాయితీ పెట్టించాడు. జెనాలు ఒకొక్కరే రాసాగారు. బడామొల్లాసాబ్ తెల్లని గుబురైన గడ్డాన్ని సవరించుకుంటూ

రఫిక్ వంక తీవ్రంగా చూస్తున్నాడు. "ఇన్నాళ్ళకు దొరికాడ్నాకొడుకు" మనసులో అక్కసుగా అనుకున్నాడు. ఆర్నెళ్ళ కిందట రంజాన్ మాసమ్లో జరిగిన గొడవ గుర్తొచ్చి పెదాలపై వంకరగా చిరునవ్వు మెరిసింది.

* * *

అజా యిచ్చే టైమైంది. జెనాలు వడివడిగా మసీదుకు చేరుకుంటున్నారు. ఆ పల్లెకు అదొక్కటే మసీదు. మసీదు చుట్టూ ఫారం కంప, పిచ్చి బంగాకు పేరుకుపోయింది. చాలా రోజుల్నించీ సున్నం కొట్టక గోడలు నీరుకావి రంగుకు తిరిగున్నాయి. కొన్ని చోట్ల గచ్చు పెల్లలు పెల్లలుగా రాలిపోయి లోపల రాళ్ళు కనబడుతున్నాయి. రఫిక్ బెరబెరా మసీద్లోకి ప్రవేశించాడు. ఓ మూలనున్న హౌజ్లో నీళ్ళు ముంచుకొని, రాయి మీద కూచోని మోచేతుల, మోకాళ్ళ కింది భాగాన్ని వజూ చేసి శుభ్రపరచుకొన్నాడు. కడుపులో ఆకలి నకనకలాడుతోంది. నోట్లో వుమ్మి మింగకుండా కిందూసి అప్పటికే అక్కడికి చేరుకున్న జెనాల మధ్యకు చేరి "అల్లాదిల్లాహై..." చదూకోని కూచున్నాడు.

కాసేపటికి పెద్దమొల్లాసాబొచ్చాడు. మోకాళ్ళ కిందికి తెల్లని జుబ్బా, ఎర్రగళ్ళ లుంగీ కట్టుకున్నాడు. మీసాలు నున్నగా గొరిగి గడ్డం బారుగా పెంచాడు. వయసు పైబడ్డంతో గడ్డం నెరిసి తెల్లగా మెరుస్తూ వుంది. నెత్తికి వల్లె చుట్టుకున్నాడు. సామూహికంగా నమాజు చేయడం ప్రారంభమైంది.దువా పూర్తి కాగానే అందరూ వెళ్ళబోతుంటే "ఒక్క నిమిషం... అందరూ కూర్చోండి" అన్నాడు పెద్ద మొల్లాసాబ్. జెనాలంతా అతనేం చెప్తాడాని ఆగిపోయారు.

మొల్లాసాబ్ పెద్దబుక్కును పక్కన పెట్టి గొంతు సవరించుకోని "ఈ సమ్మచ్చరం యెక్కువ మంది రోజా చేస్తూ ఐదు పూటలా నమాజుకొస్తున్నారు. నాకు చాలా ఆనందంగా వుంది. అల్లా మిమ్మల్నందర్నీ దయతో కాపాడ్తాడు. ముఖ్యంగా నేను చెప్పేదేమిటంటే మసీదు చాలా పాతబడి పోయింది. చిన్న చిన్న రిపేర్లున్నాయి. అలాగే మసీదుకు సున్నం, రంగులు వేయించాల. కాబట్టి మీరందరూ మీకు తోచినకాడికి సాయం చేసి అల్లా కార్యం నెరవేర్చాలి" అని చెప్పి మౌనంగా అందరి వంకా చూడసాగాడు.

జెనాలు ఒకరొకరూ అలాగేనంటూ అంగీకార సూచకంగా తలాడించసాగారు. కొంతమంది పెద్దలు ఉత్సాహంగా ముందుకొచ్చి అప్పటికప్పుడే చందాలు పోగు చేయడానికి సిద్ధపడ్డారు. అంతలో రఫిక్ లేచి నిలబడ్డాడు. అందరూ అతని వంక తలతిప్పారు. రఫిక్ నెమ్మదిగా నోరిప్పాడు.

"పెద్దమొల్లాసాబ్ చెప్పింది బానే వుంది. మసీదు పాతగైంది. నిజమే. కానీ.... ప్రతి సమ్మచ్చరం సూస్తున్నా... మసీదుకు రంగెయ్యాల, సున్నం కొట్టాల, అది చెయ్యాలిదిచెయ్యాలని మనల్ని చందాలడగడమేగానీ, మసీదు డబ్బుతో యేమీ సెయ్యడంలా... ఆ డబ్బంతా యేం సేస్తున్నారింతకూ?"

ఆ ప్రశ్నకు మసీదు మొత్తం ఒక్కసారిగా నిశ్శబ్దమావరించింది. అందరూ ఒకర్నొకరు

చూసుకుంటున్నారు. మొల్లాసాబ్ మొఖం ఎరుపెక్కింది. కోపాన్ని పళ్ళ బిగువున వుగ్గబట్టుకున్నాడు. రఫిక్ మళ్ళా "మసీద్మాన్యం నూరెకరాలుంది. కొంత సెరువులో పోయింది. డబ్బులొచ్చాయి. బ్యాంకు నుండి నెలనెలా వడ్డీ అందుతోంది. మిగతా భూమంతా రెండుకార్లూ పండుతోంది. ఎవరి వాటా వాళ్ళు అనుభవిస్తున్నారు. ఐనా మసీదిలాగే వుంది. ఏ మాత్రం బాగుపళ్ళా. ఇంకెందుకు వీళ్ళకు మాన్యమిచ్చింది?" ప్రశ్నించాడు.

మొల్లాసాబ్ ఆ మాటలకు జవాబుగా "నీవు సెప్పింది నిజమే... కానీ... పూర్వమీ మసీదు కట్టించినప్పుడు పెద్దోళ్ళు ఈ మసీదును సూసుకోడానికి మమ్మల్ని నియమించి మేం బతకడానికి ఇనాం కింద ఈ భూమిచ్చారు. దాన్నెవరూ అడగడానికి వీళ్ళేదు. దానిపై మాకు మాత్రమే హక్కుంది" అన్నాడు.

అంతలో ఒకతను జోక్యం చేసుకోని "మొల్లాసాబ్ సెప్పింది కరక్టే. పాపం... వాళ్ళు సిన్నప్పటి నుంచీ అల్లానే నమ్ముకోని మసీదు బాగోగులు సూసుకొంటున్నారు. నిన్నగాక మొన్న పుట్టిన బచ్చాగానివి. గుద్దామూతీ తెలీదు గానీ పెద్దపెద్దమాటలు మాట్లాడుతున్నావు. మూ మూచ్కేబైఠో" ఆవేశంగా అర్చాడు.

రఫిక్ ఆ మాటలకి వెనక్కి తగ్గలా. భయపడ్లా. "అవ్... బచ్చాగాన్నే. ఏమీ తెలీనోన్నే. అందుకే తెలుసుకోవాలనుకుంటున్నా. మసీదు కోసమే గదా భూమిచ్చింది. నే పుట్టినప్పుడు ఎలాగుందో, ఇప్పటికీ అలాగే వుంది. నిజం సెప్పాలంటే ఇంకా పాతబడిపోయింది. మసీదును సూసోడమంటే ఇనాం తింటూ కసులూడ్సడం, అజా ఇవ్వడం, నమాజ్ చేపియ్యడమే గాదు... మసీదు బాగోగులు గూడా సూడాల. ఎప్పుడైనా మొల్లోళ్ళెవరైనా మసీదుకు ఐదు పైసలన్నా ఖర్చు పెట్నారా? చందాలంటూ మీద పడ్తారు గానీ! దీనికి నూరెకరాలు... యేం లాభం... మాకే సరిపోవడమ్లా అంటారు. నిజమే. అందుకే గాబోలు ఈ మొల్లాసాబ్ ఆ సెరువు కింది భూమితో నాల్గు సమ్మచ్చరాల కిందట్నే మరో పదెకరాలు కొనింది. ఏం... తక్కువ డబ్బులొస్తున్నాయా... నిఖాలప్పుడు, శుక్రారం నమాజప్పుడు, జవా సేసేటప్పుడు.... డబ్బులీస్కోడమ్లా... వూకే సేస్తున్నారా... చందాలకసలు లెక్కుందా. మొల్లోళ్ళలో ఎవరు బాగాలేరు? గఫూర్భాయ్, సలామ్భాయ్, మహబూబ్భాయ్... యెంతమంది! అందరూ అల్లా దయ వల్ల సంపాదించుకొన్నోళ్ళేగదా! మరి ఆ అల్లాకెందుకు ఖర్చు పెట్టరు?"

రఫిక్ ఆవేశంగా మాట్లాడుతున్నాడు. మొల్లాసాబ్ జెనాల వంక చూశాడు. వాళ్ళ కళ్ళల్లో ఏవేవో ప్రశ్నలు కనబడసాగాయి. తమతమ బతుకులను మొల్లోల్లతో పోల్చుకుంటున్నారు. శ్రద్ధగా రఫిక్ చెప్పేది వింటూ మధ్యలో పక్కనోళ్ళతో గుసగుసలాడ్తూ తలూపుతున్నారు. మొల్లాసాబ్కు పరిస్థితి అర్థమై వెంటనే పైకి లేచి, రఫిక్ను ఆగమన్నట్టుగా సైగ చేశాడు. రఫిక్ ఆగిపోయాడు.

మొల్లాసాబ్ జాగ్రత్తగా మాటలు కూడబలుక్కుంటూ నెమ్మదిగా మొదలెట్టాడు.

"మీకు తెలియన్దేముంది.... మా నాయనల కాలం నుంచీ మేమంతా మసీదు కోసమే

జీవితాన్నంకితం సేశాం. పొద్దనకా రాత్రనకా మసీద్లోనే వుంటూ దాని బాగోగులు సూసుకుంటూ ఇనాం కిందిచ్చిన భూమ్మీద ఆధారపడి బతుకుతున్నాం. యేదో... మేం సేసిన సేవ వల్ల, అల్లా దయదల్సడం వల్ల మా భూముల పక్కన సెరువొచ్చింది. రెండుకార్లూ పండుతున్నాయి. అంతా మేం సేస్కున్న పుణ్యమేగదా అది. అల్లాను నమ్ముకున్నోడెవడూ సెడిపోడు.

అల్లా మా మీద దయ సూపినా, మీతో ఈ రోజు మాట పడాల్సొచ్చింది. మసీదు బాగు సెయ్యడమెంతసేపు. మా మొల్లోల్ల కుటుంబాలు తల్సుకుంటే నిముషాల్మీదైతాది. కానీ.... అది దేవుని పని. పదిమందీ సెయ్యాల. అందరికీ పుణ్యం దక్కాల. మీరు కూడా అల్లాకు దగ్గర కావాల. అందుకే మీకు సెప్పా. నా స్వార్థమేమీ లేదిందులో. సరే... యేం సేస్తాం... మంచికి పోతే సెడెదురైందనీ... ఇంకెవరూ సెందాలివ్వాల్సిన అవసరం లేదు. మేమే మా సొంత డబ్బుల్తో దేవుని పని పూర్తి సేస్తాం. ఆ పుణ్యమేదో మాకే దక్కనీ. అల్లాదయ మీ మీదుంటే సాలు. మీ అందరి తరఫునా అల్లాని నేను వేడుకుంటా" అన్నాడు.

ఆ మాటలకు జెనాల్లో కలకలం బయలుదేరింది. కొందరు రఫిక్ వంక కోపంగా చూడసాగారు. మరికొందరు ఆలోచించసాగారు. అంతలో ఒకడు లేచి

"బడాసాబ్! యేదో తెలీక ఆ కాఫిర్నాకొడుకు నోరు జారాడు. వాని మాటలు పట్టించుకోకండి. మసీదు మీ ఒక్కరిదేమీ కాదుగదా. వూళ్ళోని ముసల్మాన్లందరిదీ. మీకెందుకు. మేము బాగు సేపిస్తాం" అన్నాడు.

బడాసాబ్ తల అడ్డంగా వూపుతూ "వద్దు... మాటొచ్చింది. ఇంత మాట పడ్డాక మళ్ళా చందాలడిగేదేముంది. మేమే సేస్తాం" అంటూ లేచిపోయాడు. జెనాలు నెమ్మదిగా అక్కడి నుంచి కదిలారు.

⁂ ⁂ ⁂

మసీద్లోకి మున్నాభాయ్ ప్రవేశించాడు. అందరూ గౌరవంగా లేచి నిలబడ్డారు. మున్నాభాయ్ వూళ్ళోని ముస్లింలలో పెద్దరైతు. ఇరవై ఎకరాల వరిమడుంటాది. దాంతోబాటు ఎరువుల వ్యాపారం చేస్తున్నాడు. ఆ పల్లెలోని రైతులకేగాక పక్కూరోళ్ళకు గూడా అప్పు కింద ఎరువులిచ్చి పంటొచ్చిన వెంటనే వసూలు చేసుకుంటాడు. బాగా సంపాదించాడు. ఆ పల్లెలోని ముస్లింలందరూ చిన్నచిన్న పంచాయితీలకు వూళ్ళోని రెడ్లకాడికి పోకుండా మున్నాభాయ్ దగ్గరే తెంచుకుంటూ వుంటారు.

మున్నాభాయ్ అరుగు మీద కూర్చున్నాడు. పక్కనే పెద్ద మొల్లాసాబ్, మరో యిద్దరు మొల్లోల్లు కూచున్నారు. జరిగిందంతా ముందట్రోజే పెద్దమొల్లాసాబ్, మున్నాభాయ్‌కి వివరించాడు. పంచాయితీ ప్రారంభిస్తూ మున్నాభాయ్ రఫిక్ వంక తీవ్రంగా చూస్తూ, గద్దిస్తున్న స్వరంతో.

"ఏరా! నీవు సేసిందేమైనా బాగుందా" ప్రశ్నించాడు.

"నేనేమీ తప్పుసెయ్యలా" తలెత్తుకోని ధైర్యంగా సెప్పాడు రఫిక్.

"సువర్కాబచ్చా... సేసింది గాక మళ్ళా తప్పేమీ సేయలేదంటావ్. ముసల్మాన్ పుట్టుక పుట్టినోడెవుడూ ఈ పని సేయడు" మున్నాభాయ్ కోపంగా అర్చాడు.

పక్కన కూచున్న మరొకడు "సూదరోల్లెక్క సేసింది గాక యెదురుమళ్ళ మాట్లాడ్తావ్. ముసల్మాన్ పుట్టుక పుట్టి జవా సేయకుండా ముర్దార్ తింటావ్రా సాలే నువ్" ఆవేశంగా అన్నాడు.

"ముర్దార్ తిన్నానని యెవడు సెప్పింది... ఇట్రమ్మను. జవా సేసే కోశా... నేనూ సదివా పెద్దబుక్కు" రఫిక్కేమాత్రం తడబడకుండా నిబ్బరంగా సమాధానమిచ్చాడు.

ఆ మాటలింటూనే వానికి కోపం నషాళానికి అంటింది. పైకి లేచి కోపంతో వూగిపోతూ.

"ఛస్... నోర్ముయ్... తెర్మాకీ... కుక్క పని కుక్క సెయ్యాల... గాడ్దిపని గాడ్ది చేయాల... నువ్వెవర్రా కోయడాన్కి? ఇంక మొల్లోళ్ళెందుకు... పెద్దబుక్కెందుకు... నిఖా గూడా మీరే సేస్కోండి సరిపోతుంది. తప్పు సేసిందేగాక మళ్ళా పెద్దోళ్ళ ముందే ఒళ్ళు కావరమెక్కి మాటకు మాట సెబుతావ్రా లౌడేక్బాల్... నిన్ను..."

ఆవేశంగా రఫిక్ మీదికి పోతున్న వాన్ని మున్నాభాయ్ పట్టుకోని ఆపు చేశాడు. మున్నాభాయ్ కాసేపు తీవ్రంగా ఆలోచించి జెనాల వంక చూశాడు. అందరూ మున్నాభాయేం చెబ్తాడాని ఆసక్తిగా యెదురు చూడసాగారు. మున్నాభాయ్ ప్రారంభించాడు.

"వూరన్నాకో కట్టుబాటుంటాది. మన పల్లెలో మొదటి నుంచీ జవా సేయాలన్నా, పీనుగెత్తాలన్నా, మసీదు పని సూడాలన్నా... పెద్దబుక్కు బాగా సదూకొన్న మొల్లోల్లే సేయాల. ఈ రోజొగడొచ్చి జవా సేస్తానంటాడు. రేపు మరొగడు నిఖా సేస్కుంటానంటాడు. మన పెద్దోళ్ళు మొల్లోల్లనెందుకుంచారు? ఇవన్నీ సేయడాన్కే గదా... మన మత సంబంధ కార్యకలాపాలన్నీ ఆళ్ళే సేయాల. ఇంకోడెవుడూ సేయడానికీళ్ళేదు. ఆళ్ళకే హక్కుంది. ఇకపైన యెవడిలా సేయకుండా, నోరెత్తకుండా వుండడానికి వీనికి వెయ్యి రూపాయల జరిమానా యేస్తున్నా. ఓ నెల్లోగాని దాన్ని మసీదుకు సెల్లించాలి. అలాగే మరలా యిలాంటి తప్పు సెయ్యనని పెద్దబుక్కు మీద సేయెట్టి అల్లా మీద ప్రమాణం సేయాలి. లేకపోతే రేప్పొద్దున ఈ కాఫిర్నాకొడుకింట్లో ఏ కార్యక్రమం జరిగినా ఎవరూ పోగూడదు. ఆఖరికి పీనుగ పన్నాకూడా..." అంటూ ముగించాడు.

రఫిక్ వాళ్ల నాన్న అదిరిపడ్డాడు. వెయ్యిరూపాయలంటే మాటలా... నెలంతా కూలీకి పోయినా ఓ వంద మిగలదు. కన్నీళ్ళు పెట్టుకోని మున్నాభాయ్ దగ్గరకొచ్చి "భయ్యా... నా మొగం సూసి ఈ ఒక్కసారికొదిలెయ్యి. నే నచ్చజెబ్తా" అని ప్రాధేయపడుతూ "నువ్వన్నా సెప్పు బఢాసాబ్.... మీమాటింటాడు" అంటూ పక్కన కూచున్న పెద్దమొల్ల కాళ్ళు పట్టుకొన్నాడు. పెద్దమొల్లాసాబ్ అసలు ఆ గొడవతో తనకేమీ సంబంధమే లేనట్టు మౌనంగా కూచుని చూస్తున్నాడు. మారు పల్కలా. జెనాలెవ్వరూ కలుగజేసుకోడమ్లా. ఒకడు ఖురాన్ తీస్కొచ్చి అక్కడ పెట్టాడు. రఫిక్ నెమ్మదిగా వచ్చి ఖురాన్ని అందుకొన్నాడు. ఒళ్ళు ఆవేశంతో, దుఃఖంతో వణుకుతా వుంది. కాళ్ళు తడబడుతున్నాయి.

బుక్కు తీస్కోని కళ్ళకద్దుకోని గట్టిగా అర్చాదు.

"అవున్రా... నేన్కాఫిర్నే... మీరే నిజమైన ముస్లింలు. అల్లా పేరు సెప్పి మమ్మల్ని దోచుకుంటూ, భయపడిస్తూ మా గొంతుల్కోసి జవా సేస్తున్న మీరే నిజమైన ముస్లింలు. నేన్కాఫిర్నే... సచ్చినా ఒక్క పైసా గూడా కట్టను. ఎవడేం పెరుక్కుంటాడో పెరుక్కోండి" అంటూ విసురుగా బైటకి వెళ్ళిపోయాడు.

అక్కడ చేరిన జెనాలందరూ ఆ మాటలకు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. కోపంతో మున్నాభాయ్ కళ్ళు ఎరుపెక్కాయి. బడామొల్లాసాబ్ జరగబోయేది తల్చుకోని చిన్నగా లోలోన నవ్వుకున్నాడు. మసీదు తన పేరు మీద జరుగుతున్న అన్యాయాన్నంతా మౌనంగా గమనిస్తూ వుంది.

**మాయమ్మ రాచ్చసి కథా సంపుటి – డిసెంబర్ 2000**

**నయాఫత్వా కథాసంపుటి – ఏప్రిల్ 2001**

# ఒక్క కథ

సమయం ఎనిమిదవుతూ ఉంది. ట్యూషన్‌లో మంజు తప్పించి మిగతా పిల్లలెవరూ లేరు. నోట్సులో కొంచెం మిగిలి వుంటే రాసుకుంటూ ఉండిపోయింది. అది చూసి సారు "పోమ్మా మంజూ... రేపు రాసుకుందువులే... బాగా చీకటి పడిపోయింది" అని హెచ్చరించాడు.

"ఏం కాదులే సార్... పక్క సందులోనే కదా మా ఇల్లు. పది నిమిషాలు చాలు. నాకేం భయం లేదులే" అంటూ అలాగే రాసుకుంటూ ఉండిపోయింది.

మరో పావుగంటకు రాయడం పూర్తయ్యింది. లేచి పుస్తకాలన్నీ సంచిలో పెట్టుకొని, భుజానికి తగిలించుకొని బయలుదేరింది. చలికాలం కావడంతో జనాలంతా అప్పుడే తలుపులు మూసేసుకున్నారు. రోడ్డు మీద ఎవరూ లేరు. అక్కడక్కడ కిటికీల్లోంచి లైట్ల వెలుతురు రోడ్డు మీదికి పడుతోంది. చిన్నసందు కావడం చేత వీధిదీపాలు దూరం దూరంగా ఉన్నాయి. నెమ్మదిగా సందు దాటింది. ఇంకో ఐదు నిమిషాలు... అక్కడ వరుసగా పెద్దపెద్ద చెట్లున్నాయి. అవి దాటి కుడివైపుకి తిరిగితే చాలు ఇల్లు వచ్చేస్తుంది. చెట్ల కింద చాలా చీకటిగా ఉంది. నడుస్తూ ఒక పెద్ద మర్రిచెట్టు కిందికి వచ్చింది.

అంతలో...

ఒక్కసారిగా దబ్బుమని పైనుండి ఏదో దూకిన శబ్దం.

మంజు అదిరిపోయింది.

ఎదురుగా...

తెల్లగా...

గాలిలో తేలుతూ...

చిన్న దెయ్యం పిల్ల!

దాన్ని చూడగానే మంజు భయంతో బిక్కచచ్చిపోయింది. కాళ్ళు కదలలేదు. అది నెమ్మదిగా దగ్గరికి వచ్చేసింది.

మంజు గుండె కొట్టుకునే వేగం పెరిగిపోసాగింది. మనిషి గజగజా వణికిపోతోంది.

అంతలో... అది తన చిన్న చేతులు ముందుకు చాచి మంజు రెండు బుగ్గలూ పట్టుకొని "నీ

పేరు" అంది.

మంజు వణికిపోతూ "మ...మ...మన్...జు..." అంది.

"ఏం చదువుతున్నావు" మళ్ళీ అడిగింది.

"తొ... తొమ్మిది"

అది కాసేపు మంజును అలాగే చూస్తుండిపోయింది.

"భయపడకు నిన్నేం చేయను. కాకపోతే నువ్వు నాకో సాయం చేయాలి. చేస్తావా?" అంది.

మంజుకు నెమ్మదిగా వణుకు తగ్గసాగింది.

"చేస్తాను. కానీ నన్నేం చేయొద్దు" అంది.

"ఏం చేయను. కానీ నువ్వు మాట నిలబెట్టుకోవాలి. లేకపోతే మాత్రం నిన్ను వదలను.. ఎక్కడికి పోయినా" హెచ్చరించింది.

మంజు కొంచెం ధైర్యం తెచ్చుకుని ఆ దెయ్యం వంక చూసింది. అది తన కంటే కొంచెం చిన్నగానే ఉంది. పన్నెండు, పదమూడేళ్ళ వయసుంటుంది. పోనీటైల్ కట్టుకొని రబ్బరుబాండ్ పెట్టుకొంది. సినిమాల్లో చూపించినంత, పుస్తకాల్లో చదివినంత భయంకరంగా లేకపోగా చాలా అందంగా, ముద్దుగా ఉంది. పెదవులపై చిరునవ్వు మెరుస్తోంది. దాన్ని చూడగానే మంజుకు మరింత ధైర్యం వచ్చింది. అది తనను ఏం చేయదు అనిపించింది. దాంతో "సరే ఏం చేయాలో చెప్పు" అంది.

"నీకు ఏమయినా కథలొచ్చా?" ఆశగా అడిగింది ఆ దెయ్యంపిల్ల.

"కథలా... అంటే?" ఎదురు ప్రశ్నించింది మంజు.

"అంటే నీకు కథలంటే తెలియదా" నిరాశ పడిపోతూ అంది.

"లేదే... ఎలాగుంటాయి అవి" మళ్ళీ ప్రశ్నించింది మంజు.

దెయ్యంపిల్ల పూర్తిగా నీరసపడిపోయింది. ఒక్కసారిగా నిట్టూర్చి – "నాకు మంచి కథ కావాలి. నువ్వు ఎలాగయినా సరే... ఎక్కడయినా సరే... ఎవరినో ఒకరిని పట్టుకొని ఒక్క కథ చెప్పించుకొని నాకు చెప్పాలి. కానీ అది పుస్తకాల్లో వచ్చిన కథ కాకూడదు. నెట్‌లోవి కాకూడదు. సినిమాలు, సీరియళ్ళ కథలు అసలొద్దు. మన అమ్మమ్మలు, తాతయ్యల కాలంనాటి కమ్మని పూర్ణం కర్జికాయ లాంటి కథ. నువ్వు అలాంటి కథ ఒకటి చెప్తే నాకీ రూపం తొలగిపోతుంది. చెప్తావా" ఆశగా అడిగింది.

మంజు కాసేపు ఆలోచించి "సరే... నేను ఎవరినో ఒకరిని అడిగి తెలుసుకుంటాలే" అని చెప్పి బయలుదేరింది.

దెయ్యంపిల్ల టాటా చెబుతూ అలాగే అక్కడే కళ్ళ నిండా ఆశ నింపుకొని చూస్తూ ఉండిపోయింది.

⁂ ⁂ ⁂

మంజు ఇంటికొచ్చింది. అమ్మ వంటింట్లో ఉంది. అక్కడ్నించే హాలులోని టీవీలో సీరియల్ చూస్తూ వంట చేస్తోంది. నాన్న తన పర్సనల్ గదిలో కూర్చుని కంప్యూటర్లో ఏదో పని చేసుకుంటున్నాడు. అన్న తల ఎత్తకుండా రికార్డు వర్కు రాసుకుంటూ ఉన్నాడు.

"ఏమే ఇంత ఆలస్యమైంది" వంటింట్లోంచే అమ్మ అడిగింది.

"కొంచెం పెండింగులుంటే నోట్సు రాసుకుంటుంటి" అని గబగబా బ్యాగు గూట్లో పెట్టేసి అమ్మ దగ్గరకు చేరింది.

"అమ్మా... అమ్మా... నీకేమయినా కథలొచ్చా" ఆసక్తిగా అడిగింది.

వాళ్ళమ్మ చేస్తున్న పని ఆపి ఒక్క నిమిషం మంజు వంక చూసి, మళ్ళీ బీరకాయ చెక్కు తీస్తూ "అంత తీరిక నాకెక్కడిదమ్మా... పొద్దున్నుంచీ రాత్రి వరకూ ఈ పనులతోనే సరిపోతుంటే... మీ నాన్ననడుగు. ఇంటికి ఆలస్యంగా వచ్చినప్పుడల్లా కొత్తకొత్త కథలు మస్తుగ చెబుతుంటాడు" అంది.

మంజు పరిగెత్తుకుంటూ వాళ్ళ నాన్న దగ్గరికెళ్ళింది. ఆయనతో ఉన్న చనువు కొద్దీ మెడ చుట్టూ చేతులేసి "నాన్నా... నాన్నా... నీకేమయినా కథలొచ్చా నాన్నా" అని అడిగింది.

"ఎందుకమ్మా ఇప్పుడు" చేస్తున్న పని ఒక్క క్షణం ఆపి అడిగాడు.

"మా టీచర్... రేపు ఒక్కొక్కరు ఒక్కొక్క కథ చెప్పాలని అంది నాన్నా" అని అబద్ధం ఆడింది.

"నెట్‌లో చిల్డ్రన్స్ స్టోరీస్ అని క్లిక్ చేస్తే చాలమ్మా... కుప్పలు కుప్పలుగా సైట్లొస్తాయి. కాసేపున్నాక రా... నా పనయిపోగానే వెదుకుదాం".

"అలా కాదు నాన్నా... ఎవరైనా చెప్పినవి విని తిరిగి చెప్పాలంట. అది గూడా అప్పటికప్పుడు చదివి చెప్పగూడదంట. ఎప్పుడో విన్నవి గుర్తుకు తెచ్చుకొని చెప్పాలంట"

"మీ టీచర్ పిచ్చిగానీ... ఎవరికి గుర్తుంటాయమ్మా ఆ తిక్క కథలన్నీ... ఐనా మీ టీచర్‌కి ఇంతకన్నా మంచి ప్రాజెక్ట్ దొరకలేదా ఏంటి? నేనొచ్చి మాట్లాడ్తాలే" అన్నాడు.

"అంటే నీకు ఒక్కటిగూడా రాదా నాన్నా" నిరుత్సాహంగా ప్రశ్నించింది.

"లేదమ్మా... ఏదో మా చిన్నప్పుడు ఒకటి రెండు వినింటి. కొన్ని చదువుకొనింటి. కానీ ఇప్పుడు అవేమీ గుర్తులేవు."

మంజు నిరాశగా అక్కడి నుంచి బైటికొచ్చేసింది.

అన్నం తిని వాటి గురించే ఆలోచిస్తూ అలాగే నిద్రపోయింది. రాత్రంతా ఏవేవో కలలు. కథలు వింటున్నట్లు, చెబుతున్నట్లు, మధ్యలో మరిచిపోతున్నట్లు...

మర్నాడు బడికి వెళ్ళాక కనపడిన స్నేహితులను, స్నేహితురాళ్ళను, సీనియర్లను, జూనియర్లను అందరినీ అడిగింది.

"ఏమోనే... ఈ పాఠాలు బైహార్ట్ చేసి అప్పజెప్పడానికే సమయం సరిపోవడం లేదు. ఎప్పుడన్నా

ఏమన్నా కొంచెం సమయం మిగిలితే ఇంటర్నెట్‌లో మెయిల్స్ చెక్ చేసుకోవడం, చాటింగ్ చేయడం, గేమ్స్, టీవీ, సినిమాలు చూడ్డంతోనే సరిపోతోంది. కథలు చెప్పమని మేమెప్పుడూ ఎవరినీ అడగలేదు. చెబుతామని మా దగ్గరకీ ఎవరూ రాలేదు" అన్నారు అందరూ.

లాభం లేదనుకొని వాళ్ళ క్లాస్‌టీచర్‌ను కలిసింది. ఆమె వయసు అరవై పైన్నే ఉంటుంది. రిటైరయినా ఆమెకున్న సబ్జెక్టు చూసి ఇక్కడ తీసుకున్నారు. ఆమె నవ్వుతూ "మేం చిన్నగున్నప్పుడు టీచర్లు తరగతి గదుల్లో అప్పుడప్పుడు కథలు చెబుతుండేవాళ్ళు. కథలు చెప్పడానికి, చదవడానికి టైంటేబుల్లో పీరియడ్లు గూడా కేటాయించేవాళ్ళు. కానీ ఈ ప్రయివేటు బళ్ళలో ర్యాంకులు, మార్కుల పోటీల్లో అవన్నీ అటకెక్కినాయి. ఉద్యోగంలో చేరిన కొత్తలో నేను గూడా అప్పుడప్పుడు సందర్భానికి తగినట్లు కథలు చెప్పేదాన్ని. కానీ ఒకరోజు మా పై అధికారి పిలిపించి... ఏమ్మా... క్లాసులో పాఠాలు చెప్పమంటే కథలూ, కాకరకాయలూ చెప్పి పిల్లలని గబ్బులేపుతున్నావంట. నీకు జీతమిస్తున్నది అందుక్కాదు. జాగ్రత్త. మార్కులు తక్కువొస్తే బాగుండదు అని హెచ్చరించాడు. ఆ తర్వాత నా మనసులో సబ్జెక్టు తప్ప ఏమీ మిగలలేదు. ఆఖరికి ఉత్తమ ఉపాధ్యాయినిగా రాష్ట్రస్థాయిలో అవార్డు గూడా అందుకున్నాను" అంది నిట్టూరుస్తూ.

మంజుకి ఏం చేయాలో అర్థం కాలేదు. అంతలో ఒక స్నేహితురాలు పక్కకి పిలిచి "మంజూ... గ్రంథాలయమని టౌన్లో కొండారెడ్డి బురుజు దగ్గర ఉంటాదంట. అక్కడన్నీ పుస్తకాలేనంట. వాటిని చదవడానికి చాలామంది వస్తుంటారంట. అక్కడికి పోతే..." అంది. మంజుకి ఆ ఆలోచన నచ్చింది. సాయంత్రం అక్కడికి చేరుకుంది.

గ్రంథాలయం చాలా విశాలంగా ఉంది. ముందు ఒక పెద్దగది ఉంది. దానిలో కొందరు కూర్చుని దినపత్రికలు తిరగేస్తున్నారు. లోపలి గదుల్లోకి అడుగుపెట్టింది. వేలకొద్దీ పుస్తకాలు ర్యాకులలో వరుసగా కిందామీదా సర్ది ఉన్నాయి. గది చాలా నిశ్శబ్దంగా ఉంది. తన అడుగుల శబ్దం తనకే వినబడుతూ వుంది. చుట్టూ చూసింది. ఎవరూ లేరు. నవలలు, కవిత్వం, శాస్త్రగ్రంథాలు... ఇలా ఒక్కొక్క విభాగమే దాటుతూ కథల దగ్గరకు చేరుకుంది. అక్కడ పుస్తకాలు ఎన్నో రోజుల నుంచి ఎవరూ కదపక దుమ్ము పేరుకుపోయున్నాయి. లైబ్రేరియన్ ఆశ్చర్యంగా తననే చూస్తున్నాడు.

"ఏమమ్మా... ఇలా వచ్చావు. ముందు గదిలో నీకు కావాల్సినవి ఉన్నాయి చూడు" అన్నాడు.

"అది కాదంకుల్... ఇక్కడికెవరూ రారా"

"చాలా తక్కువమ్మా... ఇప్పుడు సమాచారమంతా నెట్‌లో క్షణాల్లో దొరికిపోతుంది గదా... ఇక్కడ ఇంకేం పని? ఎవరో పరిశోధకులు మాత్రం అప్పుడప్పుడూ వస్తుంటారు. ఇంతకూ నీకేం పని?"

"ఎవరైనా ఇక్కడ కథలు చదివేవాళ్ళు కనపడ్తారేమోనని..."

"కథలా..." అంటూ గట్టిగా నవ్వి "ఇప్పుడిక్కడ అవన్నీ ఎవరు చదువుతున్నారమ్మా... మేము

గూడా వాటిని కొనడం మానేసి కెరీర్ గైడ్స్, వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మికం, వివిధ పోటీ పరీక్షల మ్యాగజైన్లు తెప్పిస్తున్నాం"

"పోనీ మీకేమైనా కథలొచ్చా అంకుల్"

"నాకా..." అంటూ ఇంకా పెద్దగా నవ్వేస్తూ "నా ఉద్యోగం పుస్తకాలు పేర్చడమే తప్ప చదవడం కాదమ్మా" అన్నాడు.

మంజు ఒక్క నిమిషం అక్కడున్న వేలకొద్దీ పుస్తకాలను పరికించి చూసింది. ఆమెకు అవన్నీ శ్మశానంలో పేర్చబడ్డ శవాల్లా కనిపించాయి.నిరాశగా గ్రంథాలయం నుంచి వెనుదిరిగింది.

కథలు ఎక్కడ దొరుకుతాయో, ఎవరు చెబుతారో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. ముసిలోళ్ళనడిగితే "తెలుసుగానీ... ఇంతకాలం... ఎవరూ అడగక... ఎప్పుడూ చెప్పక... మరిచిపోయామమ్మా" అంటున్నారు. పిల్లలనడిగితే 'అస్సలు తెలీదు. ఆ మాటే ఎప్పుడూ వినలేదు' అంటున్నారు. పెద్దవాళ్ళనడిగితే "నీకేం పనిలేదా... చదువుకోక" అంటూ కసురుకుంటున్నారు. తెలిసిన ప్రతి ఇంటి తలుపూ కొట్టింది. లాభం లేకపోయింది. ఎవర్నడిగినా మాకు తెలీదంటే మాకు తెలీదన్నారు.

మంజుకు ఇప్పుడు రోజూ బుల్లిదెయ్యం ధ్యాసే. దానికిచ్చిన మాట గుర్తుకు వచ్చినప్పుడల్లా మనసంతా దిగులు ఆవరిస్తుంది.

ఒకరోజు రాత్రి ట్యూషన్ పూర్తి కాగానే సంచి తగిలించుకొని మౌనంగా నడవసాగింది. అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా ఉంది. చెట్టు దగ్గర పడుతున్న కొద్దీ కళ్ళల్లో నీళ్ళు తిరగసాగాయి. ఏడుపును ఆపుకుంటూ చెట్టు దగ్గరికి వచ్చింది.

పైనుండి బుల్లిదెయ్యం కిందకు దిగొచ్చి "మంజూ... కథ దొరికిందా?" అంటూ ఆశగా అడిగింది.

ఏం చెప్పాలో తెలియక మంజు దిగులుగా తల వంచుకుంది. బుల్లి దెయ్యానికి విషయం అర్థమైపోయి ముఖమంతా విచారం కమ్ముకుంది.

ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక పోయినందుకు మంజుకు చాలా బాధగా ఉంది. ఒక్కకథ దొరికింటే ఎంత బాగుండు అనిపించింది. అంతలో మంజుకు ఏడుపు వినిపించి తలెత్తింది.

బుల్లి దెయ్యం రెండు చేతుల్లోనూ ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది. దాని కళ్ళలో నీళ్ళు కారిపోతున్నాయి. అది చూడగానే మంజుకు కూడా ఒక్కసారిగా దుఃఖం తన్నుకు వచ్చింది. తమాయించుకుంటూ బుల్లిదెయ్యాన్ని హృదయానికి హత్తుకుంది. కళ్ళనీళ్ళు తుడుస్తూ "అసలు... నీ పేరేమిటి? ఎందుకిలా అయ్యావు" అని అడిగింది. పిల్లదెయ్యం తన కథ చెప్పడం ప్రారంభించింది.

"నా పేరు కావ్య. మాది కూడా ఈ ఊరే. రోజూ పొద్దున్నే లేవడం, మ్యూజిక్ ఛానల్ పెట్టుకోవడం, అది చూస్తూనే టిఫిన్ తినడం, తయారు కావడం, బడికి పోవడం, పాఠాలు బైహార్ట్

చేయడం, ట్యూషన్‌కి వెళ్ళడం... ఇంటికి రాగానే హోంవర్కు... మళ్ళీ టీవీ ముందుకు చేరడం... చూస్తూ చూస్తూ అన్నం తినడం, అలాగే పడుకోవడం. ఆదివారం గూడా క్లాసులుండేవి. లేకుంటే నెట్‌లో గేమ్స్, సినిమాలు, ఛాటింగులు.

ఒకసారి మా ఇంటికి మా అమ్మమ్మ వచ్చింది. వాళ్ళది ఆదోని దగ్గర బస్సు కూడా లేని చిన్న పల్లెటూరు. అక్కడే సొంతింట్లో తాతయ్య, అమ్మమ్మ ఉంటారు. ఆమెకు డెబ్బైయేళ్ళుంటాయి. తన పనులన్నీ తానే చేసుకుంటుంది. అమ్మమ్మ ఎప్పుడొచ్చినా మేం పెద్దగా పలకరించింది లేదు. ఏమ్మా అంటే ఏమ్మా అంతే... నన్ను వారం నుండి గమనిస్తున్న మా అమ్మమ్మ ఒకరోజు నాతో "ఏందే... ఒక అచ్చటా లేదు. ముచ్చటా లేదు. గానుగెద్దు మాదిరి ఎప్పుడూ ఆ టీవీ ముందో, కంప్యూటర్ ముందో, పుస్తకాల ముందో పడుంటావు. హాయిగా బైట పిల్లల్తో ఆడుకోవడమో, మంచి మంచి కథలు పెద్దవాళ్ళనడిగి వినడమో చేయొచ్చు గదా" అంది.

నాకా మాటలు విచిత్రంగా అనిపించాయి.

"కథలా... అంటే ఏంటివమ్మమ్మా..." అన్నాను.

ఆమె నన్ను దగ్గరకు తీసుకుంటూ "కథలంటే అదో అందమైన ప్రపంచమమ్మా. లోకంలోని ఆనందాలన్నీ అందులోనే ఉంటాయి. మేం చిన్నగున్నప్పుడు లేస్తే కథ. కూర్చుంటే కథ. పనులకి పోయేటప్పుడు కూడా ఎవరో ఒకరు కథ ఎత్తుకునేవాళ్ళు. మైళ్ళకు మైళ్ళు నడిచినా దూరం తెలిసేది కాదు. ఎంతటి పనైనా ఏ మాత్రం కష్టమనిపించేది కాదు. ఊ కొడతా అలా సాగిపోయే వాళ్ళం. చీకటి పడితే చాలు పిల్లలమంతా ఎవరో ఒకరి దగ్గర ఒదిగిపోయేవాళ్ళం. వాళ్ళు ఆకూ వక్కా నములా... వూరిస్తా... వూరిస్తా... తియ్యని చెరుకురసం నోట్లో పోసినట్లు... కమ్మగా కథ చెబుతా వుంటే... వింటా... వింటా... అక్కన్నే నిదురపోయేవాళ్ళం. బళ్ళలో పంతుళ్ళు గూడా కథలు చెప్పడంలో పోటీ పడేటోళ్ళు. తెలుగు పంతులైతే చెప్పాల్సిన అవసరమే లేదు. నోటి నిండా కథలే...

దేవతలూ, దెయ్యాలూ... రాజులూ, రాక్షసులూ... మంత్రాలూ, మాయలూ... నీతులూ, నవ్వులూ... భలేగుండేవి ఆ కథలు. ఆకాశంలో, పాతాళంలో విహరిస్తూ, ఇంద్ర ధనుస్సులను తాకుతూ, రెక్కల గుర్రాలపై గంతులేస్తూ, ఏడు తలల నాగుబాములతో తలబడుతూ, ఒంటి కంటి రాక్షసులను సంహరిస్తూ, మాంత్రికులను బురిడీ కొట్టిస్తూ, మంచిని గెలిపిస్తూ... అబ్బా అవి వినాలేగానీ ఇట్లా చెబితే ఆ ఆనందం అర్థం కాదమ్మా.

అమ్మ ఒడిలో పడుకొని వెచ్చగా పాలు తాగినట్లు, ఎండాకాలంలో వేపమాను కింద చేరి చల్లని గాలిలో ఉయ్యాలలూగినట్లు, పండగరోజున తియ్యని పూర్ణం కజ్జికాయను నోట్లో పెట్టుకొని తనివితీరా నమిలినట్లు... నేను చెప్పలేనే. ఆ ఆనందమే వేరు" అంది.

దాంతో నాకు కూడా ఆ కథలు ఒక్కసారి వినాలనిపించింది. అమ్మమ్మతో అంతసేపు ఎప్పుడూ గడపలేదు. వెంటనే అమ్మమ్మకు మరింత దగ్గరగా జరిగి "అయితే నాకు కూడా ఒక కథ చెప్పు

అమ్మమ్మా... వింటా" అన్నాను.

"సరే, చెప్తాలే... కానీ ఈ రోజు బాగా పొద్దుపోయింది గదా... రేపు సాయంత్రం ఆ చెత్త టీవీ చూడకుండా బడయిపోగానే నా దగ్గరికి రా" అంది.

తరువాత రోజు శనివారం. హాఫ్‌డే స్కూల్. పొద్దున్నే లేశా. అమ్మమ్మ ఇంకా లేవలేదు. తొందరగా తయారయి ఏడుకంతా బైటపడ్డా. బళ్ళో అందరికీ అమ్మమ్మ గురించి, ఆమె చెప్పబోయే కథల గురించి చెప్పా. అందరూ సోమవారం ఆ కథలన్నీ తమకు కూడా చెప్పాలని ప్రామిస్ చేయించుకున్నారు.

మధ్యాహ్నం బడయిపోగానే పరిగెత్తుకుంటూ ఇంటికి చేరుకున్నాను. ఇంటి ముందంతా బంధువులు, నాన్న స్నేహితులు. లోపల ఏడుపులు. ఏమీ అర్థం కాలేదు. బెరుకు బెరుకుగా లోపలికి అడుగుపెట్టాను. వరండాలో అమ్మమ్మ కింద పడుకొని వుంది. కళ్ళు మూసుకొని వున్నాయి. ముక్కులో దూది ఉంది. తల వెనుక దీపం వెలుగుతూ వుంది.

"రాత్రి నిద్దురలోనే పోయింది. పొద్దున ఎంతసేపటికీ లేవకపోతే" నాన్న ఎవరికో చెబుతూ ఉన్నాడు.

అలా... ఆరోజు నుంచి కథ వినాలనే కోరిక నెరవేరలేదు. అమ్మను, నాన్నను, ఎదురింటోళ్ళను, పక్కింటోళ్ళను... ఎందరినో... అడిగీ... అడిగీ... అలసిపోయా.

అన్నం తినబుద్ధి కాలేదు. నీళ్ళు తాగబుద్ధి కాలేదు. ఒక్క కథ... ఒక్క కథ... అంటూ నిద్రలో కూడా కలవరించసాగానట... అమ్మా, నాన్నా... నన్ను చూసి తల్లడిల్లిపోయారు. ఏవేవో బుక్కులు తెచ్చి చదివి వినిపించసాగారు. ఎవరెవరినో పిలిపించి కథలు చెప్పించసాగారు. కానీ... వాళ్ళ మాటలలో జీవం లేదు. వాళ్ళ ముఖాల్లో కథ చెబుతున్న ఆనందం లేదు. దాంతో... మా అమ్మమ్మ వర్ణించినట్టు కమ్మని అమ్మపాల వంటి అద్భుతమైన కథ వెంటనే ఏదీ నాకు దొరకలేదు. చివరికి ఒకరోజు వర్షంలో బాగా తడవడం వల్ల న్యుమోనియా వచ్చి చనిపోయాను. కథ వినాలనే నా కోరిక మాత్రం తీరలేదు" అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ మంజు ఒళ్ళో ఒదిగిపోయింది.

"నీ కోరిక తప్పకుండా తీరుతుంది కావ్యా... నీ కోసం తప్పకుండా మంచి కథని ఎలాగైనా విని, దాన్ని నీకు వినిపించి నీకు విమోచన కల్గిస్తాను. నీ కథని అందరికీ చెబుతా. నీ కథ విన్నవాళ్ళు వాళ్ళ పిల్లలకు చెప్పడానికైనా కథల్ని నేర్చుకుంటారు...." కావ్యని తన గుండెలకు మరింతగా హత్తుకుంటూ చెప్పింది మంజు.

**ఆదివారం ఆంధ్రజ్యోతి – 25 ఏప్రిల్, 2010**

# సత్వర న్యాయం

"చూడు... ఇప్పుడు లక్షిస్తా... మిగతా లక్ష వచ్చే సంవత్సరమిస్తా... వడ్డీ గిడ్డీ నా చాతగాదు. ఇష్టమైతే తీస్కో... లేదంటేల్యా" ఇక మాట్లాడేదేమీ లేదన్నట్లుగా జనార్దన్నాయుడు తేల్చి పారేశాడు. ఆ మాటలకు కిషోర్ శరీరం సన్నగా వణికింది. కోపం కట్టలు తెంచుకోసాగింది.

"వడ్డీ వదిలెయ్యడానికి ఇక్కడ డబ్బులు మాకేం పూకెరాలా. నెలాగాదూ రెన్నెళ్ళూ గాదు. రెండు సంవత్సరాలు దాటిపాయ... ఒక్కపైసా కూడా కట్టలా. రేపు మాపు మొత్తం ఇచ్చేస్తానంటూ తిప్పితివి. అవతల మా బామ్మర్ది దగ్గర వడ్డీకి అప్పు తెచ్చుకున్నా. మర్యాదగా అసలూ వడ్డీ ఇచ్చేయ్. లేకుంటే బాగుండదు" అన్నాడు.

జనార్దన్నాయుడు సోఫాలో వెనక్కి వాలి కూర్చుంటూ నిర్లక్ష్యంగా "చూడు... నువ్ మాటిమాటికీ డబ్బుల్డబ్బులంటూ మా యింటి చుట్టూ తిరగడం ఏం బాలేదు. వుంటే అడగాల్నా. ఇసిరి పాడేస్తుంటి. అసలే యాపారం దెబ్బతిని నేనేడుస్తుంటే మధ్యలో రోజూ నీ సోదొకటి... నువ్వేం చేస్కుంటావో చేస్కో నే చెప్పేది చెప్పా... అంతే..." అన్నాడు.

కిషోర్ కోపంగా పైకి లేచి "ఇక్కడెవరైనా చెవిలో పూలు పెట్టుకోనున్నారనుకుంటున్నావా.. యాపారాలు బాలేకపోతే రెన్నెళ్ళ కిందట కొత్తపేట్లో ఆరులక్షలు పెట్టి ఇండ్లెట్లా కొన్నావ్. నెలనెలా వడ్డీ ఇంటికి తెచ్చిస్తానని కాళ్ళా వేళ్ళా బడితే... మంచోనివని నమ్మి దాచుకున్న డబ్బంతా నీ చేతుల్లో పోస్తి. ఇప్పుడేమో నీ ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నావ్. మనిషి పుట్టుక పుట్నాక కాస్తన్నా సిగ్గూ శరమూ వుండాల" రొప్పుతూ గట్టిగా అర్చాడు.

జనార్దన్నాయుడు ఒక్కుదుటున సోఫా మీద నుండి పైకిలేచి "ఏందివై... ఎక్కువ తక్కువ మాట్లాడ్తున్నావ్.. అవ్ కొన్నా. ఐతే ఏంటంట. ఇదిగో... అసలు ఒక్కపైసా కూడా కట్టను. నీ దిక్కున్న చోట చెప్పుకోపో. ఇంగోసారి ఈ యింటి గడప తొక్కినావనుకో మెడ పట్టుకోని దొబ్బుతా... ఏమనుకుంటున్నావో" అంగీ మడుస్తూ బెదిరించాడు.

ఆ మాటలకు కిషోర్ "దారా... దొబ్బుదురా... కొడకా... నాడబ్బులు నూకేసింది గాక మళ్ళా నన్నే దొబ్బుతానంటావా. ఈడేం అంత చాతగానోళ్ళున్నారనుకుంటున్నావా" అంటూ ఒక్కుదుటున

లేచి జనార్ధన్నాయుని అంగీ పట్టుకున్నాడు.

జనార్ధన్నాయుడు ఒక్కసారిగా చేతుల్ని విదిల్చి బలాన్నంతా ప్రయోగించి కిషోర్‌ని విసురుగా ఒక్కదొబ్బు దొబ్బాడు. బక్కపలుచగా వున్న కిషోర్ దభీమని వెనక్కి పడిపోయాడు. అంతలో జనార్ధన్నాయుని కొడుకులు ఇంట్లోంచి బైటకొచ్చి లేవబోతున్న కిషోర్ రెండు రెక్కలు పట్టుకొని విసురుగా పైకిలేపి ఇంటి బైటకు దొబ్బి తలుపులేశారు. కిషోర్ ఆవేశంతో, అవమానంతో రగిలిపోయాడు. ఇంటిబైటే నిలబడి నోటికొచ్చిన తిట్లన్నీ చుట్టుపక్కలోళ్ళందర్కీ వినబడేటట్లు గట్టిగా తిట్టసాగాడు. వాళ్ళంతా ఇది చాలా మామూలు వ్యవహారమే అన్నట్లు పట్టిచ్చుకోలేదు. కాసేపటికి కిషోర్ ఆవేశం కాస్త తగ్గింది. అక్కడ వుండి లాభం లేదనుకోని నెమ్మదిగా, నీరసంగా అడుగులు వేస్తూ ఇంటివైపుకి బైలుదేరాడు.

కిషోర్ మనసు ఆవేశంతో రగిలిపోతా వుంది. బాధతో దుఃఖం తన్నుకోని రాసాగింది. పిడికిళ్ళు మాటిమాటికీ బిగుసుకుంటున్నాయ్. పెదాలు వణుకుతూ వున్నాయ్. పదే పదే జనార్ధన్నాయుని రూపం మనసులో మెదలసాగింది. ఆలోచనలు సుళ్ళు తిరగసాగాయ్.

పదివేలూగాదు.... ఇరవైవేలూ గాదు... రెండు లక్షలు... ఎన్ని సంవత్సరాలుగా కోరికలను చంపుకొని దాచిన డబ్బు. చిన్నోడెన్ని సార్లు "నాన్నా ఓ సైకిల్ కొనివ్వు" అనడిగినా కొనియ్లా. ఎండాకాలం ఫ్రిజ్ కొనమని భార్యాపిల్లలు ఎంత పోరుపెట్టినా పట్టిచ్చుకోలా. సొంత ఇంటి కోసం.... పైసా పైసా దాచి... తినీ తినక కూడబెడ్తే... 'వడ్డీ గిడ్డీ జాన్తానై' ఎంత తేలిగ్గా అనేశాడు.

అసలిలాంటోన్ని నమ్మడం నాదే తప్పు. చెప్పుచ్చుకోని కొట్టుకోవాల. ఆడికీ అందరూ చెప్తూనే వున్నారు. కాలాలసలే బాగాలేవు. బ్యాంక్లో వేసుకో అని. ఏమిస్తారు బ్యాంక్లో... ఈడ్చికొడ్తే 75 పైసల్రాదు. రోజురోజుకీ వడ్డీ తగ్గిపోతోంది.

నేనేమైనా ఐదుకిస్తినా... పదికిస్తినా...ఆఫ్ట్రాల్ రెండ్రూపాయలు. ధర్మవడ్డీ. ఈ రోజుల్లో రెండ్రూపాయలక్కూడా ఎవడిస్తున్నాడు. అదీ ఎంటపడ్తేనే గదా ఇచ్చింది. తీసుకునేటప్పుడు అనా... అకా... అంటూ... ఇంటి చుట్టూ తిరుగుతూ... ఎన్ని మాటలు... ఎంత వినయం... నమ్మి ఇస్తే ఆర్నెల్లంటే ఆర్నెల్లు కూడా వడ్డీ కట్టలా. ఆఖరికి అంగీ పట్టుకోని... ఛఛ... పిల్చి తన్నిచ్చుకోవడమంటే ఇదేనేమో... అసలిలాంటి నా కొడుకుల్ని నడిరోడ్డు మీద కాల్చిపాడేసినా తప్పులేదు.

ఇంటి చుట్టుపక్కల ఒక్కడన్నా బైటకొచ్చి ఇదన్యాయమంటాడా... ఎవరి సంగతి వాళ్ళదే. ఇంకో మూన్నెళ్ళు దాటితే... బాండు టైం కూడా పూర్తయిపోతాది. నాలుక గీసుకోడానిక్కూడా పనికిరాదప్పుడు. లాభం లేదు. ఏదో ఒకటి చేయాల... తొందరపడాల... అవతల బామ్మర్దికి వడ్డీ కట్టక అప్పు పెరుగుతా వుంది.

"నీ దిక్కున్న చోట చెప్పుకో" ఎంత ధైర్యం వానికి. నేనేమీ చేయలేననే కదా వాని నమ్మకం. కానీ కోర్టులు.. చట్టాలు.. నాలాంటోళ్ళ కోసమే గదా వుండేది. ఎట్లా తప్పిచ్చుకోని పోతాడు. లాయర్ నోటీసిప్పిస్తే తెలుస్తాది ఈ కిషోర్ అంటే ఏమిటో. కోర్టుకి లాగి బోన్లో నిలబెడ్తే అప్పుడు... అప్పుడు..

బుద్దొస్తాది నా కొడుక్కి.

కిషోర్ కాళ్ళు అప్రయత్నంగా చిన్ననాటి స్నేహితుడు శ్యాం ఇంటివైపు తిరిగాయి. ఆలోచనల్లోనే ఐశ్వర్యా అపార్టుమెంటొచ్చింది. రెండంతస్తులు నెమ్మదిగా ఎక్కి నెంబరు 104 కి చేరుకున్నాడు. "శ్యాం" అడ్వకేట్ అనే బోర్డు కనబడతా వుంది. కాలింగ్ బెల్ నొక్కాడు. ఓ నిమిషానికి తలుపు తెరుచుకొనింది. కిషోర్‌ని చూస్తానే "ఏరా... చాన్రోజులకొచ్చావ్... ఇన్నాళ్ళకు గుర్తుకొచ్చామా... దా... దా..." అంటూ లోపలికి ఆహ్వానించాడు.

కిషోర్ సోఫాలో కూలబడ్డాడు. కాసేపటికి టీ వచ్చింది. తాగుతూ జరిగిందంతా పూసగుచ్చినట్టు వివరించాడు.

శ్యాం ఓ ఐదు నిముషాలు ఆలోచించి అన్నాడు.

"సరే... లాయర్ నోటీసిద్దాం. కానీ వాడిస్తాడనే నమ్మకమైతే నాకు లేదు. కోర్టంటే తెల్సుగదా... ఎంత చెత్త లాయరైనా దీన్ని సులభంగా మూడు నాలుగు సంవత్సరాలు లాగగలుగుతాడు. లూప్ హోల్స్ లెక్కలేనన్ని వుంటాయి. కింది కోర్టులో గెలిస్తే పై కోర్టుకి... పై కోర్టులో గెలిస్తే సుప్రీం కోర్టుకి... కేసు సాగుతూనే వుంటుంది. నేనో సలహా యిస్తా. ఆలోచించు. ఫ్యాక్షన్ లీడర్ గంగాధర్ రెడ్డి తెల్సుగదా. అదే మన ఎమ్మెల్యే తమ్ముడు. ఆయన దగ్గరకు వెళ్దాం. కేసు నిమిషాల్మీద తెగుతాది. కోర్టులుండవ్. తిరుగుళ్ళుండవ్. ఏమంటావ్"

ఆ మాటలకు కిషోర్ ఆలోచనలో పడ్డాడు. వాళ్ళ దగ్గరకు పోవాలంటే భయమేసింది. నసుగుతూ "కోర్టులోనే వేద్దాంలే... ఓడిపోయేదేం లేదు గదా" అన్నాడు.

శ్యాం చిరునవ్వు నవ్వి "ఇటువంటి కేసు ఓడిపోవడమంటూ ఎప్పుడూ జరగదు. ఖచ్చితంగా గెలుస్తాం. కానీ అవతలోడు ఉద్యోగి కాదు. వ్యాపారి. ఏ క్షణంలోనైనా బోర్డు తిప్పేసి ఐ.పి. పెట్టొచ్చు. ఎవరమూ ఏమీ చేయలేం. ఈ లా వుందే ఇది గాడిదలాంటిది. అంతవరకూ మన పక్కనున్న చట్టం నిమిషాల్మీద వాని పక్కకు తిరుగుతాది. ఓ సంవత్సరం తర్వాత వాడు మళ్ళా దర్జాగా మన ముందే బండ్ల మీద తిరుగుతుంటాడు. మనం దద్దమ్మల్లా బికారులమై నోరెళ్ళబెట్టుకోని చూస్తుంటాం. కసితో రగిలిపోతుంటాం. కానీ ఏం చేయలేం" అన్నాడు.

కిషోర్‌కి ఆ మాటల్తో ఒళ్ళంతా చల్లబడింది. జనార్ధన్నాయుడు ఐ.పి. పెడ్తే అనే ఊహొచ్చి వణికిపోయాడు. అంతలో శ్యాం మరలా కొనసాగించాడు.

"సుబ్రమణ్యమని ఆదోనిలో మా బంధువొకాయనున్నాడ్లే. సుంకన్న అనేటోనికి అప్పిచ్చాడు. వాడు తిప్పుకోని తిప్పుకోని ఆఖరికి బోర్డు తిప్పేసి ఐ.పి. పెట్టాడు. ఏం చేస్తాడు పాపం. నోర్మూసుకున్నాడు. కానీ సంవత్సరానికే వాడు కొడుకు పేర్మీద రెండు చొప్పకటింగ్ మిషన్లు కొనుక్కొచ్చి యాపారం మొదలుపెట్నాడు. తీసుకున్న అప్పు తీర్చమంటే నా దగ్గరేం లేదన్నాడు. గొడవ జరిగితే వాని మీదే క్రిమినల్ కేసు పెట్టాడు. వాడు ఏడుపు ముఖం పెట్టుకోని నా దగ్గరకు వచ్చాడు. కోర్టులో

ఇవి నడ్చవ్. డైరెక్టుగా గంగాధర్ రెడ్డి దగ్గరకు తీసుకెళ్ళా. కేసు వారంలో తెగింది. కిందా పైనా మూసుకోని చెప్పిన డేట్‌కి తెచ్చిచ్చాడు".

ఆ మాటలినగానే కిషోర్‌కి మనసంతా సంతృప్తిగా అనిపించింది. అంతలో ఓ సందేహం వచ్చింది. "కానీ వాళ్ళు వూరికే ఎందుకు తెంచుతారు. భారీగా ఇచ్చుకోవాల్సి వస్తాదేమో" అన్నాడు.

శ్యాం సోఫా నుంచి ముందుకు వంగి "నిజమే... ఇవ్వాల్సి వుంటాది. వాళ్ళేం ప్రజాసేవ కోసమో, పేదప్రజల మీద ప్రేమతోనో కాదు గదా ఇట్లాంటి రిస్కులు తీసుకునేది. వాళ్ళ ఆదాయ మార్గాల్లో ఇదీ ఒకటి. కానీ... నీదేం చిన్న మొత్తం గాదు. రెండు లక్షలు. వడ్డీ రాక రెండు సంవత్సరాలు దాటింది. అది లెక్కేస్తే మూల్లక్షలు. మనం కేసు పెట్టాలంటే ముందు లాయర్ నోటీసివ్వాల. కొన్ని నెలలు సమాధానం కోసం ఎదురుచూడాల. ఆ తర్వాత కోర్టులో సూట్ ఫైల్ చేయాల.

వాయిదాల మీద వాయిదాలు పడుతూనే వుంటాయ్. కాలం గిర్రున తిరుగుతూనే వుంటాది. నువ్వు నీ బామ్మర్ది దగ్గర తెచ్చుకున్న అప్పు కొండలాగా పెరుగుతూనే వుంటాది. కానీ... కోర్టులోనేమో... నువ్వు సూట్ ఫైల్ చేసిన రోజు వరకు మాత్రమే బాండ్లో రాసుకున్నట్టు రెండ్రూపాయల వడ్డీ వస్తాది. ఆ తర్వాత కేస్ తెగేంతవరకూ పట్టే సమయానికి కేవలం అర్ధరూపాయ వడ్డీ ఏస్తాడు. బ్యాంకు కన్నా తక్కువ. కేసు ఎంత ఆలస్యమయితే నువ్వంత నష్టపోతావ్. దానికి తోడు కోర్టు ఫీజులు ముందే కట్టాల. వాదించినందుకు లాయర్‌కు ఫీజివ్వాల. ఓ పక్క మానసిక వేదన. ఈ సావంతా సచ్చే బదులు నువ్ నష్టపోయే డబ్బేదో వీని మొఖాన కొట్నావనుకో. కేసు నిమిషాల్మీద తెగుతాది. వాళ్ళ తీర్పుకి వాయిదాలుండవ్. సంవత్సరాల తరబడి చెత్త విచారణలుండవ్. అప్పీళ్ళుండవ్. చెప్పిన టైంకి చెప్పినట్టు డబ్బు నీ చేతుల్లో వాల్తాది. ఓ లాయరై వుండీ నేనెందుకిట్లా మాట్లాడ్తున్నాననే సందేహం నీకు రావచ్చు. కేసేస్తే నాకూ లాభమే. ఫీజొస్తాది. కానీ నువ్ నా క్లైయింట్‌వి కాదు. స్నేహితుడివి. ఏ కేసు ఏ కోర్టులో వేస్తే త్వరగా జడ్జిమెంటు వస్తాదో నాకు బాగా తెలుసు" అన్నాడు.

కిషోర్ కొద్ది క్షణాలు ఆలోచించాడు. మరలా ఓ సందేహం మొలకెత్తింది. "మనం పోయినాక అవతలోళ్ళు కూడా ఎవరన్నా బాగా తెల్సినోళ్ళను పిల్చుకొచ్చినారనుకో... మధ్యలో మనకే ఎసరు రావచ్చు గదా" అడిగాడు.

"అఫ్‌కోర్స్... కానీ అవి చాలా రేర్ కేసెస్. సామాన్యంగా వీళ్ళు ముందు ఎవడు తమను ఆశ్రయిస్తాడో వాళ్ళవైపే వుంటారు. అమాయకుల్నయితే అవతలోళ్ళతో మిలాఖతై అప్పుడప్పుడు ముంచేస్తూ వుంటారు. కానీ గంగాధర్ రెడ్డితో నాకు చాలా మంచి సంబంధాలున్నాయి. వాళ్ళ కేసులు చాలా వరకు నేనే చూస్తుంటా. ఈ విషయంలో నువ్వే మాత్రం భయపడనక్కర్లేదు. నేను పూచీ... సరేనా" అన్నాడు.

కిషోర్ లాభనష్టాలు బేరీజు వేసుకున్నాడు. సత్వర న్యాయానికి కోర్టుకన్నా. వీళ్ళ పంచాయితీ మేలనిపించింది. తప్పు చేసినోనిలా తలొంచుకోని కోర్టు ఆవరణలో పిలిచేంత వరకు బిక్కుబిక్కుమంటూ

నిలబడ్డం, సాక్షుల్ని బతిమాలుకోవడం, విచారణ ఎదుర్కోవడం, కేసు తెగేదాకా మానసిక వేదన, అభద్రతా భావం.. అన్నీ తప్పుతాయనిపించింది. కోర్టుకి వెళ్ళాలనే ఆలోచనను మనసులో నుండి పూర్తిగా తుడిచిపెట్టేశాడు. అంగీకార సూచకంగా తలూపాడు.

తరువాత రోజు పొద్దున్నే శ్యాం, కిషోర్ గంగాధర్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. లోపల ఏదో పంచాయితీ జరుగుతూ వున్నట్టుంది. శ్యాం లోపలికి వెళ్ళి వచ్చి "కాసేపాగు... పోదాం" అన్నాడు.

కిషోర్ బైటనే వేసి వున్న కుర్చీ మీద కూర్చుని తన వంతు కోసం ఎదురు చూడసాగాడు. ఇంటి ముందు అనేక మంది జనాలు. రకరకాల సమస్యలతో, న్యాయస్థానాలపై నమ్మకం కోల్పోయి... సత్వర న్యాయం కోసం.

**సాహిత్య ప్రస్థానం - అక్టోబర్, డిసెంబర్ - 2004**

# పచ్చి కరువు

ఏపుగా పెరిగిన పొగాకు నారకేసి చూస్తుంటే చంద్రయ్య గుండె తరుక్కుపోతుంది. పెండ్లాం బిడ్డలు మైలు దూరం నుంచి ఆపసోపాలు పడ్తా బోరింగ్ కాన్నించి బిందెల్తో నీళ్ళు తెచ్చి పోస్తా వున్నారు. రోడ్డు మీద గాలికి దుమ్ము ఎగిసెగిసి పడతా వుంది. కనుచూపు మేరలో ఎక్కడా పచ్చగడ్డి జాడే కనపడ్డంలేదు.

చంద్రయ్య నుదుటికి పట్టిన చెమట తుడ్చుకుంటూ తలెత్తి ఆకాశమొంక చూశాడు. ఒక్క మబ్బు తునకా కనబళ్లేదు. పెళ్లీడుకొచ్చిన బిడ్డ బిందెతో నారపై నీళ్ళు చిలకరిస్తా వుంటే గుండె పిండేసినట్లయింది. అంతలో ఊరి బైటి బీడుపొలం గుర్తుకొచ్చి కండ్లలో నీటిపొర కమ్ముకుంది.

'యవసాయం గుడ్డోని చేతిలో రాయిలా మారెగదా' అని నిట్టూర్చి జేబులోంచి బీడిముక్క తీసి ముట్టించాడు. పొగ గుప్పుగుప్పున వదుల్తూ నెమ్మదిగా ఆలోచనల్లోకి జారిపోయాడు.

రుతుపవనాలు ఈ యేడు ముందే మొదలవుతాయని టీవీలో వార్త విని రైతులు సంబరపడ్డారు. చంద్రయ్యకు పోయినేడు పత్తేస్తే చావు తప్పి కన్ను లొట్టపోయినంత పనైంది. అవ్వ వడికిన నూలు తాత మొలతాటికి సరిపోయినట్లు పెట్టిన కాడికి తిరిగి రావడమే గగనమైపోయింది. ఈసారైనా మంచి వానలు పడ్తే పిల్ల పెండ్లి చేసి యెళ్ళగొట్టుకోవాలనుకున్నాడు. తన పదెకరాలకుగాను మరో పదెకరాలు గుత్తకు తీసుకున్నాడు.

రైతులందరూ ఎదురు చూస్తున్నట్టుగానే తొలకరిలో బ్రహ్మాండమైన వానొచ్చింది. నేలతల్లి తడిసి ముద్దయింది. రైతుల ఒళ్ళు ఆనందంతో పులకరించింది గడాలు భుజాల మీదికెక్కాయి. ఎడ్లు ఒళ్ళు దులపరించుకోని ముందుకు సాగాయి. చంద్రయ్య కూలీల్ని పిలంపి, పెండ్లాం బిడ్డల్తో చేనులోకి దిగాడు. ఇరవై ఎకరాలూ చదును చేసి విత్తడానికి అనువుగా తయారుచేశాడు.

పొగాకు విత్తనాలు సుబ్బారెడ్డి దగ్గర అప్పు తెచ్చుకొని, మడులు కట్టి ఇంటికాన్నే ఖాళీ జాగాలో నార పెంచడం మొదలుపెట్టాడు. పదిరోజుల్లో భూమి నుంచి మొలకలు తలెత్తి చిరునవ్వులు చిందించాయి. నెమ్మదిగా ఒళ్ళు విరుచుకొని పైపైకెగసాగాయి.

చంద్రయ్య వాన కోసం ఎదురుచూడ్డం మొదలుపెట్టాడు. నెల గడిచింది. వాన రాలేదు. అప్పుడప్పుడు చిన్న చిన్న తుంపర్లొచ్చినా భూమి పైపొర కూడా తడవలేదు. నెమ్మదిగా బావుల్లో గంగింకిపోవడం మొదలైంది. భూమి నెర్రలు విచ్చుకోసాగింది. ఎనకయ్య పండగొచ్చింది. నీళ్ళ

కుంటలో నిమజ్జనమైపోయింది. జోకరయ్య వూరూరూ తిరిగి ఒట్టికుంటకు చేరుకున్నాడు. మాలపున్నమి గూడా దాటిపోయింది. కానీ వాన మాత్రం రాలేదు.

జనాలు దేవుళ్ళకు మొక్కుకోవడం మొదలుపెట్టారు. గుళ్ళో చెక్కభజనలు చేశారు. గంగమ్మకు పూజలు చేశారు. శివలింగంపై బిందెలకు బిందెలు నీళ్ళు పోశారు. రాత్రంతా జాగరణ చేస్తా విరాటపర్వం పద్దెనిమిది రోజులూ చెప్పించుకున్నారు. వూరిడ్చి బైలు పొలాల్లో వనభోజనాలు చేశారు. గోదురుకప్పను పళ్లెంలో పెట్టి ఈదీదీ తిప్పారు. వాన మాత్రం రాలేదు. మబ్బులు వచ్చినట్టే వస్తున్నాయ్. కమ్ముకుంటున్నాయ్. ఆశలు రేకెత్తిస్తున్నాయ్. వూరిస్తున్నాయ్. అంతలోనే గాలికి చెదిరిపోతూ దాగుడుమూతలాడుతున్నాయ్.

ట్రాక్టర్ శబ్దంతో చంద్రయ్య ఆలోచనల్లోంచి బైటకొచ్చాడు. నీళ్ళ డ్రమ్ముల్తో దుమ్ము లేపుకుంటూ శంకర్రెడ్డి ట్రాక్టరు చంద్రయ్యను దాటిపోయింది. అది దాటిపోయేంతవరకూ కనుచూపుమేర అలాగే చూడసాగాడు. నెమ్మదిగా మనసులో ఒక ఆలోచన మొలకెత్తింది. క్షణాల్లో మానుగా మారి వూడలు దిగింది. కాసేపు కిందామీదా పడి లెక్కలు వేసుకున్నాడు. ఒక నిర్ణయానికొచ్చి బీడీ ఆర్పేసి ఇంటికి చేరుకున్నాడు.

భార్య లక్ష్మమ్మ అన్నం చేస్తా వుంది.

మంచమ్మీద కూలబడి పెండ్లాం కేసి చూస్తూ "ఏమేవ్.... శంకర్రెడ్డి పారుమంచాల చెరువు నుంచి డ్రమ్ముల్తో నీళ్ళు తెప్పించి నాట్లేస్తున్నాడంట. మనమూ అట్లాగే చేద్దాం. ఇంకో వారం దాటే నారకు చెండొచ్చేస్తాది. ఎందుకూ కొరగాకుండా పోతాయ్. రేపు నార నాట్టానికి కూలీల్ని పిలు. నీళ్ళకత నేచూస్తా" అన్నాడు.

ఆ మాటింటానే లక్ష్మమ్మ అదిరిపడింది. గయ్యిన లేస్తా "ఏందయ్యోవ్... పులిని చూసి నక్క వాత బెట్టుకున్నట్టూ... ఆళ్ళంటే మారాజులు. ఏమైనా చేస్తారు. మనకూ ఆళ్ళకూ పోలికా... ఊరందరిదీ ఒక దారైతే వులిపిరి కట్టెది ఒక దారనీ... యేం మనమొక్కరమేనా... ఊళ్ళో చిన్న చిన్న రైతులందరూ గమ్మున ఆకాశమొంక చూస్తా ఉన్నారు. నార పోతే పోనియ్. మళ్ళా కొనుక్కోవచ్చు" అనింది.

అప్పటికే ఒక నిర్ణయానికొచ్చేసిన చంద్రయ్య పెండ్లాం మాటలు ఏ మాత్రం చెవిలోకి ఏస్కోలేదు.

"సేవ్... నువ్ కిందా పైనా మూస్కోని గమ్మున నే చెప్పిన పని చెప్పినట్టు చెయ్. మొగోన్ని నాకు తెలీదా. యేం చెయ్యాల్నో. కుండలో కూడు కుండలోనే ఉండాలి బిడ్డలు గుండ్రాయిల్లా ఉండాలి అంటే కుదుర్తాదా. ఈ వారం కాకపోయినా వచ్చేవారమన్నా ఖచ్చితంగా కురిసి తీర్తాది. దేముడేం గుడ్డోడు కాదు" అంటూ పనులు పురమాయించి సుబ్బారెడ్డి దగ్గరికి అప్పు కోసం బైలుదేరాడు.

సుబ్బారెడ్డి విషయం తెల్సుకోని కాసేపాలోచించి "నా మాటిను చంద్రయ్యా... ఇల్లలకగానే

పండుగ కాదు గదా.... కాలాలసలే బాగాలేవు. గడ్డపారలే గాలికె గిరి పోతుంటే గడ్డిపరకలు ఎగుర్లాడినట్లు యెందుకట్లా ఉరుకులాడ్తున్నావ్? ఇప్పటికే నీ అప్పు తడిసి మోపెడైంది. పోయిన సంవచ్చరమిచ్చిందానికి ఇంతవరకూ వడ్డీ గూడా జమెయ్యలేదు. మళ్ళా కొత్త అప్పంటున్నావ్... నువ్వు యాడికీ పోలేవనుకో. కానీ ఓ వారమాగు. చుట్టుపక్కల వూళ్ళన్నిట్లోనూ వాన పడ్తానే ఉంది. దేముడు కండ్లు తెరిచి చూడాల్నే గానీ ఎంతసేపు. నిమిషాల్లో కళకళలాడిపోతాది. నారదేముంది. పోతేపోనియ్. కొత్తది కొనుక్కోవచ్చు. నాట్నాక వానగాని ఆలస్యమైందనుకో... చేతులారా దుడ్లు మన్నులో పోసినట్లయితాది. కాస్త ఆలోచించు" సలహా యిచ్చాడు.

చంద్రయ్య అదేమీ పట్టిచ్చుకోకుండా "రెడ్డీ... గాడిదల్తో సేద్యం చేస్తా కాలితన్నులకు జడిస్తే ఎట్లా చెప్పు. నేనైతే నాట్లెయ్యాలని నిచ్చయం చేసుకున్నా. నార చచ్చినాక వానొస్తే మాత్రం కొత్త నార వూకె దొరుకుతాదా. ఇప్పటికే చాలా మందివి చెండ్లొచ్చేసి పనికి రాకుండా పోయినాయ్. అందరూ ఒక్కసారిగా ఎగబాక్తారు. తొక్కిసలాట పెరిగేకొద్దీ రేటు అమాంతం కొండెక్కి కూచుంటాది. తుమ్ముకుంటూ పోతే సొంఠి కూడా పిరమైనట్లు కూలీల రేట్లు కూడా ఎగిసెగిసిపడతాయ్. ఇప్పుడైతే సగం ధరకే వొస్తారు. అప్పుడు పెట్టే డబ్బేదో ఇప్పుడే నీళ్ళకు పెడ్దామనుకుంటున్నా. ఆకాశం చల్లగానే ఉంది. చెమ్మ కూడా తొందరగా ఆరిపోదు. అంతలోపు వానెలాగూ వచ్చేస్తాది" అంటూ పట్టుపట్టి చూపిచ్చిన చోట వేలిముద్రేసి అప్పు తెచ్చుకున్నాడు.

మర్నాడు పొద్దున్నే చంద్రయ్య నీళ్ళ డ్రమ్ముల్తో చేనుకి చేరుకున్నాడు. అప్పటికే లక్ష్మమ్మ నారకట్టల్తో, కూలీల్తో పొలంలో సిద్ధంగుంది. చేనుకి పూజ చేసి టెంకాయ కొట్టి పనిలోకి దిగారు. కూలీలు ఒకరు నీళ్ళు పోస్తా వుంటే మరొకరు చకచకా నాట్లేయసాగారు. లక్ష్మమ్మ దగ్గరుండి అజమాయిషీ చేయసాగింది. సాయంత్రం పొద్దుగూకే వేళకి నాటడం పూర్తయింది. చంద్రయ్య కూలీలకంతా డబ్బులు పంచి పంపిచ్చినాడు. గట్టు మీద నిలబడి తృప్తిగా ఒకసారి చూసుకొని పెండ్లాం బిడ్డలతో ఇంటికి చేరుకున్నాడు.దేవుని మీద భారమేసి ఆకాశమొంక చూడ్డం మొదలుపెట్టాడు.

నెమ్మదిగా వారం దాటిపోయింది. వాన రాలేదు. మొక్కలు సోలడం మొదలుపెట్టాయి. మళ్ళా ఒకసారి డ్రమ్ముల్తో నీళ్ళు తెప్పిచ్చి పోపిచ్చాడు. మోడాలు కనబడ్తున్నాయేగానీ వాన మాత్రం రావడం లేదు.

గుండె బిక్కు బిక్కుమనడం మొదలుపెట్టింది.

"థూథూ.... తప్పు చేస్తినేమో... పెండ్లాం బిడ్డలు నెత్తీనోరూ కొట్టుకున్నా వినకపోతి. సుబ్బారెడ్డి చెప్పినా చెవినేసుకోకపోతి. నాటి రెండువారాలైపాయ. వానదేముడేమో కనికరించడం లేదు. వడ్డీ డబ్బుల్తో ఎన్ని నీళ్ళని తెచ్చేది. అందరి మాదిరి గమ్మున కూకోక పెద్ద పాలెగాని లెక్క అతికం పని చేసినందుకు తగిన శాస్తే జరిగేటట్టుంది' అని గుంజాటన పడసాగాడు. నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ వూరి మధ్య రచ్చబండ కాడికి చేరుకోని అరుగు మీద కూలబన్నాడు.

కాసేపటికి ఓబులేసునాయుడు అటుగా వచ్చాడు. చంద్రయ్యను చూసి "ఏందిరోయ్... అట్లా కూలబన్నావ్... చేనెట్లా ఉంది" పలకరిస్తా పక్కన కూచున్నాడు.

"ఏం చెప్పమంటావ్‌లే నాయుడూ... కరువులో కవలపిల్లలు పుట్నట్లు పంటేమో వాడిపోతా ఉంది. వడ్డేమో పెరిగిపోతా ఉంది. దైర్నం చేయడమేమో చేస్తి గానీ ఇప్పుడు ఎందుకు చేస్తినా అని విచారిస్తున్నా. ఐనా ఈ బైలు పొలాన్ని నమ్ముకోవడమూ... గుడ్డోన్ని దారి చూపియ్యమనడమూ రెండూ ఒకటే. అటు పోయినేడు తెగించి సొసైటీ లోను తెచ్చి బోరింగేపిస్తే ఏమైందో తెల్సుగదా. పిల్లోడుచ్చ పోసినట్లు నీళ్ళు పన్నాయి. అది గూడా నాలుగు నెల్లే" జీరబోయిన గొంతుతో దిగాలుగా జవాబిచ్చాడు.

నాయుడు చంద్రయ్య భుజం తడ్తా "రోట్లో తల బెట్నాక రోకటి దెబ్బలకు జడిస్తే ఎట్లా చెప్పు చెంద్రయ్యా... మొన్న ఆత్మకూరులో మాంచి వానొచ్చి భూమి సితసితలాడిపోయిందంట. కూలీలు దొరక్క చుట్టుపక్కల వూరోళ్ళను అడిగినంతిచ్చి పిలిపిచ్చుకున్నారంట. అంతెందుకు పోయినారం శ్రీశైలంలో, ఆదోనిలో నీళ్ళు దోనెలెక్కి పారినాయ్. నందికొట్కూరులో నైతే మొక్కలు మోకాలంతెత్తు ఎదిగినాయ్. ఇంక మనూరే మిగిలింది. ఈరోజు గాకపోతే రేపు. ఖచ్చితంగా కుర్సి తీర్తాది. నువ్వేం దిగులు పెట్టుకోకు' అన్నాడు.

అంతలోనే దూరాన్నుండి వురుముల శబ్దం చిన్నగా చెవులను సోకింది. తలెత్తి చూస్తే పడమట నల్లని మొబ్బులు ముసురుకొని కనబన్నాయి.

ఓబులేసునాయుడు అట్టాగే చూస్తూ "నంద్యాలకెళ్ళి మోడాలు బ్రమ్మాండంగా దిగినాయ్. వాన చంపుకొంటున్నట్టుంది. పడమట పిసరంత మబ్బు పడ్తే పాతాళం దాకా వానంట. మనకు గూడా పన్నా పడ్తాది" అన్నాడు.

కాసేపటికే చల్లని గాలి వూరిని చుట్టుముట్టుకోని జనాలను ఆప్యాయంగా స్పర్శించింది. నెమ్మదిగా ఆకాశంలో మబ్బులు ముసురుకోసాగాయి. చంద్రయ్య ఆకాశమొంక చూస్తా "దేవుడా... కాస్త మమ్మల్ని గూడా దయ చూడు సామీ" అని మొక్కుకున్నాడు. ఇండ్లల్లో, హోటళ్ళలో ఉన్న రైతులందరూ వీధుల్లోకొచ్చి ఆశగా ఆకాశమొంక చూడసాగారు.

అంతలోనే ఈదురుగాలి రివ్వున పైకి లేచింది. "థూ... దీనమ్మ... ఈ గాలికి మబ్బులేం నిలబడ్తాయ్" ఒకడు తుపుక్కున వుమ్మేశాడు.

గాలి మరింత పెరిగింది. చెట్లు దయ్యాలు పట్టినట్లు సివాలెత్తి వూగసాగాయి. దుమ్ము ఆకాశానికెగసింది. చూస్తూండగానే మబ్బులు ఊరి వైపు వేగంగా రావడం మొదలుపెట్టాయి. క్షణాల్లో చీకటి ముసురుకుంది.

ఆకాశం నుంచి మొదటి చుక్క భూమిని చల్లగా తాకింది.

భూమమ్మ ఆశగా నోరు తెరచింది.

సన్నని తుంపర మొదలై... వుంటుంటనే వురుములు, మెరుపులతో భీకరంగా మారిపోయింది. ఆకాశానికీ, భూమికీ మధ్య చిక్కటి వారధి ఏర్పడింది. నేలతల్లి ఎన్నాళ్ళ నుంచి దాహంగుందో ఆవురావురుమని తాగసాగింది. నీళ్ళు దోనెలెక్కి పారసాగాయ్. నిద్రపోతున్న కాలువలు వులిక్కిపడి వురకడం మొదలెట్టాయి. భూమమ్మ తాగీతాగీ ఇక తాగలేక పసిపిల్లోని లెక్క కక్కడం మొదలుపెట్టింది. నేలంతా చిత్తడి చిత్తడయిపోయింది. సాయంత్రం మొదలైన వాన మరుసటిరోజు సాయంత్రానికి గానీ తెరిపియ్యలేదు. తరువాత రోజు పొద్దున్నే వూర్లో యెడ్ల గజ్జెలు ఘల్లుమన్నాయి. గడాలు పొలాలకేసి బారులు తీరాయి. యాడ చూసినా ఒకటే హడావుడి. కూలీల కోసం, నార కోసం జనాలు పరుగులు దీశారు.

చంద్రయ్య ఆనందం అంతా యింతా కాదు. గట్టు మీద నిలబడి చేనుని చూస్తా వుంటే పచ్చని పెండ్లి మంటపంలా కనబడింది. మొక్కలు బలం పుంజుకోని నిటారుగా, గర్వంగా ఆకాశం కేసి తలెత్తి చూస్తా ఉన్నాయి. భూమి బాగా పదునెక్కింది. మిగతా వాళ్ళ పొలాలకేసి చూశాడు. కొన్నిట్లో నాట్లు పడ్తున్నాయ్. మరికొన్నిట్లో విత్తనాలు పడ్తున్నాయ్.

వాటిని చూసిన కళ్ళతో మోకాలెత్తు ఎదిగిన తన చేనును చూస్తే సంబరంగా అనిపిస్తోంది. తరువాత రోజు చేనంతా పాపిచ్చి, కసి తీపిచ్చాడు. ఎరువుల అంగట్లో బాకీ తెచ్చి భూమి మందులు ఏపిచ్చాడు. వారానికల్లా ఆకులు పెద్దగా మంచిరంగుకు తిరిగాయి.

"చిత్తకార్తెలో ఇంకో మంచి వాన కురిస్తే చాలు. ఆ తరువాత చలికాలమొచ్చేస్తాది. మంచు కురుస్తాది. భూమి పదునారదు" అనుకున్నాడు.

'ఏం చంద్రయ్యా... గట్టు మీద నిలబడి తెగ మురిసిపోతున్నావ్. పంట బ్రమ్మాండంగా కలకలలాడ్తోందే. అందరి కంటే ముందే చేతికొస్తే నక్కను తొక్కినట్లే. ఏది ఏమైనా బలే ధైర్నం చేశావ్‌లే" పక్కపొలం వీరన్న మెచ్చుకోలుగా అన్నాడు.

"ఆ నాదేముందిలే... యేదో ఆ దేవుడు దయ చూడబట్టిగానీ ఓ రెంద్రోజులు ఆలస్సెం చేసుంటే యేమైపోదునో గదా" అంటూ ఆకాశమొంక చూసి మొక్కుకుంటూ చిరునవ్వులు చిందించాడు.

'పిల్ల పెండ్లి చేయాలనుకొంటున్నావంట గదా... ఏదైనా సమ్మందం చూస్తివా' ప్రశ్నించాడు.

'ఆ... ఆ... చూస్తున్నా. మహానంది దగ్గరి తిమ్మాపురంలో మాంచి సమ్మందముందంట. మొన్న మా చిన్నాయన చెప్పినాడు. పెద్ద మనుసులను పిల్లను చూడ్డానికి రమ్మని పిలంపాలి. పంట చేతికొచ్చి దుడ్లొద్దే సంక్రాంతి తర్వాత మంచి దినాలు చూసి చేసేస్తా" జవాబిచ్చాడు.

"మమ్మల్ని పిలవడం మర్సిపోమాకు" అంటూ నవ్వుతా వీరన్న ఆన్నించి వెళ్ళిపోయాడు.

చంద్రయ్య ఇంటికి చేరుకున్నాడు. రోజులు నెమ్మదిగా గడవసాగాయి. దినాలు కాస్తా వారాలయ్యాయి. నెమ్మదిగా భూమి తడారడం మొదలుపెట్టింది. చిత్తకార్తె ప్రవేశించింది. వాన మాత్రం రాలేదు. మొక్కలు వడలి సోలడం మొదలుపెట్టాయి. రైతుల్లో మళ్ళీ ఆందోళన పెరిగింది.

"ఒక్క వాన కురిపిచ్చు స్వామీ" అని ఎదురుచూపులు చూడ్డం మొదలుపెట్టారు.

అంతలో బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. రాయలసీమలో గూడా భారీ వర్షాలు పడొచ్చని పేపర్లలో వార్తలొచ్చాయి. మధ్యాన్నానికల్లా నల్లని మొబ్బులు కమ్ముకున్నాయి. సాయంత్రానికి పూర్తిగా ముసురుకుంది. చిమ్మచీకటై పోయింది. వాన ఒక్కసారిగా పెలపెలమని విరుచుకుపడింది. పెద్దపెద్ద చినుకులతో కుండపోతగా కురిసింది.

దానిని చూసి 'దెబ్బకు చెరువు సగానికి సగం నిండిపోతుంది. ఇక కరువు తీరినట్టే" అనుకున్నారు జనం. చంద్రయ్య చేను మళ్ళా కలకలలాడింది. ఇంక వాన లేకపోయినా దిగుల్లేదు. పంట చేతికందినట్లేనని సంబరపన్నాడు.

కానీ నాలుగు రోజులకే మళ్ళా వాన. భూమి తడారక ముందే ఇంకో వాన. ఎడతెరిపి లేకుండా వానల మీద వానలు. అగ్నికి ఆజ్యం తోడైనట్లు అల్పపీడనాలు, రుతుపవనాలు ఒకదాన్తో ఒకటి కలిసిపోయాయి. ఆకాశంలో సూర్యుడు కనపడ్డం మానేశాడు. వాగులూ, వంకలూ పరుగులెత్తసాగాయి. చెరువులు గండ్లు పడసాగాయి. పొలాలు నీళ్ళతో నిండిపోసాగాయి. ఎక్కడ చూసినా మిద్దెలు కూలిన వార్తలే. పంటపొలాలు మునిగిపోయిన కబుర్లే. "వట్టికరువు పోయి పచ్చికరువు వచ్చేటట్లుంది" అనుకోబట్టారు..

వాన ఆగాలని దేమునికి పూజలు చేయడం మొదలుపెట్టారు. దేముడు దయ తలచలేదు. వాన తెరిపిచ్చినట్టు ఇస్తూనే మళ్ళా దంచి కొట్టసాగింది. రైతుల మొఖాలు నెమ్మదిగా వడలడం మొదలుపెట్టాయి.

వారం రోజుల తర్వాత వాన తెరిపిచ్చింది. చంద్రయ్య వురుకులు పరుగుల మీద చేనుకి చేరుకున్నాడు. చేనుని చూస్తానే గుండెలో రాయి పన్నట్లయింది. కాలూ చేయీ చచ్చుబన్నట్లు కూలిపోయాడు. పొలమంతా నీళ్ళు నిండిపోయున్నాయ్. మొక్కలు భూమికి కరుచుకోని ఆకులు కుళ్ళిపోయాయి. బుడుకులాన్నా ఒక్క మొక్కా నిటారుగా కనబళ్ళేదు. చేనంతా పిచ్చి మొక్కలు అడ్డదిడ్డంగా పెరిగిపోయినాయ్. పురుగులు కలకలలాడుతున్నాయ్. చేలోకి కాలు పెడ్తే చాలు మడమల వరకు సర్రున దిగిపోసాగింది.

"థూ... నీ యవ్వ" అంటూ ఆకాశంసకేసి కాంద్రించి ఉమ్మేశాడు చంద్రయ్య. 'దినమూ చచ్చేటోనికి ఏడ్చేటోడెవడు' అనుకుంటూ గట్టు మీన్నే వాలిపోయాడు. కండ్లలో నీళ్ళు తిరిగాయి. సాయంత్రం వరకూ అట్లాగే వూటలూరుతున్న కండ్లతో వుండిపోయాడు. పొద్దువాలుతుంటే నీరసంగా అడుగులు వేస్తా ఇంటికి చేరి మంచమ్మీద కూలబడిపోయాడు.

పెండ్లీడు కూతురు గుర్తుకొచ్చింది. సుబ్బారెడ్డి దగ్గర తెచ్చిన అప్పు గుర్తుకొచ్చింది. ఎరువుల బాకీ కదలాడింది. సొసైటీ లోను గుర్తుకొచ్చింది. బాధగా కండ్లు మూసుకున్నాడు. కన్రెప్పల కింద నుంచి నీళ్ళు ఆగకుండా కారిపోసాగాయి.

మొగుని పరిస్థితి చూస్తుంటే లక్ష్మమ్మ గుండె తరుక్కుపోయింది. పోయినేడు టమోటా వేసి కోత కూలీ కూడా గిట్టక గంపలకు గంపలు మార్కెట్లోనే పారబోసి చేనులో పురుగుల మందు తాగి చచ్చిపోయిన రంగయ్య గుర్తుకొచ్చాడు. అప్పు మీద అప్పు తెచ్చి, బోరు మీద బోరు వేసి నీళ్ళు పడక, అప్పు తీర్చలేక ఆ బాయిలోనే పడి చచ్చిపోయిన ఎల్లన్న గుర్తుకొచ్చాడు.

లక్ష్మమ్మ గుండె భయంతో బిక్కుబిక్కుమంటా కొట్టుకోసాగింది. మొగుడు ఏమగాయిత్యం చేసుకుంటాడో ఏమోనని కండ్లలో వత్తులేసుకోని రాత్రంతా కాపలా కాసింది.

తరువాత రోజు పొద్దున్నే సూర్యుడు సురసురలాడ్డం మొదలుపెట్టాడు. చంద్రయ్య మంచం దిగలేదు. ఎవరితోనూ ఒక్కమాటా మాట్లాడలేదు. కాళ్ళు ముడ్చుకోని పైకప్పుకేసి చూస్తా వుండిపోయాడు. చచ్చినా బతికినా ఈ మట్టితోనే గదా అనుకుంటూ లక్ష్మమ్మ మనసు చిక్కబట్టుకోనింది. బైటకొచ్చి ఆకాశాన్నీ నేలనూ చూసింది. తిరిగి లోపలికొచ్చి మొగుని మంచం వద్దకు చేరి తట్టి లేపుతూ.

"యేందబ్బా... అట్లా కూలబడ్తివి. మనుసులకు గాకపోతే మానులకొస్తాయా కష్టాలు.. లేలే... ఇట్లాటప్పుడే ధైర్నంగుండాల. పిల్లపెండ్లి ఈ సమ్మచ్చరం కాకపోతే వచ్చే సమ్మచ్చరం చేయొచ్చు. మించిపోయిందేమీ లేదు. కొంగు తడిచినోళ్ళకు చలిగానీ కోకంతా తడిచినోళ్ళకు చలేమి... లేలే... పొగాకు పోతే పోనియ్. జొన్నేద్దాం. జొన్నకిదే అదును. భూమి పదునారక ముందే తొందరపడాల. తర్వాత విచారించి లాభం లేదు. లేసిపోయి జొన్నిత్తనాల గురించి విచారించి చేనుకాడికి చేర్చు' అనింది.

చంద్రయ్య కండ్లు తెర్చి పెండ్లాం మొగం వంక చూశాడు. ఆమె కండ్లల్లో ఆశ మినుకుమినుకుమంటా ఒక మూల వెలుగుతూ కనబడింది.

"నీకే చెబ్తున్నది. లేచి ఒక్కసారి బైటకు పోయి చూడు. రైతులందరూ మల్లా మొదట్నించీ సేద్దం చేయడానికి సిద్దం చేస్తున్నారు. రైతు పుట్టుక పుట్నాక యిట్లాంటి చిన్న చిన్న దాండ్లకల్లా యెదబడ్తే మనం యవసాయం చేసినట్టే... బదికినట్టే.... దేముడు కండ్లు తెర్చి చల్లగా ఒక్క చూపు చూడాల్నేగానీ.... ఈ కష్టాలెంత సేపు" అంటూ వంటింట్లోంచి రొట్టె తీసుకొచ్చి ముందు పెట్టింది.

చంద్రయ్య నెమ్మదిగా లేచి కాళ్ళూ, చేతులూ కడుక్కోని, రొట్టె తిని నీరసంగా, దిగాలుగా బైటకొచ్చాడు. రోడ్ల మీద ఎడ్లగజ్జెలు ఘల్లుమని వినబన్నాయి. పొలాలకేసి పలుగుపారలతో బారులు దీరి పోతున్న రైతులు కనబన్నారు. వాళ్ళను చూస్తుంటే చంద్రయ్యకు తెలియకుండానే వొంట్లోకి ఎక్కడలేని సత్తువ వచ్చి చేరింది. నీరసం ఎగిరిపోయింది. అడుగుల వేగం దానంతటదే పెరిగింది.

**ఆదివారం ఆంధ్రజ్యోతి - 22 ఆగష్టు 2004, కర్నూలు కథ - ఆగష్టు 2005 & రైతు కథలు - 2012**

# సదవకురా చెడేవు

వరుసగా ఒకరి వెనుక ఒకరు... ఎవరి నెంబర్ల దగ్గర వాళ్ళు... నిశ్శబ్దంగా... ఆతృతగా.. టెన్షన్గా... మరో ఐదు నిమిషాల్లో సంవత్సరమంతా కష్టపడి చదివిన చదువుకు ఫలితం... కాయ్ రాజా కాయ్... టెక్ట్సులు, గైడ్లు, క్వొశ్చన్ బ్యాంక్లు, పాత ప్రశ్నాపత్రాలు, టీచర్ల గెస్సింగ్ ప్రశ్నలు... చదివీ చదివీ... ఏవొస్తాయో... ఏవి రావో... అర్థంగాక... తలలు బద్దలు గొట్టుకుంటూ... ఆశగా... నిరాశగా... రాకుమారి వరించే వరుడెవరో... అసలు రాకుమారి వీళ్ళను వరిస్తుందా... ఒకొక్కడూ ఒకొక్క రాక్షసునిలా వుంటేనూ... తిన్నదల్లా కక్కే శక్తున్నోనిదే విజయం... కొట్టు కొట్టు... బట్టీ కొట్టు... కొట్టకుంటే సంపు... బట్టీరులు... మార్కులు... బట్టీ విక్రమార్కులు... అవగాహన లేని మూర్ఖులు... విద్యార్థులు... విద్యావేత్తలు...

"ఠంగ్... ఠంగ్... ఠంగ్..."

అదిగో మొదటి గంట. యుద్ధానికి సిద్ధం కమ్మంటున్న భేరీ నాదంలా... లే... లెయ్... ప్రశ్నా పత్రాలు వేగంగా అందరికీ అందచెయ్. మీట నొక్కితే చాలు పేలిపోయే బాంబుల్లా... ఒకొక్కడూ నీ వంకే ఆకలిగొన్న సింహంలా ఆవురావురుమని చూస్తున్నాడు.

"సర్"

"యస్"

"అందర్నీ ఓసారి బాగా చెక్ చేయండి. డీఈవో విజిట్కు రావొచ్చని మెసేజొచ్చింది. దొరికితే కష్టం... కొంచెం జాగ్రత్త"

కమాన్ పద.... పదో తరగతి పరీక్షలకు అడుగడుగునా మొగుళ్ళే. ఒకొక్కన్నీ కిందనుండీ పైవరకూ క్షుణ్ణంగా పేపర్ డిటెక్టర్లా చెక్ చెయ్. ఎక్కడో ఏ మూలో నీకు దొరక్కుండా దాగుండే ఓ చిన్న చీటీ పొరపాటున స్క్వాడ్ ముందు బైటపడ్తే ఆనాకొడుకుల్తో తిట్లు, ఆపై మెమోలు.

"చూడండి... మర్యాదగా చెబ్తున్నా... మీ దగ్గరేవైనా పేపర్లుంటే ముందే ఇచ్చేయండి. కాపీ కొడ్తూ పట్టుబన్నా, ఒకని దాంట్లోకింకొకడు తొంగి చూస్నా, మాట్లాన్నా... నేనేం చేస్తానో నాకే తెలీదు. అందరూ ఒకసారి ఏమైనా వున్నాయేమో చెక్ చేసుకోండి"

ఎవ్వరూ మాట్లాల్లా. గమ్మున అమాయకమైన గంగిగోవుల్లా చూస్తున్నారు. వీళ్ళలో ఆవుతోలు కప్పుకున్న పులెవడో, తప్పదు చెక్ చెయ్. అంగీ జేబులు, కాలర్లు, ఫుల్హాండ్ మడతలు, ప్యాంటు

జేబులు, బెల్టు వెనకాల, డ్రాయర్లోపల, కంపాక్సులు, అట్టలు... ఈ ఆడపిల్లల్నెట్టా చేయాలబ్బా... ఏ జాకెట్లో ఏ చీటీ వుందో... ఛఛఛ... పాపం ఆడపిల్లలు... వుండవ్‌లే... భయపడ్తార్లే... అమాయకమైన పాలబుగ్గలు. భయంతో రెపరెపలాడే చిన్నకళ్ళు... సిగ్గుతో ఎర్రబడే లేతబుగ్గలు... ఏమంటుందో ఈ మాటంటే సోనియా... తగ్గిందో లేదో ఎల్టీటీయీ మానియా...

చెక్ చేయడం పూర్తయింది గదా... వేగంగా ప్రశ్నాపత్రాలు పంచు. కొందరు వేటాడే వ్యాఘ్రాల్లా, మరికొందరు భీతహరిణాల్లా నీ వంకే చూస్తున్నారు. పంచడం పూర్తయిందా... ఇక దా.. కుర్చీలో కూలబడు. నో రిలాక్స్. ఇక జైలు వార్డన్ డ్యూటీ... ఎవరికి వారు ప్రశ్నాపత్రాలు వేగంగా చదివేస్తున్నారు కొన్ని మొహాలు హండ్రెడ్ వాట్స్ బల్బుల్లా వెలుగుతా వుంటే, మరికొన్ని ఫ్యూజ్ పోయిన బల్బుల్లా మాడిపోతున్నాయ్. మొదటి గంట వరకూ పరవాలేదు. ఎవనికి వచ్చినవి వాడు రాసేస్తాడు. ఆ తర్వాతే తలల్తిప్పడాలు, తొంగి చూడడాలు, సైగలు చేయడాలు, కాపీలు తీయడాలు...

ఐనా... నిన్ను చూస్తే కాపీ కొట్టేంత సాహసం ఎవనికుంటాది. మెలి తిరిగిన మీసాలు, లైట్గా పెరిగిన గడ్డం, నల్లని అద్దాలు, తీక్షణమైన చూపులు... ఏమనేది మీ అమ్మ "రేయ్... ఆ గడ్డం తీసెయ్రా... నిన్ను చూస్తే మన ఎమ్మెల్యే వాళ్ళింటికాడి గూండాలే గుర్తుకొస్తారు నాకు"... అంటుంది కదూ... అలాంటి నీ మొహాన్ని చూసి కూడా ఈ పసిమొగ్గలు ధైర్యంగా కాపీ కొట్టగలవా... నో... నెవర్... చంద్రమౌళిని కూడా "ఏయ్... రౌడీ..." అనేది పెళ్ళిగాక ముందు. పెళ్ళయ్యాక భారతనారి కాబట్టి కాస్త మర్యాదగా పిలుస్తోంది. తనకెట్టా నచ్చిందో ఈ ముఖం.

ఏమా బొమ్మ... ఆ జుట్టుపోలిగాని అట్ట మీద... చేతిలో కొడవలితో, తెల్లని ఖద్దరంగీపై ఎర్రని రక్తపు మరకలతో, మెలితిప్పిన మీసాలతో, ఎరుపెక్కిన కళ్ళతో, ఆగ్రహంతో కంపించిపోతున్న ఉగ్రనరసింహంలా... చెన్నకేశవరెడ్డా... ఇంద్రసేనారెడ్డా... ఆదికేశవరెడ్డా... సమరసింహారెడ్డా... సాంబశివారెడ్డా...

ఒకొక్కడూ... ఒకొక్క మహాదాత, ప్రజల కోసం తమ ధన మాన ప్రాణాలను క్షణాల్లో త్యజించగల అద్భుత వ్యక్తిత్వం. రాయలసీమ ప్రజల కష్టాలను, కడగండ్లను తీర్చడానికి తమ జీవితాలను అంకితం చేస్తున్న మహోన్నత త్యాగమూర్తులు. వారెవ్వా... ఏం తెర వీరులు.. ఏసీ రూముల్లో కూర్చుని మందు తాగుతూ విలాసంగా కథలు రాసే బేవార్సుగాళ్ళకు తప్ప మరెవరికీ ఈ రాయలసీమలో అణువణువూ గాలించినా ఒక్కడైనా ఇట్లాంటోడు కనబడ్డం లేదే.

రాయలసీమ ప్రజల భాషను, సంస్కృతిని, సహజమైన జీవన విధానాన్ని హీనాతి హీనంగా, రాక్షసంగా చూపిస్తూ... ఇక్కడి ప్రజల కన్నీళ్ళను, కడగండ్లను, ఆకాంక్షలను, స్వచ్ఛమైన మనస్సును... ఏ మాత్రం చిత్రీకరించకుండా... ఒక్క ఫ్యాక్షన్ భూతాన్ని మాత్రమే చూపిస్తూ... మరోపక్క ఆ ఫ్యాక్షనిస్టులేనే ఆకాశానికెత్తుతున్న ఈ దర్శకులు, కథకులు, హీరోలు... వీళ్ళే నిజమైన ఫ్యాక్షనిస్టులు... ఈనా కొడుకులందర్నీ...

“ఠంగ్”

మొదటి గంట పూర్తయింది. ఎవడు వాడు. గంటకే జిరాఫీలా మెడచాచి ఎదుటివాని దాంట్లోకి తొంగి చూస్తా వున్నాడు. ఏ మాత్రం లూజు వదిలినా తర్వాత తలకెక్కుతాడు. కమాన్ స్ట్రిక్ట్‌గా మేనేజ్ చెయ్. మొక్కలోనే తుంచేసెయ్. “రేయ్... పచ్చంగీ... తలకాయ గాని తిరుగుతుందా... తల తిప్పుతున్నావ్ పేపర్తీస్కోని బైటకు దొబ్బుతా జాగ్రత్త... ఏమనుకుంటున్నావో” శభాష్... అదీ... చూడు ఒక్కసారిగా అందరూ ఎలా సర్దుకున్నారో...

రేయ్... ఏందిరా అంత స్ట్రిక్టుగా పెడ్తున్నావ్. బుద్ధుందా నీకు. పరీక్షహాలులో కొచ్చే ముందు హాస్టల్ వార్డెన్ కలిసి “సార్... కొంచెం చూసీ చూడనట్టు పోండి. పాపం... పల్లెటూరి పిల్లలు” అన్నది గుర్తులేదా... మర్చిపోయావా... చిందర వందరగా పెరిగిన జుట్లు, ఇస్త్రీ లేని దుస్తులు, నల్లని మొహాలు... చూడెలా వున్నారో... ఐనా పల్లెలో పుట్టి పెరిగి వుద్యోగస్తునివై పల్లెలోనే వుద్యోగం చేస్తున్న నీకు తెలియనిబు పల్లెపిల్లల బాధలు.

ఎలా వుండేది నీవు చిన్ననాడు చదివిన ఏకోపాధ్యాయ పాఠశాల. చినిగిన అంగీలు, చీమిడి ముక్కులు, రేగిన జుట్లు, మాసిన బట్టలు, డొక్కు పలకలు, అట్టలూడిన పుస్తకాలు, ఇష్టమొచ్చినప్పుడు స్కూలుకొచ్చే పొట్టెగాళ్ళు, వానొస్తే మూసేసే పాడుబడ్డ పాఠశాల, క్రిక్కిరిసి వుండే పిల్లలు... తానే టీచరై, హెడ్మాష్టరై, క్లర్కై... ఎవరికీ న్యాయం చేయలేక నానా చావు చస్తూ ఐదు తరగతుల్లో అష్టావధానం చేసే ఉపాధ్యాయుడు... గుర్తొస్తేనే ఒళ్ళు గగుర్పొడుస్తుందా...

ఏదో మీ నాన్న చదువుకోబట్టి, ఆర్థికంగా కాస్త బలంగా వుండబట్టి, ఐదు దాటగానే కర్నూల్లోని కాన్వెంట్లో చదివించబట్టి దొరికింది నీకీ వుద్యోగం. ఐనా ఆ రోజుల్లో కాబట్టి నీకీ వుద్యోగమొచ్చింది. కానీ ప్రస్తుత కాన్వెంట్ చదువుల కంప్యూటర్ల లోకంలో ఈ పల్లెటూరి తెలుగు మీడియం పిలగాళ్ళకు కనీసం ప్యూను ఉద్యోగాలన్నా దొరుకుతాయా.

తల్లిదండ్రుల, టీచర్ల, ట్యూషన్ మాస్టర్ల నిరంతర పర్యవేక్షణలో, కాన్వెంట్ స్కూళ్ళలో, కంప్యూటర్ శిక్షణలో, రాత్రనకా పగలనకా చదువే తప్ప మరే ధ్యాసా లేని నగరవాసుల పిల్లలతో పోటీపడి ఈ పల్లె పిల్లలు ఎప్పుడు నెగ్గుకొస్తారు... ఎలా నెగ్గుకొస్తారు... ఐదో తరగతి పాసైన పాపానికి హైస్కూలు కోసం రోజుకు రెండు కిలోమీటర్లు నడిచి, బస్సులందుకొని పక్క వూర్లకు వెళ్ళి ఏ మాత్రం సందు దొరికినా స్కూలెగ్గొడదామని కాసుక్కూచునే టీచర్ల మధ్య, రావడం ఎంత ఆలస్యమైనా పోయేటప్పుడు మాత్రం గంట కొట్టడానికి ముందే బ్యాగులు సర్దుకొని, పిల్లలను గాలికొదిలేసే ఉపాధ్యాయుల మధ్య... వాళ్ళు చెప్పే వానాకాలం చదువులు వినీ, చదివీ ఎప్పుడు సాధించాలి వీళ్ళు.

పంటల కాలంలో సగం మంది పిల్లలు పొలాల్లోనే... గతిలేకనో, కూలీలకు డబ్బులివ్వలేకనో, కాస్తన్నా సంపాదించుకోవాలనో, తల్లిదండ్రుల భారం తగ్గిద్దామనో పొలం దున్నుతూ, నారనందిస్తూ, నాట్లేస్తూ, పురుగులేరుతూ, చేలకి మందు కొడుతూ... పని ఒత్తిడితో సతమతమయ్యే ఈ పిల్లలు...

ఫ్యాను కింద కూచుని ఈమైల్ వేగంతో చదువుతున్న పట్నవాసం పిల్లలతో ఎలా పోటీ పడగలరు... ఎప్పుడు పోటీ పడగలరు...

నగరాలు రోజు రోజుకీ బలుస్తా వుంటే పల్లెలు మరింత చిక్కిపోతున్నాయ్. ఎలా మారిపోతా వుంది నీ కర్నూలు, రోడ్లకిరువైపులా చక్కని ఫుట్‌పాత్‌లు, వాటి మధ్య పచ్చని చెట్లు, చుట్టూ ఫెన్సింగ్లు, రోడ్ల మధ్య డివైడర్లు, బటర్‌ప్లై స్తంభాలు, ట్రాఫిక్ ఐలాండ్లు, రంగు రంగుల పూల మొక్కలు, తివాచీలా పరుచుకున్న పచ్చని లాన్లు, వాటర్ ఫౌంటెన్లు, నున్నని తార్రోడ్లు... వారెవ్వా... అత్యంత సుందరంగా, ముగ్ధమనోహరంగా అప్పుడే యవ్వనంలోకొచ్చిన పదహారేళ్ళ గ్లామర్ హీరోయిన్లా హొయలు పోతా వుంది. ఈ నగర అందచందాల కోసం ఎక్కన్నుంచొస్తుందో అంత డబ్బు.

అదే నీ గ్రామం... ఇరవై సంవత్సరాలకు ఇప్పటికీ మరింత చిక్కి శల్యమై ఆరిపోయే దీపంలా మినుకు మినుకుమంటూ వుంది. ఎగుడుదిగుడు మట్టిరోడ్లు... రోడ్డుకిరువైపులా ముళ్ళపొదలు... బొమ్మజెముల్లు... గాలికెగిరెగిరి పడే ఎర్రదుమ్ము. చాకలోళ్ళు బట్టలుతకడానికి, పిల్లలు ముడ్డి కడుక్కోవడానికి తప్ప ఎందుకూ పనికిరాని చెరువు... దయ్యాల్లా నోళ్ళు తెరిచి ఆకాశంకేసి ఆకలిగొన్న సింహాల్లా చూసే మెట్ట భూములు, మాసిన గడ్డాలు, చినిగిన అంగీలు, బక్కచిక్కి డొక్కలు బైటపడ్డ ఎద్దులూ, దిగులూ నిరాశా ఆవహించిన మనుషులూ... ఎక్కడి గొంగలి అక్కన్నే అన్నట్టు అలాగే పడి వుంది.

గ్రామాల్లో వలసలను నిరోధించి, అవసరమైన చోట బోర్లు వేసి, కొత్త ప్రాజెక్టులు కట్టించి, స్వయం వుపాధి పథకాలు చేపట్టి, వ్యవసాయావసర వస్తువుల ధరలు తగ్గించి, గిట్టుబాటు రేట్లు కల్పించి ఆదుకోవాల్సిన పాలకులు కాలిక్యులేటర్లంటేనే తెలియని పల్లె ప్రజలకు, కంప్యూటర్లిస్తామని ప్రగల్భాలు పలుకుతూ... అల్లావుద్దీన్ అద్భుత దీపాలు చూపిస్తూ... రోజుకో రైతు చొప్పున ఆత్మహత్య చేసుకుంటున్నా ఏ మాత్రం చలించడం లేదు.

అదే పోయిన వేసవిలో కర్నూల్లో నీటి ఎద్దడి వస్తే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రి ఆఘమేఘాల మీద టెలీకాన్ఫరెన్సులు పెట్టి లక్షలకు లక్షలు నిధులు విడుదల చేసి, ఈమైల్ వేగంతో అధికారులను పరుగులెత్తించి, వాటర్ ట్యాంక్‌లతో వీధి వీధికీ నీటిని సరఫరా చేసి, రైతుల నోట్లో మట్టి కొట్టి గాజులదిన్నె నీటిని కర్నూలుకి రప్పించి తమ పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. ఇక భవిష్యత్తులో మరెప్పుడూ కర్నూలువాసులకు ఇటువంటి ఆపదలు రాకుండా ముందుచూపుతో యుద్ధ ప్రాతిపదికన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. నగరవాసుల కోసం ఇంతగా శ్రమించే ఈ పాలకులు పల్లెలో జనాలు తాగడానికే నీళ్ళు లేక మైళ్ళకు మైళ్ళు నడుస్తూ, చెలమల్లో బురద నీటినే తాగుతూ, ఫ్లోరైడ్ వాటర్ కీలు కీలునా ఇంకి ఎముకలు వంగిపోతున్నా ఏనాడైనా పట్టిచ్చుకున్నారా... నగరాల్లో డిస్కో క్లబ్బులకి, పబ్బులకి, వినోదాలకు, సరదాలకు నిరంతరం అప్రతిహతంగా ప్రవహించే విద్యుత్తు పల్లెలను చూస్తే చాలు మొహం చాటేస్తా వుంది.

కరెంటే సరిగ్గా లేని గ్రామాల్లో, గుడ్డి దీపాల కింద చదువుతూ, నిరంతరం పొలం పనుల్లో మునిగి తేలే ఈ పిల్లలు టౌను పిల్లల్తో ఎలా తూగగలరు. ఎలా పోటీపడగలరు.

అందుకే గౌరీశంకర్గాడు ఎవరన్నా పల్లెల్లో సచ్చో చెడో చదువుల కోసం టౌనుకు పంపాలనుకుంటే కోపంగా "ఎందుకురా మీకీ సన్నాసి చదువులు. ఏం బొచ్చు పెరుకుదామని. ఎమ్మేలు,బీఏలు సదివినోళ్ళే... కో... అంటే కోటిమంది సిప్ప సేతబట్టుకోని వుద్యోగమో రామచంద్రా అంటూ ఆఫీసుల చుట్టూ ఎర్రినాకొడుకుల్లెక్క తిరుగుతున్నారు. యాడున్నాయిరా మనకుద్యోగాలు. వున్నవి గూడా పీకేసి, నో వేకెన్సీ బోర్డులెట్టేసి, వాలెంట్రీ రిటైర్మెంట్లిచ్చేసి పోండ్రా నా కొడుకుల్లారా పోయి మీ దిక్కున్న సోట చెప్పుకోపోండంటుంటే... మీరేమో... సదివిస్తాం... సదివిస్తాం... అంటూ సంకలెగరేసుకుంటూ... వున్నవి కాస్తా తాకట్టెట్టేసి పొలోమని టౌన్లకురుకుతున్నారు. అసలు మన పల్లెటూరోళ్ళకు ఉద్యోగాలాడొస్తాయిరా... ఆ పట్నమోళ్ళతో పోటీపడి డబ్బూ ఖర్చెట్టలేం. సదువూ సదివించలేం. మొక్క మానవక ముందే... రెంటికీ చెడ్డ రేవడి కాకముందే... పని.. పని నేర్పు. నాలుగు వేళ్ళు నోట్లో పోవడానికి ఏదో ఒక పని. సదువు మాత్రమొద్దు. సదువంటే తెల్లేనుగును మేపడమే. ఏదో రాయడం, సదవడం వస్తే సాలు. ఎక్కువొద్దు. మనకెచ్చులొద్దు. నా మాటిను. పిల్లోడు బతకాలంటే బడిపై భ్రమలొదులుకో. వాన్ని అనవసరంగా పనికిరాని సన్నాసిని సేయకు" అనేటోడు.

"సార్... పేపర్"

ఎవడీడు. వీనికేదో పోయే కాలం దగ్గర పన్నట్టుంది. తెగ రాసేస్తున్నాడు. పాసయి నాశనమయ్యేట్టున్నాడే. తప్పదు. ఏమీ చెయ్యలేవ్, పేపరివ్వడం నీ డ్యూటీ. ఇచ్చేయ్.

పాసై ఏం వుద్ధరిస్తాడు వీడు. ఎమ్పీసీలూ, బైపీసీలు, సీయిసీలు, హెచ్ఈసీలు, ఎమ్మేలు, బియ్యేలంటూ వుద్యోగావకాశాలు మూసుకుపోయిన కోర్సులు తప్ప ఏమి దొరుకుతాయి వీళ్ళకు. అసలు వీళ్ళకు ఫ్యాషన్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ, టూరిజం, హోటల్ మేనేజ్మెంట్ లాంటి కోర్సులున్నాయని, వుంటాయనైనా తెలుసా... తెలిసినా ఏం చేయగలరులే. లక్షలకు లక్షలు ఖర్చెట్టి వాటినెలాగూ అందుకోలేరు.

ఎవడు వీడు... కిందా మీదా పడ్తున్నాడు... ఇంగ్లీషు ప్యాసేజ్ రాయలేక... ఇంగ్లీషంటే బ్రహ్మరాక్షసే గదా పాపమీ తెలుగు మీడియం పిల్లలకు. ఆంగ్లభాష రానోనికి గ్లోబల్ ప్రపంచంలో చోటెక్కడ... పట్టణాల్లో చదివించలేక, కాన్వెంటు ఖర్చులు భరించలేక, గతి లేక, తప్పనిసరై మాతృభాషను బతికిస్తా వున్నారు. పల్లెకో ఇంగ్లీషు మీడియం ఉచితంగా స్థాపిస్తే తెలుగు మీడియంలో ఒక్కడైనా మిగుల్తాడా... మాతృభాషా లేదూ... మట్టిగడ్డా లేదూ...

చూడు... వాన్ని చూడు... నీ వంకే ఆశగా, దీనంగా వాన కోసం ఎదురుచూస్తున్న రాయలసీమ రైతులా ఎలా చూస్తున్నాడో... రోజుకో రైతు చస్తున్నా తిన్నదరక్క చస్తున్నారని కారుకూతలు కూసే పాలకునిలా కనికరం లేకుండా క్రౌర్యంగా వుండు. జాలిపడకు. ఈరోజు నువ్వు జాలిపడితే వాడు

భవిష్యత్తంతా ఏడ్చాల్సొస్తాది. వాడు నిన్ను ఎన్ని అమ్మ నా బూతులు తిట్టుకున్నా పరవాలేదు. ఇలాగే కఠినంగా, ముఖంలో ఏ మాత్రం క్రూరత్వం తగ్గకుండా, చిర్నవ్వు చిందకుండా జాగ్రత్తగా వుండు. ఇంకో అరగంట అంతే... ఓపిక పట్టు... వాళ్ళ భవిష్యత్తు కోసం.

జీవనోపాధిని చూపించలేని ఈ నిరర్థకమైన చదువులు అనవసరంగా వీళ్ళలో ఫాల్స్ ప్రిస్టేజీని పెంపొందింపజేస్తూ, తమ వృత్తుల పట్ల తమకే అసహ్యాన్ని కలుగజేస్తూ... ఆశల్లో , భ్రమల్లో ముంచెత్తుతూ... రెంటికీ చెడ్డ రేవడిలా మార్చకుండా కొందరినన్నా కాపాడు. ఈ పదోతరగతి ఫెయిలైతే మట్టసంగా గ్రామంలో ఏదో ఒక పని చేసుకుంటూ కొంచమన్నా హాయిగా బ్రతుకుతారు.

వీడు.. వీన్నెక్కడో చూసినట్టుందే... యస్... యస్... మాదిగరాములు కొడుకు గదా వీడు... కాస్త లూజొదిల్తే... ఎస్సీగదా... ఏమైనా వుద్యోగమొస్తాదేమో... శివయ్య... ఎలా వున్నాడో... నీ ప్రియ శిష్యుడు... "మీకేంరా... రిజర్వేషనుంది... చదువు ఫ్రీ... తిండి ఫ్రీ... వుద్యోగాలు వురుక్కుంటూ వస్తాయి" అనేవరన్నా అంటే ఏమంటాడు వాడు.

"ఎందుకు సార్... ఈ మాటలు... ఎక్కడున్నాయి వుద్యోగాలు... మా పల్లెకు రండి... ఈ మధ్య కాలంలో వుద్యోగం సంపాదించిన ఒక్క మాదిగోన్నన్నా చూపించండి చూద్దాం. మా పల్లెనే కాదు. పల్లె పల్లెకూ పోదాం... ఎంతమందికొస్తున్నాయో చూద్దాం. ఎస్సీలూ లేదు, బీసీలూ లేదు... ప్రతి కులంలోనూ రిజర్వేషన్నుపయోగించుకొని ఎదిగిన మొదటి తరం, రెండో తరం ఆర్థికంగా బలపడి, టౌన్లలో చేరిపోయింది. ఆ క్రిమీలేయర్ల పిల్లల్తో మేమెప్పుడు పోటీ పడగలం. ఏబీసీడీలు, ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అన్నీ వాళ్ళ కోసమే. కొన్ని కుటుంబాల్లో ఐదారు మందికి వుద్యోగాలు... వుద్యోగమొచ్చినోనికి వచ్చినట్టు రిజర్వేషన్ తొలగిస్తూ పోతే తప్ప మాకందవు. అవమానాలు భరిస్తున్నది పల్లెల్లో మేము, రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్నది టౌన్లలో వాళ్ళు. ఇప్పుడు కులాల్లేవు. అన్ని కులాల్లోనూ వర్గాలే"

నిజమే గదూ వాని మాటలు. ఈ దళిత మేధావులు, ఉద్యమ నాయకులు, ఉద్యోగ వర్గాలు అందరూ క్రిమీలేయర్లే గదా... వీరు తమ రిజర్వేషన్ హక్కునొదులుకొని తమ కులంలోని అట్టడుగు వర్గాల కోసం పాటుపడగలరా... నో... నెవర్... ఎవరెట్లా చస్తే వాళ్ళకేం. వంశపారంపర్య పాలన. ప్రజాస్వామ్యంలో రాజరికం. ఏ రంగమైనా వున్నోనిదే రాజ్యం. యాభై సంవత్సరాల స్వతంత్ర భారతంలో అన్ని కులాల్లోనూ అగ్రవర్ణాలు తయారైపోయాయి.

"ఠంగ్... ఠంగ్... ఠంగ్..."

లే... లేసి... పేపర్లన్నీ ఇప్పిచ్చేసుకో... ఒకొక్కడు నిన్ను తినేసేలా చూస్తున్నాడు గదూ... బైటకు పోతే శాపనార్థాలూ, తిట్లూ తప్పవు. ఐనా పరవాలేదు. నువ్వు చేస్తున్నది మంచిపనే. కమాన్ పేపర్లన్నీ కట్ట కట్టి... ఇక పద... వీళ్ళు పాసై సర్వనాశనం కాకుండా కొందరినన్నా కాపాడాననే ఆత్మసంతృప్తితో... కట్ట కట్టిన వీళ్ళ భవిష్యత్తును ఆఫీసురూమ్లో అప్పజెప్పుదువు గానీ...

✳

# హిందూ ముస్లిం - భాయ్ భాయ్

"**దు**మ్ము లేపుకుంటూ పోలీస్ జీపొచ్చి ఊరి చివరి ఎస్సీ కాలనీలో ఆగింది. హెడ్ కానిస్టేబుల్ ఉత్సాహంగా కిందికి దిగి పోలీసుల్తో వీధిలోకి నడిచాడు. ఆశ్చర్యం. ఒక్కడూ కనబళ్ళేదు. తలుపులన్నీ తాళాలేసున్నాయి. మొగోళ్ళే కాదు ఆడోళ్ళు, పిల్లలు, ఆఖరికి ముసిలోళ్ళు గూడా లేరు. ఇండ్లలోపలేమైనా దాచిపెట్టుకున్నారేమోనని కిటికీల్లోంచి లోపలికి తొంగిచూశారు. ఎవరూ కనబళ్ళేదు.

హెడ్ కానిస్టేబుల్కి ఏమీ అర్థం కాలేదు. ఈ రోజు పొద్దున్నే వస్తామని ముందే చెప్పినా ఎవరూ లేరే... కొంపదీసి వూర్లో వాళ్ళు రాత్రికి రాత్రి దాడి గాని చేయలేదు గదా... ఆ ఊహ రాగానే ఒళ్ళు జలదరించింది. పరిసరాలన్నిట్నీ డేగకళ్ళతో పరిశీలనగా చూశాడు. అటువంటి ఆనవాళ్ళేమీ కనబళ్ళేదు. తిరిగి జీపుకాడికొచ్చి వెదకమని పోలీసులను తలోదిక్కూ పంపించాడు.

హెడ్ కానిస్టేబుల్ జీపులో కూచోని ఆలోచించసాగాడు. కిందట్రోజు సాయంత్రం జరిగిన మీటింగ్ గుర్తుకొచ్చింది. మాలోళ్ళను, మాదిగోళ్ళను అందర్నీ పిల్చుకొచ్చారు. ఎస్సై వాళ్ళందర్నీ చూస్తూ "చూడండి... మనుషులంతా ఒక్కటే. కులాలు, మతాలు ఎన్నున్నా దేవుడొక్కడే. అందరిలోనూ ప్రవహించే రక్తపు రంగొకటే. కానీ... మిమ్మల్ని అంటరానోళ్ళనీ,తక్కువ కులమోళ్ళనీ గుళ్ళలోకి రానియ్యకుండా కొందరడ్డం పడ్తున్నారు. అది మహాపాపం. చట్టరీత్యా నేరం కూడా. ప్రతూళ్ళో అంటరానితనం నిర్మూలించాలనీ, దళితులకు దేవాలయ ప్రవేశం కల్పించాలనీ గవర్నమెంట్ ఆర్డరిచ్చింది. కాబట్టి రేపు మిమ్మల్నందర్నీ దేవాలయాల్లోకి తీస్కపోతాం. వూర్లో వాళ్ళు ఏమంటారోనని భయపడాల్సిన అవసరమ్లేదు. ఎవడైనా నోరెత్తితే లోపలేసి బొమికలిరగ్గొడ్తాం. మీరు పొద్దున్నే టెంకాయల్తో సిద్ధంగా వుండండి" ముందురోజు రైటర్ రాసిచ్చిన మాటర్ గుర్తు చేసుకుంటూ స్పీచిచ్చాడు. దళితులందరూ అలాగేనంటూ తలలూపారు. పోలీసుల్తో కల్సి చప్పట్లు కొట్టారు. తీరా చూస్తే ఇప్పుడు ఒక్కడు గూడా లేడు.

ఎస్సై చెప్పిన మాటలు మననం చేసుకుంటుండగా ఒక పోలీసొచ్చాడు. "సార్! మాదొగోళ్ళు గేరి చివరున్న చర్చీ దగ్గరా, మాలోళ్ళు ఆ నీళ్ళ ట్యాంకు లేదూ... దాని పక్కనున్న చర్చి దగ్గరా వున్నారు" సమాచారమందిచాడు.

హెడ్ కానిస్టేబుల్ పోలీసుల్తో మాలోళ్ళ చర్చికాడికి చేరుకున్నాడు. కోలాహలంగా వుంది. చర్చీ నిండిపోయి చాలామంది బైటే నిలబన్నారు. వాళ్ళ మధ్య ఏవో చర్చలు తీవ్రంగా నడుస్తున్నాయి. పోలీసులను చూడగానే ఒక్కసారిగా నిశ్శబ్దమావరించింది. ఎవరికి వాళ్ళు గమ్మున తలొంచుకొని, చూడనట్లు చర్చి వేపుకు తిరిగారు.

హెడ్ కానిస్టేబుల్ చర్చి ముందు నిలబడి "రేయ్! నిన్న ఎస్సై చెప్పినాడు గదా... రాండి... ఓ పదిమందొచ్చి జీపెక్కండి" ఆజ్ఞాపించాడు.

ఎవరూ ఏమీ మాట్లాల్లేదు. కదల్లేదు. తలల్తిప్పలేదు.

హెడ్ కానిస్టేబుల్కి కోపం నసాళానికంటింది. "ఏంరోయ్... చెప్తుంది మీకే... చెవుడా... లేక నక్రాల్గాని చేస్తున్నారా... తొందరగొచ్చి జీపెక్కండి. అవతల మాకు సవాలక్ష పనులున్నాయి" అసహనంగా కసురుకున్నాడు.

అంతలో చర్చి ఫాదర్ శామ్యూల్ జనాల మధ్య దారి చేసుకుంటూ హెడ్ కానిస్టేబుల్ దగ్గరకొచ్చి "చూడండి... ఈడెవరూ ఎస్సీల్లేరు. అంతా క్రిష్టియన్లే. యేసే మా ప్రభువు. గుళ్ళోకి మేమెందుకొస్తాం. మేం రాం..." కుండ బద్దలుగొట్టినట్లు చెప్పాడు.

హెడ్ కానిస్టేబుల్ బుర్ర గోక్కున్నాడు. దేవాలయ ప్రవేశం ఎస్సీలకే గానీ, క్రిష్టియన్లకి కాదు గదా... అనుకుంటూ మాదిగోళ్ళ చర్చికాడికి చేరుకున్నాడు. ఆడ కూడా అదే సమాధానం ఎదురైంది. ఎస్సై దగ్గరికి పోయి విషయమంతా వివరించాడు.

ఎస్సై ఆలోచన్లో పన్నాడు. వూర్లో ఎస్సీల జనాభా ఎక్కువుందని ఎస్సీ కార్పోరేషన్ అక్కడ సిమెంట్ రోడ్లేపిచ్చింది. పక్కాయిండ్లు కట్టిచ్చింది. పొలాల్లో బోర్లేపిచ్చింది. నీళ్ళ టాంకులు కట్టిచ్చింది. లోన్లిచ్చింది. కానీ... ఒక్కడు కూడా ఎస్సీని కాదంటున్నాడా అని ఆశ్చర్యపోయాడు. హెడ్ కానిస్టేబుల్తో "అసలు మన లిస్టులో ఈ వూరుందా" అనుమానం వ్యక్తం చేశాడు. కానిస్టేబుల్ ఓసారి లిస్టు మళ్ళా తిరగేసి "వుంది సార్... ఈ వూర్లో ఎస్సీలూ, ముస్లిమ్లూ పెద్ద సంఖ్యలో వున్నారు" అన్నాడు.

కొంపదీసి ఈ మధ్యన అందరొక్కసారిగా మతంగాని మార్చుకోలేదు గదా... అనుకుంటూ కానిస్టేబుల్ మద్దయ్యకెళ్ళి తిరిగి "ఏరా... మీ కులమోళ్ళెవరూ లేరా ఈ వూర్లో" ప్రశ్నించాడు.

"ఎందుకు లేరు సార్. మస్తుమందున్నారు. కానీ ఈ వూర్లో ఎస్సీలంటే క్రిష్టియన్లనే అర్థం. ఎప్పుడో మతం మారిపోయారు. మాలోళ్ళకు, మాదిగోళ్ళకు ప్రత్యేకంగా చర్చీలు గూడా వున్నాయి. ప్రతి గురువారం, ఆదివారం కర్నూల్నించి పెద్ద ఫాదర్లొచ్చి ప్రార్థనా సమావేశాలు నిర్వహిస్తూ వుంటారు. కాకపోతే రిజర్వేషన్ల కోసం జనాభా లెక్కల్లో అందరూ హిందువుల కింద నమోదు చేస్కుంటుంటారు. అలాగే ముందు జాగ్రత్తగా హిందువుల పేర్లు పెట్టుకుంటుంటారు" ఉత్సాహంగా తనకు తెలిసిందంతా గడగడా చెప్పాడు.

ఎస్సై మద్దయ్యకెళ్ళి అనుమానంగా చూస్తూ "నీది గూడా ఆ బాపతేనా" అన్నాడు. మద్దయ్య

అదిరిపన్నాడు. "ఛూ... ఛూ... అనవసరంగా ఇరుక్కున్నానే" అనుకుంటూ "అబ్బే లేద్సార్... నేను నిఖార్సైన ఎస్సీని" తడబడుతూ చెప్పాడు. ఎస్సై ఇంకేమడుగుతాడోనని గుండె వేగంగా కొట్టుకోసాగింది. "ప్రభూ... సర్వలోక రక్షకా... నాగపట్నమొచ్చి తలనీలాలు సమర్పించుకుంటా... నన్నెలాగైనా ఈ ఆపద నుండి కాపాడమని యేసు నామమున నిన్ను వేడుకొనుచున్నాను తండ్రీ...." అంటూ మనసులో పదేపదే మొక్కుకోసాగాడు.

ఎస్సై ఏదో అడగబోతున్నంతలో ఇంకో పోలీసొచ్చి "సార్! నిన్న మనం మీటింగ్ పెట్నాం గదా. అది కర్నూల్లో చర్చి ఫాదర్లకి తెలిసిందంట. హిందువులు వీళ్ళని అంటరానోళ్ళుగా చూడ్డం వల్లనే గదా మన మతంలో చేరింది. ఇలా వీళ్ళని దేవాలయాల్లోకి తీస్కపోవడం, వాళ్ళలో కలుపుకోవడం చేస్తే... మళ్ళా నెమ్మదిగా హిందూమతంలోకి మారినా మారతారు. కాబట్టి ఎలాగైనా దేవాలయాల్లోకి పోకుండా మొగ్గలోనే తుంచేయాలనుకున్నారంట. వెంటనే ఫాదర్లంతా ఎవరి చర్చి దగ్గర వాళ్ళు సమావేశాలేర్పాటు చేశారట.

'మనమంతా దేవుని బిడ్డలం. ప్రభువును తప్ప ఎవర్నీ పూజించం. మనం పోయి మన జీసస్‌ని గాదని వాళ్ళ దేవుళ్ళకి టెంకాయలు కొట్టడమేంది.... పూజించడమేంది... అలా చేస్తే జీసస్ మిమ్మల్ని క్షమిస్తాడా... మీరేం భయపడొద్దండి. రామని చెప్పండి. మేం క్రిష్టియన్లమని ధైర్యంగా చాటండి. మీ వెనుక మేమున్నాం. చర్చి వుంది. జీసస్ వున్నాడు. బలవంతం చేస్తే కర్నూల్లో ర్యాలీ చేసి కలెక్టర్‌కు ఫిర్యాదిద్దాం' అంటూ నూరిపోశారట" సేకరించుకొచ్చిన సమాచారాన్నంతా సవివరంగా చెప్పాడు.

ఎస్సై తీవ్రంగా ఆలోచించసాగాడు. ఎస్పీ చాలా స్ట్రిక్టు. కర్నూల్లోని ప్రతి పల్లెలోనూ కార్యక్రమం విజయవంతంగా జరిపించి నివేదికలు అందచేయమని అందర్నీ ఆదేశించాడు. ఏ మాత్రం మిస్టేకైనా ఏ మారుమూల పల్లెకో ట్రాన్స్‌ఫరవడం గ్యారంటీ. ఇక్కడేమో పరిస్థితి ఇలా వుంది. జాగ్రత్తగా డీల్ చెయ్యాల. ఎలా... ఎలా... బుర్ర బద్దలు కొట్టుకోసాగాడు. చెమటలు కారసాగాయి. అంతలో ఠక్కున ఓ ఉపాయం తోచింది. ముఖం సంతోషంతో వెలిగిపోయింది. చిరునవ్వు పెదాల మీదకి పరుగెత్తుకోనొచ్చి చేరింది. ఉత్సాహంగా జీపెక్కి "రేయ్... పంచాయితీ ఆఫీస్కాడికి పోనియ్రా" అన్నాడు. పంచాయితీ ఆఫీసులో ఓ గంటన్నరలో తనక్కావలసిన సమాచారం, పేపర్లు తీసుకున్నాడు. పోలీసుల్తో మాలోళ్ళ చర్చికాడికి చేరుకున్నాడు.

ఎస్సైని చూడగానే మాలోళ్ళ గుండెలు దడదడా కొట్టుకోసాగాయి. ఇదేం పీడరా భగవంతుడా అనుకుంటూ భయంభయంగా చూడసాగారు. ఎస్సై పేపర్ చేతిలోకి తీస్కోని "సాములు, ఎల్లన్న, పుల్లన్న, మల్లయ్య..." అంటూ వరుసగా కొన్ని పేర్లు చదివి "రేయ్... ఇప్పుడు పేర్లు చదివిన్లా... వాళ్ళందరూ ఇట్రండి" హుంకరించాడు. భయపడ్తా ఒకొక్కడే వచ్చి చేతులు గట్టుకోని నిలబన్నారు. "ఎక్కండ్రా జీపు" ఆర్డరేశాడు. అంతలో చర్చి ఫాదర్ శామ్యూల్ అడ్డం పన్నాడు.

"చూడండెస్సైగారూ... ఇంతకు ముందే మీ వాళ్ళకు చెప్పాం. ఇక్కడెవరూ హిందువుల్లేరనీ... గుళ్ళలోకి రారనీ. మళ్ళా మీరు బలవంతంగా తీస్కపోయి మాతో హిందూ దేవుళ్ళకి టెంకాయలు కొట్టించడం ఏమీ బాలేదు. ఈ విషయం కర్నూల్లో చర్చి ఫాదర్లకు తెల్సిందనుకోండి.... పేపర్లకెక్కుతాది. గొడవలైతాయి. ఆపైన మీ ఇష్టం" బెదిరించాడు.

ఆ మాటలకు ఎస్సై చిరునవ్వు నవ్వి "అరెరే... నాక్తెలీదే... కంప్లయింట్ చేస్తారా... చేస్కోమనండి... మాకేం భయం. ఐనా అంతట్తో ఐపోతాదా... ఆ తరువాతుంటాది ఒకొక్కనికి. క్రిష్టియన్లా మీరు... మరి ఎస్సీలమని చెప్పి లోన్లు, పక్కా యిండ్లు, స్కాలర్షిప్పులు నొక్కేసినారే... ఎవడెవడేమేమి తెచ్చుకున్నాడో ఇదిగో మొత్తం లిస్టు పట్టుకొచ్చినా. మర్యాదగొచ్చి చెప్పిన పని చెప్పినట్టు చేయండి. లేదంటే ఎస్సీలని గవర్నమెంటును మోసం చేసినందుకు బొక్కలేసి బొమికలిరగ్గొట్టాల్సొస్తాది" అంటూ ఎల్లయ్య వైపు తిరిగి "ఏరా... ఎల్లిగా... ఇప్పుడు చెప్పు... నువ్వు క్రిష్టియన్వా.... హిందువ్వా" లాఠీ రెండు వేళ్ళ మధ్య గిరగిరా తిప్పుతూ విలాసంగా ప్రశ్నించాడు.

ఎల్లయ్య అదిరిపన్నాడు "అయ్య బాబోయ్... నేను పక్కా హిందువున్సార్. కావాలంటే మా ఇంట్లోకొచ్చి చూస్కోండి. గోడ మీద యెంకటేసుల సామి బొమ్మంటాది... దేవాలయంలోకి పోడానిక్కాదు మా బాధ. ఆ తర్వాత పూరోళ్ళు మా మీద పడి ఏమగాయిత్యం చేస్తారోనని భయపడి అబద్ధం చెప్పా" గబగబా చెప్పాడు.

"అదే గదా మీ భయం. మేం చూస్కుంటామ్లే అదంతా... హిందువులందరూ రండి" అన్నాడు. జనాలు ఒకొక్కరే బైటకొచ్చారు. చర్చి ఖాళీ అయింది. శామ్యూలొక్కడు మిగిలిపోయాడు. ఎస్సై శామ్యూల్ వంక చూస్తూ "నువ్వు రావా... నీ అసలు పేరు సుబ్బయ్యనుకుంటానే" అన్నాడు. శామ్యూల్ అదిరిపడి "ఇగో... వస్తున్నా సార్. తాళమెక్కడ పెట్టానా అని ఆలోచిస్తున్నా" అంటూ గబగబా తలుపులేసి బైటకొచ్చాడు.

✧ ✧ ✧

ఎస్సై హెడ్ కానిస్టేబుల్ని పేపరిచ్చి "మాదిగోళ్ళ చర్చికాడికి పోండి. ఏం చేయాల్నో అర్థమైంది గదా. ఆళ్ళనీ, ఈళ్ళనీ అందర్నీ తీస్కోని గుడికాడికి రాండి" అంటూ జీపెక్కాడు.

ప్రెసిడెంట్ గజేంద్రారెడ్డి ఇంటి ముందుకి హిందువులు ఒకొక్కరే చేరుకోసాగారు. క్షణక్షణానికి గుంపు పెద్దగ కాసాగింది. ఇంటా బైటా జనాల్తో నిండిపోసాగింది. అందరి ముఖాల్లోనూ అసహనం పెరిగిపోతా వుంది. కొంతమంది తాగి బూతులు తిడ్తా వున్నారు. ఆగ్రహం కట్టలు తెంచుకోసాగింది. అంతలో రామాలయ పూజారి అక్కటీజీకొచ్చాడు. అందరి తరఫునా గజేంద్రారెడ్డితో,

"కలికాలం... కలికాలంగానీ... లేకపోతే మాలోళ్ళు మాదిగోళ్ళేంది. మన గుళ్ళో టెంకాయలు కొట్టడానికి రావడమేంది. ఎవరన్నా వింటే కింది నుంచి నవ్విపోతారు. ఇంతవరకూ ఇలాంటివి

ఎప్పుడన్నా జరుగుతాయని కలలోనైనా అనుకున్నామా... వాళ్ళడుగు పెడ్తే యేమైపోతాడు దేవుడు. యెంతపచారం... రామరామ... వూరు నాశనమైపోటానికే ఇవన్నీ. ఐనా వూర్లో ఇంతమంది కాపోళ్ళుండి కూడా ఏమీ చేయలేదంటే ఎవనికవమానం. రేప్పొద్దున బజార్లో ఆ నాకొడుకుల ముందు తలకాయలాడపెట్టుకుంటారు" మంట ఎగదోశాడు.

గజేంద్రారెడ్డికి ఏం చేయాల్నో పాలుపోలేదు. తల గోక్కుంటూ "ఏం చేయమంటార్రా... ఇప్పుడు గవర్నమెంటు ఆళ్ళ పక్కనుంది. తుమ్మినా దగ్గినా ఎస్సీ ఎస్టీ కేసంటున్నారు. ఆ పైన పీక్కోలేక సావాల" అన్నాడు.

ఆ మాటింటూనే ఒకడు కోపంతో వూగిపోతూ "యేంది రెడ్డీ... కేసుల్కేసులని భలే భయపడిస్తున్నావ్. పెచిగ్గిమను. ఐనా మనకే వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పేంత దమ్ముందా వాళ్ళకు. తలకాయల్లేచిపోతాయ్. నువ్వు వూ అను. మిగతాది మేం చూస్కుంటాం" అన్నాడు.

అంతలో పోలీస్ కానిస్టేబుల్ అక్కడికొచ్చాడు. అందరూ కోపంగా వాని వంకే చూడసాగారు. గజేంద్రారెడ్డి నమస్కారం చేసి "రెడ్డీ... ఎస్సై పిల్చుకు రమ్మన్నాడు. ప్రెసిడెంట్ చేతుల మీదనే దళితుల ఆలయ ప్రవేశం జరగాలంట. బెరీన రండి" అన్నాడు. గజేంద్రారెడ్డి ఏం చేయాల్నా అని ఆలోచిస్తూ దేవాలయం దగ్గరికి బైల్దేరాడు. జనాలు ఆవేశంతో అతని వెంట గుంపుగా కదిలారు.

దేవాలయం ముందు ఏసుపాదం, రాబర్ట్, ఫ్రాన్సిస్, బీవర్, డేవిడ్... అందరూ వరుసగా టెంకాయలు పట్టుకోని నిలబన్నారు. గజేంద్రారెడ్డిని, అతని వెనుక వస్తున్న వూరోళ్ళను చూడగానే భయంతో వాళ్ళ కాళ్ళు వణకసాగాయి. తమనెలాగైనా కాపాడమని యేసు ప్రభువును మనసులోనే వేడుకోసాగారు.

గజేంద్రారెడ్డి వచ్చీరాగానే ఎస్సైతో "చూడండ్సార్... హిందువులెవరూ దీనికొప్పుకోడంల్యా. గొడవలు జరిగేట్టున్నాయి. ఐనా ఎవరి దేవుళ్ళు వాళ్ళకున్నారు గదా. వాళ్ళకు చదిజ్జీ వుంది. మాకు గుడుంది. తురుకోజుకోల్లకు మసీదుంది. ఒకరిదాంట్లోకి ఇంకొకళ్ళని తీస్కపోడమేంది. ఇంతవరకూ ఈ వూర్లో ఇట్లాంటివి జరగల్యా. రావాలని వాళ్ళకూ లేదంట. మధ్యలో మీరేంది గుంజుకోనొచ్చి లోపలికి దొబ్బేది. ఇదేం బాలేదు. చచ్చినా వాళ్ళు లోపలికి అడుగు పెట్టలేరు" కరాఖండీగా చెప్పేశాడు.

"అడుగు పెడ్తే ఏమౌతాది" ఎస్సై చిరునవ్వుతో ప్రశ్నించాడు. గజేంద్రారెడ్డికి ఆ నవ్వు చూడగానే వళ్ళు మండిపోయింది. కళ్ళు ఎరుపెక్కాయి. పండ్లు పటపటలాడాయి. "చెప్పాల్నా... ఎందుకులే... నువ్వే చూద్దువు గానీ" ఆగ్రహంగా అన్నాడు.

"అలాగా... సరెసరేగానీ... కొంచమిలా పక్కకురా... నీతో మాట్లాడాల" అంటూ జీపు దగ్గరికి తీస్కపోయాడు.

"చూడు రెడ్డీ... ఇది ఎస్పీ ఆర్డర్. తెల్సుగదా ఎస్పీ గురించి, జాగ్రత్త. ఎన్‌కౌంటర్లై పోగలవ్. నీవీరోజు అడ్డుపడొచ్చు. అంత మాత్రాన ఆగుతాదా... రేపు నీమీద ఎస్సీ ఎస్టీ కేసు పెట్టి

లోపలేయాల్సొస్తాది. నీ వెనుకున్నోళ్ళగ్గూడా చెప్పు. బెయిల్ గూడా దొరకదు" కటువుగా చెప్పాడు.

గజేంద్రారెడ్డి ఒక్క క్షణమాలోచించి "ఐనా వాళ్ళు ఎస్సీలైతే గదా... కేసు... వాళ్ళంతా క్రిష్టియన్లు" ఠక్కున అన్నాడు.

"అలాగా... సరే... క్రిష్టియన్లనే అనుకుందాం. మరి వీళ్ళకు ఎస్సీ కోటా కింద లోన్లు, బోరింగులు... ఇప్పిచ్చింది నువ్వేగదా. లంచం తీస్కోని క్రిష్టియన్లని ఎస్సీలని రికమెండ్ చేసినందుకు నిన్ను లోపలేస్తా. అదింకా పెద్ద కేసు. ఏమంటావ్"

ఆ మాటలింటూనే గజేంద్రారెడ్డికి ముచ్చెమటలు పోశాయి. నోరు పెగల్లేదు. కాళ్ళూ చేతులు వణికాయి. తలొంచుకోని తిరిగి తనవాళ్ళ దగ్గరికి చేరుకున్నాడు. గజేంద్రారెడ్డి పరిస్థితి చూడగానే ఎస్సై పెదాల మీద చిరునవ్వు పాదరసంలా ప్రవహించసాగింది. దేవాలయ ప్రవేశానికి ఏర్పాట్లు చేయసాగాడు. పూజారిని పిలిపిచ్చాడు.

వూరువూరంతా అక్కన్నే వుంది. హిందువులు మాలమాదిగల్ని మింగేసేలా చూస్తున్నారు. వాళ్ళ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలాగుంది. ముస్లిమ్లందరూ చుట్టూ చేరి నవ్వుకుంటూ ఏం జరగబోతూందా అని ఆసక్తిగా చూస్తున్నారు. వాళ్ళలో కొందరు హిందువుల ముఖాలు చూసి నవ్వాపుకోలేక పక్కకు తిరిగి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ, ఒకర్తో ఒకరు జోకులేసుకుంటున్నారు.

గజేంద్రారెడ్డికి ఏం చేయాల్నో పాలుపోవడం లేదు. ఓటమిని భరించలేకుంటున్నాడు. అసలే పంచాయితీ ఎలక్షన్లొస్తున్నాయి. వెనకడుగేస్తే పుట్టగతులుండవ్. శంకర్రెడ్డి ఈ సారి ఎలాగైనా గెలవాలని సర్వశక్తులూ ఒడ్డుతున్నాడు. ఇప్పుడు గనుక దీన్ని ఆపకపోతే జనాల మధ్య పరువు పోతాది. ఎలా... ఎలా... తీవ్రంగా ఆలోచించసాగాడు. నవ్వుకుంటున్న ముస్లిమ్లని చూడగానే మెరుపులాంటి ఆలోచనొచ్చింది. ఒళ్ళు ఆనందంతో పులకరించింది.

నెమ్మదిగా రెండడుగులు ముందుకేసి అందరికీ వినబడేటట్లుగా "చూడండెస్సైగారూ... మనుషులంతా ఒక్కటే అంటున్నారు. అందరికీ దేవుడొక్కడే అంటున్నారు. గుడైనా, చర్చైనా, మసీదైనా అందరికీ ప్రవేశముండాలంటున్నారు. సరే, మీరు చెప్పేది బానే వుంది. మీ మాట కాదనం. కానీ... వీళ్ళని గుళ్ళోకేగాదు, మసీద్లోక్కూడా తీస్కపోవాల. అట్లాగైతే ఒప్పుకుంటాం. మాకభ్యంతరమ్లా" అన్నాడు.

సమస్య తొలగిపోతుందనే సంతోషంతో ఎస్సై "దాన్దేముంది. అలాగే చేపిస్తాం. ఆలయ ప్రవేశం పూర్తికాగానే, మసీద్లోక్కూడా తీస్కపోయి నమాజు చేపిద్దాం" తేలిగ్గా అనేశాడు.

ఆ మాటినగానే ముస్లింలలో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. అంతవరకూ వినోదం చూస్తున్న వాళ్ళ ముఖమ్మీద నవ్వు ఠక్కున మాయమైంది. "యా అల్లా" అంటూ కొందరు చెవులు మూసుకున్నారు. నిమిషాల్మీద వార్త వూర్లోకి పాకిపోయింది. మొల్లోళ్ళు, ముస్లిమ్లలో పెద్ద రైతులు, వ్యాపారులు వురుకులు పరుగుల మీద ఆడికి చేరుకోసాగారు. గుంపు మరింత పెద్దగైంది. తొక్కిసలాట

పెరగసాగింది. ముస్లింల మొఖాలు కోపంతో ఎరుపెక్కి పోయాయి.

పెద్ద మొల్లాసాబ్ గబగబా ఎస్సై దగ్గర్కొచ్చి "చూడండ్సార్. మీరూ మీరూ కొట్లాడుకోని మధ్యలో మా మసీదునెందుకు తెస్తున్నారు. ఈ కాఫిర్గాళ్ళు మా మసీద్లోకి అడుగు పెట్టడానికి వీళ్ళేదు. గుళ్ళను పాడు చేయడమే గాకుండా, ఇప్పుడు మసీదులను గూడా అపవిత్రం చేయాలనుకుంటున్నారా... అదే గనుక జరిగితే వాళ్ళో... మేమో ఒకరమే మిగిలేది" కఠినంగా హెచ్చరించాడు.

గజేంద్రారెడ్డి తన ప్లాన్ విజయవంతమయినందుకు లోలోన ఆనందపడసాగాడు. ఎక్కడ వీళ్ళంతా ఆలయ ప్రవేశం చేస్తారో, కర్నూల్లో చర్చి పెద్దలకు ఏమని సమాధానం చెప్పుకోవాల్నో అని గింజుకులాడుతున్న శామ్యూల్‌కు ఈ పరిణామం ఆనందాన్ని కల్గించింది. బ్రాహ్మణ పుత్రికైన అంటరానితనం పల్లెల్లో హిందువుల్లోకే గాక, ముస్లిమ్లలోకి కూడా పాకిందని అంతవరకూ తెలియని టౌను ఎస్సై పెదాల మీద అప్రతిహతంగా వెలుగొందుతున్న చిరునవ్వు నెమ్మదిగా ఆరిపోవడం మొదలుపెట్టింది.

ఎస్సై పెద్ద మొల్లాసాబ్కు సర్ది చెప్పడానికి ప్రయత్నించసాగాడు. అంతలో ఒకడు గుంపులోంచి "రేయ్... సాలే... దిమాఖ్‌గానీ ఖరాబైందా... తెరిమాకీ... ఇళ్ళలోకే రానియ్యం. అట్లాట్టి ఈ ముర్దార్తినే నా కొడుకుల్ని మసీదుల్లోకి రానిస్తామా... వచ్చినోళ్ళవే గాదు, పంపించినోళ్ళవి గూడా తలకాయలెగుర్తాయ్... ఏమనుకుంటున్నారో" ఆగ్రహంతో గట్టిగా అర్చాడు.

"అదీ భాయ్... అలా చెప్పు... ఈ సువర్కాబచ్చాగాళ్ళు మసీదుల్లోకి రావడమేంది? హిందువుల్మాదిరి మనమేమన్నా గాజుల్తొడుక్కున్నామా... చూస్తూ వూకోడానికి" ఇంకొకడన్నాడు.

ఆ మాటినగానే హిందువుల మొఖాలు రంగులు మారాయి. అవమానంతో కళ్ళు ఎరుపెక్కాయి. పండ్లు పటపటలాడాయి. పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"అంటే మేమేనా గాజుల్తొడుక్కోనింది. పోతే గుళ్ళోకి, మసీద్లోకీ పోవాల... లేదంటే ల్యా... వాళ్ళేగాదు మొగోళ్ళు. మేమూ చూపిస్తాం మా తడాఖా యేంటో" ఒకడు ఒక్కుదుటున ముందుకొచ్చి ఆవేశంగా తొడగొట్టి మీసం తిప్పాడు.

ఎస్సైకి ఏం చేయాల్నో పాలుపోలేదు. అగ్నికి ఆజ్యం తోడైనట్టుంది. హిందువులూ, ముస్లిమ్లూ రగిలిపోతున్నారు. ఏ క్షణంలోనైనా గొడవ పెద్దగయ్యేటట్టుంది.

అంతలో పోలీసోడొకడు ఎస్సై చెవిలో "సార్... మనం ఈన్నించి జండా ఎత్తైడం మంచిది. కావాలంటే రేపు పెద్దయెత్తున ఎస్కార్ట్‌తో వద్దాం. గుంపు చివర కొంత మంది కట్టెలు, రాళ్ళు సిద్ధం చేసుకుంటున్నారు. మనముండేదా పదిమంది. ఏమీ చేయలేం. అసలు మాలోళ్ళ చర్చిలోనికి మాదిగోళ్ళను గానీ, మాదిగోళ్ళ చర్చిలోనికి మాలోళ్ళను గానీ రానియ్యరు. అట్లాంటిది మనం ఏకంగా మసీదూ, గుడి అంటున్నాం. జాగ్రత్తగా వుండాల. వూకున్న వూర్లో అనవసరంగా పొగబెట్టామని

జనాలకు మన మీద కోపం పెరిగిపోతా వుంది. గొడవయ్యిందనుకో.... ఆళ్ళూ ఈళ్ళూ కల్సి తన్నినా తంతారు. మూర్ఖపు నా కొడుకులు" గుసగుసగా చెప్పాడు.

శామ్యూల్ ఇద్దరి మధ్యా జొరబన్నాడు. "సార్... ఎందుకొచ్చిన గొడవ. మందిరమూ వద్దు... మసీదూ వొద్దు... మా మానాన మమ్మల్ని వదిలేయండి. మా చర్చీకి మేం పోతాం. ఇంతవరకూ హిందువులే అనుకుంటి. ఇప్పుడు ముస్లింలు కూడా తోడైనారు. ఈ రోజు మీరు లోపల్కి తీస్కపోయినా... తర్వాత మమ్మల్ని ప్రశాంతంగా బతకనివ్వరు. వెలేస్తారు. పనుల్లోకి పిల్చరు. చస్తాం" బతిమలాడాడు.

ఎస్సై ఆలోచన్లో పన్నాడు. ఓటమిని ఒప్పుకోడానికి అహం అడ్డొచ్చింది. పోలీస్ పవర్ ధైర్యాన్నిచ్చింది.

"రేయ్... అందర్కీ చెబ్తున్నా... ఐదు నిముషాల్లో ఇక్కడెవ్వడూ వుండగూడదు. పోలీసుల్తోనే తమాషాలాడ్తున్నార్రా మీరు. ఇది గవర్నమెంట్ ఆర్డర్. ఎవడైనా అడ్డమొచ్చాడనుకో... కాల్చి పాడేస్తా... కొడుకుల్లారా... ఏమనుకుంటున్నారో" కోపంగా ఆర్డరేశాడు.

"ఏందిరా నువ్ కాల్చేది. అసలు మీరిక్కన్నుంచి యెల్తేగదా... ఎయ్యేంద్రా నా కొడుకుల్ని"

"మారో సాలోంకో... ముసల్మానోంకో పాగల్ సమఝ్తా హై... క్యా... హమారా తాఖత్ దిఖాయేంగే"

క్షణాల్లో అరుపులు, కేకలు వూపందుకొన్నాయి. ఎవడేం మాట్లాడ్తున్నాడో ఎవనికీ వినబడ్డం లేదు. హిందువుల గుంపులోంచి ఎవడో రాయి తీస్కోని ఎస్సైని ఈడ్చికొట్టాడు. తల చిట్లి రక్తం బొట్లు బొట్లుగా కారసాగింది. ఎస్సై ఆగ్రహంతో వూగిపోతూ "ఎవడ్రా నాకొడుకు... పట్కోండ్రా వాన్ని" పోలీసులనుద్దేశించి గట్టిగా అర్చాడు. పోలీసులు లాఠీలతో గుంపు మీదకి ఒక్కసారిగా దుంకారు. దొరికినోన్ని దొరికినట్టుగా చావబాదసాగారు. జనాలు వెనక్కు పోయినట్లేపోయి ఒక్కసారిగా ముందుకు దుంకారు. రాళ్ళు వర్షంలా కురవసాగాయి. పోలీసుల తలలు టపటపా పగలసాగాయి. ఎస్సై పోలీసుల్తో సహా రాళ్ళు మొఖానికి తగలకుండా చేతులడ్డం పెట్టుకోని పరుగెత్తుతూ రామాలయ ప్రవేశం చేసి తలుపులు మూసుకున్నాడు.

"హిందువులంటే అంత చులకనై పోయిందిరా మీకు. వూకుంటున్నాం గదాని వూరి చివరి నాయాల్లందర్నీ వూరి మధ్య దేవాలయంలోకి తీస్కొస్తార్రా... నరుకుతాం నా కొడుకుల్లారా ఒక్కొక్కన్నీ" గజేంద్రారెడ్డి ఎలక్షన్లని గుర్తు చేసుకుంటూ గర్జించసాగాడు.

"అరే సాలే ఆరే బాహర్కో... తెరిమాకీ... మసీదు ముందే ఒకొక్క నా కొడుకునీ జవా చేసి... అల్లాకు నైవేద్యం పెడ్తా" పెద్ద మొల్లాసాబ్ కదం తొక్కసాగాడు.

పోలీసులు లోపల గడేస్కోని ప్రాణభయమ్తో వణకసాగారు. బైట్నుంచి బూతులు, సవాళ్ళు వినబడ్తున్నాయి. తలుపుల్ని దబదబా బాదుతున్నారు. గొడవ ఎప్పుడు సద్దుమణుగుతాదో అర్థం కావడమ్లేదు. పైనుండి తమకు సహాయంగా ఎవరన్నా వచ్చేవరకూ ఇంతే గతి అనుకున్నారు.

బైట జనాల్లో ఆవేశం పెరిగిపోతా వుంది. గొడవ గురించి తెల్సి వూర్లోని మిగతా హిందువులూ, ముస్లిమ్లూ ఆవేశంతో, ఆయుధాల్తో అక్కడికి చేరుకుంటున్నారు. అంతలో ఒకడు ఎస్సీల వేపు తిరిగి అన్నాడు.

"అసలు ఆనాకొడుకులను గాదు అనాల్సింది. వాళ్ళు రమ్మంటే... వీళ్ళు రామనేదిల్యా... బోర విరుచుకోని టెంకాయలు పట్టుకోని గుళ్ళోకి, మసీద్లోకి రాడానికి తయారు కావడమేనా... తెలీదా ఈ నా కొడుకులకి మనూరి కట్టుబాట్ల గురించి... బరితెగించినారీ మధ్య... ముందీనాకొడుకులని తన్నాల"

వెంటనే మరొకడన్నాడు "అచ్ఛా బాత్ బోలా భాయీ... మన మసీదుల్లోకీ, గుళ్ళలోకి ఇంగోసారి కలలో గూడా తొంగి చూడకుండా బుద్ధి చెప్పాలి నా కొడుకులకి"

హిందువులు, ముస్లిమ్ల చూపులు ఒక్కసారిగా ఎస్సీలవైపు తిరిగాయి. ఎస్సీల కాళ్ళు వణికాయి. పరిస్థితి అర్థమైంది. ప్రాణభయంతో ఒక్కసారిగా అడ్డమొచ్చినోళ్ళందర్నీ తోసుకుంటూ తలోదిక్కూ శక్తి కొద్దీ పరుగెత్తసాగారు.

"పట్టుకోండ్రా నా కొడుకుల్ని"

"మారో సాలోంకో"

కట్టెల్తో, రాళ్ళతో హిందువులూ, ముస్లిమ్లూ పోలీసోళ్ళనొదిలేసి ఎస్సీల వెంట పన్నారు. జరగబోయే దారుణాన్ని చూల్లేక సూర్యుడు మబ్బుల చాటుకి తప్పుకున్నాడు.

**మూడు అబద్దాలు కథాసంపుటి - జూలై 2005**

# చిచ్చు

బోయ వెంకటేశ్వర్లు, గొల్ల లక్ష్మన్న, గొల్ల రాముడూ నిశ్శబ్దంగా రెడ్డింటివైపు నడుస్తూ వున్నారు. ఎవరూ ఏమీ మాట్లాడుకోవడంలేదు. ముగ్గురి మొఖాలు దిగులుగా... నీరసంగా... పీక్కుపోయి వున్నాయి. మనసు నిండా బైటకు చెప్పుకోలేని ఒకటే బాధ. దానికి తోడు రెడ్డింటి దగ్గర పంచాయితీ ఏమవుతుందో అనే భయం.

వాళ్ళకి మాటిమాటికీ రోడ్డు మీద చెల్లాచెదురై... నుజ్జునుజ్జై... రోడ్డంతా ఎర్రబారిన భయంకర దృశ్యమే కండ్ల ముందు కదలాడుతా వుంది. చివరిసారిగా ఆ జీవాలు పెట్టిన కేకలూ... చావుబతుకుల మధ్య పెనుగులాడతా మూలిగిన మూలుగులూ చెవుల్లో గింగురుమంటూ వున్నాయి.

ఆ మసక మసక వెలుగులో... ఒకటి కాదు... రెండు కాదు... దాదాపు అరవై... డెబ్భైదాకా... కేవలం రెండంటే రెండు క్షణాల్లో... కండ్లు మూసి తెరిచేంతలోగా... ఆరునెల్లుగా పగలనకా రాత్రనకా కండ్లలో వత్తులు పెట్టుకొని కాపాడుకున్న జీవాలు... ఒక్కసారిగా కుప్పకూలిపోయి... నేలను కరచుకొని... భవిష్యత్తుని అంధకారం చేస్తూ... వర్తమానాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తూ....

ముగ్గురి కళ్ళ నుండి కన్నీళ్ళు ఆగాగి కారసాగాయి. ఎవరూ చూడకుండా భుజమ్మీది సెల్లతో తుడుచుకుంటున్నారు. ఎంతాపుకుందామన్నా ఆలోచనలు ఆగడం లేదు. జరిగినవన్నీ పదేపదే గుర్తుకు రాసాగాయి.

✧ ✧ ✧

పైనా కిందా ఒకటే సెగ. రాళ్ళు నిప్పు కణికల్లెక్క భగభగభగ మండిపోతున్నాయి. వేడిగాలి ఆగాగి ఈడ్చీడ్చి కొడ్తా వుంది. పెదాలు మాటిమాటికీ తడారిపోతున్నాయి. చెమట మొహమ్మీద నుండి కారి కింద పడగానే ఆవిరయిపోతా వుంది.

గాలి వీచినప్పుడల్లా గలగలమని ఆకులు రాలిపోతున్న ఒక చెట్టు కింద కూర్చున్న రాముడూ, లక్ష్మన్న తువ్వాలుతో మొహం తుడుచుకొని అటూ యిటూ చూస్తూ వున్నారు. మేకలు ఫారం బుడ్డలు, తుమ్మాకు, దెంతాకు, బండాకు అక్కడక్కడ కనిపిస్తున్న గొట్టకాయ చెట్లూ, కలబంద మొక్కలూ ఆబగా తింటా వుంటే.. గొర్రెలు పచ్చగడ్డి దొరక్క ఒట్టిగడ్డినే పెరుక్కోని పెరుక్కోని తింటూ వున్నాయి.

అంతలో బోయెంకటేశులు తింటూ తింటూ దూరం పోయిన గొర్రెలను తోలుకోనొచ్చి మందలో కలిపి వాళ్ళ పక్కనే కూలబడ్డాడు.

గొల్ల లక్ష్మన్న పక్కనే వున్న నీళ్ళబాటిల్లోని నీళ్ళు తాగుతూ "రేయ్... రాములూ... లాభం లేదురా... రోజురోజుకీ వానదేముడు వీపు చూపిస్తా వున్నాడు. గట్టుమీదున్న కాస్త చెట్టు చేమా గూడా రేపో ఎల్లుండో అనేటట్లుంది. ఇంగ మనకు శ్రీశైలం అడవులు దప్ప ఏమీ గతి లేదు. ఆడయితే పచ్చిసెత్తనో... ఒట్టిసెత్తనో... ఏదో ఒకటి కావలసినంత దొరుకుతాది" అన్నాడు.

గొల్లరాముడు చెవి పక్కనున్న బీడీ తీసి ముట్టించి రెండుదమ్ములు గుప్పుగుప్పుమని లాగి "దీనెమ్మ... మొన్నమొన్నటి వరకూ శివరాత్రిదాకా శివశివా అంటా చలికి వణికిపోయేటోళ్ళం. ఇప్పుడేం పోయేకాలమొచ్చిందో... ఏమో... సంకురాత్రి దాటగానే సూరీడు ధుమధుమలాడుకుంటూ సిందులు తొక్కుతా వున్నాడు. ఈడుంటే అంతే... ఇప్పటికే జీవాలకు తిండి దొరకక కడుపులు కరుచుకుపోయినాయి. ఎర్రసంజన్న పొలంలో నిలపడమైపోగానే బైలుదేరుదాం" అన్నాడు.

వెంకటేశులు బోయోడు. వాన్ది ఆ వూరు కాదు. పక్కనే వున్న బండమీది తాండ్రపాడు. ఈ వూర్లో పిల్లను చేసుకున్నాడు. మామకు మొగపిల్లల్లేరు. కూతురొక్కతే. పుట్టినూర్లో నాలుగెకరాల బైలు పొలమున్నా కూటికి చాలక, కరువు కాలంలో కూలిపనులు దొరక్క వచ్చిన కాడికి భూమినమ్ముకోని, తట్టా బుట్టా సర్దుకోని మామోళ్ళింటికి చేరుకున్నాడు. వ్యవసాయం మీద రోతబుట్టి భూమి అమ్మగా వచ్చిన డబ్బు పెట్టి ఒక నలభై గొర్రెపిల్లలని కొనుక్కొచ్చుకున్నాడు. దాండ్లకు ఏయే రోగాలొస్తాయి, ఏమేం మందులెయ్యాల, ఏఏ కాలాల్లో తిండెక్కడ దొరుకుతాది... ఇట్లాంటివి ఏమీ తెలీకపోవడంతో రాముడూ, లక్ష్మన్నల మందతో పాటు తనవి గూడా కలిపి వాళ్ళెంబడే తిరుగుతూ ఒకొక్కటే నేర్చుకుంటూ వున్నాడు. శ్రీశైలం అడవులనగానే వానికి అనుమానమొచ్చి –

'అవ్‌రా... అడవిలోకి పోతే ఫారెస్టోళ్ళు వూకుంటారా' అనడిగినాడు. దానికి రాముడు నవ్వి 'ఆ నా కొడుకులు చూస్తే వూరుకోరనుకో. ఐనా ఇది మనకీ కొత్తగాదు... ఆళ్ళకీ కొత్తగాదు, మొగుడూ పెండ్లాల పీకులాట మాదిరి తెగదూ... తెల్లారదు. ఒగటో రెండో కోరుకున్న జీవాలు చేతిలో పెడ్తే ఆళ్ళే గమ్మునుంటారు. అప్పుడప్పుడు మాత్రం కేసుల్లేవని లోపలికి తోసి వందో రెండొందలో ఫైనేస్తా వుంటారు' అన్నాడు.

మాటల్లోనే నెమ్మదిగా సూర్యుడు కొండ దిగడం మొదలుపెట్టినాడు. చీకటి పడ్తే కష్టం. మధ్యలో పెద్ద రోడ్డు దాటాల. లారీలోళ్ళు కిందా మీదా చూసుకోకుండా కొంపలేవో మునిగినట్లు దూసుకొని పోతుంటారు. ఏ మాత్రం ఏమరుపాటుగా వున్నా జీవాలు పచ్చడిపచ్చడయి పోతాయి. అందుకే రాముడు 'తొందరగా అన్నిట్నీ ఒగచోటికి కుప్ప చేయండి. సీకటైపోతా వుంది' అంటూ పక్కనే వున్న కంబళి భుజమ్మీదేసుకోని... ఒక చేత్తో కట్టె, మరో చేతిలో నీళ్ళ బాటిలూ పట్టుకోని పైకి లేచినాడు. లక్ష్మన్న, వెంకటేశులు గూడా లేచి 'ఛయ్... ఛయ్... ఫ... ఫ...' అంటూ దూరం

పోయిన వాటన్నింటినీ ఒకచోటికి తోలుకొచ్చినారు.

ముందుగా లక్ష్మన్న ఒక మేకను పట్టుకోని నడుస్తూ వుంటే... వాని వెనకాలే జీవాలన్నీ ఒకదానెంబడొకటి వరుసగా పోసాగాయి. అవి అక్కడా యిక్కడా ఆగకుండా రాముడూ, వెంకటేశులూ కట్టెతోని అదిలిస్తా... కదిలిస్తా... నెమ్మదిగా గట్టు దిగిపోవడం మొదలుపెట్టినారు. అదే పంటల కాలమయితే ఏ మేక ఏ చేనులోకి జొరబడుతుందో... ఏ గొర్రె ఎవని పంటను పాడు జేస్తుందో... అని భయపడ్తా... భయపడ్తా... ఒళ్ళంతా కండ్లు జేసుకోని కాపలా కాసుకుంటూ రావాలి. పొరపాట్న చేనులోకి పోయి వూరి కావలిగాండ్ల కంట పన్నాయంటే... అంతే.. వందో రెండొందలో పాడు చేసిన పంటను బట్టి తప్పు కట్టి బందెలదొడ్డి నుండి ఇడిపించుకోని రావాల్సొస్తాది.

ఎండాకాలం కాబట్టి పంటలన్నీ రైతుల ఇండ్లకు చేరిపోయినాయి. ఏ చేన్లోకి పోయినా ఏమీ కాదు కాబట్టి, వాళ్ళకు కాస్త ఆటవిడుపుగా వుంది. కులాసాగా మాట్లాడుకొంటూ నడువసాగారు.

అట్లా నడుస్తూ వుంటే గొల్ల రాముడు పొద్దుపోక 'అర్రా ఎంకటేశులూ... నాదో చిన్న అనుమానం... బెస్తోళ్ళు చేపలు పడితే, మంగలోళ్ళు నెత్తులు గీకుతారు. చాకలోళ్ళు గుడ్డలుతికితే, మేదరోళ్ళు తడికలల్లుతారు. కుమ్మరోళ్ళు కుండలు చేస్తే, బాపనోళ్ళు పూజలు చేస్తారు. ఇట్లా ఈ ప్రపంచంలో ఒక్కో కులానికి ఒక్కో పనుంది గదా... కానీ... మీ కులానికెందుకురా... ఏ పనీ లేదు' అనడిగినాడు.

దానికి బోయెంకటేశులు కాస్త ఆలోచించి నెత్తి గీరుకుంటూ... 'ఏమోరా... నాకు గూడా పూర్తిగా తెలీదు. కానీ నేను సిన్నగున్నప్పుడు ఈ మాటే మా నాయన్నడిగితే... ఆయన... ఒరేయ్... ఇప్పుడంటే కాలం బాగాలేక మనమిట్లా వున్నాం గానీ... ఒగప్పుడు మహాదర్జాగా బతికినోళ్ళంరా... అంటూ ఒక కత సెప్పేటోడు. అదేంటంటే చానాచానా కాలాల కిందట ఒక పెద్ద రాజున్నాడంట. ఆయనకు భూమి ఆ మూల నుండి ఈ మూలకు, ఈ మూల నుండి ఆ మూలకు గెలిచి చక్రవర్తి గావాలని ఒగటే కోరికంట. కానీ అట్లా గావాలంటే యుద్ధంలో రొమ్ము చూపించడమే తప్ప, వెన్ను చూపించడం తెలీని గుండెబలం, కండబలం గల పెద్ద సైన్యం కావాల గదా... దాంతో ఎట్లాగబ్బా అనుకున్నది సాధించడం అని కిందామీదా పడ్తా వుంటే మా బోయోళ్ళు కనబన్నారంట. మా కులమోళ్ళకి సయ్యంటే సయ్యంటూ తొడగొట్టడమే తప్ప కాస్త గూడా అదురూ బెదురూ తెలీదు గదా... దాంతో మమ్మల్ని సైనికులుగా చేసుకోని ఆయన కోరుకున్నేది సాధించినాడంట. అట్లా ఆయనకు మేమంటే చానాచానా ఇష్టమంట. రాజు తర్వాత అధికారమంతా మా కులపోళ్ళకే అప్ప జెప్పినాడంట.

ఆయన ఒకరోజు ఈ ప్రపంచమంతా ఆయన కాలి కిందికొచ్చినాక జనాన్నంతా ఒకచోట కుప్ప చేసి 'రేయ్! మీలో మీకు కొట్లాటలు రాకుండా ఒకొక్క కులానికి ఒకొక్క పనిస్తా... ఎవరెవరికి ఏమేం కావాల్నో కోరుకోండి' అన్నాడంట. ఇంగేముంది కుమ్మరోళ్ళు కుండలు చేస్తామంటే, వడ్లోళ్ళు

చెక్కపని చేస్తామన్నారంట. కటికోళ్ళు మాంసం అమ్ముకుంటామంటే, దూదేకులోళ్ళు దూది ఏకి పరుపులు, దిండ్లూ కుడ్తామన్నారంట. అట్లా ఒకొక్క కులం ఒకొక్క పని తీసుకొనింది గానీ మా బోయోళ్ళు మాత్రం ఏమీ తీస్కోలేదంట.

దాంతో రాజు మావోళ్ళ వైపు తిరిగి "ఏందిరా... అందరూ తలా ఒగటి తీసుకుంటా వుంటే... మీరేంది ఏమీ మాట్లాడకుండా గమ్మునున్నారు. మీకేమొద్దా" అనడిగినాడంట. అప్పుడు మావోళ్ళు "ఎందుకు రాజా మాకీ పనులు. నువ్వున్నంత కాలం ఇట్లాగే నిన్నూ, నీ రాజ్యాన్ని కాపాడుకుంటూ సైనికులుగా, సేనాధిపతులుగా వుండిపోతాం. మాకిది చాలు" అన్నారంట. దానికి రాజు 'సరే' అన్నాడంట. అదీ ఆ రోజు నుండి మావోళ్ళు రాజ్జానికి కాపలా కాస్తా... యుద్ధాలు చేస్తా... రాజు ఎక్కడికి పోతే అక్కడికి పోతా నమ్మిన బంట్లలెక్క వున్నారంట.

కానీ కాలం మారిపోయింది గదా... రాజులు పోయినారు... రాజ్జాలూ పోయినాయి. దాండ్లతోపాటు మా పనీ పోయింది. ఇంక మావోళ్ళకు ఏం చేయాల్నో అర్థం గాలేదు. అడవుల్లో జంతువులని వేటాడి బతుకుదామా అంటే పోలీసులూరుకోరు. ఏదయినా పని చేసుకొని బతుకుదామా అంటే మాదని చెప్పుకోవడానికి ఒక్క పనీ లేదు. దాంతో చెట్టుకొకరు... పుట్టకొకరు అయిపోయి ఏ పని బడితే ఆ పని చేస్తా బతుకీడుస్తున్నారు. ఆ రోజే మావోళ్ళు గూడా కాస్త ముందూ వెనుకా ఆలోచించి ఏదో ఒక పని కోరుకోనింటే ఇప్పుడీ తిప్పలు వుండేటివి గాదు... ఏం చేద్దాం... అంతా మాఖర్మ" అంటూ నిట్టూర్చాడు. మాటల్లోనే వూరు దగ్గరకొచ్చేసింది.

గొర్రె పెంటిక చేన్లకి మంచి బలం. అందుకే రైతులు ఎండాకాలంలో ప్రతి శుక్రవారం సాయంత్రం రచ్చబండ కాడ పోటీలు పడి సవాళ్ళు పాడుతుంటారు. ముందురోజు రాత్రే ఎర్ర సంజన్న వారం రోజులు వాళ్ళ పొలంలో గొర్రెలు ఆపడానికి ఆరునూర్లకి సవాలు పాడినాడు. అందుకే జీవాలన్నింటినీ చక్కగా ఎర్రసంజన్న పొలం లోనికి తోల్కోని పోయినారు. అవి అటూ యిటూ తిరగకుండా, నక్కలూ, తోడేళ్ళూ లోపలికి రాకుండా కట్టెలు వలల్లో దిగేసి చేను చుట్టూరా పాతినారు.

కాసేపటికి చీకటి కమ్మేసింది. నాలుగు కట్టెపుల్లలేరుకోనొచ్చి మంట పెట్టి చుట్టూరా కూచున్నారు. ఇంటి దగ్గర్నించి ఇంకా సద్ది రాలేదు. రాముడు మంచి పాటగాడు. పొద్దుపోక గొంతు సవరించుకోని పాటందుకొన్నాడు.

'వయ్యారీ మాలచ్చీ
వగలమారి మాలచ్చీ
మాపటేల రాకపోతివే
వస్తననీ మాటిచ్చి
మాపటేల రాకపోతివే...' ఆ కమ్మని పాట నిశ్శబ్దంలో అలా అలా అలలు అలలుగా ప్రవహిస్తూ

తన్మయపరుస్తూ వుంది. అంతలో చీకట్లో ఎవరో వస్తున్న అలికిడి అయింది. ఎవరబ్బా అని అటువైపు బ్యాట్రీలైటు వేసినారు. తలారి చిన్న నాగన్న రావడం రావడం "రేయ్... లచ్చుమన్నా.. రొడ్డి పిలుస్తున్నాడు. అరిజెంటుగా రావాలంట" అన్నాడు.

లక్ష్మన్న మారు మాట్లాడకుండా కట్టె తీసుకొని మౌనంగా వానెంబడే నడవసాగాడు. రెడ్డి గుర్తుకొచ్చేసరికి కాళ్ళు వణికాయి. ఆ వూరిలో వుండే ఏడువందల గడపలలో రెడ్డి మాట కాదని ఎవడూ నోరు మెదపడు. మెదిపినాడో వానికి అదే ఆఖర్రోజు. ఏ పనయినా సరే రెడ్డి కాల్తో చెప్తే చేత్తో చేసేటోళ్ళు మస్తుమందున్నారు ఆయన కింద.

రెడ్డికి ఎంత కాదన్నా రెండొందల ఎకరాలకు పైన్నే పొలముంటాది. బోరు కిందనే నలభై ఎకరాలుంటాది. రెడ్డి ఎప్పుడు చెబితే అప్పుడు కిందా మీదా మూసుకోని ఆయన పొలంలో ఇచ్చినంత తీసుకోని చెప్పినన్ని రోజులు జీవాలనాపాలి. కూలీలయినా సరే, మొదట ఆయన పొలంలో పని చేసినాకనే వేరేవాళ్ళ పొలంలో అడుగుపెట్టాలి. మొన్నమొన్ననే నడిపి మద్దయ్య, కర్రె నాగన్నోళ్ళ పొలాల్లో ఆపక ముందు... చేతిలోకి బాగా డబ్బులొచ్చే సమయంలో... ముష్టి ఆరొందలకు మూడు వారాలు రెడ్డి చేన్లో ఆపొచ్చినారు. ఐనా మళ్ళీ పిలుపొచ్చింది. మళ్ళా ఏం పీడ నెత్తిన పడుతుందో... ఏమో... అని ఆలోచిస్తా... ఆలోచిస్తా... రెడ్డింటి దగ్గరికి చేరుకొన్నాడు.

ఇంటి ముందు రెడ్డి నులక మంచమ్మీద కూచోని కొట్టం గోకారితో నవ్వుతూ ఏదో పరాచికాలాడుతున్నాడు. లక్ష్మన్న పైకెగ్గట్టిన పంచె కిందకు దించి ఒక పక్కగా ఒదిగి నిలబడి "రొడ్డీ పిలిచినావంట" అన్నాడు వినీ వినబడనంత నెమ్మదిగా.

రెడ్డి వాని వైపుకి తిరిగి "ఏరా... బాగున్నావా... అవునూ గట్టు మీద ఆకు దొరకడం లేదంటగదా... యాడికి పోతున్నారు జీవాల్ని తోలుకోని" ప్రశ్నించాడు. దానికి వాడు "ఏముంది రొడ్డీ మామూలే... శ్రీశైలం అడవుల్లోకి పోవాలనుకుంటున్నాం" సమాధానమిచ్చాడు.

రెడ్డి మెలితిరిగిన మీసాల్ని ఒకసారి చేత్తో జవురుకోని "ఏం లేదురా... ఈ మధ్యనే మా చిన్న బామ్మర్ది... అదే పెద్దబాయి కాడుంటాడు చూడు... ఓబుల్రొడ్డి... వాడు ఒక ఇరవై సన్న పిల్లల్ని కొన్నాడు. నువ్వెట్లాగూ నీ దాండ్లను మేపకరావడానికి అడవులకు పోతా వున్నావు గదా... దాండ్లను గూడా తోల్కపో... యేం... సరేనా..." అన్నాడు.

లక్ష్మన్న మారు మాట్లాడకుండా తలూపి "అట్లాగే రొడ్డి... నువ్వెట్లా సెప్తే అట్లా" అని తిరిగి బైలుదేరినాడు.

అదే వూర్లో గనుక ఎవరయినా జీవాలను తోల్కపొమ్మంటే ఎంతిస్తావు అనడిగేటోడు. కొందరు డబ్బులిస్తే, ఇంకొందరు జీవాలు పిల్లలు పెడితే అవి కాపలా కాసేటోళ్ళకే ఇచ్చేటట్లు ఒప్పుకునేటోళ్ళు. ఎక్కడన్నా దేనికన్నా ఏదన్నా రోగమొచ్చి పుటుక్కుమని చచ్చినా, ఏ అర్ధరాత్రో ఏ తోడేలో మీదపడి లటుక్కున దొరికినదాన్ని దొరికినట్టు కరచుకొని పోయినా వాళ్ళకే సంబంధం లేదు. ఇట్లా అన్నీ

ముందుగానే మాట్లాడుకునేటోడు. కానీ రెడ్డి గదా... ఏమన్నా అంటే "ఏరా... నాకే మాటకు మాట సెప్పేంత మొనగానివయితివిరా నువ్వు" అని చేతికేది దొరికితే అది తీసుకొని కొట్టినచోట కొట్టకుండా కొడ్తాడు. అందుకే భయంతో గమ్మున ఒప్పేసుకున్నాడు.

తరువాత రోజు పొద్దున్నే రెడ్డింటి దగ్గర్నించి గాసగాడు జీవాలను తోలుకోనొచ్చి వాళ్ళ మందలో ఇడ్చినాడు. చేసేదేమీ లేక లోపల్లోపలే గొణుక్కుంటూ ఎప్పట్లాగే ఆ రోజు కూడా పొద్దున్నే మందను గట్టు మీదకు తోల్కోనిపోయి... సాయంకాలం వరకూ అక్కన్నే మేపి... చీకటి పడే సమయానికి కాస్త ముందు కొండ దిగి వూరివైపు నడక ప్రారంభించినారు.

అప్పుడు జరిగిందా సంఘటన... వాళ్ళు వూహించని విధంగా...

వాళ్ళు అట్లా తోలుకోని పోతా వుంటే... అనుకోకుండా... వెనుకవైపు నుండి... రెండు జీపులు... ఒకదాన్తో ఒకటి పోటీ పడ్తూ.... అరుపులూ, కేకలూ, ఈలల మధ్య... దారిని పూర్తిగా అటూ యిటూ ఆక్రమిస్తూ... పక్కపక్కన... రెడ్డి కొడుకూ... స్నేహితులూ... ఏయ్... ఏయ్... అనరుస్తున్నా... ఆగకుండా సర్రుసర్రున దూసుకుపోయినారు. ఒక్క క్షణంలో టైర్ల క్రింద పడి అరవై డెబ్బైదాకా నుజ్జునుజ్జయిపోయినాయి. దారంతా ఎర్రగా రక్తంతో తడిచిపోయింది. మే... మే... అంటూ ఆ జీవాలు భయంకరంగా అరుస్తూ వుంటే... ఒక్కసారిగా అదిరిపడి... ఏది బతికిందో... ఏది చచ్చిందో అర్థంగాక... ఒళ్ళంతా కన్నీరై... అటూ యిటూ నిలకడ లేకుండా పరిగెడుతూ... కనుచూపుమేరా శవాలే కనబడుతూ వుంటే... అట్నే కుప్పకూలిపోయినారు. ఒకటి కాదు... రెండు కాదు... డెబ్బైవేలు ఒక్క క్షణంలో మన్నులో కలిసిపోయినాయి. ఆలోచనల్లోనే రెడ్డింటి దగ్గరికి వచ్చినారు.

✧ ✧ ✧

రెడ్డి మంచమ్మీద కూర్చోనున్నాడు. వెనక ఆయన తమ్ముడు సుదర్శనరెడ్డి నిలబడున్నాడు. రాముడు, లక్ష్మన్న తల దించుకోని ఏమి మాట్లాడాల్నో అర్థంగాక తప్పుచేసినోళ్ళ మాదిరి భయంభయంగా నిలబన్నారు. వెంకటేశులు అందరినీ చూస్తా ఏమవుతాదా అని ఎదురుచూడసాగాడు.

"ఏంరా... మూగెద్దుల్లెక్క మట్టసంగా అట్లా నిలబన్నారు... ఏంది కత" అన్నాడు రెడ్డి పంచాయితీ మొదలు పెడ్తూ

."అదీ... అదే... రొడ్డి... నిన్న సాయంకాలం... జీవాలను తోలుకోని మేమొస్తా వుంటే... నీ కొడుకు... అదే చక్రపాణి రొడ్డి... స్నేహితుల్తో కల్సి... ఒక్కసారిగా మా జీవాల మీదుగా జీపు.... దాంతో..." నెమ్మదిగా మాటలు కూడదీసుకుంటూ లక్ష్మన్న జరిగినేది చెప్పబోతున్నంతలో రెడ్డి తమ్ముడు సుదర్శనరెడ్డి వాళ్ళను కోపంగా చూస్తూ గట్టిగా

"ఏందిరా... కండ్లుగాని నెత్తి మీదకొచ్చినాయా కొడుకల్లారా మీకు... రోడ్డేమన్నా మీ అబ్బగంటనుకున్నార్రా మీరు... జీవాలను రోడ్డుకడ్డంగా తోలింది గాక... మళ్ళా మావోడు

గుద్దినాడంటారు... అదురుష్టం బాగుండి పిల్లోనికేమీ కాలేదుగానీ... ఆ గందరగోళంలో స్టీరింగ్ అటో యిటో తిప్పి... ఏ చెట్టుకో... పుట్టకో... కొట్టుకోనింటే ఏమయిపోయేది వాని గతి" అంటూ ఎదురు తిరిగినాడు.

తప్పు తమ మీదకే తోసేసరికి రామునికీ, లక్ష్మన్నకీ ఏం మాట్లాడాల్నో అర్థం కాలేదు. భయంతో బిగుసుకు పోయినారు. అంతలో బోయెంకటేశులు ధైర్యం చేసుకోని "అది కాదు రొడ్డీ... మేము మట్టసంగానే వస్తున్నాం... దారికో పక్క.. కానీ మీ పొట్టెగాళ్ళే... తాగినట్టున్నారు... మేం కేకలు పెడ్తున్నా వినకుండా... పట్టిచ్చుకోకుండా... ఒకదాని పక్కనొకటి తోలుకుంటూ... రయ్యిరయ్యిమని దాండ్ల మీదకి ఆపకుండా దూసుకపోయినారు" అన్నాడు.

"ఏరా... నా కొడకా... ఎక్కువ తక్కువ చూసుకోకుండా నోటికెంత మాటొస్తే అంతమాట మాట్లాడుతున్నావ్. ఒళ్ళుగాని కొవ్వెక్కిందా" అంటూ సుదర్శన రెడ్డి కోపంతో రెండడుగులు ముందుకేశాడు.

రెడ్డి తమ్మున్ని ఆగమన్నట్టు సైగ చేసి "తప్పు మీదెంతుందో... ఆళ్ళదీ అంతే వుంది. మీరు తాగి తోలుకున్నారో... వాళ్ళు తాగి తోలుతున్నారో... వాళ్ళు రోడ్డు చివర వచ్చారో... మీరు అడ్డంగా పోతున్నారో... చూసిందెవరు... చెప్పేదెవరు...అందుకే చెబుతున్నా వినండి, మొత్తం అరవైదాకా జీవాలు చచ్చిపోయినాయంటున్నారు గదా... నష్టాన్ని మూడు భాగాలు చేసుకోండి... మా వంతుకు ఇరవై జీవాలు... మొన్న మా బామ్మర్ది మీకు మేపుకు రమ్మని జీవాల్ని తోలినాడు గదా... అవి మీరే వుంచేసుకోండి. వానికి నేను డబ్బులు కడ్తా... ఏం సరేనా... ఇంగ పోండి" అంటూ మాట్లాడ్డానికి అవకాశమివ్వకుండా పంచాయితీ ముగించి లేసి ఇంట్లోకి పోవడానికి వెనక్కి తిరిగినాడు.

రామునికీ, లక్ష్మన్నకీ పెద్దరెడ్డి సంగతి తెలుసు కాబట్టి వచ్చిందే చాలనుకోని అంగీకార సూచకంగా తలూపినారు. కానీ వెంకటేశులుకి ఒళ్ళు మండిపోయింది. మౌనంగా వుండలేక పోయినాడు. దాంతో రెండడుగులు ముందుకేసి...

"ఏం న్యాయం రొడ్డి ఇది... తప్పు చేసింది నీ కొడుకైతే మేమంతా భాగం పంచుకోవాల్నా... అదే నీ జీవాల మీద ఎవరన్నా అట్లా తోల్తే నువ్వూకుంటావా... ఏదయినా పంచాయితీ చేస్తే పదిమందీ సెప్పుకొనేటట్లు మంచిగుండాలగానీ నోరు కొట్టుకునేటట్లు గాదు" అన్నాడు.

ఆ మాటలింటూనే చెప్పడమే తప్ప చెప్పించుకోవడం తెలీని రెడ్డి అహం దెబ్బతినింది. కండ్లు ఎఱ్ఱబారినాయి. ఛటుక్కున వెనక్కి తిరిగి వెంకటేశులు వంక కొరకొరా చూస్తూ "ఏం రా... నా మాటకే ఎదురు చెప్పేటంత మొగోనివై పోయినావురా నువ్వు... ఏ వూర్రా నీది...యాన్నుంచొచ్చినావ్" అన్నాడు పండ్లు పటపటా కొరుకుతూ.

"అదికాదు రొడ్డి... నీ కొడుకు తప్పు..." ఏదో మాట్లాడబోయినాడు.

"ముయ్... గబ్బునా కొడకా... మళ్ళీ నోరు తెరుస్తున్నావ్... బతకాలని లేదా నీకు... ఇంకొక్క

క్షణం గాని ఈడ నిలబన్నావనుకో... చెప్పు తీసుకోని కొడతా... ఏమనుకుంటున్నావో" రెడ్డి కోపంతో వూగిపోతూ ముందుకి వచ్చినాడు.

రాముడూ, లక్ష్మన్న పరిగెత్తుతూ వచ్చి 'తెలీదులే రొడ్డీ వీనికి నీ గురించి... వూరికి కొత్త... వదిలెయ్యి ఈ పారికి' అంటూ బోయెంకటేశుల్ని రెక్క పట్టుకోని బరబర పక్కకు లాక్కొచ్చేసినారు.

వెంకటేశులు వాళ్ళ చేతుల్ని విడిపించుకోని వేగంగా నడుచుకుంటూ వూరి బైటికి వచ్చినాడు. కోపం కట్టలు తెంచుకుంటూ వుంది. మాటిమాటికీ పిడికిళ్ళు బిగుసుకుంటున్నాయి. గబగబా గట్టు మీదికెక్కి ఒంటరిగా ఒక చెట్టు కింద కూర్చున్నాడు. కండ్ల నుండి ఆగి ఆగి నీళ్ళు కారుతూ వున్నాయి. బాధను ఎవరితో పంచుకోవాల్నో... ఆవేశాన్ని ఎవరి మీద చూపాల్నో... అర్థం కావడం లేదు. నుదుటి మీద చెమట కారుతా వుంది.

ఏదో ఒకటి చేయాలి... ఏదో ఒకటి... మనసు నిండా ఒకటే ఆలోచనలు. అంతా గందరగోళంగా వుంది. పండ్లు పటపటలాడుతున్నాయి. చూపులు తీక్షణంగా... అసహనంగా... నిలకడ లేకుండా అటూయిటూ తిరుగుతున్నాయి. మాటిమాటికీ రెడ్డి మాటలే గుర్తుకొస్తూ వున్నాయి. ఆవేశం మరింత పెరుగుతూ వుంది.

వరద వత్తిడిని తట్టుకోలేని ఆనకట్టలా వున్నాడు. తరతరాలుగా వేటాడే... వెంటాడే.. వెన్ను చూపని కులంలో నుండి వంశపారంపర్యంగా ప్రవహిస్తూ వచ్చిన రక్తం పోటెత్తుతోంది.

బీడీ తీసి ముట్టించాడు. పొగ గుప్పు గుప్పున వదలసాగాడు. చీకటి పడ్తూ వుంది. ఆలోచనలు మాత్రం ఆగడం లేదు.

ఏదో... ఏదో ఒకటి చేయాలి... దెబ్బకు దెబ్బ తీయాలి... మనసంతా గందరగోళం... ఎగిసెగిసి పడుతున్న ఆలోచనలు... ఏవేవో వ్యూహాలు, వుద్రేకాన్ని మరింత పెంచుతూ... చేయి సురుక్కుమంది. ఆఖరి దమ్ము లాగి విసిరి పాడేసినాడు. పైకి లేచి ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా పెద్దపెద్ద అడుగులేస్తూ బైలుదేరినాడు.

గడ్డి పరకల మీద పన్న బీడీ ఆగాగి వీస్తున్న గాలికి రాజుకొంటూ... రగుల్కొంటూ... పక్కనే వున్న గడ్డి పరకలను రగుల్కొల్పుతూ... నెమ్మదిగా మంటగా మారసాగింది.

**అరుణతార - ఫిబ్రవరి, మార్చి-2006**

# చూపు

క్యారియరు బ్యాగు భుజానికి తగిలించుకొని ఎయిట్ సీటర్ ఆటోలో డ్రైవరు పక్కన ముందు సీటులో కష్టపడి సర్దుకున్నా. వెనుక సీట్లన్నీ లేడీ స్టాఫ్‌తో నిండిపోయి ఉన్నాయి. ఆటో దడదడదడ శబ్దం చేస్తూ ముందుకు పోసాగింది. కూర్చోవడం కష్టంగా ఉంది. ఒక్క డ్రైవరు మాత్రమే కూర్చునే సీట్లో నలుగురం ఇరుక్కున్నాం.

దాదాపు ప్రతిరోజు ఇలాగే గంట ప్రయాణం చేయాలి. బస్సెక్కితే మెయిన్‌రోడ్డు మీద దించెలతాది. అక్కన్నించి ఊరు చేరడానికి మూడు కిలోమీటర్లు మట్టిరోడ్డు మీద నడిచి వెళ్ళాలి. ఇది చాతగాకపోతే ఆటోనే గతి. ఆ దడదడలలోనే ఆటోలోని టేప్‌రికార్డు 'ఓలమ్మీ తిక్క రేగిందా... ఒళ్ళంతా తిమ్మిరెక్కిందా' అంటూ తన శక్తినంతా ప్రయోగిస్తూ ప్రయాణికులను మైమరపించడానికి ప్రయత్నిస్తుంది.

ఎదురుగా వాహనాలు వస్తున్నాయి. బస్సులు, జీపులు, లారీలు, ఆటోలు, కార్లు దూసుకుపోతున్నాయి. వెనకనుంచి ఎర్రటి కారు మమ్మల్ని దాటుకుంటూ ముందుకు పోయింది.

దానిని చూడగానే మా తమ్ముడి కారు కళ్ళ ముందు మెదిలింది. మళ్ళీ మనసంతా అవే ఆలోచనలు. వద్దనుకున్నా కమ్ముకుంటూ...

వారం రోజులుగా ఎవరికీ చెప్పుకోలేక, లోలోపలే కుమిలిపోతూ, వాడితో నన్ను పోల్చుకుంటూ, గిల్టీగా ఫీలవుతూ, నా అశక్తతను గుర్తుచేసుకుంటూ, మనసుని అదుపులో ఉంచుకోలేక పడుతున్న బాధ... ఎవరి మీద చూపించాలో తెలీని కోపం... అసహనం.

తమ్ముడి కొడుకు మొదటి పుట్టినరోజుకి హైదరాబాదుకి పోయినప్పటి సంఘటనలన్నీ వద్దనుకున్నా పదే పదే గుర్తుకు రాసాగాయి.

✧ ✧ ✧

"అనా... ఎలా ఉన్నాయి అరేంజ్‌మెంట్స్" అన్నాడు కిరణ్ హోటల్ కింద ఫ్లోర్‌లో ఉన్న రెస్టారెంట్లో ఫంక్షన్ ఏర్పాట్లను చూపిస్తూ.

"బాగున్నాయిరా... మీల్సెంత" చుట్టూ చూస్తూ అడిగాను. "ప్లేట్ టూ ట్వంటీ రుపీస్. డ్రింక్స్ సపరేట్"

"ఎక్కువ కదరా..."

"సిటీలో అంతే. అదీగాక ఐటమ్స్ ఫిష్ నుంచి కూల్ డ్రింక్స్ వరకూ దాదాపు ఫార్టీ వెరైటీలు ఉన్నాయి కదా."

"ఎంతమంది రావచ్చు"

"దాదాపు ఒన్‌ఫిఫ్టీదాకా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నా"

"స్థలం సరిపోతుందా" చుట్టూ పరిశీలిస్తూ అడిగాను.

"సరిపోతాదిలే. అదీగాక అందరూ ఒకేసారి రారు గదా. వచ్చేవారు వస్తుంటారు.డిన్నర్ చేసి పోయేవారు పోతుంటారు"

"అంతేలే... తొందరగా రావాలన్నా ఈ ట్రాఫిక్ జామ్‌ల్లో ఎవరు ఎప్పుడొస్తారో" నవ్వుతూ అన్నాను.

"అనా... మనవాళ్ళు ఎవరయినా వస్తే రిసీవ్ చేసుకుంటుండు. మా కొలీగ్స్ ఇంకా రాలేదు. ఎక్కడున్నారో కనుక్కుంటా. వస్తూనే మొదలు పెడదాం."

కిరణ్ గేటు వైపు కదిలాడు.

నేను చివరలో ఒక చోట కూర్చుని చూడసాగాను.

పచ్చటి మెత్తని లాన్ మధ్యలో చిన్న స్టేజ్. స్టేజి మీద అమర్చిన టేబుల్‌పైన ఎర్రటి వెల్వెట్ క్లాత్. దానిపైన పెద్ద కేక్ పైన "హ్యాపీ బర్త్‌డే. అఖిల్" అనే అక్షరాలు. కేక్ మధ్యలో వెలిగించడానికి సిద్ధంగా ఉన్న కొవ్వొత్తి. పక్కన పిల్లలకు పంచడానికి తెచ్చిన క్యాడ్‌బరీ చాక్లెట్లు. చిన్న చిన్న బహుమతులు.

స్టేజీ ముందు వరుసగా మెత్తని కుర్చీలు వేయబడి ఉన్నాయి. కుడివైపు డిన్నర్‌కి ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయి. వెజ్, నాన్‌వెజ్, డ్రింక్స్... అన్నీ ప్రత్యేక కౌంటర్లలో ఒకదాని పక్కన ఒకటి ఎదురుచూస్తూ ఉన్నాయి.

ఆహూతుల్లో చాలామంది ఖరీదయిన కార్లలో వస్తున్నారు. దాదాపు అందరిదీ ఒకే వయసు. ఇరవై అయిదు. ముప్పై అయిదు మధ్యలో ఉన్నారు. విలువైన బ్రాండెడ్ రెడీమేడ్ దుస్తుల్లో, బంగారు చైన్లు, ఉంగరాలు, బ్రాస్‌లెట్స్ వేసుకుని, ఖరీదైన సెల్‌ఫోన్లు చేతుల్లో పట్టుకుని 'హాయ్ హాయ్' అంటూ పలకరించుకుంటున్నారు. నవ్వుకుంటున్నారు.

వాళ్ళందర్నీ పరిశీలనగా చూస్తుండగానే నా భార్య వచ్చింది.

"గిఫ్ట్ ఇస్తావా..."

జేబులోంచి బంగారు గొలుసున్న చిన్న ప్లాస్టిక్ డబ్బా తీసి అందించాను.

"ఇచ్చేటప్పుడు పిలుస్తాను. రా..." అంది. "పరవాలేదులే నువ్విచ్చేయ్" అన్నాను.నా భార్య దాన్ని హ్యాండ్‌బ్యాగ్‌లో భద్రపరచుకుంటూ నన్నొకసారి కోపంగా చూసి వెళ్ళిపోయింది.

అంతకు ముందు మూడురోజుల కిందట ఆ గొలుసు కోసం చిన్న గొడవ జరిగింది.

"నీకేమి మొగోనివి. తోడికోడలి ముందు, వాళ్ళ బంధువుల ముందు తలదించుకోవాల్సిందీ, మాట పడాల్సిందీ నేనే. మొన్న పాప నామకరణానికి ఇంతలావు గొలుసు మెడలో వేసినాడు. అంతకుముందు బాబు పుట్టెంట్రుకలు తీసినపుడు పదివేలు వాని చేతిలో పెట్టినాడు. దానికి తోడు వచ్చినప్పుడల్లా ఏదో ఒకటి ఖరీదయినవి పిల్లలకి తెచ్చిస్తూనే ఉన్నాడు. తీసుకోవడమే గాదు ఇవ్వడం కూడా ఉండాల. లేదంటే అలుసయిపోతాం..."

"అది కాదే... వాడంటే సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. వానికీ మనకూ పోలికా... మరో రెండు నెలల్లో చిన్నదాన్ని బళ్ళో వేయడానికి డొనేషన్ కావాలి. ఇప్పుడు ఖరీదయినవంటే కష్టంగదా. ఏదయినా ఒక బొమ్మనో, బట్టనో పెడ్తే సరిపోదూ... వాడు ఏమీ అనుకోడులే..."

"మొదట్నుంచీ చూస్తున్నదే గదా నీ వరుస. ఫంక్షన్లకు గూడా పట్టుచీరలెందుకు అనే టైపు నువ్వు. మీరంటే అన్నాదమ్ముళ్ళు. సర్దుకుంటారు. నా పరిస్థితి అట్లా కాదు. మీ చెల్లెలు ముందు, తోడికోడలి ముందు, వాళ్ళ బంధువుల ముందు నా మర్యాద పోతాది. ముందు ఏమీ అనకపోయినా వెనుక చెవులు కొరుక్కుంటారు. ఆడదానివయిపుడ్తే తప్ప నా బాధ నీకర్థం కాదు. కనీసం ఒక గొలుసయినా తీసుకుపోదాం..."

ఆ మాట వినేసరికి గుండె గుభేల్‌మంది. "గొలుసంటే మాటలా. ఎంత తక్కువలో తక్కువన్నా అర్థతులం దాట్తాది. ఇప్పటికే బంగారం కొండ మీది కోతి అయింది. నా నెల జీతమంతా పెట్నా ఒక్కతులం రాదు" అన్నాను.

నా మాటలకు కాసేపు మౌనంగా ఉండి అంది "చేతి నుండి ఏమీ పడకుండా నేనొకటి చెప్తా విను. పాప గొలుసుంది కదా... దాన్ని కరిగించి వేరే డిజైన్ చేపిచ్చుకురా... ఇచ్చేద్దాం"

"ఆడపిల్ల గొలుసా" నసిగాను.

"ఐతే ఇంగోపని చేద్దాం. చిన్నదానికి బాగాలేదని చెప్పి నేనూ, పిల్లలూ ఈన్నే ఉంటాం. నువ్వు ఒక్కనివే పోయిరా..."

ఇక నాకు మాట్లాడే అవకాశం దొరకలేదు.

పాప గొలుసు కరిగి కొత్తరూపం దాల్చుకుంది.

ఆలోచనల్లోనే సెల్ మోగింది. తీయడానికి జేబులో చేయి వేశా. రెండు మూడు కళ్ళు ఆ శబ్దానికి తిరిగి నన్నే చూస్తున్నాయి. తీయడానికి సిగ్గనిపించి జేబులోనే అరవకుండా దాని పీక నొక్కేశా.

"లైఫ్‌లాంగ్ కార్డేసి, ఆ బ్లాక్ అండ్ వైట్ పీస్ నాకిచ్చేసి, నీవు వేరే మోడల్ కలర్లో కెమెరా, ఎమ్పీత్రీ వున్నది కొనుక్కో" అని నా భార్య చాలాసార్లు చెబుతూనే ఉంటాది. సంగీతం వినడమంటే ఎంత ఇష్టమైనా జీవితంలో ఒకసారి ఒక వస్తువును మాత్రమే కొనగలిగే నాకు, మళ్ళీ అదే వస్తువుపై ఐదారువేలు పోయాలంటే చాతగావడంలేదు.

ధైర్యం చేద్దామని అప్పుడప్పుడు అనిపించినా ఇంటి బడ్జెట్ అంతా కళ్ళ ముందు మెదులుతాది.

ఇంటి అద్దె, పిల్లలకు ఆటో, స్కూలు ఫీజు, సరుకులు, కూరగాయలు, ఎల్ఐసీ, పోస్టల్ ఆర్డీ... ఇలా లెక్కలేసుకుంటూ పోతే మిగిలేది ఏ వెయ్యో... ఐదొందలో... అది గూడా పండగలకు బట్టలు కొనాల్సి వచ్చినప్పుడో, శుభకార్యాలప్పుడో, అనుకోని ఆపదలొచ్చినప్పుడో హారతయిపోతాది. ఆరునెల్లకోసారి పెరిగే "డీ ఏ" ల కోసం, సంవత్సరానికోసారి పెరిగే ఆన్యువల్ ఇంక్రిమెంట్ల కోసం, ఐదు సంవత్సరాలకోసారి జరిగే పే రివిజన్ కోసం నిరంతరం ఎదురుచూస్తూ, కలలు కంటూ, బడ్జెట్ ప్లానును ఎప్పటికప్పుడు సవరించుకుంటూ బండిని ముందుకు నడిపే నాకు కొన్ని కోరికలు తీరని కలలు.

"సర్... ప్లీజ్" అనే మాట వినబడేసరికి తలెత్తి చూశాను. ఎదురుగా ఇద్దరు యువకులు. మూతి మీద అప్పుడప్పుడే మీసాలు మొలకలేస్తా వున్నాయి. "ఏం" అన్నట్లు కళ్ళెగరేశాను.

"ఎవరైనా వస్తారా?" అన్నారు నా పక్కనున్న ఖాళీ కుర్చీలని చూపిస్తూ.

"లేదు లేదు కూర్చోండి" అంటూ కొద్దిగా వెనక్కి జరిగాను. వాళ్ళు నన్ను దాటుకుంటూ పోయి సీట్లలో కూర్చొని మాటల్లో పడ్డారు.

పక్కనే ఉండటంతో వారి మాటలు నా ప్రమేయం లేకుండానే వచ్చి చెవుల్లో పడుతున్నాయి.

"ఏం గురూ! అమెరికా పోయే ఆలోచనేమన్నా ఉందా"?

"లేదు గురూ... ఐనా ఒకప్పుడు ఇక్కడ సంపాదించుకొనే అవకాశాల్లేక అక్కడకు పోయినారు గానీ, ఇప్పుడు మన్లాంటి జెమ్స్‌కు ఇక్కన్నే కాస్త అనుభవముంటే నెలకు యాభై పైన్నే ఇచ్చే సంస్థలు కొల్లలున్నాయి. అదీగాక ఈ మధ్య రోజు రోజుకీ మన రూపాయి బలపడుతా ఉంది. అప్పుడే టెన్ రూపీస్ తేడా వచ్చింది..."

ఆ మాటలు వింటుంటే నాకు నా జీవితం గుర్తుకొచ్చింది. పీహెచ్‌డీ చేసి డాక్టరేట్ సంపాదించినా అప్పటికే కాలేజీల్లో అవకాశాలు మూసుకుపోవడంతో మరోదారి లేక డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సంపాదించాను. నెలకు పన్నెండు వందల్తో ప్రారంభం. పది సంవత్సరాలు దాట్నా ఇంకా తొమ్మిది వేలు దాటని జీతం.

తమ్మునివి చిన్నప్పటినించీ కాన్వెంట్ చదువులే. డిగ్రీ పూర్తి కాకుండానే అప్పుడే తెరమీదకొస్తున్న ఎంసీఏలో చేరి పూర్తయ్యేసరికి క్యాంపస్ సెలక్షన్లో ఉద్యోగం సంపాదించేశాడు. మీసాలు కూడా పూర్తిగా మొలవక ముందే ఇరవై వేలతో ప్రారంభమై ఐదు సంవత్సరాలు తిరిగేసరికి, నాలుగు కంపెనీలు మార్చేసి, అరవై వేలకి చేరుకున్నాడు. హైదరాబాదులో డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ కొనేశాడు. మరో సాఫ్ట్‌వేర్‌ని మంచి కట్నంతో పెండ్లి చేసుకున్నాడు. ఆ డబ్బుతో నాన్న చెల్లెలికి ఒక ఇంజనీర్ సంబంధం తేగలిగాడు. దాంతో వాళ్ళందరి ముందూ నా పరిస్థితి తీసేసినట్టయిపోయింది. ఇంతకు ముందులా వాళ్ళతో స్వేచ్ఛగా కలవలేకపోతున్నాను.

అంతలో హడావిడి మొదలైంది.

ముఖ్యమైన వాళ్ళంతా వచ్చేశారు. బొద్దుగా, ముద్దుగా నల్లని సూట్‌లో చిరునవ్వులు చిందిస్తున్న అఖిల్ చేయి పట్టుకొని కిరణ్ కేకు కట్ చేయిస్తుంటే, అందరూ చప్పట్లు చరుస్తూ "హ్యాపీ బర్త్‌డే" అంటూ వెనకనుంచి వస్తున్న మ్యూజిక్‌తో గొంతు కలిపారు.

దగ్గరి బంధువులు తమ తాహతును తెలియజేసే బహుమతులు మొదట అందజేస్తుంటే... నా భార్య కళ్ళతోనే నా కోసం గాలించి... కనబడకపోయేసరికి ఇది మామూలే అన్నట్లు గొణుక్కుంటూ... బంగారు గొలుసు తీసి అందరి ముందూ కాస్త గర్వంగా అఖిల్ మెడలో వేస్తూ ఫోటో దిగింది.

స్నేహితులంతా ఏవేవో బహుమతులు అందజేస్తూ విషెస్ చెబ్తూ వుంటే మరో పక్క డిన్నర్ ప్రారంభమైంది.

అందరూ వెళ్ళేసరికి రాత్రి పదకొండు దాటింది.

"అనా... టుమారో మార్నింగ్ టెన్ థర్టీకి వస్తాను. రెడీగా ఉండండి. ఇంటికి పోదాం" అన్నాడు కిరణ్ బై చెబుతూ.

"ఇంట్లో ఎందుకు అందరం ఇరుకిరుకుగా" అంటూ అదే హోటల్లో గది తీశాడు. పొద్దున బస్టాండ్లో దిగగానే రిసీవ్ చేసుకొని నేరుగా హోటల్లోనే వదిలి వెళ్ళాడు. నిద్రపోతున్న చిన్నోణ్ని భుజమ్మీద వేసుకొని లిఫ్ట్‌లో నాలుగో అంతస్తులోని గదికి చేరుకున్నా.

తరువాత రోజు పొద్దున్నే కిరణ్ వచ్చి బిల్ పే చేసి ఇంటికి తీసుకుని పోయాడు.

ఇల్లు చాలా అందంగా, విశాలంగా ఉంది. గృహప్రవేశం తర్వాత మళ్ళీ ఇప్పుడే రావడం. గదులన్నీ విలాసవంతమైన వస్తువులతో నిండిపోయి ఉన్నాయి. ఒక్కొక్క గదినీ చూస్తూ షోకేస్ దగ్గరకొచ్చి ఆగాను. అందులో బంగారు రంగులో మెరిసిపోతున్న చిన్న ఫ్లవర్‌వాజ్ లాంటిది కనిపించింది. దాని వెడల్పాటి మూతికి ఎరుపురంగులో రిబ్బన్ కట్టి వుంది. అది బోసిగా అనిపించి పక్కనే వున్న ఇంకో ఫ్లవర్‌వాజ్ నుండి కొన్ని పూలు తీసి అందులో ఉంచబోయాను.

అంతలో "అనా... అనా... అందులో ఏమీ పెట్టొద్దు" అన్నాడు గట్టిగా తమ్ముడు వెనుక నుంచి.

""ఏంరా" అన్నాను చెయ్యి వెనక్కి తీసుకుంటూ.

"అనా... అది ఫ్లవర్‌వాజ్ కాదు. అక్షయపాత్ర. ఈ మధ్య కంపెనీ వర్క్ మీద ఫోర్‌వీక్స్ చైనాకు పోయొచ్చా. అక్కడ ప్రతి హౌస్‌లోనూ ఇది ఖచ్చితంగా ఉంటుంది. దాన్ని అలాగే ఖాళీగా ఉంచాలంట. అప్పుడే దేవతలు అది చూసి 'అరెరే ఏమీ లేదే' అని అందులో ధనరాసులు నింపుతూ ఉంటారంట" అన్నాడు.

అంతలో మా చెల్లెలు గోడ మీద పెద్దగా అతుక్కోని ఉన్న ప్లాస్మాటీవీని చూస్తూ "అదెంతరా కిరణ్" అనింది. వాడు నవ్వుతూ "ఫార్టీ నైన్ థౌజండ్సక్కా. థియేటర్లో చూసిన ఫీలింగ్ వస్తాది" అంటూ దాన్ని ఆన్ చేశాడు.

అంతలో మా మరదలు మాటల్లో తల దూరుస్తూ "మొన్న గోల్డెన్ ఈవెంట్ రెస్టారెంట్లో ఇలాంటి టీవీలు కొన్న ఫ్యామిలీలకంతా సచిన్‌తో కలిసి డిన్నర్ చేసే అవకాశం ఇచ్చారు. నేనూ, మీ తమ్ముడు పోయొచ్చాం. సచిన్‌తో ఆటోగ్రాఫ్ తీసుకోవడంతో పాటు ఫోటో కూడా దిగాం" అంటూ లోపలికి పోయి ఆల్బమ్ తీసుకొచ్చింది.

మాటల్లోనే మధ్యాహ్నం కావచ్చింది. పిల్లలు ఇంట్లో వున్న రకరకాల విదేశీ మ్యూజికల్ టాయ్స్‌తో ఆటలాడ్తూ బిజీగా ఉన్నారు. రేపు తిరిగి డ్యూటీలో జాయిన్ కావాల. సంవత్సరం ఆఖరు కాబట్టి సెలవుల్లేవు. దాంతో ముందుగానే పిల్లల్తో ఇబ్బంది పడకుండా మూడుగంటల రైలుకి రిజర్వ్ చేసుకున్నా.

భోజనాలు పూర్తికాగానే బ్యాగులు సర్దుకున్నాం. నా భార్యకు, పిల్లలకు ఖరీదయిన బట్టలు బహుమతిగా ఇచ్చారు. వాటిని చూస్తే ఎందుకో భయం వేసింది. చెల్లెలు తర్వాత రోజు వెళ్తానంది. అమ్మానాన్నలు మరో వారం రోజులు ఉంటామన్నారు. అందరికీ వీడ్కోలు పలికి బైటపడ్డాం. కిరణ్ రైల్వేస్టేషన్ వరకూ కారులో డ్రాప్ చేశాడు.

రైలు కదిలి తిరిగి ఇంటికి వస్తున్నా అవే ఆలోచనలు. నా భార్య కూడా తప్పనిసరై అప్పుడప్పుడు ఒకటి రెండు మాటలు మాట్లాడ్తున్నా చాలావరకు మౌనంగానే ఉంది.

ఆమె మనసులో కూడా ఇలాంటి అల్లకల్లోలమే జరుగుతున్నట్లుంది. ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ ఇలాగే ఉంటుంది. మళ్ళీ కొన్ని వారాలకు గానీ పూర్తిగా సర్దుకోలేం.

తమ్ముడితో రోజురోజుకీ దూరం పెరిగిపోతోంది. మనసు విప్పి మునుపటిలా స్వేచ్ఛగా మాట్లాడలేకపోతున్నా. మధ్యలో ఇనుపతెరలు పైకి లేస్తూ ఉన్నాయి. నా పరిస్థితి గమనిస్తూ నాన్న అప్పుడప్పుడు బాధపడేవాడు.

"రేయ్! నిన్ను బళ్ళో వేసేనాటికి కాన్వెంటు చదువులు చదివితే ప్రభుత్వ ఉద్యోగాలు రావని ఎవరూ వేసేటోళ్ళుకాదు. ఆ కాలంలో ప్రయివేటు ఉద్యోగమంటే పిల్లనియ్యడానికి కూడా ఎవరూ ముందుకొచ్చేటోళ్ళు కాదు. చిన్నోని కాలానికి ఇంగ్లీషు మీడియాలు పుంజుకున్నాయి.

మా స్నేహితుడు సదాశివం బలవంతం మీద వాని కొడుకుతో బాటు వీన్ని కూడా అందులో చేర్పించా. అక్కడికీ మనసు పీకుతానే ఉండేది. చిన్నోనికేమన్నా అన్యాయం చేస్తున్నానా అని. కానీ నా అంచనాలు ఇంత తలకిందులైతాయనీ... ఈ పదేళ్ళలో ఇంత మార్పు వస్తుందనీ నేనెప్పుడూ ఊహించలేదు. నిన్ను అనవసరంగా తెలుగు మీడియంలో వేసి, భవిష్యత్తు పాడు చేశానేమో అని ఇప్పుడు బాధ కలుగుతా వుంది" అనేవాడు.

ఆటో కుదుపులకు ఈ లోకంలోకి వచ్చాను. ఆటో మెయిన్ రోడ్డు మీంచి నేను పని చేసే ఊరు వైపు తిరిగింది. రోడ్డంతా గుంతలే.

ఈ సంవత్సరం వానలు బాగా కురిసి భూమి బాగా పదునెక్కింది. వరుసగా రెండు సంవత్సరాలు వానల్లేక కడుపు చేత పట్టుకోని కర్నూలుకి వలసపోయిన చిన్నచిన్న రైతులు తిరిగి ఊరికి చేరుకున్నారు. రోడ్డంతా పొలాలకు వెళ్తున్న రైతులతో కూలీలతో కళకళలాడుతోంది. మధ్యలో బడి మానేసి కూలిపనులకు పోతున్న పిల్లలు మమ్మల్ని చూడగానే సిగ్గుతో తల పక్కకు తిప్పుకోని పోతా వున్నారు. హైస్కూలు పోయే పిల్లలు సంచీలు నెత్తికి తగిలించుకోని ఆయాసపడ్తూ నడుస్తున్నారు. ఊర్లో ఏడో తరగతి వరకే ఉండటంతో హైస్కూలుకు పోవాలంటే ఇరవై కిలోమీటర్ల దూరంలో వున్న నన్నూరో, ఓర్వకల్లో పోవాలి.

వాళ్ళను చూస్తుండగానే ఆటో బడి దగ్గరికి చేరుకుంది. డ్రైవరు చేతిలో పదిరూపాయలు పెట్టి బడివైపు అడుగులేశాను. పిల్లలింకా వస్తూనే ఉన్నారు. మమ్మల్ని చూస్తూనే కొందరు పరుగున దగ్గరకొచ్చి "సార్... బ్యాగు" అంటూ మా బ్యాగులు తీసుకుని గర్వంగా భుజాలకు తగిలించుకోని మా పక్కనే నడవసాగారు. ప్రార్థన పూర్తి కాగానే తరగతి గదికి చేరుకున్నా.

హాజరు వేస్తా వుంటే "మేకమింగు సార్" అని వినబడి తలెత్తి చూశాను. ఎదురుగా సుబ్బన్న వాళ్ళ నాయనతో ఉన్నాడు. వాని ఉచ్చారణకి లోలోపల నవ్వుకుంటూ 'కమిన్' అన్నాను. దాదాపు పది రోజులైంది వాడు బడికి రాక. వాళ్ళ నాయనతో బాగా పరిచయమే. కనపడ్డప్పుడల్లా పలకరిస్తుంటాడు.

"ఇట్లా ఇష్టమొచ్చినప్పుడు వస్తే ఆబ్సెంటు వేస్తాను" కోపంగా అన్నాను.

"అది కాదు సార్, పొలం పనులకు కూలీలు దొరక్క" సుబ్బన్న నాన్న నసిగాడు.

"అబద్దాలు చెప్పొద్దు. బైటి పొలాలకు పంపుతున్నావని తెల్సు నాకు. ఐనా ఎంతిస్తారు వానికి కూలీ?"

"నాకైతే అరవై వస్తాది కానీ, వీనికి రెక్కలింకా బలం పుంజుకోలా కదా... రోజుకు ఇరవయ్యి, ముప్పై ఇస్తారు..."

ఆ మాటలినగానే మనసంతా ఎలాగో అయిపోయింది.

"అదికాదు, నువ్వు ఇరవైకీ ముప్పయికీ ఆశపడ్తే వానికొచ్చిన కాస్త చదువు కూడా మట్టిగొట్టుకుపోతాది. ఆపైన బాధపడి లాభముండదు"

"ఏం చెయ్యమంటారు సార్. మీ మాదిరి కాలు మీద కాలేసుకోని ఫ్యాను కింద కూచోని నెలకు ఐదారువేలు సంపాదించే బతుకులు కాదు కదా మావి. ఇంట్లో ఉన్న నలుగురమూ రెక్కలు ముక్కలు చేసుకున్నా రోజుకు రెండు వందల రాలవు. అదీ పంటల కాలమే. ఈసారి పెద్దపాప

కాన్పుకొచ్చింది. ఖర్చులున్నాయి. ఈ రెన్నెళ్ళు కాస్త చూసీ చూడనట్టుపో. కోతలు పూర్తి కాగానే ఒక్కరోజు కూడా నామం పెట్టకుండా పంపుతా" అంటూ కష్టాలన్నీ ఏకరువు పెట్టాడు.

సుబ్బన్న వంక చూశాను. తల వొంచుకొని భయం భయంగా అప్పుడప్పుడు కళ్ళెత్తి నావంక చూస్తున్నాడు. వాడిని పరిశీలనగా చూశాను.

మాసి చెమటకంపు కొడుతున్న చొక్కా, రేగిన జుట్టు, ఎండలో పని చేసీ చేసీ నల్లబడిన శరీరం, సరైన తిండి లేక లోపలికి పోయిన డొక్కలు, అలసి ఎర్రబడ్డ కళ్లు...

వాడిని గమనిస్తున్న కొద్దీ నాలో ఏవేవో ఆలోచనలు... ఎన్నెన్నో ప్రశ్నలు!

వారం రోజులుగా నా మనసును తొలిచేస్తున్న బాధకు ముగింపునిస్తూ... కొత్త చూపును ప్రసాదిస్తూ...

**ఆంధ్రజ్యోతి, ఆదివారం 9 డిసెంబర్, 2007**

**కథా వార్షిక - 2007**

# జాస్మిన్

కారు పెద్దాసుపత్రి ప్రధానద్వారంలోంచి ముందుకు తీసుకెళ్ళి కాన్సర్ వార్డ్ దగ్గర ఆపాను. రెండంతస్తుల భవనం. సున్నం వేసి ఎన్నాళ్ళయ్యిందో. రంగు పోయిన పాత చీరలా వెలవెలపోతోంది. బైట పేషెంట్ల బంధువులనుకుంటా. పెరిగిన గడ్డాల్తో, నలిగిన బట్టల్తో, దిగులుగా, దీనంగా... అక్కడక్కడ చెట్ల కింద కనబడుతున్నారు. లోపలికి అడుగుపెట్టాను. ఫినాయిల్ వాసన, రోగాల వాసన, మరుగుదొడ్ల వాసన కలగలసి కడుపులో దేవుతోంది. 'డాక్టర్ గదెక్కడ' కనబడిన నర్సుని అడిగాను. గది వైపు చూపించింది. డాక్టర్ సతీష్ నాకు కోల్సు కాలేజీలో ఇంటర్మీడియట్ స్నేహితుడు. ఒకే బెంచ్. కర్నూల్లో వున్నన్ని రోజులూ అప్పుడప్పుడూ కలిసేవాళ్ళం. గ్రూప్‌వన్ ఆఫీసర్‌గా హైదరాబాద్‌లో స్థిరపడ్డాక ఫోన్లోనే పలకరింపులు. అమ్మానాన్నా ఇక్కడే క్రిష్ణానగర్‌లో వుండడంతో తప్పనిసరిగా కర్నూలుకి సంవత్సరానికి రెండుమూడు సార్లన్నా వస్తుంటాను. సంవత్సరమైంది మిత్రున్ని కలవక. రేపు మరలా ఒక ముఖ్యమైన సమావేశానికి హాజరు కావలసి వుంది. ఈ రోజు పనేమీ లేదు. సరే సమయం చిక్కింది గదాని ముందే ఫోన్చేసి కలసి పోదామని వచ్చాను. గది దగ్గరికి పోగానే కాంపౌండర్ "సార్ ఇందాకే రౌండ్స్‌కి వెళ్ళాడు. కాసేపు కూర్చోండి. వచ్చేస్తాడు" అన్నాడు ఫ్యాను వేసి, కుర్చీ చూపిస్తూ.

అట్లా అక్కడే ఒక్కన్నే కూర్చోబుద్దిగాక ఒకొక్క గదే తిరుగుతూ నడవసాగాను. అట్లా జనరల్ వార్డ్‌లోకి వచ్చాను. వరుసగా మంచాలేసి వున్నాయి. రోగులు, వాళ్ళతోబాటు వచ్చిన బంధువులతో కిటకిటలాడుతోంది. నెమ్మదిగా ఒకొక్క మంచమే దాటుకుంటూ పోతూ వుంటే ఒక బెడ్‌పైన ఏదో పరిచిత ముఖం తళుక్కున మెరిసింది. ముందుకు పోతున్న వాన్నల్లా ఆగి వెనక్కి చూశాను. ఆ మంచం చుట్టూ ఎవరూ లేరు. ఆమె ఒక్కతే. ఒళ్ళంతా తెల్లగా పాలిపోయి, పీక్కుపోయిన ముఖంతో, ఎక్కడికక్కడ కండలు కరిగిపోయి... చావుకీ బ్రతుక్కీ మధ్య వూగిసలాడుతున్నట్లుగా వుంది. ఆమె ముఖం వంక పరిశీలనగా చూశాను. కళ్ళు మూసుకొని వుంది. నిద్రో... తెరిచే శక్తి లేదో... తెలీడం లేదు. అదే... అదే... ముఖం... అదే ముఖం కాదు ఆమే... ఒళ్ళంతా తెలియకుండానే చిన్నగా ఒణుకు. గుండె వేగంగా కొట్టుకోసాగింది. కళ్ళు తిరుగుతున్నట్లనిపించింది. శక్తినంతా

కూడగట్టుకుంటూ నెమ్మదిగా మంచం దగ్గరికి చేరుకున్నాను. వేరే రోగుల దగ్గరున్న వాళ్ళంతా మాటలు ఆపేసి నన్నే విచిత్రంగా చూస్తున్నారు. బహుశా నా ఖరీదైన దుస్తులు వాళ్ళని ఆశ్చర్యపరుస్తున్నట్లున్నాయి. స్టూలు జరుపుకొని దగ్గర కూర్చున్నాను. ఆమె కళ్ళు మూసుకునే వున్నాయి. తదేకంగా ఆ ముఖం వంకే చూస్తూ చేతి మీద చేయి వేశాను. ఆ స్పర్శకు ఏదో కదలిక. కళ్ళు కొద్దిగా తెరిచి చూసింది. మరు నిమిషంలోనే ఆమె కళ్ళు పెద్దగయ్యాయి. నమ్మలేనట్లుగా వున్నాయి. పెదాలు కొద్దిగా వణికాయి. అట్లాగే నా కళ్ళలోకి చూస్తుండిపోయింది. నెమ్మదిగా ఒక మెరుపు కళ్ళ నుంచి ముఖమంతా వ్యాపించి పెదాల మీద చిరునవ్వుగా వెలిగింది. నా చేతిని గట్టిగా పట్టుకుంది.

చుట్టూ అందరూ అర్థంగాక చూస్తున్నారు... ఆ చూపుల్లో అనేక ప్రశ్నలు, అనుమానాలు, ఆశ్చర్యార్థకాలు. వేటినీ పట్టిచ్చుకోలేదు. ఆప్యాయంగా ఆమె తలవెంట్రుకలు నిమిరి చేతి మీద ముద్దు పెట్టుకొని "డాక్టర్ నా స్నేహితుడే. పిలుచుకోని వస్తాను" అంటూ సున్నితంగా చేయి విడిపించుకోని గదికి చేరుకున్నాను. సతీష్ ఇంకా రాలేదు. ఫ్యాను కింద కూర్చున్నాను. ఆమె చిరునవ్వు మరలా మరలా కళ్ళ ముందు మెదులుతూ వుంది. పది పదైదు సంవత్సరాల గతం ముందుకూ వెనక్కూ ఆలోచనల్లో దొర్లుతూ వుంది. కాళ్ళు చాపుకొని కుర్చీలో జారగిలపడ్డాను.

అది నేను డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న సమయం. ఎండాకాలం కరెంటుకోత. ఉడకకు తట్టుకోలేక చేతిలో పుస్తకంతో మిద్దె మీదికి చేరుకున్నాను. పరీక్షలు మరెంతో దూరం లేవు. తదేకంగా చదువుతుంటే ఎక్కడి నుంచో అలలు అలలుగా వినిపించీ వినిపించనంత నిశ్శబ్దంగా గజ్జెల శబ్దం. తలెత్తి చూశాను. వెనుక ఇంటి మీద ఒకమ్మాయి అప్పుడే తలస్నానం చేసినట్లుంది. తల ముందుకు వంచి నల్లని జలపాతంలా ముందుకు దుంకుతోన్న శిరోజాలలోని నీటి తుంపరలను మెత్తని గుడ్డతో విదిలిస్తూ వుంటే ఆమె ముఖం కనబడక కుతూహలంగా చూడసాగాను. ఒక్కసారిగా విసురుగా వెంట్రుకలను వెనక్కు తోసుకుంటూ తలెత్తింది. ఎవరో అద్భుత శిల్పకారుడు తెల్లని పాలరాయితో చెక్కిన చక్కని శిల్పంలా వుంది. కనురెప్ప వేయడం మరచి ఎంతసేపయిందో. ఆమె అనుకోకుండా నావైపు చూసింది. ఊపిరి ఆగిపోయినట్లయింది. ఆమె భృకుటి ముడివడింది. కోపం కళ్ళల్లో అలలా ప్రవహించింది. గిరుక్కున వెనుదిరిగి మెట్ల మీదుగా అదృశ్యమైపోయింది.

వాళ్ళ ఇల్లు సరిగ్గా మా ఇంటికి వెనుక వైపు వుంది. మధ్యలో చిన్న సందు ఇళ్ళను విడదీస్తూ వుంది. మా ఇంటి ముఖం ఇవతలి సందువైపు వుండడంతో ఆమెని ఎప్పుడూ చూడలేదు. అంత అద్భుత సౌందర్యాన్ని ఇంతకాలం మిస్సయినందుకు మనసు బాధతో మూలిగింది. ఆరోజు నుంచీ సాయంత్రం కాగానే ఎక్కడున్నా, ఎంత పనున్నా కాళ్ళు డాబా మీదకు పరుగులు తీసేవి.

వాళ్ళ ఇంట్లో నుంచి ఒక మల్లెపూల చెట్టు మిద్దె మీదికి గుబురుగా పాకింది. ఎండాకాలం కావడంతో మొగ్గలు ఆకులతో పోటీ పడుతూ వాటి పచ్చదనాన్ని మాయం చేస్తున్నాయి. సాయంకాలం కాస్త చల్లబడగానే చేతిలో పెద్దగిన్నెతో మిద్దె మీద ప్రత్యక్షమయ్యేది. ఒకొక్క మొగ్గనే మునివేళ్ళతో

సుతారంగా తుంచుతూ గిన్నెలో వేసుకునేది. సాయంకాలం కావడం ఆలస్యం నా చూపులు ఆ మల్లెచెట్టు చుట్టూరానే తిరుగుతుండేవి. ఆమె రాక కోసం గుండె కొట్టుకుంటా వుండేది. మొదట్లో నన్నస్సలు చూసేది కాదు. చూసినా కళ్ళలో నిప్పుల మందారాలు కురిసేవి. రోజులు గడుస్తున్న కొద్దీ పువ్వులు కోసుకుంటూనే అప్పుడప్పుడు ఓరగా కనురెప్పలెత్తి దొంగచాటుగా గమనించేది. కొద్ది రోజులకు పెదాలు విరజాజుల్లా విచ్చుకోసాగాయి. నెమ్మదిగా ముఖమంతా వెలుగులు విరజిమ్మడం మొదలయ్యింది. అలా అలా... చూపులు కలుపుకొని, చిరునవ్వులు ప్రవహించి, చిన్న చిన్న సైగల వరకు వెళ్ళింది. ఆమె పేరేదో నాకు తెలీదు. దాంతో "జాస్మిన్" అని నాకు నేను పెట్టుకున్నాను.

జాస్మిన్‌కు రెండు మూడు దుస్తులకన్నా ఎక్కువ లేవనుకుంటా. ఉన్న వాటినే మార్చి మార్చి వేసుకునేది. అప్పుడప్పుడూ మోకాళ్ళ మధ్య తల దాచుకొని ఏదో విషాదంగా కనిపించేది. కింది నుంచి ఏవేవో అరుపులు, కేకలు వినబడుతుండేవి. ఒణుకుతున్న అధరాలతో, కందిన బుగ్గలతో బెదురుబెదురుగా వుండేది. అదంతా కాసేపే. నన్ను చూసిన కొద్ది క్షణాలలోనే పెదాలపైకి చిరునవ్వులు వచ్చి వాలేవి. నవ్వుతూ రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టి ఫక్కున నవ్వేసేది. ఆ పలకరింపుల మధ్యలోనే కింది నుంచి వాళ్ళమ్మ కేక వినబడేది. పూలతో నిండిన గిన్నెతో చివరిసారిగా చూపులు నా గుండెల్లో దిగేలా విసురుతూ చెంగున మెట్లు దిగి వెళ్ళిపోయేది. కొన్ని వందల వేల సార్లు ఆ నవ్వులను, ఆ చూపులను తలచుకుంటూ... ఆ ఎర్రని తేనెలూరే పెదాలను కలగంటూ... ఏవేవో కోరికలతో, ఆశలతో, ఊహలతో భవిష్యత్తును కలగంటూ తరువాత రోజు సాయంత్రం వరకూ బ్రతుకుతూ వుండేవాన్ని. అదే సమయంలో చదువును గూడా వృథా చేసేవాన్ని కాదు. పరీక్షలు ముగిశాయి. సెలవులు వచ్చాయి. అనుకోకుండా జాస్మిన్ కనిపించకుండా మాయమైంది. ఎన్ని రోజులు ఎదురు చూశానో. ఆగలేక ఇంటికి పోయి చూస్తే తాళం మౌనంగా వేలాడుతూ కన్పించింది. ఆ తర్వాత కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ సీటొచ్చింది. తప్పని సరిగా వెళ్ళాల్సొచ్చింది. మధ్యమధ్యలో అనేకసార్లు ఆ ఇంటివైపు వెళ్ళేవాన్ని. వేరేవాళ్ళు ఎవరో చేరినట్లు అర్థమైంది. జాస్మిన్ ఏమైపోయిందో, ఎక్కడికెళ్ళిందో అర్థం కాలేదు.

స్నేహితుల ద్వారా వివరాలు సేకరిస్తుంటే... పేపర్‌మిల్లు కార్మికుడైన వాళ్ళ నాన్న అది మూతపడడంతో, తెరుస్తారేమోనని ఎదురు చూసీ చూసీ నిరాశతో, మానసిక ఆందోళనతో మరణించాడని, ఇంటిని చూసుకోవాల్సిన అన్న దొరికినంత మూటగట్టుకొని ఎవరినో లేపుకొని పోయాడనీ, దాంతో వాళ్ళమ్మకు పక్షవాతమొచ్చి మంచానికే అతుక్కుపోయిందనీ... అడిగేవాళ్ళెవరూ లేకపోవడంతో బరితెగించి బజారు మీద పడిందనీ... ఏవేవో... ఎన్నెన్నో.. కథలు కథలుగా... విని భరించలేకపోయేవాన్ని... మనసు మౌనంగా రోదిస్తూ వుండేది. ఎప్పుడన్నా ఒక్కసారన్నా కనబడుతుందేమోనని రోడ్ల మీద కళ్ళు నిరంతరం ఆశగా వెతుకుతూనే వుండేవి.

ఒకరోజు నటరాజ్ టాకీస్ పక్కసందులో చీకట్లో నడుస్తూ వుంటే ఒక వెలిగీ వెలగని వీధిదీపం

కింద... ఎవరి కోసమో ఎదురుచూస్తూ... జాస్మిన్... చాలా రోజులైంది చూసి. జాస్మినా కాదా అని పట్టిపట్టి చూస్తూ అడుగుల వేగం తగ్గించాను. కాస్త ఒళ్ళు చేసింది. శరీరంలో వయసులో వచ్చిన మరికొన్ని మార్పులు. కానీ ఆ కళ్ళు మాత్రం అలాగే. నిలబడిపోయాను రోడ్డుకి అవతలివైపుగా. ఎవరా అన్నట్లు తలెత్తి చూసింది. కొద్ది క్షణాల్లోనే ఆమె కనురెప్పలు విశాలమయ్యాయి. ముఖమంతా వేయి చందమామల వెలుగు. అంతలోనే ఛటుక్కున తల దించుకుంది. ఆమె శరీరం చిన్నగా వణుకుతోంది. ఆమె వైపు అడుగు ముందుకు వేశాను.

అంతలో ఒక ఆటో వచ్చి మధ్యలో ఆగింది. లోపల ఎవరో వున్నట్టున్నారు. చీకట్లో ఏమీ కనబడ్డంలేదు. జాస్మిన్ తలదించుకొనే మౌనంగా ఆటో ఎక్కేసి వెళ్ళిపోయింది.

ఆ రోజు రాత్రంతా నిద్ర లేదు. మనసంతా ఆమె పరిమళమే. కొంచెం సేపు సంతోషం, కొంచెం సేపు దుఃఖం, ఏమేమో అడగాలనీ, ఎన్నెన్నో చెప్పాలనీ, వేగంగా ప్రయాణించే కాలంతోబాటు ప్రయాణించలేక గతంలోకి జారిపోతూ... ఆనందాల్ని ఏరుకుంటూ, మాల గుచ్చుకుంటూ, ఏకాంతాన్ని వసంతంగా మార్చుకుంటూ... తరువాతరోజు సాయంత్రం వరకూ గడిపేశాను. చీకటి పడే సమయానికంతా పరుగులాంటి నడకతో నిన్న కనబన్న చోటుకి చేరుకున్నాను. మనసులో ఏదో చిన్న ఆశ.

చీకటి వెలుతురును కమ్ముకుంటూ తనలో ఐక్యం చేసుకుంటూ వుంది. వస్తుందా... రాదా... రోడ్డు ఆ చివర నుంచీ ఈ చివర వరకూ కళ్ళతోనే వెదుకులాడసాగాను. నిరాశ చుట్టుకుంటోంది. ముఖం పాలిపోతోంది. కళ్ళలో దుఃఖం కమ్ముకుంటూ వుంది. అంతలో... ఒక చిన్న పిల్ల తెమ్మెర... మల్లెపూల మరిమళాన్ని మోసుకుంటూ వచ్చి తాకింది. గిరుక్కున వెనుదిరిగాను. కాస్త దూరంగా గోడనానుకొని తదేకంగా నన్నే చూస్తోన్న జాస్మిన్. ఎంతసేపయిందో వచ్చి. ఫక్కున ఇంద్రధనస్సులా నవ్వింది. వేగంగా ముందుకు వచ్చి గట్టిగా నా చేయి పట్టుకొని అటుగా వస్తున్న ఆటోను ఆపి ఎక్కించింది. నా నోట మాట రావడం లేదు. ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న వానిలా ఆమె వెంట నడిచాను.

ఆటో సాయిబాబా గుడి దగ్గర ఆగింది. ఎవరూ గుర్తుపట్టకుండా కొంగు తల మీదుగా కప్పుకుంది. నా చేయి ఆమె చేతిలోనే వుంది. గుడిమెట్లు దాటి కిందికి తుంగభద్రలోకి దారి తీసింది. మొదట్లో కొంచెం నీళ్ళున్నాయి. అది దాటగానే అంతా ఇసుక. కాళ్ళు మెత్తగా కూరుకుపోతున్నాయి. మనుషులెవరూ కనిపించని చోటుకు, మాటలు వినిపించని చోటుకు... మధ్యలో పారుతున్న నీటి పాయ పక్కనే వున్న పచ్చిక వద్దకు తీసుకెళ్ళింది. చల్లని గాలి స్పృశిస్తూ వుంది. నల్లని మబ్బుల్లోంచి వెలుతురు చినుకులు చినుకులుగా రాలుతోంది. ఎదురెదురుగా కూర్చున్నాం. ఆమె కళ్ళు నాలోకి తొంగి చూస్తున్నాయి. ఆమె ఒంటి పరిమళం గాలినంతా సుగంధభరితం చేస్తోంది. "ఎన్ని రోజులైంది నిన్ను చూసి. అసలు నువ్వు వస్తావనుకోలేదు" అన్నా నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ. అనుకోకుండా

ఆమె కళ్ళలోంచి ఒక్కసారిగా గంగ వుప్పొంగింది. నేనామెను దగ్గరకు తీసుకున్నానో, ఆమే నాకు దగ్గరయిందో.... నా ఒళ్ళో గువ్వలా ఒదిగిపోయింది. పక్కనే నదిలోంచి వీస్తున్న చల్లని గాలి, ఇసుకలోంచి ఎగస్తున్న వేడిగాలులతో సంగమిస్తూ వాతావరణాన్ని చల్లబరుస్తోంది. ఒకరినొకరం అల్లుకుంటూ, వెదుక్కుంటూ, ఆస్వాదిస్తూ, సహకరిస్తూ... కాలం కాసేపు స్తంభించిపోయింది. అలసి వేరుపడ్డాం. ఒకరి చేయి ఒకరం పట్టుకొని అలా ఎంతసేపు ఆకాశాన్ని చూస్తూ నిశ్శబ్దంగా వుండిపోయామో తెలీదు. ఎక్కడో దూరం నుంచి సన్నగా పోలీస్ విజిల్. జాస్మిన్ వులిక్కిపడి లేచి గబగబా చీర కట్టుకుంటూ చేయి చాపింది.

"రేయ్... ఇకపై అన్నీ వదిలేసి నాతో వచ్చేయ్... ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోదాం" అన్నా.

జాస్మిన్ తుంగభద్ర ప్రవాహంలా గలగలా నవ్వింది. ఆప్యాయంగా నా జుట్టులోకి వేళ్ళు జొనిపి తల వంచి నుదుటిపై మృదువుగా చుంబించింది. నేను ఏదో చెప్పబోతున్నంతలోనే గబగబా నడవడం మొదలుపెట్టింది. నేను బట్టలు వేసుకునే లోపలే కళ్ళ ముందు నుంచి మాయమైంది. ఎంత వెదికినా కనబడలేదు. తరువాతరోజు మళ్ళీ సరిగ్గా అదే సమయానికి వెళ్ళాను. ఊహూ... లాభం లేదు. అట్లా ఎన్ని సార్లు... ఎన్ని గంటలు ఎదురుచూశానో. కర్నూలుకి ఎప్పుడు వచ్చినా చీకటి పడితే చాలు ఆ వీధిదీపం దగ్గరికి కాళ్ళు పరుగులు తీసేవి. పీజీ పూర్తయి ఉద్యోగం సంపాదించి, పెళ్ళి చేసుకొని, ఇద్దరు పిల్లలు పుట్టే వరకూ జాస్మిన్‌ను మరలా నేనెప్పుడూ చూడలేదు.

ఒకసారి శివరాత్రికి కాల్వబుగ్గ చూసొద్దామని రాజ్‌విహార్ దగ్గర భార్యాపిల్లల్తో బస్సు కోసం ఎదురు చూస్తూ వున్నాను. సంవత్సరం వయసున్న కొడుకు భుజమ్మీద తలబెట్టుకొని నిదురపోతున్నాడు. పాప అమ్మ చేయి పట్టుకొని ఏదో చెబుతూ వుంది. అసహనంగా గడియారం చూసుకుంటూ బస్సు కోసం ఎదురుచూస్తుంటే ఎవరో వెనుక చటుక్కున గోడచాటుకు తప్పుకున్నట్టనిపించింది. కొద్దిసేపు ఏమీ అర్థం కాలేదు. ఎవరు... నన్ను చూసేనా... ఎందుకు... కుతూహలం పెరిగింది. గోడచాటు నుంచి చూపులు వీపుకి గుచ్చుకొంటున్నాయి. తల వంచి కళ్ళను సాధ్యమైనంతగా తిప్పి చూశాను. గాలికి ఒక పాత మాసి, చినిగి పోయిన చీర వూగుతూ వుంది. చాలారోజులుగా తైలసంస్కారం లేక జడలు కట్టిన జుట్టు కొంచెం కనబడుతూ వుంది. ఆమె చూపులు నా భార్యాపాపల మీద వున్నాయి. ముఖం కనబడ్డం లేదు. బాబుని ఎత్తుకొనే అలా దూరంగా వెళ్ళినట్లుగా వెళ్ళి నెమ్మదిగా వెనుకవైపుగా వచ్చాను.

వీపు కనబడుతూ వుంది. తెల్లని శరీరం... చిక్కిపోయి... ముడతలు పడి... ఎవరా అని ఆలోచిస్తా వుంటే నా అడుగుల సవ్వడికి వెనుదిరిగి చూసింది. ఆశ్చర్యంతో కొయ్యబారిపోయాను. 'జాస్మిన్'. ఏ మాత్రం గుర్తు పట్టేలా లేదు. ముప్పై ఏళ్ళకే యవ్వనమంతా కరిగిపోయి, వృద్ధాప్యం కమ్మివేసినట్లుగా ముఖమంతా ముడతలు పడి, కళ్ళు లోపలికి పోయి, ఎక్కడికక్కడ ఎముకలు బైటపడి, అస్థిపంజరానికి చీర కట్టినట్టుగా వున్న నా కలలరాణి. నన్ను చూడగానే ఆమె చూపులు

తడవద్దాయి. పెదాలు వణికాయి. భయం భయంగా తల దించుకొంది. నాకు నోట మాట రావడం లేదు. జాస్మిన్‌ను ఇట్లా చూస్తానని కలలో గూడా వూహించలేదు. పలకరిద్దామని నోరు తెరిచాను. కానీ బస్టాప్‌లో కొందరు నన్నే చూస్తున్నారు. పరువు, మర్యాద అడ్డం వచ్చాయి. మాట నోటిలోనే ఆగిపోయింది. ఆమె చేతి వంక చూశాను. గుప్పిట్లో చిల్లర. జేబులో చేయి పెట్టాను. ఐదువందల రూపాయల నోట్లు నాలుగు తగిలాయి. తీసుకోమన్నట్లుగా చేయి చాపాను.

జాస్మిన్ తలెత్తి నా కళ్ళలోకి చూసింది. పెదాల మీద తళుక్కున చిరునవ్వు మెరిసింది. వద్దన్నట్లుగా తలూపూ రెండడుగులు వెనక్కు వేసింది. బలవంతంగా చేతిలో పెడదామనుకున్నాను. కానీ ఎవరన్నా గమనిస్తే... నా భార్య చూస్తే... ఏం చేయాలో తోచక సతమతమవసాగాను.

అంతలో బస్సు వస్తున్న శబ్దం. "తీసుకో" అన్నాను మరోసారి. ఆమె నిశ్శబ్దంగా చిరునవ్వుతో అలాగే నిలబడిపోయింది. ఏం చేయాలో తోచక బాబుతో వేగంగా ముందుకు వచ్చాను. అప్పటికే నా భార్య నా కోసం కంగారుగా అటూయిటూ వెదుకుతూ వుంది. "ఎక్కడికెళ్ళారండి" అంది నే కనబడగానే. చిటికెన వేలు చూపిస్తూ పాప చేయి పట్టుకొని వడివడిగా బస్సెక్కి కిటికీ పక్కన కూర్చున్నాను.

జాస్మిన్ బస్‌షెల్టరును ఆనుకొని తదేకంగా నన్నే చూస్తూ వుంది. ఆ చూపుల్లో ఏదో చెప్పలేని భావం. పెదాల మీద చిరునవ్వు పాదరసంలా ప్రవహిస్తూనే వుంది. బస్సు కదిలింది. అప్రయత్నంగా నా కళ్ళల్లో నీళ్ళు చిమ్మాయి.

"డాడీ... ఏమైంది... ఎందుకేడుస్తున్నావ్" అంది పాప.

నా భార్య తలెత్తి ఆశ్చర్యంగా చూసింది. "ఏం లేదమ్మా... కంట్లో పడగూడనిదేదో పన్నట్టుంది" అన్నాను కర్చీఫ్ తీసుకుంటూ.

అలా ఆరోజు చూసిన జాస్మిన్ మరలా సంవత్సరం కూడా కాకముందే ఇక్కడ ఆసుపత్రిలో మంచమ్మీద. ఆలోచనల్లోనే సతీష్ వచ్చాడు. ఆప్యాయంగా కరచాలనం చేస్తూ "సారీ... కాస్త ఆలస్యమైంది" అన్నాడు నవ్వుతూ. మాటల్లోనే "సతీష్... నాకు బాగా తెలిసిన అమ్మాయి. పరిస్థితేం బాగున్నట్లు లేదు. కాస్త కేర్ తీసుకోగలవా. అవసరమైన డబ్బు నే పంపిస్తాను" అన్నాను. "ఎవరు" అంటూ సతీష్ నా వెంట నడిచాడు. జాస్మిన్‌ను చేరుకున్నాం. ఆమె కళ్ళు నేను వెళ్ళిన గది వైపే అచేతనంగా చూస్తూ వున్నాయి. సతీష్‌కి అనుమానమొచ్చి ఆమె నాడి పట్టుకొని చూశాడు. శరీరం చల్లగా వుంది. తలడ్డంగా వూపూ... "సారీ... షీ ఈజ్ డెడ్" అన్నాడు. నాకు గుండె పిండేసినట్లయింది.

"ఆరు నెల్లుగా ఇక్కడే వుంది కాన్సర్‌తో పోరాడుతూ... దానితోబాటు శరీరమంతా రకరకాల జబ్బులు. బహుశా ఎవరూ లేరనుకుంటా. శవాన్ని మార్చురీకి తరలించాలి" అన్నాడు.

ఎవరూ తీసుకోకపోతే... అనాథ శవంలా... నా జాస్మిన్... గుండె కొట్టుకుంటా వుంది. సిగ్గు, మర్యాద వదిలేశాను. తడబడుతున్న గొంతుతో "రేయ్... ఎందుకు, ఏమిటి అనడగొద్దు.

ఫార్మాలిటీస్ పూర్తి చేసి నాకప్పగిస్తే గౌరవంగా ఖననం చేస్తాను. ఈ ఒక్క సహాయం చేయగలవా” అన్నాను. సతీష్ ఆశ్చర్యంగా నా వంక చూశాడు. నా కళ్ళలో కన్నీటిపొర వాన్ని ఏ ప్రశ్నలూ వేయించలేదు. సరేనంటూ వెళ్ళిపోయాడు. అంతలోపు జమ్మిచెట్టు దగ్గరి శ్మశాన వాటికకు చేరుకొని గుంత తవ్వడానికి, దాసరిని పిల్చుకు రావడానికి డబ్బులిచ్చి వచ్చాను. వైకుంఠ రథానికి ఫోన్ చేశాను. సాయంత్రానికంతా సంతకాలు తీసుకొని శవాన్ని అప్పజెప్పారు. వైకుంఠ రథం వెంట కారులో శ్మశానానికి చేరుకున్నాను. దాసరోనికి ముందే అడిగినంత డబ్బులియ్యడంతో మారు మాట్లాడకుండా చేయాల్సిన కార్యక్రమాలు చేసి శవాన్ని గుంతలో చేర్చారు. చీకటి పడే సమయానికంతా బూడ్చడం పూర్తయ్యింది. అందరికీ డబ్బులు ఇచ్చేశాను. కారులోంచి మల్లెపూల దండ తీసుకువచ్చి సమాధిపై పెట్టి అగరుబత్తులు వెలిగించాను.

కాటికాపరిని పిలిచి చేతిలో వేయి రూపాయలు పెడుతూ “ఓ పదిరోజులు గుప్పెడు మల్లెపూలు ఆ సమాధి మీద వుంచు” అన్నాను.

అతను అలాగేనంటూ “సార్... అప్పట్నించీ అడగాలనుకుంటున్నా... ఆ అమ్మాయి మీకేమవుతాది” అన్నాడు.

తలెత్తి చూశాను. చీకటిలో అతని ముఖం అస్పష్టంగా కనబడుతూ వుంది. ఏమీ మాట్లాడకుండా బైటకొచ్చి మౌనంగా కారెక్కాను. అంతవరకూ ఆపుకుంటున్న దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకొంది. వెక్కి వెక్కి ఏడుస్తూ స్టీరింగ్ మీద వాలిపోయాను.

**ఆదివారం ఆంధ్రజ్యోతి - 16 జూన్, 2013**

# వరద

అద్దె ఇంటి కోసం సీక్యాంపు, వెంకటరమణకాలనీ, కొత్తబస్టాండు పరిసర ప్రాంతాలలో వీధి వీధీ తిరుగుతున్నాడు వెంకటరెడ్డి . కానీ ఎక్కడా ఖాళీల్లేవు. అసలు చాలా ఇళ్ళు తాళాలేసి వున్నాయి. ఎప్పుడూ మనుషుల రాకపోకలతో గందరగోళంగా వుండే వీధులన్నీ గత మూడు రోజులుగా బోసిగా, నిశ్శబ్దంగా వున్నాయి. చాలా చోట్ల చాలామంది తనలాగే అద్దెఇళ్ళ కోసం వెదుకుతూ ఎదురుపడుతున్నారు.

వెంకటరెడ్డికి తిరిగీ తిరిగీ నీరసం వస్తూ వుంది. ఊరికి పోదామా అంటే అక్కడ వున్న ఇల్లు పడిపోయింది. ఇక్కడ వుందామా అంటే ఎక్కడా అద్దె ఇల్లు దొరకడం లేదు. ఊరిలో అందరి పరిస్థితి ఇలాగే వుంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు అందిస్తున్న సహాయం కోసం గ్రామస్తులంతా ఉదయమే ఊరు చేరుకొని, సాయంకాలం వరకూ ఎదురుచూస్తూ, దొరికింది చేజిక్కించుకుంటూ చీకటి పడే సమయానికి తిరిగి కర్నూలుకో, బంధువుల వూర్లకో, సహాయశిబిరాలకో చేరిపోతున్నారు. ఊరిలోకి ఏదయినా వాహనం వస్తే చాలు జనాలు ఎక్కడికక్కడ ఎగబడి, ఒకరినొకరు దొబ్బుకుంటూ, అరుచుకుంటూ, తిట్టుకుంటూ, కొట్టుకుంటూ వున్నారు. వెంకటరెడ్డికి అదంతా చాలా ఇబ్బందిగా అనిపించి ఊరికి పోవడమే మానేశాడు.

సమయం మధ్యాహ్నం మూడవుతూ వుంది. ఉదయాన్నించీ తిండి లేక ముఖమంతా పీక్కుపోయింది. కడుపులో పేగులు అరుస్తూ వున్నాయి. నెమ్మదిగా పాతబస్టాండ్ వైపుకి ప్రయాణం మొదలుపెట్టాడు.

వెంకటరమణకాలనీ దాటగానే జాగ్రత్తగా పంచ పైకెగ్గట్టి నడవసాగాడు. రోడ్ల నిండా ఎక్కడ చూసినా ఒకటే బురద. అడుగు తీసి అడుగు వెయ్యడం చాలా కష్టంగా వుంది. ఇండ్లలోంచి, షాపుల్లోంచి బైట పడేస్తున్న ఆహార పదార్థాలతో, చచ్చిన జంతువుల కళేబరాలతో వీధులన్నీ కుళ్ళి కంపు కొడుతున్నాయి. ఏ ఇంటిలో చూసినా ఒకటే దృశ్యం. ఏ వీధిలో చూసినా ఒకటే రోదన. తినడానికి తిండి లేదు. తాగడానికి నీళ్ళు లేవు. వుండడానికి వసతి లేదు. ఫ్యాన్లు, టీవీలు, మిక్సీలు, బోర్లు, బండ్లు, కార్లు... సర్వం బురదమయమై, ఇండ్లలోని ఫర్నీచరంతా నాని, ఉబ్బి, తలుపులు, కిటికీలు ఎక్కడికక్కడ ఊడి వస్తుంటే, జీవిత కాలమంతా పైసాపైసా దాచిపెట్టుకొని కొన్న వస్తువులు

కళ్ళ ముందే బురదలో కూరుకుపోయి వుంటే... వాటిని ఎలా శుభ్రం చేసుకోవాలో, ఎలా బాగు చేసుకోవాలో తెలీక నిస్సహాయంగా కన్నీరు విడుస్తూ వున్నారు. రోడ్లు, కాలువలు అన్నీ బురదతో నిండిపోయి బాత్‌రూంలు, సెప్టిక్ ట్యాంకులు వెనక్కి తంతూ వున్నాయి. గోడలు చెమ్మపట్టి ఆరడం లేదు. కొందరు బురదతో నిండిన బట్టలు, సామాన్లు ఆటోలకు వేసుకొని శుభ్రం చేసుకోవడానికి నీళ్ళున్న ప్రదేశాలకు వెళుతూ వున్నారు. మరికొందరు నీళ్ళు లేక, కరెంటు లేక ఎలా ఆ బురదను తొలగించుకోవాలో అర్థంకాక, రోజురోజుకీ పెరిగిపోతున్న అంటువ్యాధులకు భయపడి ఇళ్ళను అలాగే వదిలేసి తాళాలేసుకొని బంధువుల ఊర్లకు వెళ్ళిపోతున్నారు.

వెంకటరెడ్డి అదంతా చూస్తూ ముందుకు పోతుంటే ఒకచోట కొందరు అన్నం పొట్లాలు తెచ్చి పంచుతూ కనబడ్డారు. అది చూడగానే ఒక్కసారిగా ఆకలి పెరిగిపోయింది. భోజనం వేళ దాటిపోవడంతో పెద్దగా ఎవరూ లేరు. చాలామంది జనాలు కంపు భరించలేక ముఖాలకు కర్చీఫులు కట్టుకొని తిరుగుతున్నారు. వెంకటరెడ్డి అటూ ఇటూ చూశాడు. తెలిసినవాళ్ళు ఎవరూ కనిపించలేదు. ఎందుకయినా మంచిదని ముఖం కనబడకుండా తువ్వాలును మొహానికి అడ్డంగా కట్టుకొని వరుసలో నిలబడి ఒక ప్యాకెట్ అందుకున్నాడు. దూరంగా ఎవరూ లేని చోటకు చేరి ఒక చెట్టు కింద కూర్చొని పొట్లం విప్పాడు. అన్నం తింటూ వుంటే మూడురోజుల కిందట గాంధీజయంతి రోజున జరిగినదంతా గుర్తుకు రాసాగింది.

సుంకేసుల గేట్లు ఎత్తేస్తున్నారని, తుంగభద్రకు వరద నీరు వస్తుందని, దిగువ ప్రాంతాలన్నీ ఖాళీ చేయాలని దండోరా వినేసరికి ఊరంతా ఒకటే గందరగోళం, హడావుడి. నీళ్ళు ఎంతవరకు వస్తాయి, ఎవరి పొలాలు వుంటాయి, ఎవరివి మునుగుతాయి అని ఒకటే చర్చలు. కొందరు మేతకు పోయిన పశువులను పట్టుకోనొచ్చి ఇండ్ల దగ్గర కట్టేస్తున్నారు. వెంకటరెడ్డి గాసగాన్ని తీసుకొని పొలానికి పోయాడు. పిల్ల పెళ్ళి చేయాలనే ఉద్దేశ్యంతో మూడు ఎకరాల సొంత పొలంతో బాటు, ముందస్తుగా గుత్త చెల్లించి ఇంకో ఐదు ఎకరాల్లో వరి వేశాడు. పొలమంతా నిండుగా కళకళలాడుతూ వుంది. ఇంకో నెల దాట్తే చాలు పంట చేతికొచ్చేస్తాది. ఎందుకయినా మంచిదని వెంకటరెడ్డి పొలంలోని రెండు మోటర్లు ఇప్పించి ఇంటికి చేర్పించాడు.

ఉదయం పదయ్యేసరికి నెమ్మదిగా గ్రామ శివార్లలోకి నీళ్ళు రావడం మొదలయ్యింది. కింది గేర్లలో ఒకటే ఆందోళన. "రేయ్... ఎంతొచ్చినా... చింతతోపు కాదున్న రంగన్న పొలం వరకేలేరా" అన్నాడు ఒక పెద్దమనిషి ఆ హడావుడి అంతా చూస్తూ. కానీ అతను ఆ మాటన్నంతసేపు పట్లేదు నీళ్ళు ఆ పొలం దాటడానికి. పచ్చని పంటపొలాలను మింగుతూ నీరు ఊరికి దగ్గర కాసాగింది. నిమిష నిమిషానికి ఎప్పుడూ ఊహించని చోట్లకి చాలా వేగంగా చేరిపోతూ వుంది. దిగువ ప్రాంతాల్లోని ప్రజలు చాలామంది ఇండ్లకు తాళాలేసుకొని, బండ్లు కట్టుకొని, ట్రాక్టర్లేసుకొని నగరానికి వెళ్ళిపోవడం మొదలుపెట్టారు.

చూస్తుండగానే నీళ్ళు కర్నూలుతో ఊరిని కలిపే తారురోడ్డు మీదకి ఎక్కి పారడం మొదలయ్యింది. అది చూసి వెంకటరెడ్డి కొడుకు "నాన్నా... రోడ్డు పూర్తిగా మునగకముందే మనంకూడా బండ్లు కట్టుకొని బైటపడ్డం మేలు" అన్నాడు. ఆ మాటలు విన్న ఒక ముసిలోడు నవ్వుతూ "ఏం కాదులేరా... ఎన్ని చూళ్ళా ఇట్లాంటివి. మాతాత చెప్పినాడు ఒకసారి... దాదాపు వందేళ్ళ కిందట ఊరి బైట సుంకులమ్మ గుడి మునిగి గోపురం కనబడిందంట. ఊరంతా మిట్టమీదికి అదే ఇప్పుడు కొత్తగా బిల్డింగులు కట్టినారు చూడు అక్కడికి చేరి ప్రాణాలు కాపాడుకున్నారంట. మేం ఆయన నోట వినడమే తప్ప పుట్టి ఇంతవరకూ అట్లాంటి వరదను ఎప్పుడూ చూల్లేదు. ఎంతొచ్చినా సుంకులమ్మ గుడి మెట్లకాడికే" అన్నాడు.

ఆ మాటలతో జనాలకి ఏదో ధైర్యం. అయినా ఎందుకయినా మంచిదని వెంకటరెడ్డి పరుగులాంటి నడకతో ఇంటికి చేరి "ఏమే... నేను నీళ్ళు ఎంతవరకు వస్తున్నాయో చూసొస్తా... నువ్వు సామానంతా అటకలమీదకు చేర్చు" అంటూ భార్యా బిడ్డలతో చెప్పి బైలుదేరాడు.

"నాన్నా... నేనూ వస్తా" అంటూ వద్దన్నా వినకుండా కొడుకు వెంట నడిచాడు.

వెంకటరెడ్డి భార్య సుజాత కూతురుతో కలసి ఒక్కొక్క సామానే పైన పెట్టసాగింది. గంట గడిచిందో లేదో కొడుకు గసబెడుతూ పరుగెత్తుకుంటూ వచ్చి "అమ్మా... మన పొలంలోకి నీళ్ళు వచ్చేసినాయంట" అన్నాడు వగరుస్తూ...

ఆమాటినగానే సుజాత కాలూ చేయీ ఆడలేదు. చేస్తున్న పని ఆపి అలాగే గోడకు చేరగిలపడింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పెట్టిన పెట్టుబడి, ఎరువుల దుకాణంలో అప్పులు, పిల్ల పెండ్లి గుర్తుకు వచ్చి కుళ్ళి కుళ్ళి ఏడవసాగింది.

"ఏమయిందే... ఏమట్లా ఏడుస్తా వున్నావు" మంచమ్మీద నుంచే అత్త గట్టిగా అడిగింది. చెప్పడానికి ఆసక్తి లేక, చెప్పే ఓపిక లేక సుజాత అలాగే నేలమీద వాలిపోయింది.

అంతలో వెంకటరెడ్డి పంచ పైకెగ్గట్టి వురుక్కుంటా లోపలికి వచ్చాడు. కింద వున్న భార్యని చూసి "లెయ్... లెయ్... ఏమట్లా పడుకున్నావు. అవతల నీళ్ళు బోయగేరి దాట్నాయి. మనింటికాడికి రావడానికి వుండేది నాలుగు సందులే. లే... లేసి అమ్మను, పాపను తీసుకొని మిట్టమీది మునిరెడ్డి ఇంటికి పో. ఈ నీళ్ళను చూస్తుంటే ఇప్పట్లో ఆగేటట్టు లేవు" అంటూ కొడుకుతో కలసి ఎరువుల సంచీలు, విత్తనాల సంచులు, సంవత్సరానికి సరిపడా దాచిపెట్టుకున్న ధాన్యం అటకల మీదకు ఎక్కించసాగాడు. సుజాత నిర్లిప్తంగా అత్తను చేయి పట్టుకొని లేపి, కూతురితో బిల్డింగుల వైపుకి దారి తీసింది.

వెంకటరెడ్డి సామాన్లు పైకి సర్దుతుండగానే కాళ్ళ కింద చల్లగా అనిపించింది. చూస్తే ఇంటి గడపమాను దాటి నీళ్ళు లోపలికి దుంకుతూ వున్నాయి. ఏం చేయాలో తోచలేదు. కొడుకుతో "రేయ్... నువ్వు పోయి అమ్మ దగ్గరుండు. నీళ్ళు చూద్దామని అటూ యిటూ ఎక్కడికీ కదలొద్దు.

జాగ్రత్త" అంటూ హెచ్చరించి బైటకు పంపాడు.

ఇంట్లో సామాన్లు ఏమీ కొట్టుకుపోకుండా గబగబా కిటికీలేసి, ఇంటి వెనుక వున్న తలుపు లోపల గడ పెట్టేసి, దానికడ్డంగా బీరువా జరిపి, వురుక్కుంటూ ముందుకొచ్చేసరికి నీళ్ళు మోకాలు లోతుకు వచ్చేశాయి. వరద పెరుగుతున్న వేగం చాలా ఆశ్చర్యానికి గురి చేసింది. తలుపులు రెండూ లాగి తాళమేశాడు. అంతలో ఇంటి వెనుక నుంచి యెద్దుల అరుపులు వినబన్నాయి. వేగంగా వెనుకనున్న గాటిపాడుకి చేరాడు. పోయిన సంవత్సరం తర్తూరు తిరుణాలలో కొత్తగా కొన్న ఎద్దులు.... భయపడి గింజుకుంటున్నాయి. ఒక్కుదుటున నీళ్ళలోకి చేయి పెట్టి గుంజకు కట్టిన దుసిముడి లాగాడు. పగ్గాలు చేత పట్టుకొని రోడ్డు మీదకు లాక్కొచ్చాడు. రోడ్డంతా జనాలతో, పశువులతో గందరగోళంగా వుంది. ఆడోళ్ళు పిల్లలను సంకనేసుకొని, ముసిలోళ్ళని చేయి పట్టుకొని పరిగెత్తుతూ వుంటే, మొగోళ్ళు, యువకులు ఇండ్లలోని సామాన్లను, పశువులను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూ వున్నారు. నడవలేని వాళ్ళను కొందరు ఎత్తుకొని వురుకుతున్నారు.

వెంకటరెడ్డి ఎద్దులను తోలుకుంటూ మిట్ట మీది బిల్డింగులకు దారి తీశాడు. ఊరికి అదే అన్నింటికన్నా ఎగువ ప్రదేశం. అప్పటికే చాలా మంది ముసలీముతకా అక్కడికి చేరుకున్నారు. అంతా గందరగోళంగా వుంది. గబగబా మునిరెడ్డి ఇంటి ముందున్న గుంజకు ఎద్దులను కట్టేసి తిరిగి ఇంటివైపుకు పరిగెత్తాడు.

అప్పటికే ఇల్లు సగం నిండిపోయింది. నీళ్ళు కిటికీలను తాకుతూ వున్నాయి. చూస్తూండగానే నిమిష నిమిషానికీ నీళ్ళు పెరుగుతూ... కిటికీలు దాటేశాయి. వెంకటరెడ్డిలో ఆందోళన పెరిగిపోసాగింది. ద్వారబంధం దగ్గర ఆగినా సుంచుల మీదున్న ధాన్యం బస్తాలు, ఎరువుల బస్తాలు మిగులుతాయనుకున్నాడు. కానీ... నీళ్ళు ఆగడం లేదు. చూస్తుండగానే సుంచులు దాటేశాయి. ఇంటి పైకప్పుకు ఎక్కేశాయి. పైన కనబడుతున్న పొగగొట్టం గూడా దాటేసి కళ్ళ ముందే మొత్తం మునిగిపోయింది. తరతరాలుగా తన తాతల కాలం నుంచీ వస్తున్న ఇల్లు. ఈసారి పంట పండి డబ్బులొస్తే మట్టిమిద్దె పడగొట్టి కొత్తది కట్టించుకోవాలనుకున్నాడు. వెంకటరెడ్డి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. విచారంగా మునిరెడ్డి ఇంటివైపుకు బైలుదేరాడు. కనుచూపుమేర చుట్టూ నీళ్ళతో దీవిలా వుంది.

జనాలంతా మిద్దెలు ఎక్కుతూ వున్నారు. ఎంతవరకు వస్తాయో, ఎప్పుడు ఆగుతాయో ఎవరికీ అర్థం కావడంలేదు. ముసిలోళ్ళ అంచనాలు, అనుభవాలు అన్నీ తారుమారయిపోతున్నాయి. నీళ్ళు నెమ్మదిగా కొత్త బిల్డింగుల్లోకి ప్రవేశించాయి.

వెంకటరెడ్డి మునిరెడ్డి ఇంట్లోకి అడుగుపెట్టాడు. అక్కడ అప్పటికే చాలామంది మూగబడి వున్నారు. బియ్యం, బ్యాళ్ళు, మంచాలు, చాపలు ఇంటి మీదికి చేరుస్తూ వున్నారు. మరోపక్క చీకటి పడుతూ వుంది. కరెంటు లేదు. పెళ్ళాం బిడ్డల్ని తీసుకొని పైకి చేరుకున్నాడు. అందరి ముఖాల్లోనూ ఒకటే ఆందోళన. ఏడుపులు...

చుట్టూ వున్న ఇళ్ళ మీద నుంచి ఒకటే అరుపులు. నీళ్ళింకా పెరుగుతూనే వున్నాయి. ఇళ్ళు మునిగితే ఎలా.... ఎక్కడా మిద్దెలు లేవు. ఎలా తప్పించుకోవాలి. అందరిలోనూ ఒకటే భయం. నీళ్ళు పెరిగీ పెరిగీ ఆఖరికి కప్పుదాకా వచ్చి ఆగిపోయాయి. కేవలం ఒకడుగు. చావుకీ, బతుక్కీ మధ్య. జనాలు ఆశా నిరాశల్లో వూగుతూ వున్నారు. చుట్టూ చీకటి. మధ్యలో ఒక లాంతరు అంటించి పెట్టారు. అక్కడక్కడ ఇళ్ళ మీద లాంతరు వెలుగులు, అస్పష్టంగా కొన్ని ఆకారాలు కనబడుతున్నాయి. సమయం తొమ్మిదవుతూ వుంది. అప్పుడప్పుడు ఏవో ఇళ్ళు కూలిపోతున్న శబ్దాలు వినవస్తూ వున్నాయి. వెంకటరెడ్డి మునిరెడ్డి పక్కకి చేరి కూర్చున్నాడు. ఇద్దరి మధ్యా మాటల్లేవు.

సెల్‌ఫోన్లు ఎవరివో ఒకరివి వరుసగా మోగుతూ వున్నాయి. ఎక్కడెక్కడి నుంచో బంధువులు, స్నేహితులు ఆదుర్దాగా క్షేమసమాచారాలు విచారిస్తున్నారు. దాంతోపాటు టీవీలు చూస్తూ వివరాలు అందిస్తున్నారు. "కర్నూల్లో కొండారెడ్డి బురుజు సగందాకా మునిగిపోయిందని... సుంకేసుల, గాజులదిన్నె డ్యాంలు పగిలిపోయాయని... రాజోలి, మంత్రాలయం, అలంపూరు జలసమాధి అయ్యాయని... ఏవేవో వార్తలు, భయాన్ని మరింతగా పెంచుతూ.

"అయిపోయింది. అంతా అయిపోయింది. బ్రహ్మంగారు ఎప్పుడో చెప్పారు. కొండారెడ్డి బురుజు మీద కాకి కూచోని నీళ్ళు తాగే రోజొస్తుందని. ఏం చేయలేం. కలియుగం అంతమయిపోయే రోజొచ్చేసింది" ఒక ముసలోడు గొణిగాడు.

ఆ మాటల్తో అందరి మనసుల్లోనూ ఒకటే భయం. ఒకటే ఆలోచన.

అసలు బతుకుతామా.... రేపు ఉదయాన్ని చూడగలమా...

పొలాలు, ఇళ్ళు, అప్పులు ఏవీ గుర్తుకు రావడం లేదు.

చావు భయం అందరినీ కమ్మేసింది.

సెల్‌ఫోన్లు ఛార్జింగ్ అయిపోతున్నాయి. కొన్ని నెట్‌వర్క్‌లు పనిచేయడం ఆగిపోయాయి. ప్రపంచంతో వున్న చివరి సంబంధం గూడా తెగిపోతూ వుంది.

చుట్టూ నీళ్ళ హోరు...

చావు నిర్ణయమయినప్పుడు, సర్వమూ ఎదురు తిరుగుతున్నట్లు, ఏమీ సహకరించనట్లు అంతా నిశ్శబ్దం. ఒకరితో ఒకరు పంచుకోలేని ఆందోళన. ఒకొక్క నిమిషం నెమ్మదిగా గడుస్తూ వుంది. రాత్రి పది దాటిపోయింది. ఆకలవుతూ వుంది గానీ ఎవరికీ తినాలనిపించడం లేదు. మెడ మీద వేలాడుతున్న కత్తిలా నీళ్ళు అలాగే నిలకడగా వున్నాయి. ఎక్కడెక్కడి భూమిని కోసుకుంటూ, తనలో కలుపుకొంటూ... నీళ్ళు నల్లని రంగులో సుడులు తిరుగుతూ పరుగులు పెడుతున్నాయి. పెద్దపెద్ద చెట్లు, చనిపోయిన పశువులు, కళ్ళాల్లోని గడ్డివాములు, ఇండ్లలోని సామాన్లు... సర్రున కొట్టుకుపోతున్నాయి. కనుచూపు మేరలో ఎక్కడ చూసినా నీళ్ళే. అల్లకల్లోలమయిన సముద్రం మాదిరి వుంది.

రాత్రి పదకొండు కావస్తోంది.....మరోగంట భారంగా గడిచింది.....

అంతలో వెంకటరెడ్డి ఫోను మోగింది.

"రేయ్... వెంకా... నేను మీ చిన్నాయనను. హైదరాబాదు నుండి ఫోన్ చేస్తున్నా... ఎక్కడున్నావ్" అంటూ పలకరించి "రేయ్... జాగ్రత్త... పన్నెండు దాటితే కర్నూలు అస్సలు వుండదంట. నీళ్ళు ఏ నిమిషంలోనైనా మరింత పెరుగుతాయంట. టీవీలో పదేపదే చెబుతున్నారు. ముఖ్యమంత్రి గూడా చేతులెత్తేసినాడు. జాగ్రత్త.... ఏమాత్రం అవకాశం దొరికినా..." చెబుతుండగానే ఫోన్ కట్టయింది.

అంతలో మెసేజ్‌ల మీద మెసేజ్‌లు. అందరి ఫోన్‌లకు.

"ఊరు విడిచి పారిపోండి"

"ఎత్తయిన ప్రదేశాలకు చేరుకోండి"

"అర్ధరాత్రి దాటితే కర్నూలు జిల్లానే వుండదు"

"ఏ మాత్రం అవకాశం దొరికినా పారిపోండి"

"ఇళ్ళ మీద వుండొద్దండి.. వేగానికి కూలిపోతాయి."

ఒక్కసారిగా ఇళ్ళ మీద అలజడి. అందరికీ మెసేజ్‌లు అందుతున్నట్టున్నాయి. ఇంత రాత్రిపూట రాష్ట్రం మొత్తం మేలుకొని నలుమూలల నుండి మెసేజ్‌లు పంపుతున్నారంటే... మొత్తానికి ఏదో జరగబోతుందని తెలిసిపోతూ వుంది.

వెంకటరెడ్డి మనసంతా ఒకటే గందరగోళం...ఎలా తప్పించుకొనేది. కింద చూస్తే మునిగిపోయేంత నీళ్ళు. ఈదుకుంటూ పోదామంటే గడ్డ ఎక్కడుందో గూడా తెలియడం లేదు.

ముసలిదయి అడుగు తీసి అడుగు వేయలేని తల్లి... ఈదటం చేతగాని భార్యా, కూతురు... రెక్కలింకా బలం పుంజుకోని కొడుకు... వీళ్ళందరితో ఎలా...

ఒక్కన్ని తప్పించుకుంటే....ఛ.... ఛ... ఇంత బతుకూ బతికి ఇదేం ఆలోచన...

చచ్చినా.... బతికినా.... అంతా కలిసికట్టుగానే.

అంతలో దూరంగా ఒక పెద్ద మొద్దు కొట్టుకొస్తూ కనిపించింది. అది దగ్గరకు రాగానే అంతవరకూ మౌనంగా చూస్తున్న సుంకన్న ఎగిరి దబ్బుమని నీళ్ళలోకి దుంకాడు. "రేయ్... వద్దురా... గడ్డ ఎక్కడుందో తెలీదురా" అంటూ గట్టిగా అరుస్తున్నా వినకుండా గబగబా ఆ మొద్దును చేరుకొని దానిపైన ఎక్కేశాడు. ప్రవాహంతోపాటు ముందుకు పోతూ చీకటిలో కలిసిపోయాడు.

అంతా ఒక్కసారిగా నిశ్శబ్దం.

"శ్రీశైలం డ్యాం తెగితే తప్ప మనం బ్రతికి బయటపడలేంరా" మునిరెడ్డి నిర్వేదంగా అన్నాడు.

"అసలు ఏం జరుగుతోంది..... నీళ్ళు వెనక్కి తన్ని ఊళ్ళకు ఊళ్ళు మునిగిపోతా వుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తా వుంది... పైన ఎంత వాన పడుతుంది. ఎంత వరద వస్తుంది. ఎప్పుడు ఎన్ని గేట్లు ఎత్తాలి, జనాల్ని ఎట్లా కాపాడాలి... అనే ప్రాథమిక విషయాలు గూడా తెలీనప్పుడు

ఆనాకొడుకులకు ఉద్యోగాలెందుకు? జీతాలెందుకు? వున్నవి నిర్వహించడమే చాతగానప్పుడు మరలా అడుక్కొక్కటి చొప్పున కొత్తవెందుకు" అన్నాడు ఒకడు ఉక్రోషంగా...

కర్నూలు నుంచి వచ్చి అక్కడే వరదలో చిక్కుకుపోయిన ఇంకొకతను "నువ్వు చెప్పింది కరెక్టన్నా... రెండు సంవత్సరాల కిందటన్నే కర్నూలు మధ్యలో ప్రవహిస్తూ తుంగభద్రలో కలిసే హంద్రీనదికి... గాజులదిన్నెడ్యాంలో ఒక్కసారిగా గేట్లు ఎత్తేస్తే... వరదొచ్చి దాని దెబ్బకు కర్నూలు పావు భాగం సర్వనాశనమైపోయింది. ఆ రోజు తుంగభద్రకు నీళ్ళు లేవు. అదే తుంగభద్రకు నీళ్ళుండి హంద్రీ గనుక ఇలా ఉప్పొంగితే... ఆ వరద నీళ్ళు ఎటూ పోలేక వెనక్కి వస్తే... అసలు కర్నూలు వుంటుందా.... అని అప్పుడే సందేహం వచ్చింది. అడుగడుగునా ఆక్రమణలకు గురయి కుంచించుకుపోయిన హంద్రీకి, తుంగభద్రకు సేఫ్టీవాల్ కట్టాలనే ప్రతిపాదనా వచ్చింది. కానీ రెండు సంవత్సరాలు దాటినా ఎక్కడి గొంగళి అక్కన్నే.... ముఖ్యమంత్రుల నుంచి, కార్పొరేటర్లదాకా సందు దొరుక్తే చాలు ఎక్కడ ఎట్లా నొక్కేయాలనే గానీ, ప్రజల బాధలు ఏనాకొడుకుకైనా పడుతుంటే గదా"

ఆ మాటల మధ్యలోనే "అన్నా.... నీళ్ళు తగ్గుతున్నాయి" గుంపులోంచి ఒకడు గట్టిగా అరిచాడు.

అందరూ మాటలాపేసి ఒక్కసారిగా అటువైపు తలతిప్పారు. వాడు టార్చిలైటు ఇంటికెదురుగా వున్న ఇంకో గోడ మీదకు వేస్తూ... "చూడనా.... ఇంతకు ముందు నీళ్ళు అక్కడ పైన అంచులదాకా వుండెనా.... ఇప్పుడు చూడు కొంచం కిందకి దిగినాయి" అన్నాడు.

"నీళ్ళు గాలికి కదులుతుంటాయి కదరా... అందుకే తడిచిన గుర్తు కాస్త పైన పడింది" అన్నాడు ఒకడు నిరాశగా.

"లేదు... లేదు... సుబ్బన్నగాడు చెప్పింది కరెక్టే. తగ్గుతున్నాయి. ఇంతకుముందు పూర్తిగా మునిగుండె" ఇంకొకడు సంతోషంగా అరిచాడు.

అందరిలోనూ ఆశలు చిగురించాయి.

గంటకంతా ఒకడుగు తగ్గాయి.

పూర్తిగా తగ్గకముందే పైనుంచి మళ్ళా వస్తాయేమోనని ఒకటే ఆందోళన. ఏదేమైనా ఏ మాత్రం అవకాశం దొరికినా ఆలస్యం చేయకుండా పారిపోవాలని అందరూ నిశ్చయించుకున్నారు.

అరగంటకొకసారి టార్చిలైటు వేసి చూస్తూ వున్నారు. కిటికీ కొంచం కొంచం బైట పడుతూ రెండుకల్లా మధ్య వరకు బైటపడింది. నాలుగుకల్లా కిటికీ కింది వరకు నీళ్ళు తగ్గాయి. కింద చీకటిగా వుంది. ఐదుకంతా నేల బైట పడింది. చీకటి పోయి మసకమసకగా వెలుతురు వచ్చేసింది. కిందంతా బురద బురదగా వుంది. అప్పటికే కొన్ని చోట్ల ఇళ్ళ మీద నుండి జనాలు దిగుతూ వున్నారు.

వెంకటరెడ్డి భార్యాపిల్లల్ని తీసుకొని అందరితోపాటు కిందకి దిగాడు. ఎద్దులు పొట్ట ఉబ్బి బురదలో పడివున్నాయి. వాటికేసి తల తిప్పకుండా నడవసాగాడు. కింది గేరిలోకి వస్తూ వుంటే

అక్కడ నీటి మట్టం చాలా లోతుగా వుంది. ఒకరినొకరు చేయి పట్టుకొని ముందుకు కదలసాగారు. కరెంటు స్తంభాల మీద గడ్డి వేలాడుతూ వుంది. రోడ్డుకు ఇరువైపులా ఇళ్ళు చాలా వరకు పడిపోయి వున్నాయి. పిల్లల్ని భుజాల మీదకు ఎక్కించుకున్నారు. దూరంగా రోడ్డుకు ఇరువైపులా చెట్లు మొదళ్ళ వరకూ మునిగి కనబడుతున్నాయి. నెమ్మదిగా ఒకొక్క అడుగు వేసుకుంటూ, కలసికట్టుగా రోడ్డు మీదకు చేరుకున్నారు. రోడ్డు కొంచెం పైకుండడం చేత నీళ్ళు నడుం వరకూ తగ్గాయి. ఆనీటిలో ప్రయాణం మొదలుపెట్టారు. ఎంత దూరం అని ఎవరూ ఆలోచించడంలేదు. అందరిలోనూ ఒకటే కోరిక. బతకడం కోసం దాదాపు పన్నెండు కిలోమీటర్లు నడుస్తూ నడుస్తూ నగరానికి చేరుకున్నారు. అందరూ తలా ఒక దిక్కు చీలిపోయారు. వెంకటరెడ్డి భార్యాపిల్లల్తో కర్నూల్లోకి ప్రవేశించాడు.

ఎంత ఆపుకుందామన్నా వాళ్ళకు కన్నీళ్ళు ఆగడం లేదు. ఏం చేయాలో ఎక్కడికి పోవాలో దిక్కు తోచడం లేదు. ఒంటి మీద కట్టుబట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. ఒక్కరోజులో ఇలా రోడ్డు మీద పడతామని ఏనాడూ వూహించలేదు.

కర్నూల్లో బంధువుల ఇండ్లలో తలదాచుకోవాలనుకున్నారు. కానీ అక్కడి పరిస్థితి ఇంకా దారుణంగా వుంది. సగం కర్నూలు ఇంకా నీళ్ళలోనే వుంది. రోడ్ల మీద అసలెక్కడా మనుషుల జాడే కనబడ్డంలేదు. దాదాపు సగం జనాభా రాత్రికి రాత్రి ఏది దొరికితే అది పట్టుకొని వేరే వూర్లకు పారిపోయారు. పేదలు, చేతగానివాళ్ళు జగన్నాథగట్టుకు చేరుకున్నారు. వరదలో చిక్కుకుపోయిన కొందరు మిద్దెల మీద బిక్కుబిక్కుమంటూ కనబడుతున్నారు. రోజా, ప్రకాష్‌నగర్, కొత్తపేట, కండేరి, ఓల్డ్‌టౌన్, బండిమిట్ట, కుమ్మరిగేరి తదితర ప్రాంతాలన్నీ రెండో అంతస్తు దాకా మునిగి వున్నాయి. కర్నూలు జిల్లాకు గుండెకాయ లాంటి హోల్‌సేల్ వ్యాపార ప్రాంతమంతా నీటిలోనే వుంది.

వెంకటరెడ్డికి ఆ గొడవలో ఎక్కడికి పోవాలో... ఎవరింటికి పోవాలో అర్థం కాలేదు. అక్కడ ఊరు... ఇక్కడ నగరం... రెండూ శ్మశానాల మాదిరే కన్పిస్తున్నాయి.

తనకు తెలిసిన బంధువులు, స్నేహితుల్లో చాలా మంది ఇళ్ళు దెబ్బతిన్నాయి. ఏం చేయాలో అర్థంగాక ఎక్కడయినా, ఏదయినా ఇల్లు దొరికితే అద్దెకు తీసుకొని ఊరు బాగుపడ్డాక తిరిగిపోవాలని నిశ్చయించుకున్నాడు.

కానీ నగరంలో ఎక్కడ చూసినా ఇళ్ళకు తాళాలేసి కనబడుతున్నాయి.

రాత్రికి రాత్రి మరలా వరద వస్తుందని, ఈసారి మొత్తం నగరమంతా మునిగిపోతుందనే భయంతో ముంపుకు గురికాని ప్రాంతాల ప్రజలు కూడా వేరే ఊర్లకు పారిపోయారు.

వాళ్ళు తిరిగి వచ్చే వరకు అద్దెకు ఇల్లు దొరకదు. దాంతో వెంకటరెడ్డి ఒక నిశ్చయానికి వచ్చి "ఇప్పట్లో మనం ఊరికి పోయేటట్టు లేదు. ఇక్కడి పరిస్థితి గూడా ఎవరింటికీ పోయేటట్టు లేదు. కానీ తప్పదు. ఎవరికీ భారం కాకుండా అందరమూ తలా ఒక ఇంటికి పోదాం. నువ్వు మా అమ్మను తీసుకొని డోన్‌లోని మీ చిన్నమ్మ ఇంటికి వెళ్ళు. నేను పాపను, పిల్లోన్ని బీక్యాంపులోని

సుబ్బారెడ్డి ఇంట్లో వదుల్తా" అన్నాడు.

"మరి నువ్వు" ప్రశ్నించింది సుజాత.

"మా స్నేహితుడు మద్దిలేటిలేదూ కొత్తబస్టాండ్ కాడ. వానింట్లో వాడొక్కడే వున్నాడంట. అక్కడుండి ఏదయినా ఇల్లు బాడుగకు దొరుకుతుందేమో చూస్తా... దొరగ్గానే అందరూ వచ్చేయండి" అన్నాడు.

"ఏరా... వెంకటరెడ్డి ఏం ఇక్కడ కూచున్నావ్, ఊరంతా మునిగిందట కదా" అనే పలకరింపుతో ఆలోచనల్లోంచి బైటకి వచ్చాడు. ఎదురుగా చిన్ననాటి స్నేహితుడు నారాయణ.

అవునంటూ తలూపుతూ "మీ ఇల్లెక్కడ" అన్నాడు.

"ఓల్డ్ బస్టాండ్ దగ్గర" చెప్పాడు నారాయణ.

ఇక మాట్లాడ్డానికి, అడగడానికి ఏమీ లేదు. ఎవర్ని కదిలించినా ఒకటే బాధ. ఐనా మాటలు కూడబలుక్కుంటూ "ఎలా వుందిరా మీ  పరిస్థితి" అన్నాడు.

"ఏముందిరా... చేతిలోని డబ్బంతా క్లీనింగ్‌లకూ, రిపేర్లకే సరిపోతా వుంది. మా యజమాని ఇల్లుండేది గూడా మిన్చిన్ బజార్‌లోనే. షాపూ, గోడౌను అంతా మునిగిపోయాయి. ముప్పైలక్షల దాకా నష్టం. తిరిగి షాపు తెరుస్తాడో, తెరవడో... తెరిచినా మాకంతా పని దొరుకుతుందో, దొరకదో... ఏమీ అర్థం కావడం లేదు. కొత్తగా వేరేచోట పని వెదుక్కుందామన్నా, ఇప్పట్లో ఈ నగరం కోలుకునేటట్టు లేదు. ఉపాధి అందించేటట్టూ లేదు. అందుకే ఆదోని దగ్గర మా అత్తోళ్ళున్నారు. అక్కడికి వెళ్ళిపోవాలనుకుంటున్నా" అన్నాడు.

"ఊరుగాని ఊరు పోయి బతకడం కష్టం గాదా" అన్నాడు వెంకటరెడ్డి.

నారాయణ నవ్వుతూ "రేయ్... సావడానికి ఒకటే దారేమో గానీ, బతకడానికి వంద దారులుంటాయి. ఇక్కడ కాకపోతే ఇంకొకచోట, ఈ పని కాకపోతే ఇంకొక పని... ఊరికే చూసుకుంటూ, తిట్టుకుంటూ, బాధపడుతూ.... ఎన్ని రోజులని కూచుంటాం చెప్పు... చెయ్యాలి. ఏదో ఒకటి చెయ్యాలి. తప్పదు. బతకడానికి, మనల్ని నమ్మిన వాళ్ళని బ్రతికించుకోడానికి" అన్నాడు వెళ్ళిపోతూ.

వెంకటరెడ్డికి నారాయణ మాటలే పదేపదే గుర్తుకు రాసాగాయి. "చిన్నదో, పెద్దదో, ఎక్కువనో, తక్కువనో ముందు ఒక ఇల్లు చూసుకోవాలి. పంట పోయినా, ఎద్దులు పోయినా, ఇల్లు పోయినా, ఎంత కష్టమైనా చేయగల భార్యాపిల్లలు వున్నారు. అది చాలు... తొందరగా ఊరు చేరి పనులు మొదలు పెట్టాలి" అనుకున్నాడు. లేచి అద్దెఇంటి కోసం వేట మొదలు పెట్టాడు.

**ఆదివారం ఆంధ్రజ్యోతి – 15 నవంబర్2009**

**ఉగ్ర తుంగభద్ర కథా సంకలనం – 2010**

# కొత్త కల

**పె**ద్ద వృక్షం. శాఖోపశాఖలుగా విస్తరించి... పచ్చని ఆకులతో, అడుగడుగునా ఎర్రగా మాగిన పళ్ళతో, చుట్టూ ఎగురుతున్న పక్షుల కిలకిలా రావాలతో, పళ్ళను ఏరుకొని తింటూ గంతులేస్తున్న ఉడుతలతో, ప్రశాంతంగా, హాయిగా వుంది. అంతలో ఏదో శబ్దం. దిక్కులు పిక్కటిల్లేలా... పక్షులు ఒక్కసారిగా గాల్లోకి లేచాయి. జంతువులు భయంతో పరుగందుకున్నాయి. ఉడుతలు వులిక్కిపడి చెట్ల తొర్రల్లోకి దూరిపోయాయి.

పెద్ద పెద్ద అడుగుల చప్పుడు. చేతుల్లో గొడ్డళ్ళు, కత్తులు, రంపాలతో నల్లని రాక్షసులు. పెద్ద పెద్ద కొమ్ములతో, నోట్లో మెరుస్తున్న తెల్లని కోరలతో, చింతనిప్పుల్లాంటి కళ్ళతో... రావడం రావడం దొరికిన కొమ్మను దొరికినట్టుగా నరికేస్తున్నారు. ఆకులు విరిచేస్తున్నారు. చుట్టూ చిందరవందర చేసేస్తున్నారు. కొందరు కాండం దగ్గరకు చేరారు. రంపంతో సరసరసర కోయడం మొదలుపెట్టారు. అంతలో చెట్టు కాండం నుంచి... ఎర్రగా... చిక్కగా... జిగటజిగటగా... రక్తం. వాళ్ళ నుంచి తప్పించుకోడానికి పెనుగులాడుతూ కాపాడండి... కాపాడండి... అని అరుస్తూ వుంది. ఒక్కసారిగా బలమంతా వుపయోగించి భూమిలోంచి వేళ్ళను బైటకు లాక్కొని పరుగు తీయసాగింది.

అట్లా పరుగెత్తుతూ పరుగెత్తుతూ నెత్తిన కిరీటంతో, చేతిలో పూర్ణకుంభంతో, మెడలో పూలదండతో, చక్కని చీరకట్టుతో మాతృమూర్తిలా మారిపోయింది. ఆమె కళ్ళు భయంతో వణికిపోతున్నాయి. ఒళ్ళంతా గాయాల దెబ్బలు. "ఎవరూ... ఎవరూ... లేరా... ఇన్ని కోట్లమంది బిడ్డల్లో నన్ను కాపాడేవాళ్ళు ఒక్కరూ లేరా" గొంతెత్తి... వినే వాళ్ళ గుండెలు ద్రవించిపోయేలా హృదయవిదారకంగా ఏడుస్తూ వుంది. చుట్టూ నాయకులు... ఎవరి కుర్చీల్లో వాళ్ళు కూర్చుని... సినిమా చూస్తున్నట్లు చిరునవ్వులతో తమకేమీ పట్టనట్టుగా... అంతలో ఒక్కసారిగా దూసుకొచ్చిన రాక్షసులు ఆమెను చుట్టుముట్టేశారు. భయంకరంగా కేకలు పెడుతూ... గుంజుకుపోయి బలిపీఠంపై మెడ వంచారు. ఒక రాక్షసుడు వికటాట్టహాసం చేస్తూ కత్తి పైకెత్తి వేగంగా కిందకి దించబోయాడు.

"నో" అంటూ అరుస్తూ వులిక్కిపడి లేచాడు విజయ్.

ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. శరీరం ఆయాసంతో ఎగిరెగిరి పడుతూ వుంది. కళ్ళు తెరచుకొని కాసేపు అలాగే వుండిపోయాడు. తలుపు సందుల్లోంచి వెలుతురు గదిలోకి మసకమసకగా పడుతూ వుంది. గడియారం వంక చూశాడు. ఆరు దాటింది. గబగబా లేచి దుప్పట్లు సర్దిపెట్టాడు. గదిలో ఎవరూ లేరు. ఒక్కడే. యూనివర్శిటీకి సెలవులు ప్రకటించడంతో

మిగతా ఇద్దరు వాళ్ళ వూర్లకు వెళ్ళిపోయారు. తాను వెళదాం అనుకున్నాడు గానీ ఇంటి దగ్గర పనేమీ లేదు. యూనివర్సిటీ స్నేహితులంతా సమైక్యాంధ్రకు మద్దతుగా జరుగుతున్న ఉద్యమంలో పాల్గొంటూ వుండడంతో తానూ ఉత్సాహంగా అందులో భాగమైపోయాడు.

యాభై రోజులయినా ఉద్యమం కొంచం గూడా సడలకపోగా మరింత బలపడుతూ వుంది. రాజ్‌విహార్ కూడలిలోనో, కొండారెడ్డి బురుజు దగ్గరో, బళ్ళారి చౌరస్తా వద్దనో, సీ క్యాంప్ సెంటర్లోనో... దిష్టిబొమ్మలు తగలబెడుతూ, నాయకుల బొమ్మలకు చెప్పుల దండలు వేసి గాడిదల మీద వూరేగిస్తూ, నల్లని జెండాలతో మౌనంగా, విషాదంగా వెనక్కి నడుస్తూ... విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు, న్యాయవాదులు, కులసంఘాలు, వ్యాపారస్తులు... విడివిడిగా, సమైక్యంగా ఎవరికి తోచిన విధంగా వాళ్ళు నిరసనలు ప్రదర్శిస్తూ తమ ఆగ్రహాన్ని, ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి చిన్న చిన్న గ్రామాలదాకా ధర్నాలు, రాస్తారోకోలు, లక్షజన ఘోషలు, బందులతో దద్దరిల్లిపోతోంది.

విజయ్ యాభై రోజులుగా అందులో ఒక్కరోజు గూడా వదలకుండా పాల్గొంటూ వుండడంతో కళ్ళు మూసినా, తెరిచినా అదే నినాదం వినబడుతూ వుంది. ఎవరు పిలిచినా, పలకరించినా 'జై... సమైక్యాంధ్ర...' అనే మాటనే. లేచింది మొదలు పడుకునేదాకా అవే మాటలు, చర్చలు, ఉపన్యాసాలు. దాంతో విజయ్ శరీరంలోని అణువణువూ ఆందోళనలో భాగమైపోయింది.

విజయ్ గబగబా తలస్నానం చేసి బైటకొచ్చాడు. వరుసగా నాలుగు గదులు. ప్రక్కగదిలోని చైతన్యప్రకాష్ వరండాలో కుర్చీ వేసుకొని ఏదో చదువుకుంటున్నాడు. తనకన్నా నాలుగైదు సంవత్సరాలు పెద్ద. యూనివర్సిటీలో రాయలసీమ కరవు పరిస్థితులపై పరిశోధన చేస్తున్నాడు. దగ్గరవుతున్న అడుగుల చప్పుడుకి చదువుతున్న పుస్తకంలోంచి తలెత్తి చూశాడు. "తప్పదు, పలకరించాలి" చిరునవ్వును ముఖానికి అతికించుకోని "నమస్తే సార్" అన్నాడు.

"రాత్రి బాగా ఆలస్యమైనట్లుంది" పలకరించాడు.

"ఈరోజు రాజీనామా చేయని మంత్రుల ఇళ్ళు ముట్టడి చేసే కార్యక్రమం వుంది. ఎక్కువ మందిని మొబలైజేషన్ చేయాల. అందరికీ ఫోన్లు చేస్తూ, మాట్లాడుకుంటూ, వ్యూహాలు ఆలోచిస్తూ ఆలస్యమైపోయింది... అవును సార్... మీరు గూడా రావొచ్చుగదా" అన్నాడు.

చైతన్యప్రకాష్ చిరునవ్వు నవ్వుతూ "అవసరం అయినప్పుడు, అసలైన ఉద్యమం మొదలైనప్పుడు తప్పకుండా వస్తాలే మిత్రమా" అన్నాడు.

"అంటే... ఇది అసలైన ఉద్యమం కాదా" కోపంగా అడిగాడు విజయ్.

"ఆవేశాలలో న్యాయాన్యాయాల ప్రసక్తి వుండదు. మూసి వున్న తలుపుల వద్ద ఏ వాక్యమైనా వృథాయే. నీకు టైమవుతూ వుంది. మళ్ళా మాట్లాడుకుందాం" అన్నాడు.

విజయ్‌కు కోపం అరికాలి నుంచి నషాలానికెక్కింది. తీవ్రంగా ఒక్కచూపు చూసి విసురుగా బైలుదేరాడు. "వేస్ట్ ఫెలో... మాట్లాడిస్తే ఏదేదో వాగుతాడు. వానికే తెలివున్నట్లు, మేధావిలాగా

పెద్ద ఫోజు. ఏదో ఒకరోజు కడిగేయాలి" అనుకుంటూ రోడ్డు మీదకొచ్చాడు.

విజయ్ ఆటో పట్టుకొని హంద్రీనది పక్కన వున్న శ్రీ కృష్ణదేవరాయల విగ్రహం దగ్గర తాము వేసుకున్న టెంటు దగ్గరికి వచ్చాడు. రిలే నిరాహార దీక్షలో భాగంగా కామర్స్ విద్యార్థులు కూర్చుని వున్నారు. అప్పటికే చాలామంది విద్యార్థులు అక్కడికి చేరుకున్నారు. ఆవేశంగా ఎవరో ఉపన్యసిస్తున్నారు.

"ఇది కనీవినీ ఎరుగని, ఎవరూ కలలో గూడా వూహించని ప్రజా ఉద్యమం. రాజకీయ పార్టీలు లేవు. విద్యార్థి సంఘాలు లేవు. వామపక్షాల వెన్నుదన్ను లేదు. ఐనా ప్రజలంతా ఎక్కడికక్కడ కులమతాలకు అతీతంగా ఒక ఉద్వేగంతో ముందుకు సాగిపోతున్నారు. భవిష్యత్‌పై భయంతో, భాషపై మమకారంతో, మనల్ని కనీసం సంప్రదించకుండా పూచిక పుల్లలాగా తీసి పారేశారనే ఆగ్రహంతో, నాయకులను నమ్మక ఒక్కసారిగా ముందుకు వచ్చారు.

ఎట్లా వదుల్తాం మన రాజధానిని... ఎవరబ్బ సొమ్మది. అన్నీ వాళ్ళకిచ్చేసి వట్టి చేతుల్తో నడిరోడ్డు మీద నిలబడమంటే ఎట్లా. మన పిల్లల భవిష్యత్తెట్లా. అరవై సంవత్సరాలుగా అభివృద్ధినంతా అక్కడ పోగేస్తుంటే మన హైదరాబాదే కదా అని ఏ రోజూ ప్రశ్నించలేదు. అప్పుడు ఏ మాత్రం అడ్డుపడనివాళ్ళు ఈ రోజు హఠాత్తుగా ఇదంతా మాదే పొమ్మంటే ఎట్లా. హైదరాబాదంటే చార్మినార్, గోల్కొండ, ఇరానీచాయ్, సమోసాలు, బతుకమ్మలు కాదిప్పుడు. అపరిమిత అవకాశాలు, ఐటీ ఉద్యోగాలు, విద్యావైద్య నిలయాలు, రాష్ట్ర బడ్జెట్‌కు వెన్నెముక. దానికితోడు నదులన్నీ ప్రవహించేది ఆ భూభాగంలోంచే . అసలే మొండోళ్ళు. రాష్ట్రం వచ్చిందంటే కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్టే.

మనమంతా ఇక్కడ అన్నీ వదిలేసి రోడ్లమీదకొచ్చి కూర్చుంటుంటే... మన నాయకులేమో పదవులు పట్టుకొని వేలాడుతూ, ఢిల్లీలో దాక్కొని, అమ్మ ముందు వంగి వంగి దండాలు పెడుతూ, రాజీనామాల డ్రామాలాడుతున్నారు. అందుకే మన నిరసన ఢిల్లీలోని నాయకులను తాకేలా వుండాలి. రాజీనామాలతో కేంద్రప్రభుత్వాన్ని అతలాకుతలం చేస్తే తప్ప ప్రభుత్వం దిగిరాదు"

అనంతంగా, ఆవేశంగా ప్రసంగాలు సాగిపోతున్నాయి. కూర్చున్నవాళ్ళు ఆవేశంగా, వుద్రేకంగా మధ్యమధ్యలో "జై సమైక్యాంధ్ర" అంటూ పిడికిళ్ళు బిగించి గట్టిగా అరుస్తూ వున్నారు.

అంతలో విజయ్ సెల్లు మోగింది. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ" అంటూ మధురంగా రాష్ట్రగీతం రింగ్‌టోన్‌గా వస్తూ వుంది. తీసి చూశాడు. హైదరాబాద్‌లో వుండే పెద్దమ్మ కొడుకు రమేష్. ఆన్ చేశాడు.

"హలో విజయ్... ఎట్లా వున్నావురా" అవతలి నుంచి ఆత్మీయమైన పలకరింపు.

"అన్నా బాగున్నా. నువ్వెట్లా వున్నావ్"

"ఆ... బాగున్నారా. అమెరికాలో జాబ్ కన్‌ఫర్మ్ అయింది. ఆదివారం బైలుదేరుతున్నా.

ఒకసారి అందరినీ కలుద్దామని ఫోన్చేస్తున్నా. ఎల్లుండి పార్టీ. నువ్వు తప్పకుండా రా"

"బస్సులు బంద్ గదన్నా... సాధ్యమైనంత వరకూ ప్రయత్నిస్తాలే"

"అవ్... ఎట్లుందిరా ఉద్యమం. పత్రికల్లో, టీవీల్లో చూస్తున్నా... అంతా అట్టుడుకుతున్నట్టుందే"

"అవ్వన్నా... రోజూ ధర్నాలూ, ర్యాలీలే... మీకు హైదరాబాదులో ఎట్టుంది. మనోళ్ళని ఎవరన్నా ఏమన్నా అంటుంటారా"

"ఇక్కడదేం లేదురా... నేనుండే కాలనీలో తెలంగాణోళ్ళూ తక్కువే. రాయలసీమోళ్ళూ తక్కువే. ఆఫీసులో అయితే వేళ్ళ మీద లెక్కబెట్టొచ్చు. అయినా ఈ మల్టీనేషనల్ కంపెనీల్లో అలాంటివేమీ కుదరవ్లే. ఎవనికి సత్తా వుంటే వానికే. ఇప్పుడు నాకు గదా అమెరికాలో దొరికినట్లు" అంటూ నవ్వేశాడు.

"గొడవలు జరుగుతున్నట్లు టీవీల్లో...."

"అవంతా ప్రభుత్వ కార్యాలయాల్లోనే... ఐనా ఆ గొడవలన్నీ పదోన్నతుల కోసం, వ్యక్తిగత ప్రయోజనాల కోసమే గానీ ఆళ్ళకు తెలంగాణా లేదు. కోస్తా లేదు. ఆఫీసుల్లో అడుగుపెడితే చాలు పందికొక్కుల్లా మెక్కేస్తారు. నేనో పని మీద పోతే మనోళ్ళూ వదల్లా, వాళ్ళూ వదల్లా. చేతులు తడిపేంత వరకు ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించినారు. వాళ్ళ గురించి మాట్లాడుకోవడం కన్నా వూరుకోవడం మంచిది. నువ్వు మాత్రం ఎలాగో ఒకలాగా తప్పకుండా రా" అంటూ ఫోన్ పెట్టేశాడు.

రమేష్ మాటల్తో విజయ్ ఆలోచనల్లో పడ్డాడు. ప్రజలు నిజాయితీగా ఎవరికి వారు విడివిడిగా చేస్తున్న పోరాటం క్రమంగా కోస్తా నాయకత్వం వున్న ఎన్జీవోల చేతుల్లోకి చేరిపోతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏ ఏ రోజుల్లో ఎవరెవరు ఏమి చేయాలో వాళ్ళే నిర్ణయించేస్తున్నారు. వీళ్ళు చర్చల్లో, మీటింగుల్లో మాట్లాడే సమస్యలన్నీ ఉద్యోగ సంబంధమే. ప్రజల గురించి పోరాడిన చరిత్ర ఎక్కడుంది వీళ్ళకు.... డీఏలకు, పీఆర్సీలకు, పదోన్నతులకు తప్ప. విజయ్కి ఆలోచనలు పెరుగుతున్న కొద్దీ చాలా అయోమయంగా అన్పిస్తూ వుంది.

అంతలో విద్యార్థులంతా గుంపుగా బైలుదేరారు. విజయ్ కూడా వారితో బైలుదేరాడు. అప్పటికే అనేక సంఘాలు మంత్రి ఇంటి వద్దకు చేరుకున్నాయి. అందరూ వూగిపోతున్నారు. "రాజీనామాలు చేయండి – రాష్ట్ర విభజనను అడ్డుకోండి" "గల్లీల్లో కాదు మీ ప్రతాపం – ఢిల్లీలో చూపండి" అంటూ నినాదాలతో హోరెత్తిస్తున్నారు. అంతలో కొందరు యువకులు "కనబడుట లేదు" అంటూ మంత్రి ఫోటో వున్న పోస్టర్లు తెచ్చి మంత్రి ఇంటి గోడలకు అతికించసాగారు. అందులో "నాయనా... చిన్నారెడ్డి... యాడుండావు బిడ్డా... యాభై రోజులు దాటింది నీ మొగం చూడక. మా కోసం గాకపోయినా నీ పెండ్లాం బిడ్డల కోసమన్నా కొంపకు రా. మేమేమీ అనుకోంలే. నీవు పెద్ద యెదవవని మాకు ముందే తెలుసు" అని వుంది. అది చదివి ఒకటే నవ్వులు, ఈలలు, కేకలు. గంటసేపు అక్కడ నినాదాలతో హోరెత్తించి మంత్రి

దిష్టిబొమ్మను వూరేగిస్తూ, తప్పెట్ల మధ్య రాజ్‌విహార్ వైపు బైలుదేరారు. విజయ్ వాళ్ళతోబాటు నినాదాలు చేస్తూ అడుగులు వేయసాగాడు.

ఎదురుగా బండి మీదొస్తున్న విజయ్ స్నేహితుడు అతన్ని చూసి పలకరిస్తూ బండి ఆపాడు. ఇద్దరూ కలసి మాట్లాడుకుంటూ టీ తాగారు. అప్పటికే వూరేగింపు చాలా దూరం వెళ్ళిపోయింది. "పద నేనూ కొత్తబస్టాండ్ వైపే వెళ్తున్నా. రాజ్‌విహార్‌లో దిగుదువుగానీ" అంటూ బైక్ స్టార్ట్ చేశాడు. విజయ్ వెనుక కూర్చున్నాడు.

రాజ్‌విహార్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసినట్లున్నారు. అన్నివైపులా వాహనాలు ఆగిపోయి వున్నాయి. వాటిని తప్పించుకుంటూ కొంచం ముందుకు పోయారు. ఇక ఎటూ పోవడానికి లేదు. "యాభై రోజులుగా ఇదే పరిస్థితి. ఏ దారి ఎటువైపు ఎంతసేపు బందవుతుందో తెలీదు. ఎవరినీ ఏమనడానికి లేదు" అన్నాడు మిత్రుడు నవ్వుతూ.

పక్కనే ఓ ఆటో ఆగి వుంది. ఎవరో ముసలాయన మాసిపోయిన తెల్లంగీ, తెల్లపంచ, పెరిగిన గడ్డంతో వున్నాడు. "ఎంతసేపైతాది" అంటున్నాడు అసహనంగా ఆటోవానితో. "చూడు ముసలాయనా... అంతవసరమైతే డబ్బులిచ్చి దిగిపో... నేనేమన్నా ఆపినానా... చూస్తున్నావుగదా పరిస్థితి" అన్నాడు. "ఛ... ఛ... పనిలా... పాటలా... ఈ టౌనోళ్ళకి. అక్కడ చేలో పురుగులు పడ్తున్నాయి. మందుడబ్బాల కోసమని నానాక తిప్పలు పడి వస్తే... ఎప్పుడు బందుంటాదో... ఎప్పుడు తెరుస్తారో... ఎవరికీ అర్థం కావడంలా" అంటూ ఏదో గొణుగుతున్నాడు.

"అదేంది పెద్దాయనా అట్లంటావు. మన సమైక్యాంధ్ర కోసమే గదా ఇదంతా" అన్నాడు ఆటోలో పక్కనే కూర్చున్న ఒక ఉద్యోగస్తుడు.

"అవు... మా కోసమే... సమైక్యాంధ్ర వుంటే మావూళ్ళోని గవర్నమెంటు బళ్ళో సదువుకుంటున్న పొట్టిగాళ్ళకు ఉద్యోగాలు వస్తాయి. మా ఎండిన భూముల్లో నీళ్ళు పారి పంటలూ పండుతాయి. అరవై ఏళ్ళ నుంచీ సూస్తూనే వున్నా గదా... ఈ సమైక్యాంధ్రను" అన్నాడు వ్యంగ్యంగా.

ఆ మాటలకు ఆ ఉద్యోగస్తునికి పిచ్చి కోపం వచ్చింది. "ఛీ... ఛీ... నీలాంటోళ్ళుండబట్టే రాష్ట్రం ఇట్లా తగలబడిపోతోంది. మేమంతా జీతాలు గూడా వదులుకోని ఎండకు రోడ్ల మీద బడి అవస్థలు పడుతుంది మీ కోసం కాదూ" అన్నాడు ఆయాసపడుతూ.

"అవునవును నిజమే... మా కోసమే... మేం కాళ్ళావేళ్ళా పడి అడుక్కున్నా ఒక్కరూపాయి విదల్చడానికి రోజుకి పదిసార్లు తిప్పుకునే బ్యాంకులు... మీకు మాత్రం... అడగక ముందే అయ్యోపాపమని పిలిచి మరీ అప్పులిస్తున్నాయి. తర్వాతెలాగు ప్రభుత్వం మెడలు వంచి పోయిన జీతం సాధించుకుంటారు. మేం గూడా మీలాగే పంటలు బందు చేసి రోడ్ల మీదకొస్తాం. మరి మాకు గూడా వదులుకున్న పంటకు పరిహారమిస్తారేమో అడగండి. మీ బందుల వల్ల మా పంటలు నాశనమైనా, పండించినవి కుళ్ళిపోయినా ఎవరూ ఒక్కరూపాయి విదల్చరు. మా సావు మేం సావాలగానీ" అన్నాడు.

ఆ మాటలింటుంటే విజయ్‌కి తన పల్లె కళ్ళ ముందు కదిలింది. పుట్టినప్పటి నుంచి ఎట్లున్నది అట్లనే... కొంచం గూడా మార్పు లేకుండా... నోట్లోకి నాలుగుముద్దలు పోడానికి రోజూ పోరాటమే... వానొస్తే పంట. లేదంటే వలస. భూములన్నీ ఎక్కడికక్కడ పగుళ్ళిచ్చి ఆకలిగొన్న సింహాల్లా ఆవురావురావురుమని ఎదురుచూస్తుంటాయి. ఎండాకాలమొస్తే తాగడానికి నీళ్ళు గూడా దొరకక చుక్కచుక్కను అపురూపంగా దాచుకోవడం గుర్తుకొచ్చింది. ఆ ముసలాయన వంక చూశాడు. ఎందుకో వాళ్ళ నాయన గుర్తుకు వచ్చాడు. వూర్లో రైతులు గుర్తుకు వచ్చారు. వాళ్ళు పడే బాధలు గుర్తుకు వచ్చాయి. వలసలు గుర్తుకొచ్చాయి. కళ్ళు చెమ్మగిల్లాయి. మౌనంగా వెనక్కి తిరిగాడు. "రేయ్... ఎక్కడికి" అంటూ మిత్రుడు పిలుస్తున్నాడు. జవాబివ్వలేదు. అడుగులు వాటంతటవే పడుతున్నాయి. తలంతా దిమ్ముగా వుంది. ఏవేవో ఆలోచనలు కిందికీ పైకీ, అలాగే గది వద్దకు చేరుకున్నాడు.

చైతన్యప్రకాష్ ఏదో చదువుకుంటూ వున్నాడు. విజయ్ రాకని గమనించి చిరునవ్వు నవ్వాడు. మామూలుగా అయితే విజయ్ గూడా చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయేవాడు. కానీ ఎందుకో అడుగులు ముందుకు పడలేదు. అక్కడే నిలబడ్డాడు. మనసంతా ఏవేవో సందేహాల మధ్య, సమాధానాలు చెప్పేవారు లేక, అడగడానికి తటపటాయిస్తూ...

"ఏం" అన్నట్టు ఆశ్చర్యంగా చూశాడు చైతన్యప్రకాష్.

"ఏం లేదు. కాసేపు మాట్లాడదామని" అన్నాడు.

చైతన్యప్రకాష్ లోపల్నుంచి చెక్క స్టూలు తెచ్చి అక్కడ వేస్తూ "కూర్చో" అన్నాడు.

విజయ్ కూర్చుని కాసేపు తటపటాయించి "ఉద్యమం ఇంత పెద్ద ఎత్తున జరుగుతుంది గదా... దీనిపై మీ అభిప్రాయం" అడిగాడు నెమ్మదిగా.

చైతన్యప్రకాష్ చిరునవ్వు నవ్వుతూ "అసలు ఉద్యమం ఎందుకు జరుగుతుంది. దాని లక్ష్యమేమో చెప్పు ముందు" అన్నాడు.

"ఇంకేముంది సమైక్యాంధ్ర కోసం"

"అట్లా గాదు. నిజాయితీగా, స్పష్టంగా మాట్లాడుకుందాం. హైదరాబాదు మొత్తంగా మనకే ఇచ్చేసి, తెలంగాణా వాళ్ళకు వేరే రాజధాని ప్రకటించారనుకో అప్పుడు మనకు ఓకేనా"

విజయ్ ఆలోచనలో పడి "ఇది జరగదు" అన్నాడు నిశ్చయంగా.

"జరుగుతుందా... జరగదా... అనేది పక్కన పెట్టు మిత్రమా... అట్లా ఇస్తే మనవాళ్ళకు విభజన ఓకేనా అన్నది నా ప్రశ్న"

విజయ్ కాసేపు ఆలోచించి ఓకే అన్నట్లు తలాడించాడు.

"నో... ఉద్యమ లక్ష్యం సమైక్యాంధ్ర కాదు. హైదరాబాద్. అది సృష్టిస్తున్న సంపద. ఉద్యోగావకాశాలు. వాటి చుట్టూ అల్లుకున్న భయాలు. ఆ సందేహాల నివృత్తి కోసం స్పష్టంగా కూర్చుని మాట్లాడుకొని చట్టాలు చేసుకుంటే సరిపోతుంది గదా... రాజధానితో అరవై సంవత్సరాల అనుబంధం మనది. మన హక్కుల్ని కాదనడానికి ఎవనికీ అధికారం లేదు. అట్లా గాక మాతృభాష,

మట్టిగడ్డా అంటూ ప్రజల్లో భావోద్వేగాలు రెచ్చగొడుతూ, భయాలు సృష్టిస్తూ, ప్రజలను విభజన ఆగుతుందనే భ్రమల్లో వుంచి వాళ్ళకు న్యాయంగా దక్కాల్సినవి గూడా దక్కకుండా, కొత్త రాష్ట్రానికి ఏమేం కావాలో చర్చించి సాధించకుండా... ఇలా నాటకం పూర్తయినా నటిస్తూనే వుంటే ఎట్లా".

"కనీసం హైదరాబాదును యూటీ చేసినా మేలేగదా"

"మనకు దక్కనిది ఎవరికీ దక్కగూడదనే ఆసిడ్ సంస్కృతి వదిలేద్దాం మిత్రమా... లూటీ చేసిన డబ్బులు కాపాడుకోడానికే యూటీ. హైదరాబాద్ ఇప్పుడు కోస్తా పెట్టుబడిదారుల, రాయలసీమ ఫ్యాక్షనిస్టుల స్విస్‌బ్యాంక్. వాళ్ళకి కాపలా కాయాల్సిన అవసరం మనకెందుకు. కలసి నడవాల్సింది, పోరాడాల్సింది మనలా మోసపోయినవాళ్ళతోనే కానీ, అందరినీ అణగదొక్కి సమస్త అభివృద్ధినీ తమ ఆధిపత్యంలోకి తీసుకున్నవాళ్ళతో కాదు. ఈ అరవై ఏళ్ళ సమైక్యాంధ్రలో బాగుపడింది నాలుగు జిల్లాలు. రెండు కులాలే. ఎవని నినాదాన్నో మోస్తూ, ఎవని వాదాన్నో బలపరుస్తూ, ఎవని కుట్రలోనో కూరుకుపోతూ, కాళ్ళ క్రింద కదలిపోతున్న నేలను మరిస్తే ఎట్లా" అన్నాడు.

"అంటే ఇప్పుడు ఉద్యమంలో పాల్గొంటున్న వాళ్ళంతా అమాయకులనా నీ అభిప్రాయం" అడిగాడు విజయ్ ముందుకు వంగుతూ.

చైతన్యప్రకాష్ సూటిగా చూస్తూ "ఛ... ఛ... ఛ... ఇక్కడి ప్రజల వుద్వేగాల మీద నాకు అపారమయిన గౌరవం వుంది. సమైక్యాంధ్ర ఉద్యమంలో మన రాయలసీమవాళ్ళ భయాలు వేరు. కోస్తావాళ్ళ భయాలు వేరు. వాళ్ళది ఆస్తుల గొడవ. మనది ఆకలి గొడవ. అసలు మన రాయలసీమకు అన్యాయం చేస్తున్నదెవరు? మనం చేయాల్సిన పోరాటం ఎవరి మీద అనేదే నా ప్రశ్న. రాజధానిలో జరిగిన అభివృద్ధినే కాదు. అరవై సంవత్సరాలుగా కృష్ణా జలాల కింద జరిగిన అభివృద్ధిలోనూ వాటా అడగాలి. అది మరిస్తే ఎట్లా. అభివృద్ధంతా కొన్ని చోట్లనే పోగవుతుంటే చూస్తూ వూరుకోవడమేనా? ఇప్పటికన్నా మన ప్రాంతం గురించి ఆలోచిద్దాం. హైదరాబాదులో పెట్టుబడులు ఆపి ఈ కరువుసీమలో విస్తరించమని అడగడంతో పాటు కృష్ణా నికరజలాల పునఃపంపిణీ గురించి గూడా గొంతెత్తుదాం. పోలవరంతో వాళ్ళ ప్రాంతానికి నికరజలాలు శాశ్వతం చేసుకుంటూ, మన ప్రాజెక్టులకు మాత్రం మిగులు జలాల కోసం గూడా కొట్టుకు చచ్చేలా చేస్తున్న కుట్రను ఎదిరిద్దాం..." అంటూ కాసేపు ఆగాడు.

విజయ్‌కి అయోమయంగా అర్థం అయీ కానట్టుగా వుంది. చైతన్యప్రకాష్‌కి అతని పరిస్థితి అర్థమైంది. "చూడు మిత్రమా... ఒక్క పూటతో, ఒక్క మాటతో ఇవి అంత తొందరగా అర్థం కావు. ఒక్క నిమిషం" అంటూ లోపలికి పోయాడు. కాసేపటికి భూమన్ రాసిన రాయలసీమ ముఖచిత్రం, బాలగోపాల్ జలపాఠాలు, ఇమాం కోటి గొంతుకల ఆక్రందన, శ్రీకృష్ణకమిటీ నివేదిక , సీమ ఎక్కిళ్ళు వ్యాసాల సంకలనం తీసుకువచ్చి విజయ్ చేతిలో పెడుతూ "నీ సందేహాలకు చాలా వరకు ఇందులో సమాధానాలు దొరుకుతాయి. ముందు చదువు. ఆ తరువాత మాట్లాడుకుందాం" అన్నాడు.

విజయ్ గదిలోకి చేరాడు. మనసంతా ఒకటే గందరగోళం. పొద్దున్నుంచీ జరుగుతున్న సంఘటనలు పదేపదే గుర్తుకు వస్తూ మనసంతా అతలాకుతలంగా వుంది. నెమ్మదిగా ఒకొక్క పుస్తకమే తీసి చదవసాగాడు. పేజీలు తరుగుతున్న కొద్దీ చిక్కుముడులు కొద్దిగా వదులు కాసాగాయి. అనేక ఆలోచనల మధ్య, సంఘర్షణల మధ్య అలసిపోయి అట్లాగే కళ్ళు మూసుకున్నాడు.

అంతలో సుదూరంగా ఎక్కడి నుంచో ఎవరో ఏడుస్తున్న శబ్దం. లేచి అటువైపు పరుగెత్తుకుంటూ వెళ్ళసాగాడు. భూమి భగభగా మండిపోతూ సెగలు కక్కుతోంది. దారి పొడవునా రైతులు ఎండిన చెట్లకు ఉరి వేసుకొని వేలాడుతున్నారు. పశువులు డొక్కలు ఎండిపోయి, దీనంగా మోర ఎత్తి ఆకాశంలోకి చూస్తున్నాయి. కాళ్ళ క్రింద నేల నెమ్మదిగా ఇసుకగా మారిపోతోంది. ఖనిజాలన్నీ రెక్కలు వచ్చి గడపదాటి గాల్లో ఎగిరిపోతున్నాయి. శవాలగుట్టల మీద నాయకులు కుర్చీలను వీపులకు ముడి వేసుకొని నోట్లకట్టలు లెక్కపెట్టుకుంటూ చిద్విలాసంగా నవ్వుకుంటున్నారు. ఎడారి అనంతంగా విస్తరిస్తూ వుంది. గోదావరీ, కృష్ణా వెక్కి వెక్కి ఏడుస్తున్నాయి. శ్రీభాగ్ ఒప్పందపు కాగితాలు చెత్తకుప్పల్లో నిదురపోతున్నాయి.

వాటన్నింటినీ దాటుకుంటూ పరుగెత్తుతూనే వున్నాడు. అక్కడ ఒక ఎండిన చెట్టు క్రింద, చెదిరిన జుట్టుతో, ముక్కలై పగిలిపోయిన పూర్ణకుంభంతో, వాడిన పూలదండతో, ఒకవైపంతా చచ్చుబడిపోయి ఒక స్త్రీ కదలలేక ఏడుస్తా వుంది. ఆమె చేతులు వెనక్కి విరిచి కట్టేసున్నాయి. చచ్చుబడిన వైపు ఇద్దరు పిల్లలు ఎదపైబడి రాని పాల కోసం పీల్చీ పీల్చీ అలసిపోయి గుక్కబెట్టి ఏడుస్తా వున్నారు. వాళ్ళ బుగ్గలు పీక్కుపోయి, అస్థిపంజరంపై తోలు కప్పినట్లుగా వున్నారు. ఆమె శరీరపు రెండవ భాగం కళకళలాడుతూ పుష్టిగా పూరిస్తూ వుంది. పాల కోసం అటువైపు చేతులు చాచినప్పుడల్లా బలమైన రెండు చేతులు దొబ్బేస్తున్నాయి. అవతల ఎర్రగా, దబ్బపండులా, పుష్టిగా చిరునవ్వులు నవ్వుతా ఒక్కడే పాలు తాగుతా వున్నాడు. “నాన్నా... వాడూ నా బిడ్డే. కొంచం”అంటోంది. కానీ ఏ మాత్రం పట్టించుకోకుండా మరింతగా, మరింతగా పీలుస్తా వున్నాడు. నోట్లోంచి పాలు జారి కిందపడి మట్టిలో కలసిపోతోంటే కిలకిలా నవ్వుతా వున్నాడు.

అంతలో ఆకాశంలో చల్లని మెరుపు. మెరుపులోంచి కిందికి దిగిన నల్లని దేవదూతలు. చిరునవ్వుతో, ప్రేమతో ఆ స్త్రీ బంధనాలు తొలగిస్తున్నారు. వెంటనే ఆమె ఆతృతగా, వడివడిగా ఆ బక్కపిల్లలని ఎత్తుకొని ఒళ్ళంతా నిమురుతూ, కళ్ళలోంచి నీళ్ళు కారిపోతూ వుంటే ముద్దాడి పాలివ్వబోయింది. సరిగ్గా ఆ సమయంలో ఒక్కసారిగా, మూకుమ్మడిగా, పెద్ద ఎత్తున కేకలు పెడుతూ తెల్లని ఆకారాలతో, నోట్లో కోరలతో, చింతనిప్పుల్లాంటి కళ్ళతో గుంపులు గుంపులుగా రాక్షసులు. అడ్డం వచ్చిన వారందరిపై దాడి చేస్తూ, దొరికిన వారిని దొరికినట్లుగా చావగొడుతూ, ఆ స్త్రీని జుట్టుపట్టుకొని గుంజుకు పోతున్నారు. అది చూసిన విజయ్ పిడికిళ్ళు ఆవేశంతో బిగుసుకున్నాయి. “నో” అంటూ గట్టిగా అరుస్తూ కళ్ళు తెరిచాడు.

**విభజన రేఖలు కథాసంకలనం, ఆగష్టు, 2013**

# ఒక మైనార్టీ కాలేజీ కథ

"సెయింట్ థామస్ హైస్కూల్" పసుప్పచ్చని బోర్డుపై నల్లని అక్షరాలు ఎండకు నిగనిగా మెరుస్తా వున్నాయి. విశాలమైన కాంపౌండ్లో లోపలికి అడుగుపెడ్తూనే చర్చి ముఖద్వారం ఎత్తుగా కనబడతా వుంది. పై భాగంలో ఓ అద్దాల గూట్లో బాలయేసును ఎత్తుకున్న మేరీమాత విగ్రహం మిరుమిట్లు గొలుపుతావుంది. కుడివైపున స్కూలు బిల్డింగ్, తరగతి గదులపై బైబిల్ సూక్తులు అందంగా పెయింట్ చేయబడ్డాయి. ప్రార్థన జరుగుతా వుంది. గజేంద్రారెడ్డి ఓ మూలకు నిలబడి మౌనంగా చూడసాగాడు. హెడ్మాష్టర్ జాన్సన్ ప్రార్థన మధ్యలో బైబిల్లోని వాక్యాలను చదివి, క్రిష్టియన్ మతం గొప్పతనం గురించి అనర్గళంగా ఐదునిమిషాలు ఉపన్యాసమిచ్చాడు. అన్ని మతాల విద్యార్థులు మౌనంగా వింటూ వున్నారు. ప్రార్థన పూర్తి కాగానే విద్యార్థులంతా ఎవరి దారిన వాళ్ళు తమతమ క్లాసుల్లోకి వెళ్ళిపోయారు. గజేంద్రారెడ్డి పాల్ని కలవడానికి స్టాఫ్రూం వైపు అడుగులేశాడు.

పాల్ అసలు పేరు మదనగోపాల్. క్రిష్టియన్ మతం పుచ్చుకున్నాక పాల్గా పేరు మారింది. ఎయిడెడ్ స్కూల్లో ఉద్యోగమూ వచ్చింది. పాల్ పెద్దకొడుకు ఎస్సీ సర్టిఫికెట్ మీద మెడిసిన్లో సీటు సంపాదిచ్చాడు. దాంతో సీటు దొరకని ఓ ఎస్సీ విద్యార్థి వాళ్ళు క్రిష్టియన్లని కోర్టులో కేసేశాడు. ఆ రోజు నుండి పాల్ చర్చీలకు పోవడం మానేశాడు. ఇంట్లో కూడా ఏసుక్రీస్తు ఫోటోలు అటకెక్కించి బుద్దుని ఫోటోలు తగిలిచ్చి, బౌద్ధమతంలోకి మారిపోయాడు. కేసింకా నడుస్తా వుంది.

పాల్ సార్ కనబడగానే గజేంద్రారెడ్డి విష్ చేశాడు. పాల్ చిరునవ్వుతో తల పంకిస్తూ ఒక్క నిమిషం అంటూ హెడ్మాష్టర్ దగ్గర పర్మిషన్ తీసుకొచ్చాడు. బైక్ మీద ఇద్దరూ "గుడ్ షెప్పర్డ్ మైనారిటీ బీయీడీ కాలేజీ" వైపు బైలుదేరారు.

"సీటు దొరుకుతుందా అంకుల్" గజేంద్రారెడ్డి సందేహంగా అడిగాడు. పాల్ చిరునవ్వు నవ్వుతూ "ఖచ్చితంగా... కాకపోతే రేటు పెరగడం కోసం కాస్త బెట్టు చేస్తాడంతే. ఐనా తినబోతూ రుచులెందుకు. నువ్వే చూస్తావు గదా" అన్నాడు.

ఇద్దరూ కాంపౌండ్ దాటి లోపలికి అడుగుపెట్టారు. లోపల ఏసుక్రీస్తు నిలువెత్తు విగ్రహం కాలేజీపైన కనబడుతా వుంది. గజేంద్రారెడ్డి సందేహంగా "అవునంకుల్ ఇక్కడ ఏసుక్రీస్తు

విగ్రహం వుంది. మరి మీ స్కూళ్ళోనేమో మేరీమాత విగ్రహం వుంది. ఎందుకు" ప్రశ్నించాడు.

"అదా మేం కాథలిక్స్. వీళ్ళు ప్రొటెస్టెంట్సు" అన్నాడు బైక్ దిగి స్టాండ్ వేస్తూ. ఇద్దరూ లోపలికి ప్రవేశించారు.

గది పైభాగాన "నేనే మార్గమును, సత్యమును, జీవమును. నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాలేడు" అనే బైబిల్ కొటేషన్ కనబడతా వుంది.

గదిలోకి ప్రవేశించగానే కరెస్పాండెంట్ ఫ్రాన్సిస్ కనపడ్డాడు. మనిషి కాస్త నల్లగా వున్నా హుందాగా వున్నాడు. మెడలో బంగారు చైన్, వేళ్ళకు ఉంగరాలు, చేతికి గోల్డ్‌వాచ్ తళతళలాడుతున్నాయి. ఫ్రాన్సిస్ పాల్‌ను చూస్తానే "కమాన్... కమాన్... టేకిట్" అంటూ కుర్చీ చూపిస్తూ షేక్‌హ్యాండ్ ఇచ్చాడు. ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు.

"ఏం ఈ మధ్య అస్సలు కన్పడ్డం లేదు. నల్లపూసైనావ్. ఆరోగ్యమెట్లుంది. ఇంతకూ నీ కొడుకు కేసేమైంది" ప్రశ్నల వర్షం కురిపించాడు.

పాల్ నిట్టూరుస్తూ "కాస్త పచ్చగా కన్పిస్తే ఏనాకోడుకూ ఓర్చలేడు గదా. పండ్ల చెట్టుకే రాళ్ళ దెబ్బలు. తొందర్లోనే తెగుతాది" అన్నాడు.

ఇద్దరూ ఏవేవో మాట్లాడుకోసాగారు. మధ్యలో ముగ్గురికీ కాఫీ వచ్చింది. కాఫీ తాగుతూ పాల్ అసలు విషయంలోకి వచ్చాడు.

"ఈ అబ్బాయి గజేంద్రారెడ్డని మా స్నేహితుని కొడుకు. చాలా క్లోజ్‌లే. మొన్ననే బీయీడీ ఎంట్రెన్స్ రాశాడు. ర్యాంక్ కాస్త ఎక్కువొచ్చింది. మీ కాలేజీలో సీటేమైనా దొరుకుతుందేమోనని..."

అంతవరకూ పిచ్చాపాటి మాట్లాడుతోన్న ఫ్రాన్సిస్ వెంటనే కరెస్పాండెంట్‌గా క్షణంలో మారిపోయి "సీటా... చాలా మంది అడుగుతున్నారబ్బా. ఎవరికనివ్వను చెప్పు. కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం. అందరూ కావాల్సినోళ్ళే. కొంతమంది రాజకీయ నాయకుల్తో గూడా సిఫార్సులు చేయిస్తున్నారు. నీకన్నా కావాల్సినోళ్ళు ఇంకెవరూ లేరనుకో కానీ ఒక పదిరోజుల ముందే రావాల్సింది. ఇప్పుడు కొంచం కష్టం. ఏమనుకోవద్దు" అన్నాడు.

పాల్‌కి ఫ్రాన్సిస్ గురించి ముందే తెలుసు కాబట్టి కాస్త అభ్యర్థిస్తున్న గొంతుతో "అట్లనొద్దు. మాటిచ్చా. అదీగాక బాగా కావాల్సినోడని ముందే చెప్పాగదా. లేదంటే రేప్పొద్దున మొహం చూపించలేను. ఇంటి పక్కనుండేటోళ్ళం" అన్నాడు.

ఫ్రాన్సిస్ కాసేపు దీర్ఘంగా ఆలోచించినట్లు నటించి "సర్లే... చూద్దాంలే... ఓ నాల్రోజుల తర్వాత కలవండి... ఏ విషయం చెబ్తా" అన్నాడు.

పాల్ పట్టిన పట్టు వదలకుండా "చూడు... చూద్దాం గీద్దాం అంటే కుదర్దు. నేనెప్పుడైనా ఏదైనా అడిగానా. నువ్వేమైనా చెయ్. సీటు మాత్రం గావాల. లేదంటే చెప్పు. ఈన్నే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా" చిన్నగా నవ్వుతూ అన్నాడు.

ఫ్రాన్సిస్ పెద్దగా నవ్వేస్తూ "సర్లే... సర్లే... ఈ ఒక్కసారికి నేనెలాగో మానేజ్ చేస్తుంటా గానీ ఓ ఎనభైవేలు రెడీ చేస్కోమని చెప్పు" అన్నాడు.

పాల్ టేబుల్ మీద కాస్త ముందుకు వంగి "కాస్త తగ్గించుకోకూడదా" అన్నాడు.

ఫ్రాన్సిస్ తలడ్డంగా వూపుతూ "సీటివ్వడమే కష్టం. మళ్ళా డబ్బులు కూడా తగ్గిచ్చుకోమంటే ఎలా చెప్పు. కోర్సుకి డిమాండెట్లుంది. యస్సంటే లక్ష కూడా ఇయ్యడానికి సిద్ధంగున్నారు. తెల్సినోనివని ముందే తక్కువ చెప్పా. అన్న గురించి నీకు తెల్సుగదా. కట్టేదంటే మెట్టేదంటాడు. తర్వాత నేను సమాధానం చెప్పుకోలేక సావాల. అర్థం చేస్కో" అన్నాడు.

పాల్ సరేనని తలూపుతూ లేచి "రేపొచ్చి కట్టేస్తాం" అన్నాడు. ఇద్దరూ బైటకి పోతుంటే "అన్నట్లు చెప్పడం మర్చిపోయా. మతం పుచ్చుకున్నట్లు సర్టిఫికెట్ కావాల. నందికొట్కూరు పక్క దున్నపాడని ఓ గ్రామముంది. అక్కడ శామ్యూలని చర్చి ఫాదరుంటాడు. మనోడేలే. నే పంపిచ్చానని చెప్పు. సర్టిఫికెట్టిస్తాడు. రేపొచ్చేటప్పుడు దాన్ని గూడా పట్కోని రాండి" అన్నాడు.

"తర్వాతేమీ కాదుగదా సార్" గజేంద్రారెడ్డి సందేహంగా అడిగాడు.

ఫ్రాన్సిస్ ప్రసన్నంగా చూస్తూ "కోర్సు పూర్తయ్యి సర్టిఫికెట్ చేతిలో పడేంత వరకే నీవు క్రిష్టియన్వి. ఆ తర్వాత ఎవరి మతం వాళ్ళది. మతస్వేచ్ఛ. నిజం చెప్పాలంటే పోయిన సంవత్సరం ఈ కాలేజీలో సగం మంది మీ కమ్మోళ్ళ కాపోళ్ళే" అంటూ నవ్వేశాడు. ఇద్దరూ బైటికొచ్చారు.

పాల్ బైక్ స్టార్టు చేస్తూ "నే జెప్పలా. దొంగనాకొడుకు. ఎక్కడైనా బావగానీ వంగతోటకాడ కాదన్నట్లు పైసలకాడ కాస్త కూడా తగ్గడు. ఏమన్నా అంటే మా అన్న ఒప్పుకోడంటూ అన్నమీదికి దొబ్బేస్తాడు" అన్నాడు.

"వాళ్ళఅన్నెవరు" కుతూహలంగా ప్రశ్నించాడు గజేంద్రారెడ్డి.

"అదో పెద్ద కథలే. చిన్న సుంకన్నని భలె డకాటీలే. ఐదురోడ్ల కాడ చర్చి వుంది చూడు. అదే ఎస్టీబీసీ కాలేజీ దగ్గర. దాంట్లో ఒకప్పుడు భిషప్పులంతా రెడ్లే. దాంట్లనేముందిలే. మా కాథలిక్ చర్చిల్లోనైతే ఫాదర్లు, భిషప్పుల్లో అత్యధిక భాగం కమ్మోళ్లు, కాపోళ్ళు, బాపనోళ్ళే. చర్చికొచ్చేదేమో అత్యధిక భాగం మాలోళ్ళు. మాదిగోళ్ళు. మాలోళ్ళ చర్చికి మాలోళ్ళే ఫాదర్లు, భిషప్పులు కావాలగానీ రెడ్లదేంది పెత్తనమంటూ ఉద్యమం లేవదీశాడు. చూస్తుండగానే ఉద్యమం ఊపందుకొంది. క్రిస్మస్, జనవరి ఫస్ట్లకు చర్చిని బహిష్కరించారు. చర్చి బైటే టెంటేసి మాలోళ్ళతోనే ప్రార్థనలు జరిపించాడు. దాంతో పైన్నుండి రాయబారాలు నడిచి ఆఖరికి రెడ్లు పోయి మాలోళ్ళు ఫాదర్లయ్యారు. ఆ సమయంలో చిన్న సుంకన్న భలె ఫోకస్సయ్యాడు. ఎవరినోట విన్నా ఆయన పేరే. కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న రెడ్ల పెత్తనానికి గండి కొట్నాడు గదా. వీడెట్లాంటి నా కొడుకైనా దానికి మాత్రం మెచ్చుకోవలసిందే. కానీ ఆ తర్వాతనే వీనికి నెమ్మదిగా డబ్బు దురద అంటుకోనింది. ఎక్కడెక్కడి నుండి ఫండ్స్ చర్చిలకెట్లా వస్తున్నాయి, వాళ్ళకెట్లా టోపీ వెయ్యాల అన్నీ నేర్చేసుకొన్నాడు.

వాళ్ళక్క సుబ్బమ్మని శ్రీశైలం పక్కన జమ్మికుంటలో వుంటుందిలే. అక్కడ దేవాలయ భూములు దళితులకియ్యాలని పెద్ద పోరాటం జరిగింది. దాంట్లో సుబ్బమ్మ చురుగ్గా పాల్గొంది. అడవి లోపల్నించి కూడా సపోర్టొచ్చింది. భూముల్లో ఎర్రజెండాలు రెపరెపలాన్నాయి. మనోడు

ఎగిరి దాంట్లోకి దూకాడు. అప్పటికే మంచి పేరుంది గదా. అందరూ నమ్మారు. ఉద్యమం పెరిగి పెద్దగైంది. దళితులంటే క్రిష్టియన్లే గదా. మనోడు ఆ మొత్తం పోరాటాన్ని ఎప్పటికప్పుడు వీడియోలో చిత్రించి హిందువులకి వ్యతిరేకంగా క్రిష్టియన్లంతా సమైక్యంగా చేస్తున్న పోరాటమనీ, ఆర్థిక సాయమందించాలనీ అభ్యర్థిస్తూ వివిధ క్రిష్టియన్ దేశాలకి పంపిచ్చాడు. అంతే ఫారిన్ ఫండ్స్ కుప్పలు తెప్పలుగా వచ్చి పడసాగాయి. ఉద్యమానికి పిచ్చపిచ్చగా డబ్బు ఖర్చు పెట్టసాగాడు. ఎంత పెడ్తే అంతకు రెండితలు ఆన్నించొచ్చేది. అసలు వీనికింత డబ్బెక్కడిదబ్బా అని కొందరు ఆరా తీశారు. దాంతో అసలు విషయం అర్థమైంది. దళిత ఉద్యమానికి మతం రంగు పూస్తున్నందుకు ఎర్రోళ్ళు వీనికి వార్నింగిచ్చి బహిష్కరించారు. అప్పట్కే పిచ్చడబ్బు సంపాదిచ్చేశాడు గదా. దాన్ని పెట్టి మైనార్టీ హోదాతో బీయీడీ కాలేజీ సంపాదిచ్చేసి, తమ్మున్ని కరెస్పాండెంట్ చేశాడు. వాడు మాత్రం ఏదో స్వచ్ఛంద సంస్థ పెట్టుకొని ఇంకా దొబ్బేస్తూనే వున్నాడు".

బైక్ స్కూలు దగ్గరికి వచ్చేసింది "రేప్పొద్దున్నే డబ్బుతో రా. దున్నపాడు పోయి సర్టిఫికెట్ తెచ్చుకోని కాలేజీలో చేరిపోదువుగానీ" అన్నాడు. సరేనని గజేంద్రారెడ్డి ఇంటికి పోయి డబ్బులు సిద్ధం చేస్కోని తరువాత రోజు పొద్దున్నే పాల్ ఇంటికి చేరుకున్నాడు. ఇద్దరూ కల్సి బస్సెక్కారు. బస్సు ఫుల్లు రష్‌గా వుంది. గజేంద్రారెడ్డి కిటికీవైపు కూర్చున్నాడు. వాళ్ళ పక్కన ఇంకోడెవడో స్టూడెంట్ వచ్చి కూర్చున్నాడు. మనిషి నల్లగా వున్నాడు. బ్లాక్ ప్యాంట్లోకి ఇన్‌సర్ట్ చేసిన వైట్ షర్ట్, లైట్‌గా పెరిగిన గడ్డం, సూటిగా చూస్తున్న కళ్ళు... ఓ ఇరవై ఏళ్ళుండొచ్చు. వాన్ని తేరిపారా చూసి గజేంద్రారెడ్డి నెమ్మదిగా కిటికీ తెరిచాడు. చల్లని గాలి రివ్వున రాసాగింది. బైటకి చూడసాగాడు. అడుగడుగునా క్రిష్టియన్ స్కూళ్ళు, కాలేజీలు, చర్చీలు కనబడసాగాయి. వాటిని చూస్తూ పాల్తో "క్రిష్టియన్లు భలే డెవలప్పవుతున్నార్లదా" అన్నాడు.

పాల్ అవునన్నట్లు తలూపుతూ "ఈ మధ్య మా పిన్ని కొడుకు అమెరికాగ్గూడా పోయినాడు" అన్నాడు.

ఆ మాటలింటున్న పక్కనున్న యువకుడు సీరియస్‌గా "వాపును చూసి బలుపనుకోవద్దు. మాలోళ్ళు, మాదిగోళ్ళు యాడ డెవలప్పయ్యారు. పల్లెల్లో ఇప్పటికీ వూరిబైటే అంటరానోళ్ళుగా వుసూరుమంటున్నారు. మతం మారినా కులం పోలేదు. హరిజనులు, దళితులు, క్రిష్టియన్లు... పేరేదైనా అంటరానోళ్ళనే గదా అర్థం. వీళ్ళు హిందువులకే మాత్రం తీసిపోకుండా మాలోళ్ళకో చర్చి, మాదిగోళ్ళకో చర్చి పల్లెపల్లెకు కట్టిస్తూ మంట మరింత ఎగేస్తున్నారు. ఏవో చిన్న చిన్న వుద్యోగాలు తప్పిస్తే ఎవడూ పైకి పోయిందీ లేదు. సంపాదిచ్చిందీ లేదు. ఎవడైనా ఏదైనా మంచి ఉద్యోగం సంపాదిచ్చినా అది ఎస్సీ సర్టిఫికెట్ మీదే గానీ క్రిష్టియన్ హోదాతో గాదు. కర్నూల్లో విలువైన ఆస్తులు ఎన్నున్నాయి క్రిష్టియన్ సంస్థల ఆధీనంలో. నంద్యాల వైపుగానీ, ఈ నందికొట్కూర్ వైపుగానీ ఒక్కసారి పోయి చూడు. రోజుకొక చర్చీ పైకి లేస్తా వుంది. మతవ్యాప్తి మీదున్న శ్రద్ధ మతం తీసుకున్నోళ్ళ మీద లేదు. ఎర్రజెండాలు ఈ చర్చి భూముల్లో కూడా పాతితే... దళితులందరికీ పంచితే... ప్రతి క్రిష్టియన్‌కీ కాస్తైనా భూమి..." మాటల మధ్యలో

నందికొట్టుకొచ్చింది. ఎవరికి వాళ్ళు దిగిపోయారు.

"ఎవడో తీవ్రవాదిలెక్కున్నాడు" పాల్ నవ్వుతా అన్నాడు. ఇద్దరూ సెవెన్ సీటర్ ఆటోలో దున్నపాడు చేరుకున్నారు. ఊరి బైటి చర్చి దగ్గరికి చేరి ఫాదర్ శామ్యూల్ని కలుసుకున్నారు. వెయ్యి రూపాయలు తీసుకోని ఆర్నెల్ల క్రిందే మతం మార్చుకున్నట్టు సర్టిఫికెట్ రాసిస్తూ "విషయం ఎవరికీ చెప్పకండి. ఎవరైనా అడిగినా నిజంగానే బాప్తిజం పుచ్చుకున్నట్లు చెప్పండి" అన్నాడు. వాళ్ళు చిరునవ్వుతో తలూపి తిరిగి సర్టిఫికెట్తో కాలేజీకి చేరుకున్నారు.

ఇద్దరూ కరెస్పాండెంట్ గదిలోకి పోబోతూ లోపల ఏవో మాటలు వినబడ్తుంటే బైటే ఆగిపోయారు. గదిబైట సాదాసీదా రబ్బరు చెప్పుల జత వుంది. మాటలు బైటకి వినబడ్తున్నాయ్.

"సార్... ప్లీజ్ సార్... దయచేసి ఒక్క సీటిప్పియ్యండి సార్. ఓ ఇరవైదాకా ఇచ్చుకుంటాను సార్"

"అరె ఎన్నిసార్లు చెప్పాలి నీకు. సీట్లు లేవని. కాస్త కష్టపడి చదివింటే ఎస్సీకోటాలో సీటొచ్చేది గదా. పోపో... పోయి ఈ సంవత్సరమన్నా కష్టపడి చదువు. ఫ్రీ సీటొస్తాది".

"సార్... సార్... ప్లీజ్ సార్"

"ఏయ్... చెప్తే అర్థం కాదా నీకు. ఎందుకు సతాయిస్తావ్. హాస్టల్లో ఫ్రీగా తినేది. తిరిగేది. చదవడం మాత్రం చాతకాదు. ఇదేమన్న గవర్నమెంట్ కాలేజనుకున్నావా. నీలాంటోళ్ళకి సీట్లియ్యడానికి. క్రిష్టియన్లకు తప్ప ఇంకెవ్వరికీ ఇక్కడ సీట్లియ్యడానికి రూల్సొప్పుకోవ్".

"సార్... నేన్గూడా క్రిష్టియన్నే సార్"

"సిగ్గు లేదూ ఆ మాటనడానికి. రిజర్వేషన్ల కోసం, స్కాలర్షిప్పుల కోసం హిందువునని చెప్పుకుంటూ... మళ్ళా క్రిష్టియనంటావ్. నీలాంటోళ్ళ వల్లనే మన మతానిక్కూడా చెడ్డపేరు. పో... పో... నాక్కోపం తెప్పియ్యొద్దు".

కాసేపటికి ఒకడు దీనంగా, దిగులుగా, నిరాశగా బైటకొచ్చాడు. గజేంద్రారెడ్డి, పాల్ లోపలికెళ్ళారు.

కరెస్పాండెంట్ వెనుకనున్న గోడపై ఓ వైపుకు వాలిన తలతో, నెత్తిన ముళ్ళ కిరీటంతో, కాళ్ళూ చేతులలో దిగిన మేకులతో, ఎదను గాయం చేసిన బల్లెంపోటుతో... పాపుల కొరకు రక్తాన్ని స్రవిస్తున్న ఏసుక్రీస్తు బొమ్మ ఫ్రేములో బందీయై వుంది.

**మూడు అబద్ధాలు కథాసంపుటి - జూలై 2005**

# గాయపడ్డ నమ్మకం

"తాతా రేపు గణతంత్ర దినోత్సవం. కలెక్టర్ ఆఫీస్ నుంచి కబురొచ్చింది. మిమ్మల్ని తీసుకొని కర్నూలులోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌కు హాజరు కమ్మని ఆహ్వానపత్రం గూడా పంపించారు" అంటూ తాత చేతికి అందించింది భారతి.

విశ్వనాథం దానిని అందుకోను గూడా అందుకోలేదు. నిరాసక్తంగా చిరునవ్వు నవ్వుతూ చేతిలోని దినపత్రిక తిప్పసాగాడు.

"ఎందుకు తాతా... ఎప్పుడూ పోనంటావు. నీకు సన్మానం జరుగుతుంటే చూడాలని ఆశగా వుంది. ఈ ఒక్కసారికీ రాగూడదూ" అంది భారతి.

"ఈ ముసలి వయసులో ఆ సన్మానం కోసం అంతదూరం పోవడం ఎందుకులేమ్మా... మనం పోయినా పోకపోయినా అక్కడేమీ ఆగదులే. ఎప్పట్లాగే పక్కనే వున్న పాఠశాలకు వెళతా" అన్నాడు.

"అదేంది తాతా! అంత మాటంటావు. మీరంతా ప్రాణాలను సైతం లెక్క చేయకుండా చేసిన పోరాట ఫలితమే గదా ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. మీలాంటి వాళ్ళు స్వయంగా అనుభవాలు చెప్తే యువతకు ఎంత స్ఫూర్తివంతంగా వుంటుంది. ఆ పోరాటం, త్యాగాలు, దేశభక్తి కళ్ళ ముందు సాక్షాత్కరిస్తాయి. మార్గదర్శనం చేయాల్సిన మీరే ఇలా ముఖం చాటేయడం పద్ధతి కాదు" అంది భారతి నిష్ఠూరంగా.

విశ్వనాథానికి మనవరాలికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. ప్రతి సంవత్సరం ఆగష్టు 15, జనవరి 26 ఇదే గొడవ.

అంతలో మళ్ళా భారతి "చూడు తాతా... ఈ ఒక్కసారికి రా నా కోసం మళ్ళా ఎప్పుడూ అడగను. రానంటే మాత్రం నా మీద ఒట్టే. నీతో ఇకపై ఎప్పుడూ మాట్లాడను" అంటూ ఆఖరి అస్త్రం ప్రయోగించింది.

విశ్వనాథానికి డిగ్రీ చదువుతున్న తన మనవరాలంటే చాలా ప్రేమ. దాంతో కాదనలేకపోయాడు. అదీగాక ఇప్పటికే వయసు ఎనభై దాటింది. ఇక రేపో... ఎల్లుండో... చివరిసారిగా కర్నూలు నగరం నడిబొడ్డున వున్న ఆ కొండారెడ్డి బురుజును ఒకసారి చూడాలనిపించింది. దాంతో అలాగేనంటూ తలూపాడు.

భారతి ఆనందం పట్టలేకపోయింది. తాత చేయి పట్టుకుని ముద్దు పెట్టుకుంది.. తర్వాత రోజు ఉదయం త్వరగా తయారై తాతను తీసుకొని బస్సులో బైలుదేరింది.

విశ్వనాథానికి మనసంతా చాలా ఉద్వేగంగా వుంది. స్వాతంత్ర్యానికి పూర్వం తాను చేసిన సాహసం గుర్తుకొస్తే ఇప్పటికీ ఒళ్ళు జలదరిస్తుంది. అసలు అంత ధైర్యంగా తానేనా అలా చేసింది అనిపిస్తుంది. ఆ వయసులో వున్న ఆవేశం, స్వాతంత్ర్య కాంక్ష, ఆంగ్ల ప్రభుత్వంపై వున్న వ్యతిరేకత, స్వాతంత్ర్యం వల్ల ప్రజల జీవితాల్లో మార్పులు వస్తాయనే బలమైన విశ్వాసం ఆరోజు అట్లా చేయించిందనుకుంటా. నెమ్మదిగా విశ్వనాథం ఆ రోజుల్లోకి జారిపోయాడు.

అది 1942. క్విట్ ఇండియా ఉద్యమ సమయం. మహాత్మాగాంధీ ఇచ్చిన "సాధించు లేదా మరణించు" అనే నినాదం గడప గడపకూ చేరి మహోగ్ర తరంగంలా ఉవ్వెత్తున ఎగసిపడుతున్న సందర్భం. కర్నూలు జిల్లాలో ప్రజలందరినీ సమీకరించి, ఒక పెద్ద ర్యాలీ నిర్వహించి, కొండారెడ్డి బురుజు ముందున్న విశాలమైన ఖాళీ స్థలంలో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు అప్పటి నాయకులు.

సరిగ్గా దానికి రెండు రోజుల ముందు... సాయంత్రం మసక మసక చీకటి పడుతుండగా కర్నూలును ఆనుకుని ప్రవహిస్తున్న హంద్రీనది ఇసుక తిన్నెలపై కూర్చున్న నలుగురు వ్యక్తులు చాలా సుదీర్ఘమైన ఆలోచనలో వున్నారు. కుడివైపు కర్నూలు మునిసిపాలిటీ, ఎడమవైపు బుధవారపేట గ్రామం కనిపిస్తూ వుంది. మధ్యలో రెండింటినీ కలుపుతూ నిర్మించిన పెద్ద వంతెన అనేకసార్లు వచ్చిన హంద్రీ వరదల్లో బాగా దెబ్బతిని శిథిలమై పోయి వుంది. నలుగురిలో అందరికన్నా పెద్దవాడైన వ్యక్తి నిశ్శబ్దాన్ని పారద్రోలుతూ గొంతు విప్పాడు.

"లాభం లేదు. మనం మౌనంగా ఇలాగే వుంటే లాభం లేదు. ఏదో ఒక సంఘటన జరగాలి. అది ప్రజలందరిలో ఉత్తేజాన్ని నింపి ఉద్యమం వైపు ఉరకలు వేయించేలా వుండాలి. నాయకులే కాదు సామాన్యులు గూడా బ్రిటిష్ తూటాలకు ఎదురొడ్డి నిలబడేలా ధైర్యాన్ని కలిగించాలి. మన సాహసం పల్లెపల్లెకూ పాకి, గుండె గుండెకూ చేరి నూతనోత్తేజాన్ని నింపాలి" అన్నాడు.

వెంటనే ఒక యువకుడు "జొహరాపురం, రోజా, కల్లూరులలో దాదాపు వందమంది దాకా యువకులు మనం ఏం చెప్తే అది చేయడానికి సిద్ధంగా వున్నారు. మూడు దళాలుగా విడిపోయి రేపటిలోగా వీలైనన్ని చోట్ల టెలిఫోన్ స్తంభాల తీగలను తెంచేద్దాం. అట్లాగే రైళ్ళు నడవకుండా పట్టాలు తొలగిద్దాం. ప్రభుత్వ కార్యాలయాలపైన, రక్షకభట నిలయాలపైన రాత్రుళ్ళు దాడులు చేసి ఆయుధాలు ఎత్తుకుపోదాం. దాంతో అంతా అల్లకల్లోలమైపోతుంది"

అన్నాడు ఆవేశంగా.

ఆ మాటలకు నడివయసు వ్యక్తి "మిత్రమా! ఆవేశపడకు. మనం మహాత్మాగాంధీ అడుగుజాడల్లో సత్యం, అహింసలను వదలగూడదు. 1929లో మహాత్మాగాంధీ రెండవసారి జిల్లాలో అడుగుపెట్టి, ఖద్దరునిధికి విరాళాలు సేకరిస్తూ తన ప్రసంగాలతో ప్రజలను ఉత్తేజభరితం చేశాడు. కానీ ఇక్కడి భూస్వాములంతా జస్టిస్ పార్టీకి జేజేలు పలుకుతూ, ఆంగ్లేయ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుండడంతో, సామాన్య ప్రజలు మనసులో స్వాతంత్ర్య కాంక్ష వున్నప్పటికీ భయంతో బైటకడుగు పెట్టటానికి సాహసించడంలేదు. గాడిచెర్ల, వనం శంకరశర్మ, మేడం వెంకయ్య శెట్టి, బియాబానీ, సర్దార్ నాగప్ప లాంటి గాంధేయవాదులంతా గ్రామాలన్నీ తిరుగుతూ స్వేచ్ఛా భావాలు వ్యాప్తి చేశారు. కానీ ప్రజల్లో ఏదో సంకోచం. తడబాటు. అందుకే ప్రజలందరినీ కదిలించేలా, ఆంగ్ల ప్రభుత్వపు చేతగాని తనాన్ని చాటి చెప్పేలా ఒక సాహసోపేతమైన చర్యను చేపట్టాలి. ఏమంటారు?" అన్నాడు. దానికి మిగతావాళ్ళు అలాగేనంటూ తలూపుతూ "మీరు పెద్దవారు. ఇప్పటికే రెండుసార్లు కారాగారశిక్ష అనుభవించి వచ్చినవారు. చెప్పండి. ఏం చేద్దాం" అన్నారు ముక్తకంఠంతో.

అతను ఒక్క నిమిషం చుట్టూ చూశాడు. బాగా చీకటి పడింది. దూరంగా కర్నూలు వీధుల్లో అక్కడక్కడా విద్యుద్దీపాలు తళుకు తళుకుమంటున్నాయి. ఎదురుగా కూర్చున్న వాళ్ళ ముఖాల్లోకి సూటిగా చూస్తూ "మరో రెండు రోజుల్లో కర్నూల్లో పెద్దర్యాలీ జరగబోతోంది గదా... దానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి గూడా అనేకమంది వస్తున్నారు. అదే సమయంలో మనం నగరంలోని ప్రధానమైన కూడలిలో మన ఆత్మగౌరవానికి చిహ్నమైన మూడు రంగుల జెండాను సగర్వంగా ఎగురవేయాలి..."

ఆ మాటలకు అడ్డుపడుతూ ఒక యువకుడు "అదేమంత పెద్ద కష్టం కాదు గదా! దానికింతగా ఆలోచించాల్సిన అవసరమేమి" అన్నాడు.

"నిజమే... నువ్వు చెప్పింది. కానీ ఇక్కడ జెండా ఎగురవేయడం ఒక్కటే కాదు ముఖ్యం. అది ఎక్కడ ఎగురవేస్తున్నాం అన్నది ప్రధానం. బ్రిటిష్ ప్రభుత్వ ప్రధాన కార్యాలయంపై ఆ దేశ పతాకాన్ని దించి, అక్కడ మన మూడు రంగుల జెండా ఎగురవేయాలి. ఇంకో ముఖ్యమైన విషయం. ఈ సమాచారాన్ని ముందుగానే మనం కరపత్రాల ద్వారా ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేయాలి" అన్నాడు.

ఆ మాటలకు అక్కడ ఒక్కసారిగా గాలి స్తంభించిపోయింది.

"కానీ ముందే తెలిస్తే... మనం ఎగురవేయగలమా" సందేహంగా అడిగాడో యువకుడు.

"అందుకే ఇది సాహసమంటున్నా. పోలీసులు అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తారు. డేగల్లా కాపు కాస్తారు. జెండా ఎగురవేసే క్రమంలోగానీ, ఎగురవేసింతర్వాతగానీ పోలీసుల చేతికి చిక్కితే చిత్రహింసలు, కారాగారశిక్షలే గాక ఒక్కోసారి ప్రాణాలకు గూడా అపాయం కలుగవచ్చు. కానీ మనం విజయం సాధిస్తే అది గుండె గుండెనూ తట్టి... పాటగా, కథగా,

నాటకంగా, ప్రజల గుండె చప్పుడుగా మారి వారిలో ఉత్సాహాన్ని ఉరకలు వేయించి సమంగర్జన చేయిస్తుంది. దేనికైనా సిద్ధపడేలా చేయిస్తుంది. చెప్పండి. మీలో ఎవరైనా దీన్ని చేయగలరా?" అన్నాడు.

అందరూ దీర్ఘాలోచనలో పడ్డారు. ఐదునిమిషాల తర్వాత విశ్వనాథం లేచి "నేను సిద్ధం. జెండా ఎగురవేయడం లేదా మరణించడం... ఏదో ఒకటి ఖచ్చితంగా జరిగి తీరుతుంది. దేశమాత ఋణం తీర్చుకోవడం కన్నా కావలసిందేముంది" అన్నాడు. అందరూ ఆ పదహారేళ్ళ యువకుని వంక చూశారు. మాటల్లో దృఢత్వం, ముఖంలో గాంభీర్యం తొణికిసలాడుతూ కనపడ్డాయి.

మధ్య వయస్కుడు తలూపుతూ "మనం పొరబాటున పోలీసులకు పట్టుబడ్డా రహస్యం మాత్రం బైటపడగూడదు. కాబట్టి ఎక్కడ ఎగురవేయాలి అనేది విశ్వనాథానికి మాత్రమే చెప్తాను. అలాగే మిగతావాళ్ళందరికీ విడివిడిగా ఎవరెవరు ఏమేం పనులు చెయ్యాలో తెలియజేస్తాను. ఇది మీ మీద నమ్మకం లేక కాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ విజయం సాధించడం కోసం. ఏమంటారు?" అన్నాడు చేయి ముందుకు చాస్తూ.

అందరూ అతని చేతిలో చేయి వేసి "మీ అనుభవం, ఆచరణ... అద్భుతం. అలాగే చేద్దాం" అన్నారు ఏక కంఠంతో. అతను ఒకొక్కరికి వారు ఏం చేయాలో తెలియజేశాక అందరూ అక్కడి నుంచి నిష్క్రమించారు.

తర్వాత రోజు ఉదయంకంతా నగరంలోని ప్రధాన కూడళ్ళలో, చుట్టుపక్కల గ్రామాల్లోని రచ్చబండల దగ్గర కరపత్రాలు ప్రత్యక్షమయ్యాయి.

**తెల్లకుక్కలకు సవాల్**

"క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంగా రేపు జరుగబోయే ర్యాలీలో మన ఆత్మాభిమానానికి చిహ్నమైన మువ్వన్నెల పతాకాన్ని సగర్వంగా ప్రభుత్వ భవనంపై ఆంగ్ల పతాకాన్ని దించి ఎగురవేయడం జరుగుతుంది. దమ్ముంటే దాన్ని అడ్డుకోమని బ్రిటిష్ తొత్తులకు బహిరంగంగా సవాల్ చేస్తున్నాం"

ఇట్లు
కందనవోలు దేశాభిమాన సంఘం.

విషయం తెలిసిన పోలీసులు ఎక్కడికక్కడ వాటిని తొలగించారు గానీ అప్పటికే వార్త దావానలంలా వ్యాపించి పోయింది. ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఇదే ఆలోచన. ఎవరు రాశారు? ఎక్కడ ఎగురవేస్తారు? ఎంత మందున్నారు? అన్నీ ప్రశ్నలే...

పరిస్థితిని గ్రహించిన సైనిక దళాల అధికారి మొదట ర్యాలీకి అనుమతిని నిరాకరించాలనుకున్నాడు. కానీ అది పిరికిపందల చర్యగా తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి తీసుకుపోతుందని భయపడ్డాడు. దాంతో వేగులని రంగంలోకి దించాడు. అనుమానమున్న

చోటల్లా సైనికులు వేటకుక్కల్లా వెంటాడుతూ నఖశిఖ పర్యంతం సోదాలు చేయసాగారు. ముందు జాగ్రత్తగా కొందరిని అదుపులోకి తీసుకున్నారు. గడియారం ఆసుపత్రి, నవాబ్ బంగ్లా, కలెక్టర్ బంగ్లా, ఎర్రబురుజు, బండిమెట్ట, కొండారెడ్డి బురుజులాంటి ముఖ్యమైన ప్రదేశాలనంతా పోలీసు వలయాలతో నింపివేశారు.

అనుకున్నట్లుగానే ఆ రోజు ఉదయం రాంబొట్ల దేవాలయం నుంచి ఊరేగింపు ప్రారంభమైంది. ఏం జరుగుతుందో చూద్దామని చుట్టుపక్కల పల్లెల నుంచి గూడా జనాలు తండోపతండాలుగా వచ్చి చేరడంతో నగరమంతా జనసంద్రంగా మారిపోయింది. మూడు రంగుల జెండాను తీసుకురావడాన్ని ముందుగానే నిషేధించడంతో ప్రజలంతా వందేమాతర గీతాలతో సాగిపోతూ వున్నారు. ఒకొక్క అడుగే దాటుకుంటూ వందేమాతర గీతాన్ని ఆలపిస్తూ.... జాతీయ నాయకులను జయజయ ధ్వానాలతో పొగుడుతూ, స్వాతంత్ర్యం కోసం ఎలుగెత్తి నినదిస్తూ అశేష ప్రజానీకం నగరం బైట వున్న కొండారెడ్డి బురుజు ముందున్న విశాలమైన సభాస్థలికి చేరుకున్నారు. ఏ క్షణంలో ఏ వీధిలో ఏం జరుగుతుందోనని ఉదయం నుంచీ ఊపిరి బిగబట్టి వుత్కంఠతో పహరా కాస్తున్న పోలీసులు వూపిరి పీల్చుకున్నారు. బ్రిటిష్ ప్రభుత్వమా... మజాకా... అని మీసాలు తిప్పుకున్నారు. దారంతా ఎదురు చూసిన ప్రజలు నిరాశతో, నీరసంతో, అవమానంతో క్రుంగిపోయారు. అందరి ముఖాలు విషాదంతో నిండిపోయాయి.

"పెద్ద పాలెగాల్లలెక్క కరిపిచ్చినారు కరపత్రాలు" అన్నాడొకడు.

"ఇంత మంది పోలీసుల మధ్య ఎగరేయడమంటే మాటలా... ఎన్ని గుండెలుండాలి" అన్నాడు మరొకడు.

"చేతగానోళ్ళు చేతగానోళ్ళ మాదిరుండాలి. అనవసరంగా మన పరువు తీసినారు" అన్నాడు ఇంకొకడు.

అంతలో ఏదో కోలాహలం. సభా స్థలమంతా ఒక్కసారిగా అలజడి. కొందరు పైన ఆకాశంలోకి చూస్తూ గట్టిగా, ఆనందంగా "వందేమాతరం" అని అరుస్తూ వున్నారు. ప్రజలు, పోలీసులు, అధికారుల దృష్టంతా ఆకాశం వైపుకి మళ్ళింది. ఆకాశంలో రెండు పెద్ద పెద్ద గాలిపటాలు మూడు రంగుల్లో ఎగురుతూ, పల్టీలు కొడుతూ వున్నాయి. అంతలో దూరంగానున్న మిద్దెల మీది నుంచి కొందరు రాకెట్లకు చిన్న చిన్న జెండాలు కట్టి అంటించారు. అంతే అవి గాలిలో రయ్యిమని దూసుకుపోతూ పెద్ద పెద్ద శబ్దాలతో పేలిపోగానే.... వాటికి కట్టిన మూటలు విడిపోయి అందులోంచి చిన్న చిన్న జెండాలు ఆకాశమంతా వెదజల్లబడ్డాయి. ఎవరు చేస్తున్నారో, ఎక్కడి నుంచి వస్తున్నాయో అర్థంకాక పోలీసులు ఒక్కసారిగా లాఠీలతో నాలుగువేపులా పరుగులు పెట్టారు. అంతా అల్లకల్లోలంగా వుంది. ప్రజల అరుపులు, కేకలు మిన్ను ముడుతున్నాయి. అందరూ ముందుకు దూసుకు రాసాగారు. వారిని ఆపడం చాలా కష్టంగా వుంది. బురుజుపైన కాపలా కాస్తున్న పోలీసులంతా ప్రజలను అదుపు చేయడానికి

కిందికి వచ్చారు.

కొండారెడ్డి బురుజు వెనుక అంతా నిశ్శబ్దంగా వుంది. బురుజును ఆనుకొని వున్న ఒక పెద్ద చెట్టు మీద రాత్రి నుంచీ దాచిపెట్టుకుని వున్న విశ్వనాథం నెమ్మదిగా చెట్టు దిగాడు. పొదలో దాచిన పెద్ద ఉడుమును బైటకు తీసి, దాని నడుముకు గట్టిగా తాడు కట్టాడు. తేనె పూసిన కట్టెను దాని తల భాగంలో అందకుండా వుండేటట్టు తాడుతో కట్టి, దానిని కోట గోడ మీద వదిలాడు. అది తేనె వాసన పీలుస్తూ, దాన్ని అందుకోవడం కోసం ముందుకు పాకుతూ పది నిమిషాల్లో పై భాగానికి చేరుకొంది. వెంటనే తాడు పట్టుకొని గట్టిగా లాగాడు. ఉడుము ఒక్కసారిగా గోడకు అతుక్కుపోయింది. విశ్వనాథం గబగబా బ్రిటిష్ సైనికునిలా దుస్తులు వేసుకొని, నెమ్మదిగా ఎక్కడం మొదలుపెట్టాడు. పావుగంటలో పైకి చేరుకుని లోపలికి తొంగి చూశాడు. ఎవరూ లేరు. నెమ్మదిగా బురుజు లోనికి అడుగుపెట్టాడు. వడివడిగా పోసాగాడు. ఎదురుగా ఇద్దరు ముగ్గురు సైనికులు వచ్చినా ఎవరూ అనుమానించలేదు. గబగబా మూడో అంతస్తుకు చేరుకుని తలెత్తి పైకి చూశాడు. స్థూపం ఎత్తుగా, గర్వంగా, నిటారుగా వుంది. దాని మీదకు ఎక్కడానికి ఒక పొడవాటి ఇనుప నిచ్చెన వుంది. పైన బ్రిటిష్ జెండా ఎగురుతూ వుంది. దాన్ని చూడగానే విశ్వనాథం పల్లు పటపటలాడాయి. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, వేగంగా నిచ్చెన ఎక్కుతూ పైకి చేరుకున్నాడు.

అంతవరకూ బొడ్లో భద్రంగా దాచిపెట్టుకున్న మూడు రంగుల జెండాను తీసి గర్వంగా ముద్దు పెట్టుకున్నాడు. జరజరజర బ్రిటిష్ జెండాను క్రిందికి దించి భారతీయుల గుండె చప్పుడుని దానికి కట్టాడు. గర్వంగా ఆ 168 అడుగుల ఎత్తు గల స్థూపంపై నిలబడి "వందేమాతరం" అని దిక్కులు పిక్కటిల్లేలా ఒక్కసారిగా గట్టిగా అరిచాడు. కింద వున్న జనాల దృష్టి పైకి మళ్ళింది. పైన ఎవరో అర్థం కాలేదు. బ్రిటిష్ సైనికుని దుస్తుల్లోనే వున్నాడు. కానీ అంతవరకూ అక్కడ రెపరెపలాడుతున్న బ్రిటిష్ జెండా మాత్రం లేదు. అంతలో మరలా పై నుంచి "వందేమాతరం, భారతమాతా జిందాబాద్" అని గట్టిగా అరిచాడు. పోలీసులు, ప్రజలు అందరూ నిశ్చేష్టులై చూస్తుండగా ఒక్కసారిగా మూడు రంగుల జెండా పైకి పోవడం ప్రారంభించింది.

అంతే... కిందనున్న జనాల్లో ఆనందం అంబరాన్ని తాకింది. 'జయహో... భారతమాతాకీ', 'వందేమాతరం', 'మహాత్మాగాంధీకి జై' అంటూ నినాదాలు మిన్ను ముట్టాయి. జెండా పైకి చేరుకుని గాలికి గర్వంగా రెపరెపలాడసాగింది. ఆంగ్లేయ అధికారి ఆగ్రహంతో ఊగిపోయాడు. 'క్యాచ్ హిమ్' అంటూ సైనికులను పురమాయించాడు. విశ్వనాథం అక్కడి నుంచి పారిపోవడానికి ఏ మాత్రం ప్రయత్నించలేదు. బ్రిటిష్ పార్లమెంటులో బాంబులు వేసి అక్కడే చిరునవ్వులతో నిలబడ్డ వీరకిశోరం భగత్‌సింగ్‌లా ఆ స్థూపంపై నినాదాలు చేస్తూ అట్లాగే నిలబడిపోయాడు. పోలీసులు అతన్ని పట్టి బంధించి కిందకు తెచ్చారు.

రక్తం కారేలా కొట్టి, రాజద్రోహనేరం కింద న్యాయస్థానంలో హాజరుపరిచారు. యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించడంతో అల్లీపురం జైలులో నిర్బంధించారు. ఐదు సంవత్సరాలు కారాగారంలో పోలీసుల చేతిలో తీవ్రమైన హింసను అనుభవించాడు. కానీ అంతలోనే భారతదేశానికి స్వాతంత్ర్యం లభించడంతో జైలు నుంచి విడుదలయ్యాడు.

ఆ తర్వాత టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని నంద్యాలలో ఉపాధ్యాయునిగా స్థిరపడ్డాడు. స్వాతంత్ర్య సమర యోధునిగా గుర్తించి ప్రభుత్వం ఇచ్చిన ఐదు ఎకరాలను ఒక అనాథ శరణాలయానికి ఇచ్చివేశాడు. పాఠశాలలో పేద పిల్లలకు అవసరమైన సహాయాలు అందిస్తూ, వారిని బాగా చదువుకొనేలా ప్రోత్సహిస్తూ వుండేవాడు. చూస్తుండగానే కాలం గిర్రున తిరిగిపోయింది. పిల్లలు... మనుమలు... మనమరాళ్ళు అందరూ వచ్చేశారు. పత్రికల్లో ప్రస్తుత తరం రాజకీయ నాయకులను చూస్తూ చాలా బాధపడేవాడు. అందుకే వాళ్ళ చేతుల మీద జరిగే సన్మానాలకు, సత్కారాలకు హాజరు కావడం మానేశాడు. మరలా ఇన్ని రోజులకు... మనవరాలి కోసం...

బస్సాగడంతో మనవరాలు "తాతా.. రాజ్‌విహార్ వచ్చేసింది. ఇక్కడ దిగి ఆటోలో వెళదాం" అంది. పాప చేయి పట్టుకొని నెమ్మదిగా దిగాడు. ఆటోలో కొండారెడ్డి బురుజు పక్కనే వున్న పోలీస్ పెరేడ్ గ్రౌండుకు చేరుకున్నాడు. ఒకప్పుడు ఊరిబైట విసిరేసినట్లుగా వున్న బురుజు నగరం విస్తరించడంతో నడిబొడ్డుగా మారింది. గ్రౌండ్‌లో జనాలెవరూ లేరు. నెమ్మదిగా వేదిక దగ్గరికి చేరుకున్నాడు. చేతిలోని పత్రికను చూపించగానే ఒక పోలీసు 'ప్రత్యేక ఆహ్వానితులు' అని వున్న చోట కూర్చోబెట్టాడు. కాసేపటికి తనలాగే మరో ముగ్గురు సమరయోధులు వచ్చారు. అందరూ ముసలి వాళ్ళై పోయారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. గ్రౌండులోకి పాఠశాలల నుంచి పిల్లలు, ఉపాధ్యాయులు రావడంతో అక్కడంతా కోలాహలంగా మారిపోయింది. కాసేపటికి అధికారులు, మంత్రులు విచ్చేశారు. వాళ్ళతో పాటు ఒక పెద్ద గుంపు ఖద్దరు చొక్కాలతో... పతాకావిష్కరణ తర్వాత మంత్రి శాలువాలతో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించడానికి వచ్చాడు. విశ్వనాథానికి చూపు సరిగా ఆనడం లేదు. దగ్గరగా వచ్చి శాలువా కప్పుతున్న మంత్రిని పరీక్షగా చూశాడు. ఒక పెద్ద ఫ్యాక్షనిస్టు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి వందల కోట్ల ప్రజల సొమ్మును దోచుకున్న నిందితుడు. అనేక హత్యలతో సంబంధమున్న ఒకప్పటి రౌడీషీటర్. అతను మెడలో దండేసి, శాలువా కప్పుతుంటే ఆంగ్లేయాధికారిలా కనిపించి ఒళ్ళంతా తేళ్ళు, జర్రులు పాకినట్లనిపించింది.

సభ ప్రారంభమయ్యింది. "ఎవరైనా స్వాతంత్ర్య సమర వీరునితో మాట్లాడిద్దామా" అన్నాడు ఒక అధికారి. "ఆ ముసలోళ్ళతోనా... వాళ్ళ సుత్తి భరించడం కష్టం" అంటూ మంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రసంగించారు. తమ ప్రసంగాలు పూర్తి కాగానే వేరే అత్యవసరమైన పనులున్నాయంటూ మధ్యలోనే వెళ్ళిపోయారు.విశ్వనాథం సభ అంతా కలియజూశాడు. అంతా పిల్లలే. బలవంతంగా తోలుకొచ్చిన బడిపిల్లలు. ప్రజలెవరూ లేరు...

సభ పూర్తి కాగానే ఎక్కడి వారక్కడ వేగంగా పనై పోయినట్టు వెళ్ళిపోతున్నారు. తమని పట్టించుకునేవాళ్ళు, పలకరించేవాళ్ళు ఎవరూ లేరు. ఆ గుంపులో వెళితే ఎక్కడ పడిపోతామో అని భయపడి అలాగే కూర్చున్నారు. కాసేపటికి సభంతా నిర్మానుష్యమైంది. కొందరు పనివాళ్ళు కుర్చీలు ఎత్తి పక్కన పెడుతున్నారు.

భారతి చుట్టూ చూసింది. పక్కన మరో ముగ్గురు స్వాతంత్ర్య సమర వీరులు. ఒంటరిగా తమలాగే...

తాత ఇటువంటి కార్యక్రమాలకు రావడానికి ఎందుకు ఇష్టపడడో భారతికి అప్పుడర్థమయ్యింది.. చేతిలో వున్న దండ, శాలువాలను అక్కడే పడేసి, తాత చేయి పట్టుకుని పైకి లేచింది. ఎదురుగా కొండారెడ్డి బురుజుపై స్థూపం... నిటారుగా... ఒంటరిగా... త్యాగాలకు గుర్తుగా... మరో పోరాటం కోసం ఎదురు చూస్తూ...

## డా॥ ఎం. హరికిషన్ రచనలు

1. మాయమ్మ రాచ్చసి
2. నయాఫత్వా
3. నేనూ మా అమ్మ
4. మూడు అబద్దాలు
5. ఒక చల్లని మేఘం
6. కర్నూలు జిల్లా చరిత్ర

### సంపాదకత్వం

7. కర్నూలు కథ

### బాల సాహిత్యం

8. చిలుక ముక్కు వూడిపాయ
9. రేపటి వెలుగులు
10. నల్లకుక్క
11. ఠింగురుబిళ్ళ
12. నక్కబావ - పిల్లిబావ
13. చిన్నారి గేయాలు
14. జానపద గేయాలు
15. తేనేటీగ - కందిరీగ
16. బంగారు చేప - గంధర్వకన్య
17. మెరుపుల వాన
18. పావురం దెబ్బ
19. చెప్పుకోండి చూద్దాం
20. బొమ్మలతో సామెతలు - 1
21. బొమ్మలతో సామెతలు - 2
22. తిక్క కుదిరిన నక్క
23. నమ్మొద్దురా నాయనా దొంగ నక్కల్ని
24. మూతి పగిలిన పిల్లి
25. రాము టోపి
26. కుందేలు దెబ్బ
27. ఒక వీరుని కథ
28. పుచ్చకాయ తపస్సు
29. సముద్రంలో చిన్నచేప
30. కోటకొండ మొనగాడు
31. బూర
32. తేనె చినుకులు
33. పిండిబొమ్మ వీరుడు
34. పిల్లలు కాదు పిడుగులు
35. నాకు మూడు - నీకు రెండు
36. కిర్రు కిర్రు లొడ్డప్పా
37. ఒకటి తిందునా రెండు తిందునా
38. నలుగురు మూర్ఖులు
39. కమ్మని ఊహలు